www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

బుధవారం | 19-2-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 322 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: షష్ఠి ఉ.7.32 తదుపరి సప్తమి; నక్షత్రం: స్వాతి ఉ. 10.40 తదుపరి విశాఖ; వర్జ్యం: సా. 4.55-6.43; దుర్ముహూర్తం: మ. 12.05-12.52; అమృతఘడియలు: తె. 3.39-5.27; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.43; సూర్యాస్తమయం: 6.14 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


వన్డే సమరం

నేటి నుంచే చాంపియన్స్ ట్రోఫీ



హాట్ ఫేవరెట్ భారత్
రేపు బంగ్లాతో తొలిపోరు
ఆదివారం పాకిస్థాన్‌తో..

వివరాలు స్పోర్ట్స్‌లో



తెలంగాణకు 131 టీఎంసీలు

ఆంధ్రప్రదేశ్‌కు 27 టీఎంసీలు

- ఈ ఏడాది మిగిలిన కాలానికి వాటాలివే
- ఇప్పటికే 639 టీఎంసీలు వాడిన ఏపీ
- నీటి పంపకాలకు 2015 ఒప్పందానికి కట్టుబడాలి.. మినిట్స్‌లో కృష్ణా బోర్డు
- ట్రైబ్యునల్ తేల్చేదాకా 66:34 నిష్పత్తిలో పంచుకోవాలని స్పష్టీకరణ
- నీటి వినియోగానికి ప్రణాళికలు సమర్పించాలని ఇరు రాష్ట్రాలకు సూచన

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల మధ్య నీటి వివాదం ముదిరిపోవడంతో కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) రంగంలోకి దిగి.. ఈ ఏడాది మిగిలిన కాలానికి నీటివాటాలను తేల్చింది. ఉమ్మడి జలాశయాలైన శ్రీశైలం, నాగార్జున సాగర్‌లలో ప్రస్తుతం మిగిలిఉన్న జలాల్లో ఏపీకి 27.03 టీఎంసీలు, తెలంగాణకు 131.75 టీఎంసీల వాటా ఉంటుందని స్పష్టం చేసింది. జూన్, జూలైనాటికి ఉండనున్న తాగు, సాగునీటి అవసరాలను తీర్చుకోవడం కోసం ఈనెల 21వ తేదీలోగా ప్రణాళికలు సమర్పించాలని ఇరు రాష్ట్రాలను కోరింది. వాటిపై చర్చించి, నీటిని పంచాలని నిర్ణయించింది. ఈ మేరకు కృష్ణా బోర్డు చైర్మన్ ఆమోదంతో ఎస్ఈ జి.వరలక్ష్మి సోమవారం ఏపీ, తెలంగాణ నీటిపారుదల శాఖల ఈఎన్‌సీలకు లేఖ రాశారు. నిజానికి, ప్రస్తుత (2024-25) నీటి సంవత్సరంలో కృష్ణా జలాలను కచ్చితంగా 50:50 నిష్పత్తితో పంచాలని తెలంగాణ నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. ఏపీ మాత్రం 2015లో కుదిరిన తాత్కాలిక ఒప్పందం ప్రకారం 66:34 (ఏపీ, తెలంగాణ) నిష్పత్తికి కట్టుబడి ఉండాలని పట్టుబట్టింది. ఈనెల 11నాటికి

మిగతా 3వ పేజీలో...

రూ.6 వేల కోట్లు ఇవ్వండి

జంట జలాశయాలకు గోదావరి జలాల తరలింపునకు అవసరం
పాలమూరు-రంగారెడ్డికి నీటి కేటాయింపులు చేయాలి
రాష్ట్రాల నీటిపారుదల శాఖ మంత్రుల సదస్సులో మంత్రి ఉత్తమ్ 13

తాగునీటి స్థిరీకరణకు రూ.16వేల కోట్లివ్వండి

కేంద్రాన్ని కోరిన మంత్రి సీతక్క

అయ్యో.. ఎస్!

దిగజారుతున్న కొందరు ఐఏఎస్‌ల తీరు



- ఒకప్పుడు ప్రజోపయోగమే పరమావధి
- ఇప్పుడు నాయకులతో అంటకాగడమే విధి
- ఒకప్పుడు పథకాల రూపకల్పనకు పెద్దపీట
- ఇప్పుడు ఆస్తులను కూడబెట్టుకోవడానికే స్కెచ్
- ప్రభుత్వ భూములు ధారాదత్తం చేయడానికి ప్లాన్లు
- అక్రమాన్ని సక్రమం చేయడానికి తరుణోపాయాలు
- కొందరు ఐఏఎస్‌లకు ఏజెంట్లు, రహస్య పెట్టుబడులు
- నాయకులతో కుమ్మక్కై ఆదాయార్జనపైనే దృష్టి
- నిజాయతీగా పనిచేసే వారిపై నాయకుల చిన్నచూపు
- అటువంటి వారికి మంచి పోస్టింగ్ దక్కడం గగనమే
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యల నేపథ్యంలో చర్చ

దశాబ్దం కిందటి మాట. హైదరాబాద్‌ను అనుకుని ఉన్న ఓ ప్రభుత్వ భూమిపై కేసులున్నాయి. వాటి విషయంలో ప్రైవేటు పార్టీకి అనుకూలంగా వ్యవహరించాలంటూ కొందరు ఓ ఐఏఎస్ అధికారిని ఆశ్రయించారు. 'ప్రభుత్వ భూమిని పరిరక్షించడం నా బాధ్యత. సహకరించేది లేదు' అని ఆయన తేల్చి చెప్పారు. వెంటనే వాళ్లు ఓ రాజకీయ నేతను ఆశ్రయించారు. అక్కడి నుంచి ఉరుములాంటి మౌఖిక ఆదేశం. అయినా సరే.. చేయలేనని సమాధానం. 'కావాలంటే బదిలీ చేసుకోండి. ఆ పని మాత్రం చేయలే'నని స్పష్టీకరణ.

ఏడాది కిందట హైదరాబాద్‌లోనే మరో భూమి వ్యవహారం. ప్రైవేటు వ్యక్తులకు అనుకూలంగా వ్యవహరించాలని రాజకీయ నాయకులు చెప్పారు. సదరు బాధ్యతలు చూస్తున్న ఐఏఎస్ ఒక్క క్షణం కూడా ఆలోచించలేదు. సరికదా.. చట్టానికి దొరక్కుండా ఎలా చేయవచ్చో కూడా సూచించారు. విలువైన భూమి ప్రైవేటుపరమైంది. ఆ ఐఏఎస్‌కూ కొన్ని కోట్లు దక్కాయి.

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): .అఖిల భారత సర్వీసు అధికారులు (ఐఏఎస్) మారిన తీరుకు నిదర్శనమిది! ఒకప్పుడు ప్రజోపయోగ పథకాలకు రూపకల్పన చేసి.. పాలనను ప్రజలకు చేరువ చేసిన ఐఏఎస్‌లు ఇప్పుడు రాజకీయ నాయకులతో అంటకాగుతూ స్వప్రయోజనాలకే పెద్దపీట వేస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడడానికి బదులుగా కొందరు వాటిని ధారాదత్తం చేయడానికే మొగ్గు చూపుతున్నారు. తప్పును ఒప్పు చేయాల్సిన అధికారులు రాజకీయ నాయకుల ప్రాపకం కోసం ఒప్పును కూడా తప్పుగా మారుస్తున్నారు. ఒకప్పుడు ఉదయం తొమ్మిది గంటలకు క్యాంపు ఆఫీసు నుంచి బయలుదేరి పాఠశాల, హాస్టలు, ఆస్పత్రి వంటి వాటిలో ఆకస్మిక తనిఖీలు చేసి అపసవ్య ధోరణులను చక్కదిద్దిన వారు కాస్తా ఇప్పుడు వారే అపసవ్య దిశలో పయనిస్తున్నారు. అందుకే,

మిగతా 12వ పేజీలో...



సైబర్ నేరాలతో..

సమాజానికి ముప్పు

- రోజుకో కొత్త రూపంతో సైబర్ నేరగాళ్ల మోసాలు
- గతేడాది దేశవ్యాప్తంగా రూ.22,812 కోట్ల దోపిడీ
- సోషల్ మీడియాలో అవాస్తవాల వ్యాప్తి
- అడ్డుకట్ట వేయకపోతే ఆర్థిక వ్యవస్థకూ నష్టం
- సైబర్ నేరాల కట్టడిలో రోల్ మోడల్ తెలంగాణ
- సైబర్ సెక్యూరిటీ సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి
- సాగు, ఏఐలలో బ్రెజిల్‌తో ఒప్పందం, ఎంవోయూ

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలు సమాజానికి ముప్పుగా పరిణమించాయని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రతి క్షణం ఎక్కడో ఒకచోట సైబర్ నేరం జరుగుతుండటం ఆందోళన కలిగించే అంశమన్నారు. ఒకప్పుడు దొంగలు ఇంట్లోకి చొరబడి దొంగతనాలు చేసేవారని, ఇప్పుడు కంటికి కనిపించకుండా ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లలోకి చొరబడి ఉన్నదంతా దోచుకుంటున్నారని పేర్కొన్నారు. గతేడాది దేశవ్యాప్తంగా సైబర్ నేరగాళ్లు రూ.22,812 కోట్లు దోచుకున్నట్లుగా అంచనాలు ఉన్నాయని తెలిపారు. సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయకపోతే భవిష్యత్తులో పౌరులకు, ఆర్థిక వ్యవస్థకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, సొసైటీ ఫర్

మిగతా 13వ పేజీలో...



కొత్త వీసీకి స్వాగతం పలుకుతున్న వర్సిటీ అధికారులు

జేఎన్‌టీయూ వీసీగా కిషన్‌కుమార్‌రెడ్డి

16 ఏళ్ల తర్వాత వర్సిటీ ప్రొఫెసరే ఉపకులపతిగా.. 13
హర్షం వ్యక్తం చేస్తున్న సిబ్బంది

అర్ధరాత్రి సీఈసీ ఎంపిక

సుప్రీం ఉత్తర్వుల ఉల్లంఘనే!

రాహుల్‌గాంధీ విమర్శ 2
ఆర్థిక వ్యవస్థ సర్వనాశనం
కేంద్ర సర్కారుపై ఖర్గే ధ్వజం



12

అయ్యప్ప భక్తులు చేసిన పాపమేంది?

రంజాన్ భక్తులకే మినహాయింపా?
మీలో హిందువుల రక్తం ఉందా?
ఈ ప్రభుత్వం ఉండేది ఐదారు మాసాలే.. వచ్చేది బీజేపీ సర్కారే
కేంద్ర మంత్రి బండి సంజయ్ ఫైర్

రూ.300 కోట్లే!

ఉద్యోగుల బిల్లుల చెల్లింపులపై సర్కారు సీలింగ్



- నెలకు కనిష్ఠంగా రూ.1000 కోట్లు అవసరం
- కానీ.. అన్ని బిల్లులూ కలిపి రూ.300 కోట్లు మించొద్దని ఆర్థిక శాఖకు ప్రభుత్వం ఆదేశాలు
- సంక్షేమ పథకాలకే నిధులు మళ్లించాలని స్పష్టం
- నిధులు సమకూరాక బిల్లుల చెల్లింపు

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తమ బిల్లులను ఎప్పుడు చెల్లిస్తారంటూ నెలల తరబడి కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం పిడుగులాంటి వార్త చెప్పింది. పెండింగ్ బిల్లులను ఇప్పట్లో చెల్లించలేమని తేల్చేసింది. ఉద్యోగులు, పదవీ విరమణ చేసిన వారి బిల్లుల చెల్లింపుపై సీలింగ్ విధించింది. ఒక నెలలో చెల్లించే బిల్లుల మొత్తం రూ.300 కోట్లకు మించరాదని ఆర్థిక శాఖకు సుస్పష్టంగా ఆదేశాలు ఇచ్చింది. అంతకుమించి ఒక్క పైసా చెల్లించినా.. ఆర్థిక శాఖపై

మిగతా 13వ పేజీలో...

హైదరాబాద్ కిటకిట

ఢిల్లీ కన్నా భాగ్యనగరంలో అధిక జనసాంద్రత

- అక్కడ చదరపు కిలోమీటరుకు 11,313 మంది
- ఇక్కడ 18,161 మంది.. 2031 నాటికి 3.92 కోట్లకు చేరనున్న తెలంగాణ జనాభా
- వచ్చే పదేళ్లలో భారీగా పెరగనున్న వృద్ధుల సంఖ్య
- ఏడాది నుంచి ఐదేళ్లలోపు పిల్లల సంఖ్య 2021తో పోలిస్తే 2036 నాటికి 25% మేర తగ్గుముఖం
- 34 ఏళ్లలోపు వారి సంఖ్య గణనీయంగా తగ్గుదల
- 60ఏళ్లకు పైబడే వారిలో 60 శాతం మేర వృద్ధి
- 80 ఏళ్లు దాటినవారి సంఖ్యలో 82% పెరుగుదల
- తెలంగాణ గణాంకాల సంగ్రహం-2024లో వెల్లడి

(సెంట్రల్ డెస్క్)

రాష్ట్ర రాజధాని కిటకిటలాడిపోతోంది! జనసాంద్రత విషయంలో.. దేశ రాజధాని ఢిల్లీని సైతం మించిపోయింది. 2011 జనాభా లెక్కల ప్రకారం.. ఢిల్లీ మహానగరంలో ప్రతి చదరపు కిలోమీటరుకూ 11,313 మంది నివసిస్తుండగా, హైదరాబాద్ జనసాంద్రత 18,161గా నమోదైంది. అంటే.. భాగ్యనగరంలో ప్రతి చదరపు కిలోమీటరు పరిధిలో పద్దెనిమిది వేల మందికిపైగా నివసిస్తున్నట్టు. ఇవేవో కాకిలెక్కలు కావు.. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన "తెలంగాణ రాష్ట్ర గణాంకాల

మిగతా 14వ పేజీలో...

స్నానానికి పనికిరావు!

- కలుషితమైన త్రివేణి సంగమ జలాలు
- కుంభమేళా ప్రాంతంలో పడిపోయిన నీటి నాణ్యత
- స్థాయిని మించిన ఫీకల్ కోలీఫామ్ బ్యాక్టీరియా
- ఆందోళన వ్యక్తం చేసిన ఎన్జీటీ 2
- నీటి నాణ్యత పెంపునకు యూపీ సర్కారు చర్యలు

మహాకుంభ్ కాదు.. మృత్యుకుంభ్!

ఏర్పాట్లలో యూపీ విఫలం
బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ధ్వజం 2

ఉక్రెయిన్ యుద్ధంపై రష్యా- అమెరికా చర్చలు

రియాద్, ఫిబ్రవరి 18: ద్వైపాక్షిక సంబంధాల మెరుగుదలకు తీసుకోవాల్సిన చర్యలతో పాటు ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేదెలాగన్న దానిపై రష్యా, అమెరికాలకు చెందిన ఉన్నతస్థాయి దౌత్యవేత్తలు మంగళవారం నాడు సౌదీ అరేబియాలో చర్చలు జరిపారు. మూడేళ్లుగా సాగుతున్న ఉక్రెయిన్ యుద్ధం మీదే ప్రధానంగా చర్చ జరిగినప్పటికీ, ఉక్రెయిన్ అధికారులెవరూ సమావేశంలో పాల్గొనకపోవడం, లేదా వారికి ఆ అవకాశం ఇవ్వకపోవడం గమనార్హం. తమ భాగస్వామ్యం లేని ఈ చర్చల ఫలితాన్ని అంగీకరించేది లేదని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఇప్పటికే స్పష్టం చేశారు. రష్యా- అమెరికా చర్చల తరువాత జెలెన్ స్కీ తన సౌదీ పర్యటన వాయిదా వేసుకున్నారు. చర్చల్లో ఈయూ, యూకే, టర్కీలకు భాగం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. మరోవైపు అవసరమైతే జెలెన్ స్కీతో చర్చించడానికి రష్యా అధ్యక్షుడు పుతిన్ సిద్ధంగా ఉన్నారని క్రెమ్లిన్ ప్రకటించింది.

కశ్మీర్‌లో కమ్ముకొస్తున్న కరవు!

శ్రీనగర్, ఫిబ్రవరి 18: హిమాలయాలకు నిలయమైన కశ్మీర్‌లో కరవు పరిస్థితులు తలెత్తవచ్చని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. జనవరి, ఫిబ్రవరి నెలల్లో కురవాల్సిన హిమపాతంలో 80% మేర తగ్గుదల కనిపించడమే ఇందుకు కారణం. ఈ ఏడాది తగినంతగా మంచు కురవకపోవడంతో హిమాలయాలు బోడి కొండల్లా దర్శనమిస్తున్నాయి. దక్షిణ కశ్మీర్‌లో సెలయేర్లు ఎండిపోయాయి. ఫిబ్రవరిలోనే ఇలా ఉంటే వేసవిలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. కశ్మీర్‌లోయలో సాగునీరు కాదు కదా తాగునీటికి కూడా ఇబ్బందులు తప్పవని అంటున్నారు. రానున్న 15 రోజుల్లో మంచుగానీ, వర్షంగానీ కురవకపోతే నీటి సంక్షోభం తప్పదని హెచ్చరిస్తున్నారు. తగినంత మంచు లేకపోవడంతో ఈ నెల 22 నుంచి జరగాల్సిన ఖేలో ఇండియా శీతాకాల ఆటలపోటీలను అధికారులు వాయిదా వేశారు.

నా చావుకు తమ్ముడు, మరదలే కారణం!

సూసైడ్ వీడియోలో ఓ వ్యక్తి వెల్లడి.. భయంతో ఆ ఇద్దరి ఆత్మహత్య

బెంగళూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తన సోదరుడు, మరదలు ఐపీఎల్ బెట్టింగ్‌లు, ఆన్‌లైన్ గేమ్స్ కోసం భారీగా అప్పులు చేయడం వల్ల ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తన చావుకు తమ్ముడు, అతని భార్యే కారణమని పేర్కొంటూ ఆత్మహత్యకు ముందు సెల్ఫీ వీడియో రికార్డు చేశాడు. దీంతో పోలీసులు అరెస్టు చేస్తారన్న భయంతో అతని సోదరుడు, మరదలు కూడా ఆత్మహత్య చేసుకున్నారు. కర్ణాటకలోని రమ్మనహళ్లిలో ఈ దుర్ఘటన చేసుకుంది. మృతులను జెస్సీ ఆంటోని (40), అతని సోదరుడు జోబి ఆంటోని (40), జోబి భార్య షర్మిల(35)గా గుర్తించారు. జెస్సీ జోబీ కవలలు. జోబీ భార్య షర్మిల. ఐపీఎల్, ఆన్‌లైన్ గేమ్‌ల కోసం జెస్సీ పేరిట ఉండే ఇంటిపై జోబి దంపతులు అప్పులు చేశారు. ఈ క్రమంలో జెస్సీ సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తన ఆత్మహత్యకు తమ్ముడు, మరదలే కారణమని సెల్ఫీ వీడియోలో పేర్కొన్నాడు. తన చెల్లెలిని, బిడ్డను హత్య చేయాలని వారు ప్రేరేపించారని ఆవేదన వ్యక్తం చేశాడు. వీడియోలో జెస్సీ పదే పదే తమ పేర్లను ప్రస్తావించడంతో పోలీసులు అరెస్టు చేస్తారన్న భయంతో జోబి ఆంటోని, ఆయన భార్య షర్మిల విజయనగర క్రీడామైదానంలోని వాటర్‌ట్యాంకు మెట్లకు ఉన్న ఇనుప కడ్డీలకు ఉరి వేసుకున్నారు.

తమిళనాడులో బాలికపై ఏడుగురి గ్యాంగ్ రేప్

చెన్నై, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని కోయంబత్తూరు జిల్లా కునియముత్తూరు ప్రాంతంలో 17 ఏళ్ల బాలికపై ఏడుగురు కాలేజీ విద్యార్థులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. కోయంబత్తూరు ఉక్కడం ప్రాంతానికి చెందిన బాలిక ఇంటర్ ఫెయిలై బామ్మ ఇంట్లో ఉంటోంది. ఇటీవల ఆ బాలికకు సామాజిక మాధ్యమాల ద్వారా కునియముత్తూరుకు చెందిన కాలేజీ విద్యార్థితో పరిచయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం ఆ బాలికను మాయమాటలతో కునియముత్తూరులో ఉన్న తన గదికి రప్పించుకున్న ఆ విద్యార్థి.. ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆపై ఆమెను నగ్నంగా ఫొటోలు తీశాడు. అంతేగాక ఆరుగురు సహచర విద్యార్థులను కూడా తన గదికి రప్పించి, ఆమెపై సామూహిక అత్యాచారం చేయించాడు. బాలికను సోమవారం ఉదయం వారు ఆమె ఇంటివద్ద విడిచిపెట్టి పారిపోయారు. ఈ ఘటనపై ఆ బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని ఏడుగురు విద్యార్థులను పోక్సో చట్టం కింద అరెస్టు చేశారు.

మళ్లీ వస్తా..ప్రతీకారం తీర్చుకుంటా: హసీనా

ఢాకా, ఫిబ్రవరి 18: తాను బంగ్లాదేశ్ తిరిగి వస్తానని, అమరుల తరఫున ప్రతీకారం తీర్చుకుంటానని పదవీచ్యుత ప్రధాని షేక్ హసీనా అన్నారు. మంగళవారం తన పార్టీ అయిన అవామీలీగ్ కార్యకర్తలతో గుర్తు తెలియని ప్రదేశం నుంచి ఆమె వర్చువల్ విధానంలో ప్రసంగించారు. 45 నిమిషాల పాటు సాగిన ప్రసంగాన్ని వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 8000 మంది వీక్షించారు. ఓపిక పట్టాలని, తాను మళ్లీ తిరిగి వస్తానని చెప్పారు. ప్రతీకారం తీర్చుకొని అందరికీ న్యాయం చేస్తానని చెప్పారు. నోబెల్ పురస్కార గ్రహీత, తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన సలహాదారు యూనస్‌ను ఉగ్రవాదిగా అభివర్ణించారు.

మహిళల్లో క్యాన్సర్ నివారణకు 6 నెలల్లో వ్యాక్సిన్

ఛత్రపతి శంభాజీనగర్, ఫిబ్రవరి 18: మహిళల్లో కేన్సర్ నివారణకు అయిదారు నెలల్లో వ్యాక్సిన్ అందుబాటులోకి రానుందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, ఆయుష్ శాఖల సహాయ మంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్ వెల్లడించారు. నూతన వ్యాక్సిన్‌పై ప్రస్తుతం ప్రయోగాలు జరుగుతున్నాయని తెలిపారు. 9 నుంచి 16 ఏళ్లలోపు ఉన్న బాలికలకు కూడా దీన్ని టీకాల రూపంలో ఇవ్వవచ్చని చెప్పారు. మంగళవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ 30 ఏళ్లు పైబడ్డ మహిళల్లో కేన్సర్ లక్షణాలను గుర్తించడానికి ప్రభుత్వ ఆస్పత్రుల్లో తగిన ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. డే కేర్ కేన్సర్ సెంటర్లను నెలకొల్పుతామని తెలిపారు.

లండన్ నుంచి న్యూయార్క్‌కు బంగారం తరలింపు

- ట్రంప్ పన్నులు పెంచుతారన్న భయమే కారణం

లండన్, ఫిబ్రవరి 19: లండన్‌లో ఉన్న అమెరికన్ బ్యాంకులు తమ వద్ద ఉన్న బంగారాన్నంతా న్యూయార్క్‌కు తరలిస్తున్నాయి. అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన వాణిజ్య యుద్ధమే ఇందుకు కారణం. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే బంగారంపై ట్రంప్ పన్నులు విధిస్తారన్న అనుమానాలతో తమ బంగారం నిల్వలను ముందుగానే అమెరికాకు పంపించివేస్తున్నాయి. ఈ కారణంగా లండన్‌లో బంగారం ధర డిసెంబరు నుంచి పోల్చితే 20 డాలర్లు (సుమారు రూ.1800) మేర తగ్గింది. మరో వైపు అమెరికాలో బంగారం నిల్వలు భారీగా పెరిగాయి. అధ్యక్ష ఎన్నికలు జరిగిన నవంబరు 5 నాటికి బంగారం నిల్వలు 50 బిలియన్ డాలర్ల మేర ఉండగా, ప్రస్తుతం 106 బిలియన్ డాలర్లకు పెరిగింది.

కెనడాలో రన్‌వేపై విమానం పల్టీ..!

టొరంటో, ఫిబ్రవరి 18: కెనడాలోని టొరంటో పియర్‌సన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో పెనుప్రమాదం తప్పింది. 76 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బందితో మినెయాపోలీస్ నుంచి టొరంటో చేరుకున్న విమానం.. పియర్‌సన్ విమానాశ్రయంలో ల్యాండ్ అవుతుండగా రన్‌వేపై పల్టీ కొట్టి తలకిందులుగా పడిపోయింది. ఈ ఘటనలో 18 మంది గాయపడ్డారు. ప్రమాదం కారణంగా విమానంలో మంటలు చెలరేగగా, ఎమర్జెన్సీ సిబ్బంది అప్రమత్తమై వెంటనే వాటిని అదుపు చేశారు. అందులో చిక్కుకుపోయిన ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. ఘటన జరిగిన సమయంలో టొరంటో విమానాశ్రయం వద్ద ఉష్ణోగ్రత మైనస్ 8.6 డిగ్రీలుగా ఉంది. గంటకు 51 కిమీల వేగంతో శీతల గాలులు వీస్తున్నాయి. ఉష్ణోగ్రత పడిపోవడంతో రన్‌వేపై దట్టంగా మంచు పేరుకుపోయింది. ఇవన్నీ ల్యాండింగ్‌కు ప్రతికూలంగా మారి ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు.



స్నానానికి పనికిరావు

కలుషితమైన త్రివేణి సంగమ జలాలు.. కుంభమేళా ప్రాంతంలో పడిపోయిన నీటి నాణ్యత

- ఆందోళన వ్యక్తం చేసిన ఎన్జీటీ



ప్రయాగ్‌రాజ్‌లో శాస్త్రి బ్రిడ్జి కింద గంగా నదిలోనే కట్టిన టాయిలెట్లు ఇవి. చాలా చోట్ల ఇలాగే నిర్మించారు. మానవ వ్యర్థాలు నదిలో కలిసిపోతున్నాయని, నీటి కాలుష్యానికి ఇదొక కారణమని ఎన్జీటీ ఆందోళన వ్యక్తం చేసింది

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: మహా కుంభ మేళా సందర్భంగా కోట్లాది మంది భక్తులు పుణ్యస్నానాలు చేస్తున్న త్రివేణి సంగమ ప్రాంతంలో నీటి నాణ్యత దారుణంగా పడిపోయింది. మురుగుతో నీరు కలుషితం అయిపోతోంది. ఇక్కడి నీటి కాలుష్యం ప్రాథమిక ప్రమాణాల స్థాయిని మించిపోయి స్నానానికి అనుకూలం కాని విధంగా మారిపోయింది. నీటిలో ఫీకల్ కోలీఫామ్ బ్యాక్టీరియా స్థాయిని మించి పెరిగిపోయింది. తాము పరీక్షించిన అన్ని ప్రాంతాల్లోనూ ఆ బ్యాక్టీరియా ఉండాల్సిన దాని కన్నా ఎక్కువగా ఉందని ఈ నెల 3న నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ (ఎన్జీటీ)కు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) ఓ నివేదిక ద్వారా తెలిపింది. ఇటీవల ఓ కేసు విచారణలో ఎన్జీటీ ధర్మాసనం సీపీసీబీ నివేదికను సమీక్షించి ఆందోళన వ్యక్తం చేసింది. కాలుష్య నియంత్రణ చర్యలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని తాము కోరినా స్పందించని ఉత్తరప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (యూపీపీసీబీ)పై ఎన్జీటీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ కేసులో బుధవారం జరిగే తదుపరి విచారణకు యూపీపీసీబీ సభ్య కార్యదర్శితో పాటు ఇతర అధికారులు పాల్గొనాలని ఆదేశించింది. కాగా, త్రివేణి సంగమంలో నీటి నాణ్యతపై అడిషనల్ కలెక్టర్ వివేక్ చతుర్వేది వివరణ ఇచ్చారు. పుణ్య స్నానాలకు వీలుగా నదిని ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తున్నామని తెలిపారు. అన్ని ఘాట్లలో పీసీబీ బృందం ప్రతిరోజు నీటి పరీక్షలు చేస్తోందని, నీటి నాణ్యత నియంత్రణలోనే ఉందని చెప్పారు. పువ్వులు, కొబ్బరికాయలు, ఇతరత్రా పూజా సామగ్రిని ప్రతి రెండు గంటలకు ఓసారి మెషీన్ల సాయంతో తొలగిస్తున్నామని వెల్లడించారు. మహా కుంభమేళా పూర్తయ్యే వరకు నదిలో నీటిని శుభ్రంగా ఉంచటానికి నిరంతరం పరవేక్షిస్తూ చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఇక మహా కుంభ మేళా నిర్వహణకు రూ. 7 వేల కోట్లు కేటాయించిన యూపీ ప్రభుత్వం.. జలాలు, వ్యర్థాల నిర్వహణకు రూ. 1,600 కోట్లు ఖర్చుపెడుతోంది. అత్యాధునిక పద్ధతుల్లో మురుగు నీటి నిర్వహణ, వ్యర్థాల తరలింపు చర్యలు చేపడుతోంది.

55 కోట్ల మంది పుణ్యస్నానాలు

గత నెల రోజులకు పైగా కొనసాగుతున్న మహా కుంభమేళాలో ఇప్పటి వరకు అపూర్వ స్థాయిలో 55 కోట్ల మంది త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించారని యూపీ ప్రభుత్వం మంగళవారం వెల్లడించింది. దేశంలో సనాతన ధర్మాన్ని పాటించే 110 కోట్ల జనాభాలో సగం మంది మూడు నదుల సంగమంలో స్నానాలు చేశారని, ఈ సంఖ్య మహాకుంభ్ ముగిసే ఈనెల 26వ తేదీ నాటికి 60 కోట్లు దాటుతుందని ఓ ప్రకటనలో పేర్కొంది. దేశంలోని దాదాపు 143 కోట్లు ఉన్న మొత్తం జనాభా పరంగా చూస్తే.. ఇప్పటి వరకు 38 శాతానికి పైగా ప్రజలు పుణ్యస్నానాలు చేశారని తెలిపింది. కాగా, మహాకుంభమేళా ప్రారంభానికి ముందు ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో 45 కోట్ల మంది భక్తులు పాల్గొంటారని యోగి సర్కార్ అంచనా వేసింది. అయితే ఆ సంఖ్య ఈ నెల 14వ తేదీకే 50 కోట్లు దాటిందని ప్రభుత్వం పేర్కొంది. ఇందులో అత్యధికంగా మౌని అమావాస్య రోజున దాదాపు 8 కోట్ల మంది పవిత్ర స్నానాలు చేశారని తెలిపింది.

కిలోమీటర్‌కు రూ. 100

మహా కుంభ మేళాకు వస్తున్న భక్తులు అయోధ్య దర్శనానికి కూడా వెళుతున్నారు. రద్దీని నియంత్రించేందుకు అయోధ్యలోకి వాహనాలను అనుమతించడంలేదు. ఇదే అదనుగా కొంత మంది బైక్ ట్యాక్సీల అవతారం ఎత్తారు. కిలో మీటర్‌కు రూ. 100 వసూలు చేస్తూ భక్తులను అడ్డంగా దోచుకుంటున్నారు. ఇలా అనధికారికంగా భక్తుల వద్ద భారీ మొత్తంలో వసూలు చేస్తున్న వారిని రెండు రోజులుగా పట్టుకుంటున్నారు. 30 మోటార్ సైకిళ్లను సీజ్ చేశారు. తమ ఆపరేషన్ కొనసాగుతుందని రామ జన్మభూమి పోలీసు అధికారులు చెప్పారు. కాగా వీఐపీ దర్శనం చేయిస్తానని తన వద్ద ఓ ట్రావెల్ ఏజెంట్ రూ. 1.8 లక్షలు వసూలు చేసి మోసం చేశారని మహారాష్ట్రకు చెందిన ఓ మహిళ అయోధ్య పోలీసులు ఫిర్యాదు చేశారు.

మహాకుంభ్ కాదు.. మృత్యుకుంభ్!

ఏర్పాట్లలో యూపీ ప్రభుత్వం విఫలం

బెంగాల్ సీఎం మమత ధ్వజం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: యూపీలోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభ్.. 'మృత్యుకుంభ్'గా మారుతోందని పశ్చిమబెంగాల్ సీఎం మమత వ్యాఖ్యానించారు. మంగళవారం రాష్ట్ర అసెంబ్లీలో ఆమె మాట్లాడుతూ యోగి సర్కార్‌పై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కుంభమేళాలో జరిగిన తొక్కిసలాట ఘటనలో చాలా మంది చనిపోయారని, యూపీ ప్రభుత్వం బాధిత కుటుంబాలకు ఎంత పరిహారం ఇచ్చిందని ప్రశ్నించారు. తొక్కిసలాటలో చనిపోయిన తమ రాష్ట్రానికి చెందిన వారి మృతదేహాలకు పోస్టుమార్టం కూడా చేయలేదని, తమ ప్రభుత్వం పోస్టుమార్టం చేసిందన్నారు. మరణాలకు సరైన కారణం తెలియకుంటే.. ప్రభుత్వం పరిహారం ఎలా ఇస్తుందని ప్రశ్నించారు. మహాకుంభ్‌లో భక్తులకు సరైన ఏర్పాట్లు కూడా చేయలేదని, చేసిన ఏర్పాట్లలోనూ అసమానతలు ఉన్నాయని, అధికారులకు సరైన ప్రణాళికలు లేవని విమర్శించారు. 'ఇది మృత్యుకుంభ్..! నేను మహాకుంభ్‌ను, గంగా మాతను గౌరవిస్తాను. అయితే ఈ కార్యక్రమానికి సరైన ప్లానింగ్ లేదు' అని మమత అన్నారు. డబ్బున్న వాళ్లు, వీఐపీలకు రూ.లక్షతో క్యాంపుల ను(టెంట్లు) అందుబాటులో ఉంచారని, అయితే పేదల కోసం ఎలాంటి ఏర్పాట్లు లేవని పేర్కొన్నారు. సీఎం మమత వ్యాఖ్యలపై బీజేపీ నేత సువేందు అధికారి స్పందించారు. ఆమె చేసిన వ్యాఖ్యలు హిందువులు, మహాకుంభమేళాపై దాడిగా అభివర్ణించారు. హిందూ సమాజం, సాధువులు నిరసన తెలపాలని కోరారు.

లోకం తీరు



అమెరికాలో శతాధిక వృద్ధులు 2 కోట్ల మంది అట!

- 200 ఏళ్లు దాటిన 2 వేల మంది
- 369 ఏళ్ల వ్యక్తి కూడా ఉన్నాడట!
- విస్మయం కలిగిస్తున్న అమెరికా సామాజిక భద్రత డేటాబేస్ గణాంకాలు

వాషింగ్టన్, ఫిబ్రవరి 18: అగ్రరాజ్యం అమెరికాలో శతాధిక వృద్ధులు 2 కోట్ల మంది ఉన్నారట! వారిలో 200 ఏళ్ల వయసు పైబడిన వారి సంఖ్య 2 వేల మార్కు దాటేసిందట! ఇంకా ఆశ్చర్యం ఏమిటంటే 369 ఏళ్ల వయసు వ్యక్తి ఒకరున్నారట! అమెరికా సామాజిక భద్రత విభాగం (ఎస్ఎస్ఏ) డేటాబేస్‌లోని ఈ గణాంకాలు చర్చనీయాంశంగా మారాయి. 'డోజ్' సారథి ఎలాన్ మస్క్ 'ఎక్స్'లో ఈ వివరాలను వెల్లడిస్తూ 'ఇది చరిత్రలోనే అతిపెద్ద మోసమ'ని వ్యాఖ్యానించారు. ప్రభుత్వంలో వృథా ఖర్చును కట్టడి చేసేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఏర్పాటు చేసిన 'డోజ్' విభాగం... ఈ డేటాబేస్ తీగ లాగితే డొంక కదిలింది. సామాజిక భద్రత నంబర్లు ఉన్న వారి సంఖ్య ప్రస్తుతం అమెరికా జనాభాను దాటిపోయిందంటూ మస్క్ విస్మయం వ్యక్తం చేశారు. 2023 జూలైలో నిర్వహించిన ఆడిట్‌లో ఎస్ఎస్ఏ డేటాబేస్‌లో కోటీ 89 లక్షల మంది వందేళ్లు దాటిన వారున్నట్లు గుర్తించారు. కానీ జనాభా లెక్కల ప్రకారం దేశంలో 86 వేల మంది మాత్రమే వందేళ్లు దాటిన వారు ఉన్నట్లు తేలింది. 1886, 1893లో పుట్టినవాళ్లు కూడా ఇంకా జీవించి ఉన్నట్లు డేటాబేస్ చూపిస్తోంది. వీరందరికీ సోషల్ సెక్యూరిటీ నంబర్లు ఉన్నాయి. మరణాలకు సంబంధించిన సమాచారం ఎస్ఎస్ఏ రాకపోవడం, వచ్చినా నమోదు చేయకపోవడంతో ఈ సమస్య తలెత్తింది. దాంతో ఎప్పుడో గతించినా... డేటాబేస్ మాత్రం బతికే ఉన్నట్లు చూపిస్తోంది.

అభ్యంతరకర వ్యాఖ్యల కేసుల్లో... రణవీర్‌ను అరెస్టు చేయొద్దు

- కొత్త కేసులు వద్దు.. సుప్రీం ఆదేశం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: తల్లి దండ్రులపై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న యూట్యూబర్ రణవీర్‌ను అరెస్టు చేయకుండా సుప్రీంకోర్టు రక్షణ కల్పించింది. ఆయనపై కొత్త కేసులు నమోదు చేయకూడదని ఆదేశించింది. అదేసమయంలో ఆయనను తీవ్రంగా మందలించింది. ఆ వ్యాఖ్యలు ఆయన 'వికృత మనస్తత్వాన్ని' చూపిస్తున్నాయని విమర్శలు చేసింది. ఇటీవల 'ఇండియాస్ గాట్ లేటెంట్' కామెడీ షోలో రణవీర్ జడ్జిగా పాల్గొన్నారు. ఆ సమయంలో ఆయన తల్లిదండ్రుల శృంగారానికి సంబంధించిన ప్రశ్న వేశారు. దీంతో, వీక్షకులు భగ్గుమన్నారు. ఆయనపై అస్సాం సహా పలు చోట్ల కేసులు నమోదయ్యాయి. దాంతో అరెస్టు చేయకుండా రక్షణ కల్పించాలని కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించగా మంగళవారం ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషన్‌ను పరిశీలించగానే అల్లాహాబాదియాపై ధర్మాసనం మండిపడింది. ఆ వ్యాఖ్యలు ఆమోదయోగ్యం కావంటునే "ఆయన మనసులో చెత్త ఉంది. దాన్నంతా యూట్యూబ్ షోలో కక్కేశారు" అని వ్యాఖ్యానించింది. "పాపులారిటీ ఉందని ఏదైనా మాట్లాడేస్తారా, ఎవరైనా ఇలాంటి భాషను ఇష్టపడుతారా" అని అడిగింది. "వాక్ స్వాతంత్ర్యం పేరుతో సమాజం విలువలకు వ్యతిరేకంగా మాట్లాడే లైసెన్స్ ఏ ఒక్కరికీ లేదు" అని స్పష్టం చేసింది. రన్‌వీర్ పాస్‌పోర్టును ఠాణె పోలీసు స్టేషన్‌లో అప్పగించాలని, కోర్టు అనుమతి లేకుండా విదేశాలకు వెళ్లకూడదని పేర్కొంది. ఈ కామెడీ షోకు సంబంధించిన ఇతర ఎపిసోడ్లను తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు ప్రసారం చేయకూడదని తెలిపింది.

అర్ధరాత్రి సీఈసీ నియామకం

సుప్రీం ఉత్తర్వుల ఉల్లంఘనే!

ఎంపిక ప్రక్రియపై సుప్రీంలో విచారణ ఉండగా ఇలా చేస్తారా: రాహుల్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): కొత్త ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ)గా జ్ఞానేశ్‌కుమార్‌ను నియమించిన తీరుపై అర్ధరాత్రి నిర్ణయించడం ద్వారా ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అగౌరవంగా, అమర్యాదకరంగా వ్యవహరించారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించారని అన్నారు. అసలీ ఎంపిక ప్రక్రియనే సవాల్ చేస్తూ దాఖలుచేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టులో బుధవారం విచారణ జరుగనుండగా.. సోమవారం రాత్రి పొద్దుపోయాక హడావుడిగా నిర్ణయం తీసుకోవడం ఏమిటని మంగళవారం 'ఎక్స్'లో ప్రశ్నించారు. సీఈసీ, ఎన్నికల కమిషనర్ల నియామకాన్ని ప్రధాని, విపక్ష నేత, సీజేఐలతో కూడిన కమిటీ చేపట్టాలని ఆదేశిస్తూ 2023 మార్చి 2న రాజ్యాంగ ధర్మాసనం తీర్పు ఇచ్చిందన్నారు. 'దురదృష్టవశాత్తూ.. ఎంపిక కమిటీ నుంచి సీజేఐని తప్పించి.. ఆ స్థానంలో ప్రధాని నియమించే కేబినెట్ మంత్రిని చేర్చుతూ కేంద్ర ప్రభుత్వం 2023 ఆగస్టులో చట్టం తెచ్చింది. ఇది సుప్రీంకోర్టు ఉత్తర్వులను దారుణంగా ఉల్లంఘించడమే. సుప్రీంకోర్టు విచారణ పూర్తయ్యేదాకా కొత్త సీఈసీ ఎంపికను వాయిదా వేయాలన్నది కాంగ్రెస్ పార్టీ నిశ్చిత వైఖరి. కమిటీ సమావేశంలో ప్రధానికి, హోం మంత్రికి నా అసమ్మతి తెలియజేశాను. ఓ పక్క ఎంపిక కమిటీ కూర్పునే సుప్రీం కోర్టులో సవాల్ చేసినప్పుడు.. మరో 48 గంటల్లో కోర్టు ముందు విచారణకు రానున్నప్పుడు అర్ధరాత్రి కొత్త సీఈసీని ఎంపిక చేశారు' అని రాహుల్ ఆక్షేపించారు. ప్రజాస్వామ్యం, ఎన్నికల కమిషన్ వ్యవహారాల్లో కార్యనిర్వాహక విభాగం జోక్యం చేసుకోరాదని హెచ్చరిస్తూ 1949 జూన్‌లో రాజ్యాంగ సభలో అంబేద్కర్ చేసిన ప్రసంగాన్ని రాహుల్ ప్రస్తావించారు. అయితే, సుప్రీం కోర్టు తీర్పునకు రాహుల్ వక్ర భాష్యం చెబుతున్నారని బీజేపీ ఐటీ విభాగం ఇన్‌చార్జి మాలవీయ విమర్శించారు. సుప్రీం తీర్పునకు ముందు సీఈసీ, కమిషనర్లను ప్రధాని సిఫారసు మేరకే రాష్ట్రపతి నియమించేవారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ఏలుబడిలో ఎన్నికల కమిషనర్లను ఎలా నియమించారో రాహుల్ మరచిపోయారా అని 'ఎక్స్'లో నిలదీశారు.

నేడు సుప్రీంకోర్టులో విచారణ

సీఈసీ, ఎన్నికల కమిషనర్లను 2023నాటి చట్టం ప్రకారం నియమించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై ప్రాధాన్య ప్రాతిపదికన బుధవారం విచారణ జరుపుతామని సుప్రీం కోర్టు వెల్లడించింది. రాజ్యాంగ ధర్మాసనం తీర్పును ఉల్లంఘించి, ఎంపిక కమిటీ నుంచి సీజేఐని తప్పిస్తూ తీసుకొచ్చిన చట్టం కింద కేంద్రం సోమవారం సీఈసీ, ఎన్నికల కమిషనర్‌ను నియమించడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని ప్రజాస్వామిక సంస్కరణల సంఘం (ఏడీఆర్) తరఫు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ మంగళవారం కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

370 రద్దు వెనుక జ్ఞానేశ్‌కుమార్

నూతన ఎన్నికల ప్రధాన కమిషనర్(సీఈసీ)గా నియమితులైన జ్ఞానేశ్‌కుమార్.. మోదీ ప్రభుత్వం తీసుకున్న పలు నిర్ణయాల్లో, వాటి అమల్లో కీలక భూమిక పోషించారు. జమ్మూకశ్మీరుకు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే 370 అధికరణ రద్దు, ఆ రాష్ట్రాన్ని జమ్మూకశ్మీరు, లద్ధాఖ్ అనే కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజిస్తూ తీసుకొచ్చిన చట్టాలకు రూపకల్పన చేసింది ఆయనే. అంతే కాదు.. అయోధ్యలో రామాలయ నిర్మాణం చేపట్టిన రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ఏర్పాటులోనూ ఆయన కీలక పాత్ర పోషించారు. 2018-21 నడుమ కేంద్ర హోం శాఖలో ఆయన అదనపు కార్యదర్శిగా పనిచేశారు. 2019లో 370 అధికరణ రద్దు, జమ్మూకశ్మీరు పునర్విభజన జరిగాయి. ఆ పునర్విభజన బిల్లును తయారుచేసే బాధ్యతను మోదీ ప్రభుత్వం జ్ఞానేశ్‌కుమార్‌కు అప్పగించింది. ప్రభుత్వం అతి రహస్యంగా తీసుకొచ్చిన బిల్లుల్లో ఇదొకటి. ఈయన కేరళ కేడర్‌కు చెందిన 1988 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. గతేడాది జనవరి 31న పదవీవిరమణ చేశారు. అదే మార్చిలో ఎన్నికల కమిషనర్‌గా నియమితులయ్యారు. ఇప్పుడు సీఈసీగా 2029 జనవరి 26 వరకు బాధ్యతలు నిర్వహించనున్నారు. కాగా, ప్రస్తుత సీఈసీ రాజీవ్ తన పదవికి మంగళవారం రాజీనామా చేశారు.

ఆర్థిక వ్యవస్థ సర్వనాశనం

- మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ చీఫ్ ఖర్గే నిప్పులు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: "భారత ఆర్థిక వ్యవస్థ మంచి రాబడినిస్తోంది" అని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ చీఫ్ ఖర్గే నిప్పులు చెరిగారు. దూరదృష్టి, దృక్పథం లోపించిన ప్రధాని మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం కారణంగా దేశ ఆర్థిక వ్యవస్థ సర్వనాశనం అయిందని, కుప్పకూలిందని దుయ్యబట్టారు. "మన ఆర్థిక వ్యవస్థ మంచి రాబడినిస్తోందని మోదీ ప్రభుత్వం, కేంద్ర మంత్రి నిర్మల చెప్పడాన్ని మించిన అతి పెద్ద జోక్ ఇంకొకటి లేదు" అని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఖర్గే పేర్కొన్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు భారత స్టాక్ మార్కెట్‌లో రూ.45 లక్షల కోట్లు ఆవిరయ్యాయని వివరించారు. విదేశీ పెట్టుబడిదారులు గత అక్టోబరు నుంచి ఇప్పటి వరకు రూ.1.56 లక్షల కోట్ల స్టాక్స్‌ను విక్రయించారని, దీనిలో రూ.లక్ష కోట్లు ఈ ఒక్క ఏడాదివేనని ఖర్గే తెలిపారు. డాలరుతో రూపాయి మారకం విలువ రూ.87కు చేరిందని, దీంతో ద్రవ్యలోటు నింగినంటుతోందని, గత ఐదేళ్లలో దిగుమతులు 62.21 శాతానికి పెరిగాయని పేర్కొన్నారు. "మోదీ వాణిజ్య విధానం దేశానికి వినాశకరం" అని ఖర్గే ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ పదేళ్ల పాలనలో ఎగుమతులు 549.36% మేర జరిగితే, మోదీ పదేళ్ల పాలనలో ఎగుమతులు 24.72శాతానికి పడిపోయాయని తెలిపారు. మోదీ తీసుకువచ్చిన మేకిన్ ఇండియా, పీఎల్ఐ పథకాలు విఫలమయ్యాయన్నారు.



ఇక వ్యూహాత్మక భాగస్వామ్యం!

- ఖతార్ రాజు తమీమ్‌తో ప్రధాని చర్చలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: భారత్-ఖతార్‌ల మధ్య బంధాలను వ్యూహాత్మక భాగస్వామ్యంగా మార్చడంపై దృష్టి పెట్టాలని ఇరు దేశాల అధినేతలు నిర్ణయించారు. వాణిజ్యం, పెట్టుబడులు, టెక్నాలజీ, ఇంధనం, ప్రజా సంబంధాలపై ప్రత్యేకంగా దృష్టి సారించడం ద్వారా ఇరు దేశాల మధ్య ఉన్న సంప్రదాయ సంబంధాలను మరింత పటిష్ఠపర్చుకోవాలని తీర్మానించుకున్నారు. రెండు రోజుల భారత పర్యటనకు వచ్చిన ఖతార్ రాజు షేక్ తమీమ్‌తో మంగళవారం మోదీ సమావేశమయ్యారు. ద్వంద్వ పన్నుల నుంచి మినహాయింపు, పన్ను ఎగవేత అంశాలపై ఈ సందర్భంగా ఒప్పందం కుదిరింది.

మహాయుతిలో అంతర్యుద్ధం?

- షిండే వర్గం ఎమ్మెల్యేల భద్రత కుదింపుతో దుమారం

ముంబై, ఫిబ్రవరి 18 : మహారాష్ట్రలోని అధికార మహాయుతి కూటమిలో అంతర్గత విభేదాలు ముదురుతున్నాయి. సీఎం ఫడణవీస్, డిప్యూటీ సీఎం షిండే మధ్య దూరం రోజురోజుకి అధికమవుతోంది. షిండే వర్గానికి చెందిన 20 మంది ఎమ్మెల్యేల భద్రతను ఫడణవీస్ ఆధ్వర్యంలోని హోం శాఖ కుదించడం కూటమి వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది. షిండే వర్గంలోని 20మంది శివసేన ఎమ్మెల్యే(మంత్రివర్గంలో లేని వారు)లకు వైప్లస్ క్యాటగిరీ భద్రతను ఒక్క కానిస్టేబుల్‌కు కుదిస్తూ హోం శాఖ సోమవారం ఉత్తర్వులు ఇచ్చింది. వీరితోపాటు కొందరు బీజేపీ ఎమ్మెల్యేలు, అజిత్‌పవార్ నేతృత్వంలోని పలువురు ఎన్సీపీ ఎమ్మెల్యేల భద్రతను కూడా కుదించింది. కానీ, వీరితో పోలిస్తే షిండే వర్గంలోని వారి సంఖ్య చాలా ఎక్కువ. భద్రత కుదింపుపై షిండే వర్గం అసహనం వ్యక్తం చేస్తోంది. నిజానికి, రాయ్‌గఢ్, నాసిక్ నియోజకవర్గాల ఇన్‌చార్జి మంత్రుల నియామకం విషయంలో ఫడణవీస్, షిండే మధ్య రేగిన విభేదాలు కొనసాగుతున్నాయి. 2027లో జరగనున్న మహా కుంభమేళా ఏర్పాట్లపై ఫడణవీస్ జనవరిలో నిర్వహించిన సమీక్షకు షిండే గైర్హాజరయ్యారు. ఆ తర్వాత కొద్దిరోజులకు కుంభమేళా అంశంపైనే షిండే విడిగా సమీక్ష నిర్వహించారు. ఇటీవల మరో అడుగు ముందుకు వేసిన షిండే.. ముఖ్యమంత్రి సహాయనిధి మాదిరిగా ఉపముఖ్యమంత్రి సహాయ నిధిని ప్రారంభించి అందరికీ షాకిచ్చారు. ఇక, కొన్నేళ్లుగా మహారాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ బాధ్యతలను రాష్ట్ర రవాణా మంత్రి నిర్వహిస్తున్నారు. షిండే వర్గం ఎమ్మెల్యే ప్రస్తుతం రవాణా మంత్రిగా ఉండగా.. చైర్మన్ పదవిని ప్రభుత్వం ఇటీవల ఓ ఐఏఎస్ అధికారికి అప్పగించింది.

అక్రమంగా చొరబడిన ముగ్గురు రోహింగ్యాల అరెస్ట్

» పరారీలో మరో మహిళ

» మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు

జడ్చర్ల, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): భారతదేశంలోకి అక్రమంగా చొరబడి నివసిస్తున్న ముగ్గురు రోహింగ్యాలను అరెస్ట్ చేసినట్లు మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. మరో మహిళా రోహింగ్యా పరారీలో ఉన్నట్లు ఆయన వెల్లడించారు. మంగళవారం జడ్చర్ల పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. రాజాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నర్సింగ్ తండాలోని ఎండీ అయూబ్‌కు చెందిన ఫాంహౌజ్‌లో రోహింగ్యాలు ఉంటున్నారని పక్కా సమాచారం అందడంతో జడ్చర్ల రూరల్ సీఐ నాగార్జున్‌గౌడ్, రాజాపూర్ ఎస్‌ఐ శివానందం, తమ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. అక్కడ ఉన్న నూర్ మహమ్మద్, మహ్మద్ అరోబ్ అహ్మద్, సుమైయ అనే ముగ్గురు వ్యక్తులను విచారించగా తాము రోహింగ్యాలని ఒప్పుకున్నారని డీఎస్పీ చెప్పారు. నూర్ మహమ్మద్ భార్య రిజ్వానా పరారీలో ఉన్నట్లు తెలిపారు. మయన్మార్‌కు చెందిన నూర్ మహమ్మద్ 2012 సంవత్సరంలో త్రిపుర రాష్ట్రం ద్వారా దేశంలోకి అక్రమంగా చొరబడి, హైదరాబాద్‌లోని బాలాపూర్‌లో నివాసం ఉంటున్నాడు. 2017లో నకిలీ పాస్‌పోర్ట్, వీసా ద్వారా సౌదీఅరేబియా వెళ్లి 2022లో మళ్లీ హైదరాబాద్‌కు వచ్చాడు. త్రిపుర సరిహద్దు ద్వారా ఓ ఏజెంట్ సహాయంతో నూర్‌మహమ్మద్-రిజ్వానాలు బంగ్లాదేశ్‌కు వెళ్లి సంవత్సరం పాటు ఉన్నారు. అక్కడ ఉన్న మయన్మార్‌కు చెందిన మహమ్మద్ అరోబ్ అహ్మద్, అతని భార్య సుమైయలను భారత్‌కు తీసుకొచ్చేందుకు ఒక్కొక్కరికి రూ.30 వేల చొప్పున ఒప్పందం కుదుర్చుకున్నారు. 2024 మార్చిలో వారిని తీసుకొని నూర్‌మహమ్మద్, రిజ్వానాలు త్రిపుర సరిహద్దు ద్వారా రాత్రి సమయంలో అక్రమంగా భారత్‌లోకి చొరబడి అగర్తలాకు చేరుకున్నారు. అక్కడి నుంచి రైల్లో సికింద్రాబాద్‌కు చేరుకున్నారు. వీరు 8 నెలల నుంచి నర్సింగ్ తండాలోని ఆయూబ్ ఫాంహౌజ్‌లో ఉంటున్నారు. పది రోజుల క్రితం రిజ్వానా ఒక ఏజెంటు ద్వారా బంగ్లాదేశ్‌కు వెళ్లింది. ఈ రోహింగ్యాల వద్ద ఉన్న నకిలీ పాస్‌పోర్టులు, నకిలీ బర్త్ సర్టిఫికెట్, యుఎన్‌ఎస్‌ఆర్ కార్డు, బర్మా దేశంలో వారికి జారీ చేసిన ఫోక్రా కార్డులు, రెండు మొబైల్ ఫోన్‌లను సీజ్ చేసినట్లు తెలిపారు. వారికి నకిలీ పత్రాలు అందేలా సహకరించిన వారిపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు.

హత్య కేసులో ఐదుగురికి జీవిత ఖైదు

» రూ.2 లక్షల సుపారీ ఇచ్చి ప్రియుడితో భర్తను దారుణంగా హత్య చేయించిన భార్య

» నేరం రుజువు కావడంతో కోర్టు తీర్పు

నల్లగొండ క్రైం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని ప్రియుడితో భర్తను హత్య చేయించిన భార్య, మరో నలుగురికి జీవిత ఖైదు విధిస్తూ నల్లగొండ 3వ జిల్లా అదనపు జడ్జి దుర్గాప్రసాద్ మంగళవారం తీర్పు చెప్పారు. 2019లో జరిగిన ఈ హత్యకు సంబంధించి జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నల్లగొండకు చెందిన బిల్డర్ సోమ కేశవులు(36) భార్య స్వాతికి.. నల్లగొండకే చెందిన సీసీ కెమెరాల వ్యాపారి దుబ్బ ప్రదీప్‌తో వివాహేతర సంబంధం ఉంది. ఈ సంబంధానికి భర్త అడ్డుగా ఉన్నాడని భావించిన స్వాతి అతని అడ్డుతొలగించుకోవాలని నిర్ణయించుకుంది. ఇందుకు ప్రదీప్, అతని స్నేహితులు కొడిదేటి శివకుమార్, కుంభం ప్రసాద్, చింతపల్లి నగేష్‌తో కలిసి పథక రచన చేసింది. హత్య కోసం శివ కుమార్‌కు రూ.2 లక్షలు సుపారీ కూడా ఇచ్చింది. ఈ క్రమంలో 2019 జూలై 1 అర్ధరాత్రి కేశవులు తమ ఇంట్లోని హాల్‌లో నిద్రిస్తుండగా స్వాతి రహస్యంగా ఫోన్ చేసి ప్రదీప్‌కు సమాచారం ఇచ్చింది. మద్యం మత్తులో ఉన్న ప్రదీప్ అతని మిత్రులు ఇంట్లోకి ప్రవేశించి నిద్రిస్తున్న కేశవులు ఛాతీపై సుత్తితో కొట్టి హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని వరండాలోకి తీసుకువచ్చి పడేశారు. హాల్‌తోపాటు వరండాలో కారం చల్లి ఆనవాళ్లు లేకుండా చేసేందుకు యత్నించారు. తమ ఇంట్లోకి ప్రవేశించిన దొంగలు.. తన భర్త కేశవులను చంపి డబ్బు దోచుకుని వెళ్లారంటూ స్వాతి తెల్లవారుజామున విలపించింది. అయితే, కేశవులు తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన నల్లగొండ వన్‌టౌన్ పోలీసులు విచారణలో అసలు నిజాన్ని కనుగొని న్యాయస్థానానికి ఆధారాలు సమర్పించారు. నేరం రుజువు కావడంతో స్వాతి, ప్రదీప్ సహా ఐదుగురికి జీవిత ఖైదు విధించిన న్యాయమూర్తి ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున జరిమానా కూడా విధించారు.

పంట ఎండిపోతోందన్న బెంగ..

కౌలు రైతు ఆత్మహత్య

» ఖమ్మం జిల్లా లచ్చగూడెంలో ఘటన

చింతకాని, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): నీరులేక వరి పంట ఎండిపోతోందన్న బెంగతో ఖమ్మం జిల్లా చింకాని మండలం లచ్చగూడెంలో ఓ కౌలురైతు ఆత్మహత్య చేసుకున్నాడు. నెర్సుల యల్లయ్య (45) మూడెకరాల భూమి కౌలుకు తీసుకుని వరి సాగు చేస్తున్నాడు. అయితే పొలం సాగర్ ఆయకట్టుకు చివరన ఉండటం, భూగర్భ జాలాలు తగ్గిపోయి వ్యవసాయ బావిలో నీరు లేకపోవడంతో పంటకు నీరు పారక నెర్రెలు బారింది. వరి సాగు కోసం ఇప్పటికే రూ. 60 వేల వరకు అప్పుచేసి పెట్టుబడి పెట్టిన యల్లయ్య, పొలం ఎండిపోతుండడం చూసి తీవ్ర వేదనతో మంగళవారం పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

నిలిచిన సీసీఐ కొనుగోళ్లు

» సర్వర్ డౌన్‌తో తొమ్మిది రోజులుగా పత్తి విక్రయాలు లేవు

» తక్కువ ధరకు ప్రైవేటుకు విక్రయిస్తున్న రైతులు

జమ్మికుంట, ఆసిఫాబాద్‌రూరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్ జిల్లా జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో తొమ్మిది రోజులుగా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) కొనుగోళ్లు నిలిచిపోయాయి. ఆధార్ సర్వర్ డౌన్‌తో రైతుల వివరాలు ఐడెంటిఫికేషన్ కావడం లేదంటూ సీసీఐ అధికారులు తాత్కాలికంగా కొనుగోళ్లు నిలిపివేశారు. ఈ నెల 10వ తేదీ నుంచి సర్వర్ డౌన్ సమస్య తలెత్తింది. అప్పటి నుంచి పత్తి విక్రయానికి తెస్తున్న రైతులు దళారులకు విక్రయిస్తూ తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వ మద్దతు ధర రూ.7,521 ఉండగా, ప్రైవేట్ ట్రేడర్లు క్వింటాల్‌కు రూ.6,900 మాత్రమే చెల్లిస్తున్నారు. దీంతో రైతులు క్వింటాల్‌కు దాదాపు రూ.621 వరకు నష్టపోతున్నారు. ఒకటి, రెండు రోజుల్లో సీసీఐ కొనుగోళ్లు ప్రారంభం అవుతాయని మార్కెట్ అధికారులు తెలిపారు. కాగా సాంకేతిక లోపంతో వారం రోజుల నుంచి సీసీఐకి చెందిన రాయిటెల్ నెట్‌వర్క్ పనిచేయకపోవడంతో ఆసిఫాబాద్ జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ పత్తి కొనుగోళ్లు నిలిపివేశారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంటను వాహనాలు, ఎద్దుల బండ్లలో తీసుకువచ్చి జిన్నింగ్ మిల్లు వద్ద వారం రోజుల నుంచి ఎదురు చూస్తున్నారు.

నేడు బీఆర్‌ఎస్ విస్తృతస్థాయి సమావేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యవర్గ విస్తృత స్థాయి సమావేశం బుధవారం నిర్వహించనున్నారు. పార్టీ అధినేత కేసీఆర్ అధ్యక్షతన తెలంగాణ భవన్‌లో జరిగే సమావేశంలో రాజకీయ పరిస్థితులు, బీఆర్‌ఎస్ సిల్వర్ జూబ్లీ వేడుకలతోపాటు పలు అంశాలపై చర్చించనున్నారు. కాంగ్రెస్ సర్కార్ విధానాలను ఎండగట్టేందుకు పార్టీ పరంగా ఏం చేయాలన్న అంశంపై గులాబీ బాస్ దిశానిర్దేశం చేయనున్నారు.

తెలంగాణకు 131 టీఎంసీలు

(మొదటి పేజీ తరువాయి)

ఏపీ 646.37 టీఎంసీలను తరలించిందని, తాము 214.683 టీఎంసీలను మాత్రమే వినియోగించుకున్నామని, రానున్న రోజుల్లో తాగు, సాగునీటి అవసరాల కోసం 116 టీఎంసీలను తమకు కేటాయిస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని తెలంగాణ ఈఎన్‌సీ (జనరల్) జి.అనిల్‌కుమార్ నేరుగా కృష్ణా బోర్డు చైర్మన్ అతుల్ జైన్‌ను కలిసి, లేఖ ఇచ్చి.. నిరసన వ్యక్తం చేశారు. అయినా, కృష్ణా బోర్డు తాత్కాలిక సర్దుబాటు ప్రకారమే కేటాయింపులు చేశారు. కృష్ణా బేసిన్‌లో ప్రస్తుత నీటి సంవత్సరంలో 1010.134 టీఎంసీలు లభ్యతలోకి వచ్చాయి. తాత్కాలిక నీటి సర్దుబాటు ప్రకారం ఏపీకి 666.68 టీఎంసీలు, తెలంగాణకు 343.44 టీఎంసీల వాటాలుంటాయని బోర్డు తేల్చింది. ఏపీ ఇప్పటికే 639.652 టీఎంసీలు వాడుకోగా, ఆ రాష్ట్ర కోటాలో 27.03 టీఎంసీల జలాలు మాత్రమే మిగిలి ఉన్నట్టు స్పష్టం చేసింది. తెలంగాణ 211.691 టీఎంసీలు వాడుకుందని, దాని కోటా కింద మరో 131.75 టీఎంసీలు మిగిలి ఉన్నాయని లెక్క తేల్చింది. అదే సమయంలో, నాగార్జున సాగర్ కనీస నీటిమట్టం 510 అడుగులకిపైన 63.6 టీఎంసీలు, శ్రీశైలం జలాశయం కనీస నీటి మట్టం 834 అడుగులకిపైన 30.811 టీఎంసీల నిల్వలు మాత్రమే ప్రస్తుతం మిగిలి ఉన్నాయని కృష్ణా బోర్డు స్పష్టం చేసింది. శ్రీశైలం, నాగార్జున సాగర్, జూరాల, ప్రకాశం బ్యారేజీ, పులిచింతల ప్రాజెక్టుల ద్వారా ఇప్పటిదాకా ఇరు రాష్ట్రాలు 851.343 టీఎంసీలను వినియోగించుకున్నాయని గుర్తు చేసింది.



నీటి పంపకాలకు 2015 ఒప్పందానికి కట్టుబడాలి.. మినిట్స్‌లో కృష్ణా బోర్డు

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం 2015 జూన్‌లో జరిగిన ఒప్పందం మేరకు కృష్ణా జలాలను ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు 66:34 నిష్పత్తిలోనే పంచుకోవాలని కృష్ణా బోర్డు స్పష్టం చేసింది. ఈ మేరకు జనవరి 21న జరిగిన 19వ బోర్డు సమావేశం మినిట్స్‌ను రెండు రాష్ట్రాలతో సుదీర్ఘ సంప్రదింపుల అనంతరం మంగళవారం విడుదల చేసింది. 2015కు ముందున్న ప్రాజెక్టులన్నీ అనుమతి ఉన్నవేనని, ఆ తర్వాత కృష్ణా బేసిన్‌లో ఏ ప్రాజెక్టుకు సీడబ్ల్యూసీ, అపెక్స్ కౌన్సిల్ ఆమోదం లేదని గుర్తు చేసింది. కృష్ణా జలాలను 50:50 నిష్పత్తిలో పంచాలని తెలంగాణ, 2015 ఒప్పందానికే కట్టుబడాలని ఏపీ ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. తాజాగా జనవరి 21న జరిగిన బోర్డు సమావేశంలోనూ నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా ఇదే డిమాండ్ చేశారు. తెలంగాణకు 71 శాతం నీటిని పంచాలని, ఏపీకి 29 శాతం మాత్రమే కేటాయించాలని డిమాండ్ చేశారు. దీనిని ఏపీ తిరస్కరించి.. 66:34 నిష్పత్తికే కట్టుబడాలని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలోనే, నీటి పంపకాలపై ట్రిబ్యునల్‌లో విచారణ జరుగుతున్నందున 2015లో ఒప్పందాన్ని అనుసరించి, 66:34 నిష్పత్తితో పంచుకోవాలని బోర్డు చైర్మన్ స్పష్టం చేశారు. సుప్రీం కోర్టులో విచారణ జరుగుతున్నందున సాగర్, శ్రీశైలంలోని కాంపొనెంట్ల వ్యవహారంలో ముందుకెళ్లరాదని, ఇరు రాష్ట్రాల అంగీకారం మేరకే ప్రాజెక్టులను బోర్డు స్వాధీనం చేసుకుంటుందని మినిట్స్‌లో పేర్కొంది. మూడో విడతలో 11 ప్రాంతాల్లో టెలిమెట్రీ (నీటి తరలింపును లెక్కించే) యంత్రాలను పెట్టాలని జనవరి 10న తెలంగాణ నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి లేఖ రాశారని, వీటిని బనకచర్ల హెడ్ రెగ్యులేటరీ (తెలుగు గంగ ప్రాజెక్టు, శ్రీశైలం రైట్ బ్యాంకు కెనాల్, గాలేరు నగరి సుజల స్రవంతి, ఎస్కేప్ రెగ్యులేటర్)తోపాటు ముచ్చుమర్రి, గురు రాఘవేంద్ర ఎత్తిపోతల పథకం కింద పెట్టాలని కోరారని, ఇందుకయ్యే వ్యయం తామే భరిస్తామని ప్రతిపాదించారని గుర్తు చేసింది. అయితే, తెలంగాణ ప్రతిపాదనను అంగీకరించే ప్రసక్తే లేదని ఏపీ తేల్చి చెప్పినట్లు బోర్డు తెలిపింది. తాగునీటికి 100 టీఎంసీలు తరలిస్తే.. అందులో 20 శాతం (20 టీఎంసీలు) మాత్రమే తరలించినట్లు లెక్కించాలన్న ఏపీ, తెలంగాణ ప్రతిపాదనలకు బోర్డు అంగీకరించింది. శ్రీశైలంలో ప్లంజ్‌పూల్ మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఈఎన్‌సీ డిమాండ్ చేయగా.. దీన్ని అత్యంత ప్రాధాన్య అంశంగా బోర్డు పేర్కొంది. శ్రీశైలం, సాగర్ నిర్వహణపై యథాతథస్థితి కొనసాగించాలని నిర్ణయించింది.

నాన్నా.. ఇది తగునా..!

» కుమార్తెలతో కామాంధుల అసభ్యప్రవర్తన.. తండ్రుల వత్తాసు

» హైదరాబాద్‌లో రెండు వేర్వేరు ఘటనలు

» భార్యల ఫిర్యాదు.. నిందితులు, భర్తలపై పోక్సో కేసుల నమోదు



బంజారాహిల్స్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మీ మేనల్లుడు మన అమ్మాయితో అసభ్యంగా ప్రవర్తించాడు.. అని భార్య చెబితే.. నా మేనల్లుడిపై నింద వేయడానికి నీకెంత ధైర్యం ? అంటూ రెచ్చిపోయిన భర్త ఒకరు. నీ ఫ్రెండ్ మన కూతురిపై లైంగిక దాడికి యత్నించాడు అంటే.. నా స్నేహితుడిపై నిందలు వేస్తావా ? అంటూ భార్యతో గొడవకు దిగిన భర్త మరొకరు. తమ కుమార్తెలు లైంగిక దాడికి గురైనా ఈ తండ్రులు పట్టించుకోకపోతే.. ఆయా బాలికల తల్లులు పోలీసులను ఆశ్రయించడంతో ఈ దారుణాలు బయటికొచ్చాయి. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన ఈ వేర్వేరు ఘటనల వివరాలిలా ఉన్నాయి. బంజారాహిల్స్ సయ్యద్‌నగర్‌లో ఓ మహిళ, తన భర్త, కుమార్తె(10)తో కలిసి నివాసం ఉంటుంది. గతేడాది ఆమె ఆడపడచు(భర్త సోదరి) కుమారుడు అబ్దుల్ నజీర్ వారి ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో నజీర్ ఇంటి మేడపై ఆడుతూ పదేళ్ల బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడు. ఇది గమనించిన ఆ బాలిక తల్లి.. విషయాన్ని తన భర్త దృష్టికి తీసుకెళ్లగా.. అతడు తన మేనల్లుడికి వత్తాసు పలికి భార్యతో గొడవపడ్డాడు. దీంతో పుట్టింటికి వెళ్లిపోయి కొద్ది రోజులు తర్వాత ఇంటికి తిరిగొచ్చిన ఆ మహిళ తన ఆడపడుచుతో జరిగిన విషయాన్ని చెప్పింది. ఆమె కూడా గొడవ పడింది. దీంతో తన కుమార్తెకు జరిగిన అన్యాయంపై ఆ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. బాధిత బాలిక తండ్రి, అబ్దుల్ నజీర్‌పై పోక్సో కేసు నమోదు చేశారు. మరో ఘటనలో.. ఓ మహిళ, తన భర్త, ఇద్దరు పిల్లలతో కలిసి బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 5లో నివాసం ఉంటుంది. ఫిబ్రవరి 14న పిల్లలను ఇంట్లో వదలి ఆ దంపతులిద్దరూ మహబూబ్‌నగర్ వెళ్లారు. ఆ సమయంలో భర్త స్నేహితుడైన సోను, మరో ముగ్గురు మహిళలతో కలిసి వారింటికి వచ్చి మద్యం తాగాడు. అంతేకాక, ఇంట్లో ఒంటరిగా ఉన్న స్నేహితుడి కుమార్తె (14)పై లైంగిక దాడికి యత్నించాడు. విషయం తెలుసుకున్న మహిళ జరిగిన ఘటనను భర్తకు చెప్పగా.. అతను తన స్నేహితుడికి వత్తాసు పలికాడు. దీంతో బాధిత బాలిక తల్లి పోలీసులను ఆశ్రయించగా బాలిక తండ్రి, సోనుపై పోక్సో కేసు నమోదైంది.

కుటుంబ నియంత్రణ ఆపరేషన్

వికటించి మహిళ మృతి

» చేవెళ్లలోని 'పట్నం' ఆస్పత్రిలో శస్త్రచికిత్స.. సీరియస్

» మరో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆమె మృతి

» 'పట్నం' ఆస్పత్రి వద్ద కుటుంబ సభ్యుల ఆందోళన



మమత (ఫైల్)

చేవెళ్ల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు పిల్లల ఓ తల్లికి.. ఓ ఆస్పత్రి వైద్యులు చేసిన కుటుంబ నియంత్రణ ఆపరేషన్ వికటించింది. శరీరంలో ఇన్‌ఫెక్షన్ సోకి మహిళ మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే ఆమె చనిపోయిందంటూ మృతురాలి కుటుంబసభ్యులు, బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్లలోని పట్నం మహేందర్‌రెడ్డి ఆస్పత్రి వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. వికారాబాద్ జిల్లా పూడూర్ మండల పరిధిలోని అంగడి చిట్టంపల్లికి చెందిన చుంచు మమత (25)కు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ నెల 12న ఆమెకు చేవెళ్లలోని పట్నం మహేందర్‌రెడ్డి జనరల్ ఆస్పత్రిలో వైద్యులు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేశారు. ఈ నెల 15న రాత్రి మమతకు జ్వరం రావడంతో వైద్యులు మందులు ఇచ్చారు. జ్వరం తగ్గకపోగా.. మరుసటి రోజు తీవ్రమై బీపీ 70కి పడిపోయింది. దీంతో పరిస్థితి విషమంగా ఉందని, ఉస్మానియా ఆస్పత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. అయితే వారు ఉస్మానియాకు కాకుండా ప్రీమియర్ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ఆమెకు ఇన్‌ఫెక్షన్ సోకినట్లు అక్కడి వైద్యులు తెలిపారు. రెండు రోజుల చికిత్స అనంతరం మమత ఆరోగ్యం మరింత క్షీణించి సోమవారం అర్ధరాత్రి మృతి చెందింది.

20 లక్షల పరిహారం ఇస్తాం : పట్నం ఆస్పత్రి యాజమాన్యం

పట్నం మహేందర్‌రెడ్డి ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే మమత చనిపోయిందంటూ కుటుంబ సభ్యులు, బంధువులు మంగళవారం ఉదయం మృతదేహంతో ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. పోలీసులు, రాజకీయ నాయకులు ఆస్పత్రి యాజమాన్యంతో చర్చలు జరపడంతో రూ.20 లక్షల సాయం అందిస్తామని యాజమాన్యం హామీ ఇచ్చింది. దీంతో ఆందోళన విరమించారు. కాగా, మమతకు ఆపరేషన్ చేయడంలో వైద్యుల నిర్లక్ష్యం లేదని పట్నం మహేందర్‌రెడ్డి ఆస్పత్రి సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డి అన్నారు.

ఆ భోజనం మాకొద్దు బాబోయ్!

» సచివాలయంలో 'ప్రోటోకాల్' భోజనంపై ఉద్యోగులు, అధికారుల అసంతృప్తి

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సచివాలయంలో ప్రోటోకాల్ విభాగం ఆధ్వర్యంలో అందించే భోజనం నాణ్యతపై ఉద్యోగులు, అధికారుల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతుంది. ఈ భోజనం తిని కొందరు అస్వస్థత గురైన ఘటనలు కూడా ఉన్నాయి. సచివాలయంలోని మంత్రులు, ఇతర ఐఏఎస్ అధికారులు, ముఖ్యమంత్రి ప్రజా సంబంధాల అధికారి కార్యాలయాలకు ప్రోటోకాల్ విభాగం ఆధ్వర్యంలో ఆహారం అందజేస్తుంటారు. మధ్యాహ్న భోజనం తోపాటు సాయంత్రం చిరుతిళ్లు, టీ అందిస్తారు. ఈ ఆహార తయారీ, సరఫరా బాధ్యతను ఓ సంస్థకు అప్పగించగా ప్రోటోకాల్ విభాగం పర్యవేక్షిస్తుంటుంది. అయితే, కొంతకాలంగా సదరు సంస్థ సరఫరా చేస్తున్న ఆహారం నాసిరకంగా ఉంటుందని అధికారులు, ఉద్యోగులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. సచివాలయం ఐదో అంతస్తులో ఉన్న ఓ పేషీలోని కీలక అధికారి ఇటీవల ఈ భోజనం తిని కాసేపటికే వాంతులు చేసుకున్నారని సమాచారం. కాగా, ఆహార నాణ్యతపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు ఇటీవల సదరు ఏజెన్సీ వంటగదిలో తనిఖీలు చేసినట్లు తెలిసింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కొత్త సీఈసీ

దాదాపు మూడేళ్ళపాటు భారత ఎన్నికల సంఘం సారథిగా ఉన్న రాజీవ్‌కుమార్ స్థానంలోకి జ్ఞానేశ్ కుమార్ వచ్చారు. సీఈసీగా జ్ఞానేశ్ పదోన్నతి పొందడంతో ఆ స్థానంలో ఎన్నికల కమిషనర్‌గా వివేక్ జోషీ నియమితులైనారు. జ్ఞానేశ్‌కు ప్రమోషన్, మూడునెలల్లోనే హర్యానానుంచి జోషీని తెచ్చి ఈసీగా నియమించడం లక్ష్యంగా సోమవారం ఎంపిక కమిటీ భేటీ అయినప్పుడు విపక్షనాయకుడు రాహుల్ గాంధీ ఆ ప్రక్రియను తాత్కాలికంగా వాయిదావేయాలని కోరారు. ఎన్నికల కమిషనర్ల నియామకాలకు సంబంధించి 2023లో తీసుకొచ్చిన చట్టం ప్రకారం తొలిసారిగా ఈ ఎంపికలు ఉండబోతున్నందున, సెలక్షన్ ప్యానెల్‌కు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లను కోర్టు నిగ్గుతేల్చేవరకూ కొత్త సీఈసీపై నిర్ణయాన్ని వాయిదావేయాలన్నది రాహుల్ సూచన. కానీ, ఆయన మాటను లక్ష్యపెట్టకుండా ప్రధాని నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్ షా ఈ రెండు పోస్టులు నింపేసినందుకు కాంగ్రెస్ ఆగ్రహిస్తోంది. త్రిసభ్య కమిటీ సమావేశంలో సమర్పించిన నోట్‌ను రాహుల్‌గాంధీ ప్రజాక్షేత్రంలో పెట్టి, ఇదేమి అన్యాయం అని ప్రశ్నిస్తున్నారు. అంతా బానే ఉంది కానీ, సదరు పిటిషన్ విచారణలో ఉన్నంతమాత్రాన నియామకాలు ఆపేయాలన్న నియమమేమీ లేదు. కొత్తచట్టం ప్రకారం నడవడానికి వీల్లేదనో, ఎంపికలు కూడదనో సుప్రీంకోర్టు చెప్పలేదు. పైపెచ్చు, పిటిషన్‌దారు చేసిన అటువంటి విన్నపాన్ని త్రోసిపుచ్చి, పరోక్షంగా మార్గాన్ని సుగమం చేసింది కూడా. రాహుల్ వాదనలో ఔచిత్యం లేకపోలేదు. కానీ, కేసు విచారణలో ఉన్నందున కాస్తంత ఓపికపడితే సరిపోతుందని, వ్యవస్థల ఔన్నత్యాన్నీ, మర్యాదలను కాపాడినట్టూ అవుతుందని ప్రభుత్వ పెద్దలు కూడా అనుకోవాలి కదా!

రాహుల్‌గాంధీ సుప్రీంకోర్టును చూపి బెదిరిస్తున్నారు కానీ, అదేమీ హడావుడి పడటంలేదు. మోదీ ప్రభుత్వం తనకు నచ్చిన చట్టం చేసుకొని, మెచ్చినవారిని నియమించుకుంటున్నందుకు అభ్యంతరమూ లేదు. ప్రశాంత్‌భూషణ్ ఒత్తిడిచేస్తున్నా న్యాయమూర్తులు ప్రశాంతంగానే ఉన్నారు. బుధవారం కేసు విచారణ ఉండగా, సోమవారమే ఈ రెండు నియామకాలు జరిగిన విషయాన్ని ప్రశాంత్ భూషణ్ మంగళవారం మరోమారు కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. వరుసలో నలభయ్యోస్థానంలో ఉన్న ఈ కేసు బుధవారం సైతం విచారణకు రాకపోవచ్చుననీ, ప్రాధాన్యత రీత్యా దానిని ముందుగానే చేపట్టాలని ఆయన విజ్ఞప్తిచేస్తే, రేపటి సంగతి రేపు చూద్దామని జస్టిస్ సూర్యకాంత్ తేల్చేశారు. ఇప్పటివరకూ మూడు నియామకాలు ఇదే తీరున జరిగిన విషయాన్ని కూడా పిటిషనర్ న్యాయమూర్తికి గుర్తుచేశారు. నిజానికి, ఫిబ్రవరి 12న జరగాల్సిన విచారణ19వ తేదీకి వాయిదావేసినప్పుడే, అంతలోగా సీఈసీ నియామకం పూర్తయిపోతుందని పిటిషన్‌దారులు ఆందోళన వెలిబుచ్చారు. జరగాల్సింది జరుగుతుందనీ, అన్నీ అంతిమతీర్పుకు కట్టుబడి ఉంటాయని న్యాయమూర్తులు ఓ నామమాత్రపు హామీ ఇచ్చారు.

ఎన్నికల కమిషనర్ల నియామకాలకు సంబంధించి నిర్దిష్టమైన చట్టం లేనందున, అది తయారయ్యేలోగా, ప్రధాన న్యాయమూర్తి కూడా భాగస్వామిగా ఉన్న ప్యానెల్ ద్వారా భర్తీ జరగాలని సుప్రీంకోర్టు 2023 మార్చిలో తీర్పు చెప్పింది. అదే ఏడాది చివర్లో కేంద్రప్రభుత్వం చట్టం చేసుకుంది, అందులో చీఫ్ జస్టిస్ స్థానంలోకి హోంమంత్రి వచ్చారు. తటస్థుడైన మూడో వ్యక్తికి చోటులేకపోయింది. చట్టం తయారైంది కానీ, సారాంశంలో సుప్రీంకోర్టు ఆశయమైతే అందులో మిగల్లేదు. ఎన్నికల కమిషనర్ల నియమకాలు అన్ని రకాల ప్రభావాలకు అతీతంగా, స్వతంత్రంగా, కార్యనిర్వాహక వ్యవస్థకూ, రాజకీయాలకూ అతీతంగా జరగాలన్నది ఆ తీర్పు సారాంశం. కానీ, ఉన్న ముగ్గురిలో ఇద్దరు అధికారపక్షం నుంచే ఉన్నప్పుడు విపక్షనేత మాట చెల్లుబాటయ్యే అవకాశమే ఉండదు. పైగా, ప్రజాస్వామ్యంలో అతిముఖ్యమైన ఎన్నికల ప్రక్రియను ఒత్తిళ్ళకు అతీతంగా నిర్వహించాల్సిన ముగ్గురు అధికారులను కమిటీలో ఉన్న ముగ్గురు రాజకీయ నాయకులు నియమించడం మరో విచిత్రం. అంతిమంగా ఈ ప్రక్రియకు గౌరవమే లేకుండా పోయింది. ఎన్నికల సందర్భంలో కమిషనర్ల నిర్ణయాలు వివాదాస్పదం కావడం నిత్యకృత్యమైంది. కొత్తచట్టం మీద సుప్రీంకోర్టు కొత్తగా ఏమి చెబుతుందో తెలియదు కానీ, ప్రత్యేక ప్రతిపత్తిని కోల్పోయిన జమ్మూకశ్మీర్‌ను చక్కబెట్టడం నుంచి, రామజన్మభూమి ట్రస్టు ఏర్పాటువరకూ ఎన్నో రాచకార్యాలను చక్కబెట్టిన జ్ఞానేశ్ కుమార్ ఆధ్వర్యంలో రాబోయే నాలుగేళ్ళలో ఇరవై అసెంబ్లీ ఎన్నికలు జరిగి, సార్వత్రిక ఎన్నికలకు కూడా రంగం సిద్ధం కాబోతున్నది.

నిన్నగాక మొన్నటి దాకా తాము దేశాన్ని ఏలిన నాయకులమనే అభిజాత్యాన్ని కాంగ్రెస్ నేతలు వీడలేకపోతున్నారు. యువతకు చేరువ కావడానికి ముమ్మరంగా ప్రయత్నించవలసిన కాంగ్రెస్ ఇంకా పురా వైభవ స్మృతులలోనే మునిగి తేలుతోంది. 7–18 సంవత్సరాల వయసులోని నవతరాన్ని ఆకర్షించే దిశగా 'జవహర్ బాల మంచ్'ను నెలకొల్పాలని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీలకు జారీ చేసిన ఆదేశాలను అధికారంలో ఉన్న తెలంగాణలోనే పట్టించుకోవడం లేదు!

కాంగ్రెస్ : కూలుతున్న మహావృక్షం

గల్ఫ్ లేఖ

భారతవని రాజకీయ మహావృక్షం భారత జాతీయ కాంగ్రెస్ క్రమేణా బలహీనపడుతోంది. పార్లమెంటులో ప్రభావశీలతను, ప్రజల్లో ఆకర్షణ శక్తిని కోల్పోతోంది. ఒకటి, రెండు మినహాయించి ప్రతీ ఎన్నికలలోనూ ఈ జాతీయ సంస్థ ప్రాబల్యం సన్నగిల్లుతోంది. దేశ జనాభాలో సగానికి మించి ఉన్న యువతతో మమేకం కాలేకపోతోంది. అసలు యువజనులను తన వైపు ఆకట్టుకోవడంలో సాఫల్య వైఫల్యాలు అటుంచి కనీసం వారిని తన రాజకీయ కార్యకలాపాలలో భాగస్వాములుగా చేసుకునేందుకు ఒక అడుగు కూడ ముందుకు వేయడం లేదు.

దేశ ప్రగతి నిర్మాణ శక్తి యువతే కదా. అయినా యువ భారతీయులతో యువనేత రాహుల్‌గాంధీ సారథ్యంలో సైతం మమేకం కాలేకపోవడం కాంగ్రెస్ కష్టాలకు ఒక ప్రధాన కారణమని చెప్పవచ్చు. ఒకప్పుడు అనునిత్యం వివిధ కార్యక్రమాలతో నిమగ్నమై నేటి తరానికి మేటి నాయకులను అందించిన యువజన కాంగ్రెస్ నేడు ఫెక్సీలకు కూడ పనికి రాకుండ పోగా, విద్యార్థి విభాగమైన ఎన్ఎస్‌యుఐ ఉనికినే కోల్పోయింది. గతంలో ఢిల్లీ కాంగ్రెస్‌లోనే కాదు జాతీయ స్థాయిలో రాహుల్‌గాంధీ యూత్ బ్రిగేడ్‌లో ప్రముఖుడుగా భాసించిన సందీప్ దీక్షిత్ ఘోర పరాజయం ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు మాత్రమే పరిమితమైన విషయం కానే కాదు. షీలా దీక్షిత్ తనయుడు అయిన సందీప్‌కు వచ్చిన ఓట్లు కాంగ్రెస్ పతనావస్థకు సంకేతం. మారిన, మారుతున్న లోకం పోకడలను అర్థం చేసుకోకుండా ఒకనాటి తమ అధికార దర్పంతో ఎక్కువ స్థానాలకు పట్టుబట్టడం, ఆ తర్వాత పరాజయం పాలై ప్రభావం కోల్పోవడం కాంగ్రెస్‌కు పరిపాటి అయిపోయింది.

నిన్నగాక మొన్నటి దాకా తాము దేశాన్ని ఏలిన నాయకులమనే అభిజాత్యాన్ని కాంగ్రెస్ నేతలు వీడలేకపోతున్నారు. నాటి నవాబులూ సరిగ్గా ఇలానే వ్యవహరించేవారు. లక్నో నవాబుల వారసురాలుగా చెప్పుకున్న ఒక మహిళకు 1985లో రాజీవ్‌గాంధీ న్యూ ఢిల్లీలో ఒక బంగ్లాను కేటాయించారు. నవాబు వాజీద్ అలీ షా వారసురాలుగా తాను ఆ బంగ్లాలో ఉండడం తన వంశ స్థాయికి తగదని ఆమె తిరస్కరించారు. న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లోని ప్రయాణికులు వేచి ఉండే గదిలో తొమ్మిది సంవత్సరాలు గడిపిన అనంతరం, ఆమెకు ఢిల్లీ శివారులోని ఒక నిర్మానుష్య శిథిల భవంతి అయిన మల్చ మహల్‌ను కేటాయించారు. తలుపులు లేని ఆ హర్మ్యంలో విద్యుత్ కాదు కదా కనీసం మంచి నీటి వసతి కూడ లేదు. అలా తాను ఇంకా నవాబు వంశస్థురాలుననే భ్రమల్లో ఆమె బతికింది. ఈ రకంగా అనేక మంది గడిచిపోయిన గతం నుంచి వర్తమానంలోకి రాకుండ భ్రమల్లో గడుపుతుంటారు. ప్రస్తుతం కాంగ్రెస్ నాయకగణం పరిస్థితి కూడ సరిగ్గా ఇదే విధంగా ఉంది.



చెప్పవచ్చినదేమిటంటే యువతకు చేరువ కావడానికి ముమ్మరంగా ప్రయత్నించవలసిన కాంగ్రెస్ ఇంకా పురా వైభవ స్మృతులలోనే మునిగి తేలుతోంది. ప్రత్యర్థి బిజెపి తన వాట్సాప్ విశ్వవిద్యాలయం ద్వారా దేశంలోనే కాదు విదేశాలలోని భారతీయ యువతను సైతం ఆకర్షించడంలో సఫలమయింది. కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసే వ్యూహాలు కేవలం కాగితాలకు మాత్రమే పరిమితమవుతున్నాయి. ప్రగతిశీల భావజాల ప్రాతిపదికపై పార్టీని పునర్నిర్మించేందుకై 7–18 సంవత్సరాల వయసులోని నవతరాన్ని ఆకర్షించే దిశగా 'జవహర్ బాల మంచ్' (జె.బి.యం)ను నెలకొల్పాలని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీలకు జారీ చేసిన ఆదేశాలను అధికారంలో ఉన్న తెలంగాణలోనే పట్టించుకోవడం లేదంటే కాంగ్రెస్ పరిస్థితి ఎలా ఉన్నదో ఊహించుకోవచ్చు. ఇక రాహుల్‌గాంధీ నిత్యం ఉద్ఘాటిస్తుండే సైద్ధాంతిక విధానాలు ఆయన్ను అనుసరిస్తున్న ఎంత మంది నాయకులకు అర్థమవుతున్నాయనేది ఒక అంతు చిక్కని ప్రశ్న. యువ కిశోరాలుగా దేశాన్ని ఆకర్షించిన కన్హయ కుమార్, హర్దిక్ పటేల్, జిగ్నేష్ మేవానీలను సరైన రీతిలో వినియోగించుకోలేదు. ఇదే కన్హయ కుమార్ బిజెపిలో చేరి ఉంటే ఆ పార్టీ అతన్ని ఏ విధంగా ఉపయోగించుకునేదో ఒక్కసారి ఆలోచించాలి. ఒకప్పుడు హైదరాబాద్ నగరంలో యువతలో బలమైన సంస్థాగతమైన పట్టు కలిగి ఉండి మజ్లిస్, తెలుగుదేశం, భారతీయ జనతా పార్టీలను దీటుగా ఎదుర్కొన్న హైద్రాబాద్ నగర కాంగ్రెస్ విభాగం నేడు నిర్వీర్యమైపోయింది. పార్టీ నిర్మాణాన్ని పక్కన పెడితే నగర కాంగ్రెస్ అధ్యక్షుడు రోహన్‌రెడ్డి కనీసం కార్యవర్గాన్ని కూడ నియమించుకోలేకపోతున్నారు. దీన్ని బట్టి కాంగ్రెస్ కార్యకలాపాలు ఏ రీతిలో ఉన్నాయో ఊహించుకోవచ్చు. తెలంగాణలో వారసత్వంగానైనా కొంత మంది యువనేతలు శాసన సభకు ఎన్నికయినప్పటికి పార్టీ పట్ల వారి విధేయత ఎంత అనేది ఒక అంతుబట్టని ప్రశ్న. కాంగ్రెస్ పార్టీ ప్రముఖ నాయకులు ఎవరైనా విదేశీ పర్యటనలకు వస్తే వారిని కలుసుకోవడానికి ప్రవాసులు ఇష్టపడడం లేదు. పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల నాయకగణం కూడా తమ విదేశీ పర్యటనల్లో జనాలను కలుసుకోవడానికి ఇష్టపడకపోవడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి?

1999లో ఢిల్లీలో కురిసిన భారీ వర్షాలకు 24, అక్బర్ రోడ్డులోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయం ఆవరణలోని ఒక మహా వృక్షం తన నీడలో ఉన్న ఒక చిన్న మందిరంపై కూలిపోవడాన్ని అపశకునంగా అనేక మంది భావించారు. సంవత్సరాల తరబడి వేళ్ళు దెబ్బతిన్న చెట్టు ఒక్క పది నిమిషాల వర్షానికి కూలిపోవడం అశ్చర్యం కాదని ఆ సందర్భంగా సోనియాగాంధీ వ్యాఖ్యానించారని చెబుతారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అనే మహా వృక్షం వేళ్ళన్నీ కూడ పూర్తిగా దెబ్బతిని కూలిపోతోంది. ఈ పతన క్రమంలో అక్కడక్కడ మిగిలి ఉన్న పచ్చని కాంగ్రెస్‌ను చూసి మురిసిపోతే ఎలా?

■ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ఈ ఘటనలు ఏ వైఫల్యాలకు సంకేతం?



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

ప్రతీదాన్నీ వ్యతిరేక దృక్పథంతో చూడడం సరైంది కాదని లోకమంతా పచ్చగా ఉన్నదని నమ్మేవారు అంటారు కాని కొన్ని దృశ్యాలు చూసినప్పుడు మనసు కలచివేస్తుంటే మాట్లాడకుండా ఎలా ఉండగలం? అమెరికా నుంచి వందలాది భారతీయులను పెడరెక్కలు విరిచి కట్టి జంతువుల్లా సైనిక విమానాల్లో పడవేసి వెనక్కు పంపుతున్న దృశ్యాలు గతంలో కోవిడ్ సమయంలో వేలాది కూలీలు నగరాలనుంచి తమ ఊళ్లకు మైళ్లకు మైళ్లు నడిచి వెళ్లిన దృశ్యాలను తలపించడం లేదా? 144 సంవత్సరాలకు ఒకసారి మహాకుంభమేళా వస్తుందని, ఫలానా రోజు మునిగితే ఇంకా పుణ్యం వస్తుందని ప్రభుత్వమే ప్రచారం చేస్తే తండోపతండాలుగా తరలి వచ్చిన ప్రజలు తొక్కిసలాటకు గురై మృత్యువాత పడ్డ దృశ్యాలను చూసి బాధపడకుండా ఎలా ఉండగలం? ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసి ఒకసారి ప్లాట్ ఫారంపైకి జనం వచ్చేలా చేసి ఒకర్నొకరు తొక్కుకుని అయిదుగురు పిల్లలతో సహా 18 మంది మరణించడానికి ఎవరు బాధ్యులు? బిహార్‌లో కిక్కిరిసిన రైలులో ఎక్కలేమన్న ఆగ్రహంతో ఏసీ కోచ్‌ల కిటికీల అద్దాలను రాళ్లతో పగులగొట్టి మరీ చొచ్చుకు వచ్చిన దుండగులకు ఏ నదిలో మునిగితే మాత్రం పాపవిమోచనం లభిస్తుంది?

ఈ దృశ్యాలన్నీ ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగాలనుకుంటున్న భారతదేశానికి శుభ సూచకాలు మాత్రం కాదని చెప్పగలం. తమ స్వంతదేశం నుంచి అమెరికాకు పొట్ట చేత బట్టుకుని వచ్చిన లక్షలాది మందిలో భారతీయులు సంఖ్యరీత్యా అయిదవ స్థానంలో ఉంటారని మైగ్రేషన్ పాలసీ ఇనిస్టిట్యూట్ వెల్లడించింది. నలుగురు భారతీయుల్లో ఒకరికి సరైన పత్రాలు ఉండవని సెంటర్ ఫర్ మైగ్రేషన్ స్టడీస్ వంటి సంస్థలు చెబుతున్నాయి. స్వంత ఊళ్లో పనిదొరక్క వలస కూలీలు పట్టణాలకు వలస వచ్చినట్లే స్వంతదేశంలో పని దొరక్క ఏదో ఒక ఏజెంట్‌కు డబ్బులు ముట్టచెప్పి అమెరికాలాంటి దేశాలకు వెళుతున్నారంటే దానికి కారణం ఏమిటి? సముద్రాలు, కొండలు, కోనలు, అడవులు దాటి భార్యాపిల్లలతో పాటు మైళ్లకు మైళ్లు నడిచి దొంగ మార్గాల్లో భారతీయులు అమెరికాలో ప్రవేశించేందుకు ఎందుకు తహతహలాడుతున్నారు? మన దేశంలో వారు శ్రమకు తగ్గ ప్రతిఫలాన్ని పొంది హుందాగా జీవించేందుకు అవకాశాలు దొరకనందువల్లే కదా? మన నిరుద్యోగ సమస్యను మనం పరిష్కరించుకోలేక, అమెరికా మన వారిని అమానుషంగా పంపిస్తున్న తీరును బహిరంగంగా ఖండించలేక మన నేతలు సతమతమవుతున్నారు. 'అక్రమంగా వెళ్లిన వారిని వెనక్కు తీసుకుంటాం, మనుషులను అక్రమంగా రవాణా చేస్తున్నవారిపై చర్యలు తీసుకుంటాం' అని వినిపిస్తున్న అధికారిక స్వరాల్లో బలహీన నిస్సహాయత ప్రతిధ్వనిస్తోంది. 'మావారిని వెనక్కు పంపండి కాని వారి పట్ల మానవత్వంతో వ్యవహరించండి..' అని అమెరికాను అభ్యర్థించినట్లు విదేశాంగ మంత్రి జైశంకర్ పార్లమెంట్‌లో చెప్పిన తర్వాత కూడా అదే విధంగా చేతులకు గొలుసులతో, కాళ్లకు సంకెళ్లతో భారతీయులను వెనక్కు పంపారు. ఆ తర్వాత ప్రధానమంత్రి నరేంద్రమోదీ అమెరికాకు వెళ్లి కీలకమైన వ్యాపార, రక్షణ ఒప్పందాలను కుదుర్చుకుని వచ్చారు. గతంలో హౌడీమోడీ, నమస్తే ట్రంప్ వంటి కార్యక్రమాల్లో తాను, ట్రంప్ దిగిన ఫోటోలను ఆల్బమ్‌గా తయారు చేసి కలిసికట్టుగా మన ప్రయాణం పేరుతో మోదీ బహూకరిస్తే, 'మిస్టర్ ప్రైమ్ మినిస్టర్, యు ఆర్ గ్రేట్' అని ట్రంప్ ఆ ఆల్బమ్‌పై సంతకం చేశారు. భారత, అమెరికా దేశాల స్నేహ సంబంధాలు ఇలా పరిఢవిల్లుతున్న సమయంలో వలసవెళ్లిన వారి గురించి అపస్వరాలు ఎందుకు వినిపిస్తాయి?

నిజానికి అమెరికా అంటేనే వలసవచ్చిన వారి దేశం. ప్రపంచంలోని అన్ని దేశాలనుంచి వచ్చిన వారి కష్టంతో బలపడ్డ దేశం. అక్కడి పారిశ్రామికీకరణకు చెమటోడ్చిన వలస కూలీలు, వినూత్న ఆవిష్కరణలకు తోడ్పడిన వివిధ దేశాలకు చెందిన మేధావులకు కృతజ్ఞత ప్రకటించాల్సిన దేశం. గూగుల్, యాహూ, ఇన్‌స్టాగ్రామ్, హఫింగ్టన్ పోస్ట్ అనేక సంస్థల్ని వలసవచ్చిన వారే స్థాపించారు. సిలికాన్ వాలీలో వందల కోట్ల డాలర్ల స్టార్టప్‌లను స్థాపించిన సగం మంది ఇతర దేశాల నుంచి వచ్చిన వారే. ప్రపంచీకరణ మూలంగా ఏర్పడ్డ ఆర్థిక మాంద్యం, లక్షలాది మంది ఉపాధి కోల్పోవడం వల్ల అందుకు వలస వచ్చినవారిని నిందిస్తున్నారు కాని రీగన్ హయాంలో పత్రాలు లేని వారికి కూడా చట్టపరమైన హోదా కల్పించి ఇముడ్చుకున్న దేశం అమెరికా. 'Coalition for Humane Immigrant Rights of Los Angeles' (చిర్లా) అనే సంస్థ అక్రమంగా వలస వచ్చిన వారికి డాక్యుమెంట్లను తయారు చేసి అమెరికాలో గౌరవంగా స్థిరపడేందుకు తోడ్పడింది. స్కూళ్లకు పిల్లల్ని పంపడానికి, డాక్టర్ల వద్దకు వెళ్లడానికీ భయపడ్డ అనేకమంది ప్రవాసులకు డెమొక్రాటిక్ పార్టీ అండగా నిలిచిన రోజులున్నాయి.

ఏ కారణాల వల్ల నైతేనేం, ఇవాళ పత్రాలు సరిగా లేవని అనేకమందిని వారి వారి స్వదేశాలకు పంపిస్తున్న అమెరికాలో నేర న్యాయవ్యవస్థ ఎంత ఘోరంగా ఉన్నదో బైడెన్ హయాంలో ఉపాధ్యక్షురాలుగా ఉన్న కమలా హారిస్ తన ఆత్మకథ 'The Truths We Hold: An American Journey'లో వివరించారు. కొన్ని దశాబ్దాల పాటు అటార్నీగా పనిచేసిన ఆమె అమెరికా క్రిమినల్ జస్టిస్ వ్యవస్థ అంతటా వివక్ష తాండవిస్తోందని రాశారు. తప్పుచేసిన కారు డ్రైవర్లలో 85 శాతం నల్లవారే పోలీసుల చర్యలకు లోనవుతారని, జైలు పాలయే నేరస్థుల్లో తెల్లవారి కంటే నల్లవారే ఆరు శాతం ఎక్కువ మంది ఉంటారని, తెల్లవారి కంటే 20 శాతం ఎక్కువగా నల్లవారికి సుదీర్ఘకాలం శిక్ష పడుతుందని, బెయిల్ కోసం తెల్లవారి కంటే 35 శాతం ఎక్కువగా వారు చెల్లించాల్సి ఉంటుందని ఆమె వివరించారు. పోలీసుల క్రూరత్వానికి తెల్లవారి కంటే నల్లవారే బలవుతారని ఆమె చెప్పారు. 'వీధుల్లో పెట్రోలింగ్ చేసే పోలీసులు తమను చితకబాదుతారని, కొట్టి చంపుతారని ఒక వర్గం ప్రజలు భయపడితే మనం స్వేచ్ఛా సమాజంలో జీవిస్తున్నట్లా? మన న్యాయవ్యవస్థలో పోలీసుల క్రూరత్వానికి తగినట్లు శిక్షలు లేకపోతే మనం ఏ సందేశం పంపుతున్నట్లు?' అని ఆమె ప్రశ్నించారు. ఒక బ్యాక్‌పాక్ దొంగిలించినందుకు అరెస్టయి, బెయిల్ వచ్చేందుకు 3వేల డాలర్లు చెల్లించలేక, మూడేళ్ల పాటు జైలులో ఒంటరి నిర్బంధానికి గురైన బ్రౌడర్ అనే 16 ఏళ్ల యువకుడి ఉదంతాన్ని ఆమె తన ఆత్మకథలో వివరించారు. అమెరికాలో నగదుకు బెయిల్ ఇచ్చే పద్ధతి సంపన్నులకు అనుకూలంగా, పేదలకు వ్యతిరేకంగా ఉన్నదని చెప్పారు. 'పేదరికంలో ఉన్నందుకు ప్రజలను శిక్షించేది ఒక న్యాయమా?' అని ఆమె ప్రశ్నించారు. 2000–14 సంవత్సరాల మధ్య జైళ్లలో ఉన్న 95 శాతం మంది విచారణ కోసం ఎదురు చూస్తూ గడిపారని తెలిపారు. నిర్బంధితుల్లో మహిళల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని, గర్భిణీ స్త్రీలను కూడా గొలుసులతో బంధిస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు తన ఆత్మకథను విడుదల చేసి పతితులు, అభాగ్యులపై కమలా హారిస్ ఎంత ఆవేదన వ్యక్తపరిచినా ఆమెను ప్రజలు అమెరికా అధ్యక్షురాలిగా ఎంపిక చేసుకోకపోవడం, ట్రంప్‌ను గెలిపించడం వివిధ దేశాల్లో మారుతున్న ప్రజల ఆలోచనా విధానానికి నిదర్శనం.



సంకెళ్లతో భారతీయులను అమెరికా నుంచి పంపించినా; ప్రయాగ్‌రాజ్, న్యూఢిల్లీలో జనం తొక్కిసలాటకు గురై మరణించినా; బిహార్‌లో రైళ్లపై జనం దాడి చేసినా ఇవన్నీ మన దేశంలో వ్యవస్థల వైఫల్యానికి నిదర్శనం. ప్రజలకు ఉపాధి కల్పించలేని వైఫల్యం ఒకవైపు, పాలనా యంత్రాంగాలను సక్రమంగా నిర్వహించలేని అసమర్థత మరోవైపు దేశాన్ని వికసిత భారత్‌గా మార్చగలుగుతాయా?

భారతదేశంలో ఎన్ని ఘోర ప్రమాదాలు జరిగినా బాధ్యతను స్వీకరించేందుకు ఎవరూ ముందుకు రాకపోవడం, మరణాలను యథాలాపంగా తీసుకోవడం సాధారణమైంది. 1956లో మహబూబ్‌నగర్, తమిళనాడులో జరిగిన ఘోర రైలు ప్రమాదాలకు బాధ్యత వహించి అప్పటి రైల్వే మంత్రి లాల్‌బహదూర్ శాస్త్రి రాజీనామా చేశారు. తర్వాతి కాలంలో నితీశ్ కుమార్, మమతా బెనర్జీ, సురేశ్ ప్రభు కూడా ఇదే విధంగా రైలు ప్రమాదాలకు బాధ్యత వహించి రాజీనామా చేశారు. పీవీ హయాంలో మాధవరావు సింధియా కూడా ఒక విమాన ప్రమాదానికి బాధ్యత వహించి పదవిని వదులుకోవడానికి సిద్ధపడ్డారు. కాని న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో జరిగిన తొక్కిసలాటకు ఒక్కొక్కరు ఒక్కొక్క కారణాన్ని చెప్పి తప్పించుకుంటున్నారు. ఒకే పేరుతో ఉన్న రెండు రైళ్లు వచ్చాయని, అందువల్ల ప్రమాదం జరిగిందని ఢిల్లీ పోలీసులు అంటే, ఎవరో కుట్రలో భాగంగా పుకార్లు ప్రచారం చేసినందువల్లే ప్రమాదానికి దారి తీసిందని రైల్వే మంత్రి చెప్పారు. ఎవరో మెట్లపై నుంచి కాలు జారిపడ్డారని, ఆ తర్వాత జనం ఒకరిపై మరొకరు పడ్డారని రైల్వే అధికారులు తెలిపారు. ఎర్రటి టోపీలతో కొందరు వచ్చి పడుకున్నవారిని లేపారని వారు భయంతో పారిపోవడం వల్లే తొక్కిసలాట జరిగిందని మరో ప్రచారం వినబడింది.

కుంభమేళాకు వెళ్లే రైళ్లు ఆలస్యం కావడం, రాత్రి 7.30 గంటల నుంచే భారీగా స్టేషన్‌లో జన సమూహం పోగు కావడం, ఎటువంటి ఆలోచన లేకుండా గంటకు 1500 టిక్కెట్ల చొప్పున వేల కొద్దీ టిక్కెట్లు కౌంటర్‌లో అమ్మడం, అకస్మాత్తుగా ప్లాట్ ఫారం మార్పు గురించి ప్రకటనలు జారీ చేయడం వల్ల ఈ తొక్కిసలాట జరిగింది. ఇదంతా స్పష్టంగా నిర్వహణ లోపమన్న విషయం స్పష్టం కావడం లేదా? దీనికి ఎవరు బాధ్యత వహించాలి? బాధ్యత వహించి తప్పిదాన్ని అంగీకరించడానికి బదులు కుట్ర జరిగిందని చెప్పడం ఏ మానసిక స్థితికి నిదర్శనం? కేజ్రీవాల్ హయాంలో దేశ రాజధాని ఢిల్లీలో అస్తవ్యస్త పరిస్థితులు నెలకొన్నాయని ప్రచారం చేసినవారు తమ అధీనంలో ఉండే న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో ప్రజలు కుంభమేళాకు వెళ్లేందుకు సాఫీగా ఏర్పాట్లు ఎందుకు చేయలేకపోయారు? కోట్లాది మంది వస్తున్నారని తెలిసినా ప్రయాగ్‌రాజ్‌లో తొక్కిసలాటను ఎందుకు నివారించలేకపోయారు?

సంకెళ్లతో భారతీయులను అమెరికా నుంచి పంపించినా, ప్రయాగ్‌రాజ్, న్యూఢిల్లీలో జనం తొక్కిసలాటకు గురై మరణించినా, బిహార్‌లో రైళ్లపై జనం దాడి చేసినా ఇవన్నీ మన దేశంలో వ్యవస్థల వైఫల్యానికి నిదర్శనం. ప్రజలకు ఉపాధి కల్పించలేని వైఫల్యం ఒకవైపు యంత్రాంగాలను సక్రమంగా నిర్వహించలేని అసమర్థత మరోవైపు భారత దేశాన్ని వికసిత భారత్‌గా మార్చగలుగుతాయా అన్న సందేహాన్ని ఇనుమడింపజేస్తున్నాయి.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

మావోయిస్టులు మారాలి!

ప్రస్తుత సమాజంలో సాయుధ పోరుకు తావు లేదు. ప్రాణాలు హరించినంత మాత్రాన ఏ సమస్యా పరిష్కారం కాదు. చర్చలే పరిష్కారమనే సత్యాన్ని మావోయిస్టులు, పోలీసు బలగాలు, పాలకులు ఎవరూ పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా ఆరు పదుల సాయుధ ఉద్యమం దిక్కుతోచని స్థితిలో ఉందనడంలో సందేహం లేదు. తమ ప్రస్థానంలో వారు సాధించిందేమీ లేదన్నది చరిత్ర చెబుతున్న చేదు నిజం. పొరుగున ఉన్న నేపాల్ దేశంలో మావోయిస్టు నేతగా పేరుగాంచిన ప్రచండ వంటి నేతలు పోరుబాటను వీడి, జనజీవన స్రవంతిలోకి వచ్చి పార్లమెంటరీ పంథాను అనుసరిస్తున్నారు. ఇలాంటి అనేక ఉదాహరణలు కళ్లముందే కనిపిస్తున్నప్పటికీ ఈ సత్యాన్ని భారత 'మావో'లు మాత్రం పరిగణలోకి తీసుకోవడం లేదు.

సాయుధ పోరు ఫలితంగా ఆయా ప్రాంతాల్లోని అమాయక ఆదివాసీలు, గిరిజనులు కూడా బలవుతున్నారు. ఇక 'మావో'ల పేరును ఆసరా చేసుకొని ఎవర్నైనా ఇట్టే బందీఖానాలో పెట్టే అవకాశం ఏర్పడుతున్నది. ఏ మాత్రం చైతన్యం ప్రదర్శించినా అర్బన్ నక్సలైట్ ముద్ర, 'ఉపా' లాంటి చట్టాలను ప్రయోగిస్తున్న పరిస్థితులు బహిరంగ రహస్యమే. ఈ నేపథ్యంలో 'మావో'లు తమ పంథా మార్చుకోకపోతే సమాజానికి ఉపయోగం లేదు.

కనీసం ప్రతిఘటించే పరిస్థితుల్లో కూడా మావోయిస్టు పార్టీ లేదని పరిస్థితులు, విశ్లేషణలు తేటతెల్లం చేస్తున్నాయి. టెక్నాలజీ క్షేత్ర స్థాయిలో ఉంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు సైతం జనానికి ఊరటనిస్తూనే ఉన్నాయి. యువత సైతం తమ భవిష్యత్తును, మనుగడను చూసుకుంటున్న పరిస్థితి ఉంది. మావోయిస్టులే కాదు పార్లమెంటరీ పంథాలో ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికల్లో పాల్గొంటున్న ఎర్రజెండా పార్టీల వైపు కూడా యువత అంత ఆసక్తికరంగా లేరు. ఇలాంటి పరిస్థితుల్లో మావోయిస్టులు సాయుధ పోరుతో చేసేది ఏముంటుంది? ఇక మావోయిస్టులు హింస వైపు నిలబడ్డారని, ఆ హింసను అరికట్టే పేరుతో పాలకులు పోలీసు బలగాలతో ప్రతిహింస చేయకూడదు. హింసను అరికట్టే బాధ్యత పాలకులపై ఉన్నప్పటికీ, అది రాజ్యాంగ బద్ధంగానే, రాజ్యాంగ న్యాయ సూత్రాలకు లోబడి ఉండాలి. మావోయిస్టులు సైతం తుపాకులతో సాధించేది ఏమీ లేదని గుర్తించి, పుస్తకాలు పట్టాలి. రాజ్యాంగం వైపు నడవాలి. భారత రాజ్యాంగాన్నే మార్చాలనుకునే పాలకులున్న దేశంలో తుపాకులతో చేసే యుద్ధం గెలుస్తుందని భావించకూడదు. తమ పంథా మార్చుకుని సాయుధ ఉద్యమానికి బదులు ప్రజాస్వామ్యబద్ధంగా పార్లమెంటరీ పద్ధతిని అనుసరించేలా తమ సిద్ధాంతాన్ని మార్చుకొని ముందుకు సాగితే సమాజానికి కొంత మేలు జరుగుతుంది.

సాయుధ మార్గాన్ని వీడి ఎన్నికల్లో పాల్గొంటున్న పార్టీలు ప్రజల్లో నిలబడుతున్న సత్యం కనబడుతూనే ఉంది. నేపాల్ మావోయిస్టులు ప్రచండ నేతృత్వంలో సాయుధ మార్గం వీడి ఎన్నికల్లోకి వచ్చారు. అధికారాన్ని చేపట్టారు. ప్రస్తుతం అధికారంలో లేకపోయినా ప్రజల్లో ఉన్నారు. మనదేశంలోనూ సీపీఐ ఎంఎల్ లిబరేషన్ లాంటి పార్టీ తమ పంథాను మార్చుకొని బిహార్, జార్ఖండ్ లాంటి రాష్ట్రాల ఎన్నికలో పోటీ చేస్తున్నారు. ఎమ్మెల్యే, ఎంపీలుగా గెలుస్తున్నారు. ఇతర అనేక రాష్ట్రాల్లోనూ ఈ పార్టీ విస్తరిస్తోంది. మన తెలంగాణలోనూ కొన్ని ఎంఎల్ పార్టీలు ఎన్నికల్లో పోటీ చేసి మనుగడ సాగిస్తున్న విషయం మరువద్దు. సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ లాంటి పార్టీ ఎన్నికల్లోకి వచ్చి గుమ్మడి నర్సయ్య లాంటివారు ఎమ్మెల్యేగా సుదీర్ఘకాలం ప్రజల మనిషిగా ఉన్నారు. ఇవి మచ్చుకు మాత్రమే. సాయుధ మార్గం వీడి ప్రజల్లోకి వచ్చి ఎన్నికల పంథాను అనుసరించిన పార్టీలు ఫలితాలు సాధిస్తున్నాయి. ఇవన్నీ చరిత్ర రుజువు చేస్తున్నది.

ప్రజలు అడవుల్లో లేరని మావోయిస్టు పార్టీ ఇప్పటికైనా గ్రహించాలి. ప్రజా ప్రయోజనాలకు ఉపయోగపడని ఆ పోరులో ప్రజలు భాగస్వామ్యం అయ్యే పరిస్థితి లేని సాయుధ మార్గం ప్రయోజనం లేనిదే. అందుకే సాయుధ మార్గం వీడి ఎన్నికల్లోకి రావాలి. మావోయిస్టు పార్టీ గతంలో జనంలోకి వచ్చే అవకాశాలు చేజార్చుకున్నప్పటికీ, మరో అవకాశం కోసం అడుగులు వేయాల్సిన అవసరం ఉంది.

– రాజేందర్ దామెర, జర్నలిస్ట్, వరంగల్

అధ్యాపక కొలువులు భర్తీ చేయాలి

రాష్ట్ర యూనివర్సిటీల అధ్యాపక పోస్టుల భర్తీ విషయంలో గత 14 సంవత్సరాలుగా ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. 'నీళ్లు, నిధులు, నియామకాలు' అనే నినాదంతో తెలంగాణ రాష్ట్ర ఉద్యమం జరిగింది. కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం గత పది సంవత్సరాలలో యూనివర్సిటీల అభివృద్ధిని పట్టించుకోలేదు. ఏ యూనివర్సిటీలైతే తెలంగాణ ఉద్యమానికి ఊపిరి ఊదాయో అవే నేడు అధ్యాపకులు లేక నిర్వీర్యం దిశగా అడుగులు వేస్తున్నాయి.

తెలంగాణ యూనివర్సిటీలలోని ఖాళీలు భర్తీ చేయడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. యూనివర్సిటీలలో టీచింగ్ పోస్టులు భర్తీ కోసం 'తెలంగాణ యూనివర్సిటీ కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డు' బిల్లును గత ప్రభుత్వం తీసుకొచ్చింది. రాజ్యాంగబద్ధమైన యూనివర్సిటీల స్వయంప్రతిపత్తికి విఘాతం కలుగుతుందని ఆ బిల్లును కులపతి, రాష్ట్ర గవర్నర్ పెండింగ్‌లో పెట్టారు. దీనిని సాకుగా చూపించి గత, ప్రస్తుత ప్రభుత్వాలు ఖాళీల భర్తీ విషయంలో కాలయాపన చేస్తున్నాయి.

ప్రతిష్ఠాత్మకమైన ఉస్మానియా, కాకతీయ, శాతవాహన, జేఎన్‌టీయూ, బాసర(ఐటి) యూనివర్సిటీలలోని కొన్ని విభాగాలు అధ్యాపకులు లేకపోవడంతో కాంట్రాక్ట్, పార్ట్‌టైమ్ వారితో కాలం వెళ్లదీస్తున్నాయి. అలాగే, కొన్ని విశ్వవిద్యాలయాలకు రిజిస్ట్రార్, ఇతర కీలక పరిపాలన పదవుల్లో ఇతర విశ్వవిద్యాలయాలకు చెందిన ప్రొఫెసర్లను ఇన్‌చార్జిలుగా నియమిస్తున్నారు. అదేవిధంగా యూనివర్సిటీలోని కొన్ని విభాగాలకు రెగ్యులర్ ప్రొఫెసర్లు లేకపోవడంతో కాంట్రాక్టు ఉద్యోగులను డిపార్ట్‌మెంట్ విభాగ అధిపతులుగా, బోర్డ్ ఆఫ్ స్టడీస్‌లుగా నియమిస్తున్నారు.

దేశంలోని కేంద్రీయ విశ్వవిద్యాలయాలు (సెంట్రల్ యూనివర్సిటీస్)లోని అన్ని రకాల బోధన ఉద్యోగాల పోస్టులను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేస్తున్నారు. ఇదే విధానాన్ని రాష్ట్రంలోని యూనివర్సిటీ టీచింగ్ పోస్టుల భర్తీ విషయంలో కూడా అవలంబించాలి. రాష్ట్ర యూనివర్సిటీల నుండి ప్రతి సంవత్సరం దాదాపు రెండువేల మంది పీహెచ్‌డి పూర్తి చేసి కేంద్రీయ విశ్వవిద్యాలయాలు ఇచ్చే రెగ్యులర్ నోటిఫికేషన్‌కి అర్హత సాధించినప్పటికీ, నియామకాల విషయంలో వీరికి కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో పీహెచ్‌డి చేసిన వారితో సమానమైన ప్రాధాన్యం ఇవ్వడం లేదు. దేశంలో అత్యున్నతమైన చదువు పీహెచ్‌డి, నెట్, సెట్ అర్హత సాధించి, ఒకవైపు ఉద్యోగాలు లేక, మరోవైపు కుటుంబ భారంతో పాటు ఏజ్‌బార్ అయిపోవడంతో అనేకమంది ఆశావాదుల అసిస్టెంట్ ప్రొఫెసర్ కావాలనే కల కలగానే మిగిలిపోతుంది. ప్రభుత్వాలకు రాజకీయ ఖాళీల భర్తీ విషయంలో ఉన్న చిత్తశుద్ధి యూనివర్సిటీ ఖాళీలను భర్తీ చేయడంలో లేదు. ఇకనైనా ప్రభుత్వం అర్హత గల అభ్యర్థులతో ఖాళీలను త్వరితగతిన భర్తీ చేయాలి.

– చట్ల సతీష్ చంద్ర
ఏబీవీపీ స్టేట్ యూనివర్సిటీస్ కో కన్వీనర్, తెలంగాణ

ఇంటర్ విద్యలో సంస్కరణలు అవసరం

జాతీయ క్రైమ్ బ్యూరో లెక్కల ప్రకారం భారతదేశంలో విద్యార్థుల ఆత్మహత్యల్లో తొమ్మిది శాతం ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనే జరుగుతున్నాయి. వీటిలో మెజారిటీ విద్యార్థులు ఇంటర్మీడియట్ చదువుతున్నవారే కావడం గమనార్హం. నేషనల్ క్రైమ్ బ్యూరో రికార్డ్స్(2022) ప్రకారం విద్యార్థుల ఆత్మహత్యల్లో మహారాష్ట్ర, తమిళనాడు, మధ్యప్రదేశ్ తొలి మూడు స్థానాల్లో ఉండగా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలు 10, 11 స్థానాల్లో ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులు అధిక శాతం మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. దీనికి ప్రధాన కారణం ఇంటర్మీడియట్ విద్యారంగం కార్పొరేట్ శక్తుల కబంధహస్తాల్లో ఉండడమే. వారి ప్రభావం వల్ల గత మూడు దశాబ్దాలలో ఇంటర్మీడియట్ విద్యలో ఎటువంటి సంస్కరణలూ జరగలేదు. కార్పొరేట్ శక్తుల స్వార్థ ప్రయోజనాల కోసం విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారు.

రాష్ట్రంలో ప్రతి సంవత్సరం ఆత్మహత్యలకు గురి అవుతున్న విద్యార్థులలో అత్యధిక శాతం ఇంటర్ విద్యార్థులే అని గణాంకాలు చెబుతున్నాయి. ఇంటర్మీడియట్ ఫలితాలు వెలువడిన ప్రతీసారి విద్యార్థుల ఆత్మహత్యల వార్తలు ఆందోళన కలిగిస్తూనే ఉన్నాయి. ఇంటర్‌లో చేరే విద్యార్థులు కోర్సు మొదలయిన రోజు నుంచి ఫలితాలు వచ్చే వరకు రెండు సంవత్సరాల పాటు నిరంతర ఒత్తిడిలో ఉంటారు. దీనికి కారణం బోర్డు పరీక్షలు, కార్పొరేట్ శక్తులు, తల్లిదండ్రుల ఒత్తిడి. దేశంలో కేవలం ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో, తమిళనాడులో మాత్రమే ఇంటర్మీడియట్ మొదటి సంవత్సర పరీక్షలు జరుగుతున్నాయి. మిగతా రాష్ట్రాల్లో కేవలం అంతర్గత మూల్యాంకనం ద్వారా మాత్రమే విద్యార్థి అభ్యసన సామర్థ్యాలను నమోదు చేస్తారు. మొదటి సంవత్సరం పరీక్షల్ని తొలగిస్తే విద్యార్థులపై ఒత్తిడి తగ్గి, మొదటి ఏడాది సిలబస్‌లో కీలక అంశాలపై పట్టు సాధించడంతో పాటు వాటి ఆధారంగా రెండో ఏడాది సబ్జెక్టులపై పట్టు సాధించి, జాతీయస్థాయి పరీక్షలలో రాణించే అవకాశం ఉంది. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కూడా పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే సమయం, సౌలభ్యం దొరుకుతుంది. అధ్యాపకులు కూడా పోటీ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేసేందుకు వెసులుబాటు ఉంటుంది. అదే విధంగా జాతీయ బోర్డు, ఇతర రాష్ట్రాల బోర్డులు కేవలం 12వ తరగతి పరీక్షలు మాత్రమే నిర్వహిస్తున్నందున వారితో సారూప్యత ఏర్పడుతుంది.

కానీ, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు తొలగిస్తే విద్యార్థులు, అధ్యాపకులలో మొదటి సంవత్సరంపై శ్రద్ధ తగ్గి, కేవలం రెండవ సంవత్సరంపై మాత్రమే దృష్టి పెడతారని కొందరు విద్యావేత్తల అభిప్రాయం. మొదటి సంవత్సర ఇంటర్నల్ పరీక్షలు, మూల్యాంకనం పకడ్బందీగా నిర్వహించడం ద్వారా దీనిని అధిగమించవచ్చు. అదే విధంగా జాతీయ స్థాయి, రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షలలో రెండు సంవత్సరాల సిలబస్ నుంచి సమాన సంఖ్యలో ప్రశ్నలు ఉంటాయని విద్యార్థులకు అవగాహన కల్పించడం ద్వారా వారిని ప్రోత్సహించాలి.

ప్రభుత్వమే ఇంటర్మీడియట్ తర్వాత విద్యార్థులు రాసే పోటీ పరీక్షల కోసం ప్రత్యేకంగా కోచింగ్ సెంటర్లను నిర్వహించడం, ప్రభుత్వ రంగంలో ఇంటర్మీడియట్ విద్య బలోపేతానికి చర్యలు తీసుకోవడం, మొదటి సంవత్సర పరీక్షలు రద్దు చేయడం వంటి చర్యలు తీసుకోవాలి. ఇంటర్మీడియట్ విద్యలో సంస్కరణలు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

– అనుమాండ్ల వేణుగోపాల్ రెడ్డి
పాకాల శంకర్ గౌడ్

కాకినాడ జేఎన్‌టీయూ

వీసీగా నిట్ ప్రొఫెసర్



- ఉత్తర్వులు జారీ చేసిన ఏపీ గవర్నర్

6



వంగర బాలికల గురుకుల పాఠశాలలో హాస్టల్ నిద్రలో భాగంగా విద్యార్థినులతో కలెక్టర్ ప్రావీణ్య

హాస్టళ్ల నిర్వహణ సక్రమంగా ఉండాలి

- తనిఖీల కోసం అధికారుల నియామకం
- భోజనం సక్రమంగా ఉండకపోతే చర్యలు
- వంగర గురుకుల పాఠశాల హాస్టల్ నిద్రలో కలెక్టర్ ప్రావీణ్య

6



నేడు మేడారంలో తిరుగువారం

వనదేవతల పూజా సామగ్రిని భద్రపరచనున్న పూజారులు

7

యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప.. అసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర జరిగే మేడారం.. ప్రకృతి సోయగాల సమాహారం లక్నవరం.. కాళేశ్వరం గోదావరి తీరం.. నురగలు కక్కే తెలంగాణ నయాగరా బొగత జలపాతం.. వీటికి తోడు వరంగల్ కోట, వేయి స్తంభాల గుడి, పాండవుల గుట్టలు, గణపేశ్వరాలయం, మల్లూరు లక్ష్మీనర్సింహస్వామి, కురవి, పాఖాల సరస్సు.. లాంటి అనేక ప్రకృతి అందాలు, శిల్పా కళాసంపదలకు నెలవు ఓరుగల్లు. వారాంతమొస్తే చాలు రాష్ట్ర నలుమూలల నుంచి వేలాది మంది పర్యాటకులు ప్రకృతి అందాలను ఆస్వాదించడంతో పాటు ఆధ్యాత్మికతలో ఓలలాడుతుంటారు. ఈ క్రమంలో పర్యాటకును మరింత ఆకర్షించేలా.. పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ప్రైవేట్ భాగస్వామ్యంలో బిల్డ్ ఆపరేషన్ ట్రాన్స్‌ఫర్ (బీవోటీ) పద్ధతిన రూపురేఖలు మార్చేందుకు కసరత్తు చేస్తోంది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాల్లోని పలు హరిత హోటళ్లు, రిసార్టులు ప్రైవేటు సంస్థల ఆధ్వర్యంలో నడుస్తుండగా.. తాజాగా కొత్త టూరిజం పాలసీతో ప్రభుత్వం మరికొన్ని పర్యాటక ప్రాంతాలను ప్రైవేటుకు అప్పగించేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. అయితే తొలిదశలో రామప్ప, లక్నవరం, బొగత, మేడారం, కాళేశ్వరంలో అమలు చేయాలని భావిస్తోంది. ఇంతవరకు బాగానే ఉన్నా ప్రైవేట్ భాగస్వామ్యం కార్యరూపం దాల్చితే సామాన్యులపై ఆర్థికంగా మరింత భారం పడుతుందనే ఆందోళన కూడా వ్యక్తమవుతోంది.



పర్యాటకానికి కేరాఫ్ ఓరుగల్లు

పర్యాటకం.. ప్రైవేటుకు..!

బీవోటీ పద్ధతిలో టూరిస్టు ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కసరత్తు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

ఓరుగల్లులోని పర్యాటక ప్రాంతాలు ఇక ప్రైవేటు చేతుల్లోకి వెళ్లనున్నాయి. బిల్డ్ ఆపరేషన్ ట్రాన్స్‌ఫర్ (బీవోటీ) పద్ధతిన ఆయా ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ప్రైవేటు సంస్థలకు 15 ఏళ్ల నుంచి 66 ఏళ్ల వరకు లీజుకు ఇచ్చేందుకు కొత్త పాలసీని తీసుకొస్తోంది. ఇప్పటికే ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో ఉన్న హరిత హోటళ్లు, రిసార్టులను చాలా వరకు గత ప్రభుత్వం ప్రైవేట్‌కు అప్పగించగా, తాజాగా కొత్త టూరిజం పాలసీతో ప్రభుత్వం కొత్తగా పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయడంతో పాటు.. ఇప్పటికే పర్యాటకులను ఆకర్షిస్తున్న మరికొన్నింటిని కూడా ప్రైవేటుకు అప్పగించేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. ఇలా ప్రైవేట్ భాగస్వామ్యంతో టూరిజాన్ని అభివృద్ధి చేసి, దేశీయ, అంతర్జాతీయ టూరిస్టులను ఆకర్షించటం, కొత్త పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయటం లక్ష్యంగా పర్యాటకశాఖ అడుగులు వేస్తుంది. అయితే ఈ విధానంతో భవిష్యత్తులో సామాన్యులకు టూరిజం భారంగా మారనుందనే టాక్ కూడా వినబడుతుంది.

- ఆదాయం పెంపుతో పాటు పర్యాటకులకు సౌకర్యాలు కల్పనే లక్ష్యంగా చర్యలు
- 15 ఏళ్ల నుంచి 66 ఏళ్ల వరకు ప్రైవేటు కంపెనీలకు లీజుకిచ్చే యోచన
- ఆయా పర్యాటక ప్రాంతాల్లోని హోటళ్లు, రిసార్టులు వారి చేతుల్లోకే
- తొలిదశలో రామప్ప, లక్నవరం, బొగత, మేడారం, కాళేశ్వరంలో అమలు
- కొత్త పర్యాటక ప్రాంతాలపైనా ఫోకస్
- ప్రైవేట్‌కు అప్పగింతతో సామాన్యులపై భారం పడే అవకాశం

ఓరుగల్లు.. పర్యాటకానికి పెట్టని కోట. కాకతీయుల చారిత్రాత్మక కట్టడాలు, ప్రకృతి సోయగాలు ఉమ్మడి వరంగల్‌లో అనేకం ఉన్నాయి. ఆదివారం, ఇతర సెలవు దినాలు వచ్చాయంటే చాలు రాష్ట్ర నలుమూలల నుంచి వాహనాలు రయ్‌రయ్ మంటూ ఓరుగల్లు వైపు పరుగుతీస్తాయి. యునెస్కో గుర్తింపు పొందిన రామప్పతో పాటు అసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతర మేడారం, ప్రకృతి సోయగాలతో కట్టిపడేసే లక్నవరం అందాలు, ఐల్యాండ్, కాళేశ్వరం గోదావరి జలాలు, ఆధ్యాత్మిక క్షేత్రం, పచ్చని అడవుల మధ్యన నురగలు కక్కే తెలంగాణ నయాగరా బొగత జలపాతం సవ్వడులతో పాటు కనువిందు చేసే వరంగల్ కోట, వేయి స్తంభాల ఆలయం, పాండవుల గుట్టలు, గణపేశ్వరాలయం, మల్లూరు లక్ష్మీనర్సింహస్వామి, కురవి , పాఖాల సరస్సు. ఇలా అనేక ప్రకృతి అందాలు, శిల్పా కళాసంపదలకు వరంగల్ నెలవు. గత కొన్నేళ్లుగా ప్రభుత్వాలు పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేకంగా దృష్టి పెట్టాయి. పర్యాటకులను ఆకర్షించేందుకు హోటళ్లు, రిసార్టులను ఏర్పాటు చేసింది. దేశీయ, విదేశీ పర్యాటకులు కూడా ఓరుగల్లు అందాలను చూసేందుకు సుదీర ప్రాంతాల నుంచి తరలి వస్తున్నారు.

ఇక ప్రైవేటు చేతిలోకి పర్యాటకం..

పర్యాటకానికి పర్యాయపదంగా ఉన్న ఓరుగల్లులోని అనేక ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వం స్వదేశీ దర్శన్ స్కీమ్‌లో భాగంగా తెలంగాణ ట్రైబల్ సర్క్యూట్‌లో భాగంగా ములుగు, భూపాలపల్లి, వరంగల్ జిల్లాల్లో రూ.83కోట్ల వ్యయంతో టూరిస్ట్ స్పాట్‌లు, కాటేజీలు, డార్మెటరీలు, హోటళ్లను నిర్మించింది. మేడారం, బొగత, లక్నవరం, గణపురం, కాళేశ్వరం, రామప్ప, మల్లూరు, ములుగు గట్టమ్మ, జంగాలపల్లి వద్ద, తాడ్వాయి తదితర ప్రాంతాల్లో హరిత హోటళ్లను నిర్మించారు. వీటిలో గత ప్రభుత్వం మేడారం, తాడ్వాయి, బొగత, జంగాలపల్లి, గట్టమ్మ హరిత హోటళ్లు, రెస్టారెంట్లను ప్రైవేట్‌కు లీజుకు ఇచ్చారు. అయితే గత ప్రభుత్వం తరహాలోనే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బీవోటీ పద్ధతిలో పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు ప్రైవేటు భాగస్వామ్యాన్ని ఆహ్వానిస్తోంది. హనుమకొండ హరిత కాకతీయ హోటల్ మినహా మిగతా అన్ని హోటళ్లను ప్రైవేట్ సంస్థలకు లీజుకు ఇచ్చే యోచనలో ఉంది. హోటళ్లతో పాటు బీవోటీ పద్ధతిన పర్యాటక ప్రాంతాలను కూడా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం చర్యలు చేపడతోంది. బీవోటీ అంటే నిర్మాణం, నిర్వహణ, బదిలీ అని అర్థం. ఈ మూడు ప్రతిపాదికన టూరిజం ప్రాజెక్టులను ప్రయివేటుకు అప్పగించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఆయా ప్రాజెక్టుల స్థాయిని బట్టి 15ఏళ్ల నుంచి 66ఏళ్ల వరకు లీజుకు ఇవ్వాలని ప్రణాళిక రూపొందిస్తోంది. అయితే ఈ అప్పగింత ప్రక్రియ అంతా ఈ టెండర్ విధానంలో జరగనుంది.

తొలిదశలో ఓరుగల్లులోని ఐదు టూరిజం స్పాట్లు

రాష్ట్ర పర్యాటక శాఖ దేశంలోనే తెలంగాణను పర్యాటక రంగంలో టాప్-5లో ఉంచాలనే ఆలోచనతో భారీ కసరత్తు చేస్తోంది. అందులో భాగంగానే బీవోటీ

మిగతా 7వ పేజీలో...

ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

వరంగల్ కలెక్టరేట్/హనుమకొండ కలెక్టరేట్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను అధికారులు అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆయా జిల్లాల అధికారులకు సూచించారు. మంగళవారం ఆమె హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తాగునీటి సరఫరా, రబీ పంటలకు సాగునీరు, విద్యుత్ సరఫరా, రేషన్ కార్డుల దరఖాస్తుల ధ్రువీకరణ, రైతు భరోసా పథకాల అమలుపై పలు సూచనలు చేశారు. అనంతరం వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. జిల్లాలో అన్ని ఆవాసాలకు మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని అందిస్తున్నామని, రబీ సీజన్‌లో 2 లక్షల 28వేల ఎకరాలు సాగు చేస్తున్నారని, రైతు భరోసా కింద లక్షా 63వేల మందికి గాను 91 వేల మందికి వారి ఖాతాల్లో డబ్బులు జమ చేశామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలలను తరుచుగా తనిఖీ చేస్తున్నామని, ఆహార నాణ్యత, విద్యాబోధన మెరుగు పడిందని అన్నారు. విద్యార్థులకు మంచి భోజనం అందిస్తున్నామని కలెక్టర్ వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, విద్యుత్ శాఖ ఎస్‌ఈ మధుసూదన్‌రావు, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, పౌరసరఫరాల అధికారి కిష్టయ్య, జడ్పీ సీఈవో రామిరెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న శాంతికుమారి, పాల్గొన్న హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య

ప్రభుత్వ లక్ష్యాలను అధికారులు కట్టుదిట్టంగా అమలు చేయాలి

ప్రభుత్వ లక్ష్యాలను అధికారులు కట్టుదిట్టంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలపై కలెక్టర్‌లతో మంగళవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్‌లో శాంతికుమారి మాట్లాడారు. విద్యుత్ వినియోగదారులకు నిరంతరంగా సరఫరా కొనసాగించాలని, రైతు భరోసాపై గ్రీవెన్స్‌సెల్‌ను జిల్లాల్లో ఏర్పాటు చేయాలన్నారు. ఐదు రోజులలో అదనపు భూ వివరాల నమోదు పోర్టల్‌లో పూర్తి చేయాలన్నారు. ప్రతి నీటి చుక్కను వినియోగించుకుని చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలన్నారు. హనుమకొండ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. జిల్లాలో తాగునీటి సమస్య లేదని, సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా చేతిపంపులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రేటర్ వరంగల్ పరిధిలోని డివిజన్లకు ధర్మసాగర్ నుంచి నీటి సరఫరాను చేయనున్నామన్నారు. ప్రస్తుతం 24 నీటి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. డివిజన్లలో అదనంగా 21 నీటి ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయనున్నట్లు కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. వీడియోకాన్ఫరెన్స్‌లో గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కమిషనర్ అశ్విని తానీజీ వాకడే, జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



కార్‌లో పెట్రోల్ పోస్తున్న డీజీపీ సౌమ్యమిశ్రా, కలెక్టర్ సత్యశారద

తెలంగాణ జైళ్ల శాఖ దేశానికే ఆదర్శం

- డీజీ సౌమ్య మిశ్రా
- సెంట్రల్ జైలు ప్రాంగణంలో పెట్రోల్ బంక్ ప్రారంభం

7

తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలి

- మేయర్ గుండు సుధారాణి
- బల్దియా ఎదుట ఉన్న బయోగ్యాస్ ప్లాంట్ పరిశీలన

వరంగల్ కార్పొరేషన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పలు కాలనీల ప్రజలు తడి పొడి చెత్తను వేర్వేరుగా అందించాలని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయం ఎదుట ఉన్న బయో గ్యాస్ ప్లాంట్‌ను సందర్శించారు. అక్కడి సిబ్బందితో మాట్లాడి యంత్రాల పని తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ.. ప్రజలకు తడి పొడి చెత్తపై అవగాహన కలిగి ఉండాలని తడి, పొడి చెత్తను వేరు వేరు బుట్టలలో జమ చేయాలని అన్నారు. ప్రతీ రోజు బల్దియా నుంచి చెత్త సేకరణకు వచ్చే వాహనాలకు విడి విడిగా చెత్తను అందిస్తే శుద్ధి చేయడానికి అనుకూలంగా ఉంటుందని తెలిపారు. ఇళ్ల నుంచి సేకరించిన తడి చెత్తను కంపోస్టు ఎరువుగా మార్చి హార్టికల్చర్ ఆధ్వర్యంలో పెంచుతున్న మొక్కలకు ఎరువుగా అందించవచ్చని అన్నారు. బయో గ్యాస్ ప్లాంట్ ద్వారా వచ్చే విద్యుత్‌ను ప్రతీ రోజు రెండు గంటల పాటు ఉపయోగించుకోవచ్చని అన్నారు. ఇంకా పొడి చెత్తను ముందుగా డీఆర్‌సీసీ కేంద్రాలకు ఆ తర్వాత వివిధ ప్రాంతాలలోని రీ సైక్లింగ్ కేంద్రాలకు తరలించడం జరుగుతుందన్నారు. బయో ప్లాంట్ ద్వారా వాతావరణ కాలుష్యం నివారించవచ్చని అన్నారు. రెండు రకాల చెత్తను వేరు వేరుగా సేకరించడం వల్ల డంపింగ్ యార్డ్‌కు పెద్ద ఎత్తున చెత్త వచ్చే సమస్య తగ్గుతుందని అభిప్రాయపడ్డారు. స్వచ్ఛ సర్వేక్షన్‌లో నగర ప్రజలు ముందుండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బయోగ్యాస్ ప్లాంట్ సిబ్బంది పాల్గొన్నారు.



బయో గ్యాస్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న మేయర్ సుధారాణి

హామీలు నెరవేర్చని కాంగ్రెస్

- రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో మూతపడుతున్న విద్యా సంస్థలు
- విలేకరుల సమావేశంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్



విలేకరుల సమావేశంలో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్

నర్సంపేట టౌన్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): హామీలు అమలు చేయలేని స్థితిలో ప్రభుత్వం ఉందని మల్కాజిగిరి ఎంపీ, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటెల రాజేందర్ అన్నారు. నర్సంపేట పట్టణంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో నేడు అనేక విద్యా సంస్థలు మూతపడుతున్నాయని అన్నారు. కొట్లాడి ప్రత్యేక తెలంగాణ సాధించుకుని బాగుపడతామనుకుంటే రాష్ట్రంలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా ఉందన్నారు. ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు నాలుగేళ్లగా విడుదల కాకపోవడంతో టీచర్లకు వేతనాలు చెల్లించలేక విద్యా సంస్థలు మూతపడుతున్నాయన్నారు. జీవో 317ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిందని, ఉపాధ్యాయులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ఉపాధ్యాయుల ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, పీఆర్‌సీ లేదని, రిటైర్డ్ అయిన ఉపాధ్యాయులకు బెనిఫిట్స్ ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. నిరుద్యోగ యువకులు, ఉపాధ్యాయులు ఆలోచన చేయాలని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో సమస్యలపై పోరాడే బీజేపీకి అండగా నిలవాలన్నారు. కస్తూర్బా గురుకులాల్లో అనేక పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఉపాధ్యాయులపై పనిభారం పడుతున్నా పట్టించుకునే వారే లేరన్నారు. కేసీఆర్ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధిచెప్పడానికి పదేళ్లు పట్టిందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న భ్రమలు తొమ్మిది నెలల్లోనే తొలగిపోయాయన్నారు. రాబోయే రోజుల్లో ఇచ్చిన హామీలను అమలు చేయని ప్రభుత్వంపై బీజేపీ పోరాటం చేస్తుందన్నారు. కేంద్రం బడ్జెట్‌లో తెలంగాణపై వివక్షత చూపిందని కాంగ్రెస్ మాట్లాడటం హాస్యాస్పదమని, బడ్జెట్ అనేది ఆయా రాష్ట్రాల అవసరాలపైనే ఆధారపడి ఉంటుందన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలో రాష్ట్రానికి చేసింది తక్కువేనని, బీజేపీ అధికారంలోకి వచ్చాక హైదరాబాద్‌లో రైల్వేస్టేషన్లు, ఎయిర్‌పోర్టు కోసం రూ.2వేల కోట్లు వెచ్చించిన ఘనత మోదీ ప్రభుత్వానిదేనన్నారు. పార్లమెంట్‌లో అధికార పార్టీ ఎంపీ నైనప్పటికీ గ్రీన్‌ఫీల్డ్‌పై తాను మాట్లాడానని, రైతులకు అన్యాయం జరగవద్దని కోరడం జరిగిందన్నారు.

సమావేశంలో మాజీ ఎంపీ, బీజేపీ నాయకులు సీతారాంనాయక్, కొండేటి శ్రీధర్, ఎర్రబెల్లి ప్రదీప్ కుమార్, బైరి మురళీకృష్ణ, హరి శంకర్, రాంచంద్రారెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు గంట రవికుమార్, గూడూరు సందీప్, కాశీప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఉపాధ్యాయులను బీజేపీ బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎంపీ ఈటెల రాజేందర్ కోరారు.

రాణిరుద్రమకు ఈటల పరామర్శ

నర్సంపేట పట్టణానికి చెందిన బీజేపీ రాష్ట్ర నేత రాణిరుద్రమ, జిల్లా నాయకుడు గోగుల రాణాప్రతాప్‌రెడ్డిల తల్లి గోగుల జయశ్రీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాన్ని మంగళవారం ఈటెల రాజేందర్ సందర్శించి పరామర్శించారు. మృతురాలు జయశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

పాల ఉత్పత్తులపై విద్యార్థులకు అవగాహన

మామునూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): మామునూరు కృషివిజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం పాల ఉత్పత్తులపై విద్యార్థులకు, రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వివిధ గ్రామాలనుంచి 644మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేవీకే కోఆర్డినేటర్ రాజన్న మాట్లాడుతూ.. పాల ఉత్పత్తులలో ఉండే పోషకాలతో పాటు వాటి వల్ల వచ్చే లాభాల గురించి వివరించారు. కలాకంద్ తయారీతో కుటీర పరిశ్రమ ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. అనంతరం బయో ఫ్లాక్ చేపల పెంపకం, వెర్మీకంపోస్ట్ ఎరువు, మల్చింగ్ పద్ధతుల ద్వారా కూరగాయలు పండించడం గురించి వివరించారు. వ్యవసాయ యంత్రాలు, పరికరాల పనితీరును ప్రత్యక్షంగా చూపించారు. కార్యక్రమంలో కేవికే శాస్త్రవేత్తలు సౌమ్యఅరుణజ్యోతి, రాజు, గణేష్, సాయికిరణ్ పాల్గొన్నారు.

రేపటి నుంచి యోగా శిక్షణ తరగతులు

బాలసముద్రం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ కేఎల్ఎన్‌రెడ్డి కాలనీలోని రామకృష్ణా సేవా సమితి ధ్యాన మందిరంలో గురువారం నుంచి ఉదయం, సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల వరకు యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు సేవా సమితి అధ్యక్షుడు కటంగూరి సత్యనారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం శిక్షణా తరగతులను యోగా గురూజీ, రిటైర్డ్ లెక్చరర్ వేదాంతం సత్య , సాయంత్రం తరగతులను యోగా గురూజీ కంచర్ల ఆంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.ఔత్సాహిక యోగా సాధకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవల్సిందిగా సత్యనారాయణ రెడ్డి కోరారు. వివరాల కోసం సెల్ నంబర్లు : 99498 82810 / 93983 16578 లలో సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు.

మాజీ ఎమ్మెల్యే నరేందర్‌పై కేసు

మట్టెవాడ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా వరంగల్ పోచమ్మమైదాన్ జంక్షన్‌లో సోమవారం కేసీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారన్న కారణంతో ఇంతేజార్‌గంజ్ పోలీసులు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌పై కేసు నమోదు చేశారు. జంక్షన్‌లో ట్రాఫిక్ జామ్ కావడం, రోడ్డుపై వేడుకలు నిర్వహించడం, వేడుకలకు అనుమతి లేదనే కారణంతో పాటు అనుమతి పత్రాన్ని పోలీసులకు అందజేయకపోవడంతో కేసు నమోదు చేసినట్లు తెలిసింది.

కేయూ పీజీ మొదటి సెమిస్టర్ పరీక్షలు వాయిదా

కేయూ క్యాంపస్ ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఈనెల 20 నుంచి జరుగాల్సిన రెగ్యులర్ ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీ ఎంటీఎం, ఎంహెచ్‌ఆర్‌ఎం, ఎంఎస్‌డబ్ల్యూ తదితర పీజీ కోర్సుల మొదటి ఏడాది మొదటి సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ బీఎస్ఎల్ సౌజన్యలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కానిస్టేబుల్, సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్ (సీఏపీఎఫ్ఎస్), ఎస్ఎస్ఎఫ్, అస్సాం రైఫిల్‌మేన్, నార్కోటిక్ బ్యూరో, స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా జూనియర్ అసోసియేట్స్, ఇండియన్ ఎయిర్ ఫోర్స్ తదితర పరీక్షల దృష్ట్యా విద్యార్థుల కోరిక మేరకు పరీక్షలను వాయిదా వేసినట్లు వెల్లడించారు. పరీక్షల రీ షెడ్యూల్‌ను త్వరలోనే విడుదల చేస్తామని స్పష్టం చేశారు.

టెక్నాలజీని ప్రోత్సహించేందుకే

ఇన్నోవేషన్ సెంటర్

నాబార్డు జనరల్ మేనేజర్ ఉదయ్‌భాస్కర్



ఇన్నోవేషన్ సెంటర్‌ను ప్రారంభించిన అనంతరం మాట్లాడుతున్న ఉదయ్‌భాస్కర్

వరంగల్ వ్యవసాయం, ఫిబ్రవరి18 (ఆంధ్రజ్యోతి): శాస్త్ర సాంకేతికరంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా గ్రామీణ యువతలో వ్యవసాయ ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకే రూరల్ ఇన్నోవేషన్ సెంటర్ ను ప్రారంభించినట్లు నాబార్డు జనరల్ మేనేజర్ ఉదయ్‌భాస్కర్ తెలిపారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వరంగల్ ఆవరణలో ఏర్పాటు చేసిన అగ్రిహబ్ వారి రూరల్ ఇన్నోవేషన్ సెంటర్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. వ్యవసాయ యూనివర్సిటీ వైస్‌చాన్స్లర్ అల్దాస్ జానయ్య సమక్షంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉదయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. వ్యవసాయానికి తోడ్పడే టెక్నాలజీని అభివృద్ధి చేసేందుకు ఈ సెంటర్ తోడ్పాటు అందిస్తుందన్నారు. అనంతరం అల్దాస్ జానయ్య మాట్లాడుతూ..వ్యవసాయం సంక్షోభంలో లేదని, కానీ రైతులు సంక్షోభంలో ఉన్నారని, దానికి స్టార్టప్ సంస్థలను అభివృద్ధి చేసి టెక్నాలజీని రైతులకు అందుబాటులోకి తీసుకురావడమే సరైన మార్గమని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ అధికారులు బలరాం(పరిశోధన సంచాలకుడు), కల్పనా శాస్త్రి(ఎండి.అగ్రిహబ్), ఆర్.ఉమారెడ్డి, (సహ పరిశోధన సంచాలకుడు), వెంకట్‌రెడ్డి (అసోసియేట్ డీన్ వ్యవసాయ కళాశాల వరంగల్), ఎన్.విజయ్ (సీఈవో అగ్రిహబ్), కె.అనురాధ (వరంగల్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి), రవీందర్‌సింగ్(హనుమకొండ జిల్లా వ్యవసాయశాఖ అధికారి), చంద్రశేఖర్ (నాబార్డ్ ఏజీఎం) తదితరులు పాల్గొన్నారు.

భీమారం శ్యామల చెరువు కట్ట

ధ్వంసంపై ఐబీ ఏఈఈ ఆగ్రహం

- ఎక్స్‌కవేటర్‌తో చేస్తున్న చదును పనుల నిలిపివేత
- క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరిక



కట్టను పరిశీలిస్తున్న ఐబీ ఏఈఈ శ్రీనివాస్

హసన్‌పర్తి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ 55వ డివిజన్ పరిధి భీమారం శ్యామల చెరువు కట్టను సోమవారం మాజీ ప్రజాప్రతినిధితో పాటు మరికొంత మంది వ్యక్తులు ధ్వంసం చేసి చెరువును పూడ్చేందుకు ప్రయత్నించారు. విషయం తెలిసిన స్థానిక యువకులు కొంత మంది చెరువుకట్టపై జేసీబీతో కట్టను ధ్వంసం చేయకుండా అడ్డుకున్నారు. విషయం తెలిసిన ఐబీ ఏఈఈ శ్రీనివాస్ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని ఆ మాజీ ప్రజాప్రతినిధిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐబీ అధికారులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపట్టడం సరికాదని హెచ్చరించారు. శ్యామల చెరువులో దేవాలయాల విస్తరణ పేరుతో కబ్జాలకు పాల్పడుతున్నట్లు ఇప్పటికే గ్రామస్తులు ఫిర్యాదులు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం చెరువు శిఖంతో పాటు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధులలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఐబీ ఏఈఈ శ్రీనివాస్ హెచ్చరించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

హాస్టళ్ల నిర్వహణ సక్రమంగా ఉండాలి

- తనిఖీల కోసం అధికారుల నియామకం
- భోజనం సక్రమంగా ఉండకపోతే చర్యలు
- వంగర గురుకుల పాఠశాల హాస్టల్ నిద్రలో కలెక్టర్ ప్రావీణ్య



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

భీమదేవరపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): హాస్టళ్ల నిర్వహణ సక్రమంగా నిర్వహించేందుకు జిల్లాలోని హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీలు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. మంగళవారం రాత్రి భీమదేవరపల్లి మండలం వంగర బాలికల గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య హాస్టల్‌లోని వసతులు, డార్మెంట్ హాల్, విద్యార్థుల స్టడీ తరగతులను పరిశీలించారు. అనంతరం గురుకుల పాఠశాలలోని వంట గదిని పరిశీలించారు. కూరగాయలు, బియ్యాన్ని పరిశీలించారు. కూరగాయలు ఎప్పటికప్పుడు తాజాగా ఉండాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల డైట్ మెనూ చార్జీలు పెంచారన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన డైట్‌ను హాస్టళ్లలో డిస్‌ప్లే చేయాలన్నారు. హాస్టల్ విద్యార్థినులకు అందించే భోజనంలో ఏమైనా ఇబ్బందులు, సమస్యలు తలెత్తితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో 109 రెసిడెన్షియల్ కళాశాలలు ఉన్నాయన్నారు. రెండు మూడు రెసిడెన్షియల్ పాఠశాలలను కలిపి ఒక జిల్లా అధికారిని నియమించామన్నారు. వారు తరుచుగా హాస్టళ్లను తనిఖీ చేస్తారన్నారు. వంగర బాలికల గురుకుల పాఠశాలలో 5 నుంచి జూనియర్ కళాశాల వరకు 550 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. వీరికి మెరుగైన వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వంగర గురుకుల పాఠశాలకు రూ. 24లక్షల నిధులు కేటాయించామన్నారు. తరగతి గదుల మరమ్మత్తు, విద్యుత్ వైరింగ్, కంపౌండ్‌వాల్ మరమ్మతు, తదితర పనులు చేయిస్తున్నామన్నారు. పది రోజుల్లో ఈ పనులు పూర్తి చేయాలని, సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో 18 పాఠశాలలను పీఎంసీ పథకం కింద గుర్తించి, రూ. 2.20కోట్ల నిధులను కేటాయించామన్నారు. పాఠశాలలో వివిధ అభివృద్ధి పనుల కోసం రూ. 1కోటి ఖర్చు చేశామన్నారు. అలాగే గురుకుల పాఠశాలలో ఫిర్యాదు పెట్టెలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందులో విద్యార్థినులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేయవచ్చన్నారు. వంగర గురుకుల పాఠశాలకు ఆకస్మిక తనిఖీకి వచ్చిన కలెక్టర్ ప్రావీణ్యను పీవీ మదన్‌మోహన్, మాజీ సర్పంచ్ ఆర్ వెంకట్‌రెడ్డి, ఒల్లాల రమేష్, శ్రీరామోజు మొండయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం రాత్రి వంగర గురుకుల పాఠశాలలో కలెక్టర్ ప్రావీణ్య హాస్టల్ నిద్ర చేశారు. తరగతి గదుల్లో విద్యార్థులను ప్రశ్నించి, విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో డీఈవో వాసంతి, ఎంఈవో సునీతరాణి, పాఠశాల ప్రిన్సిపాల్ ఆఫ్రీన్, వైస్ ప్రిన్సిపాల్ భార్గవి, అడిషనల్ డీఆర్‌డీవో శ్రీనివాస్‌కుమార్, ఎంపీడీవో వీరేశం, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీవో నాగరాజు, ఏపీవో కుమారస్వామి, పంచాయతీ కార్యదర్శి వినయ్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సురేష్

కుల గణనతో తెలంగాణలో మొదలైన సామాజిక విప్లవం

బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్

హసన్‌పర్తి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కులగణనతో తెలంగాణలో సామాజిక విప్లవం మొదలైందని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్ అన్నారు. బీసీ రాజ్యాధికార సమితి ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి రాజేందర్‌గౌడ్ నేతృత్వంలో మంగళవారం ఎర్రగట్టుగుట్ట ప్రాంతీయ కార్యాలయంలో నిర్వహించిన ఉత్తర తెలంగాణ ముఖ్య నాయకుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో కొనసాగుతున్న రాజకీయ పరిణామాలను క్షేత్రస్థాయి స్థితిగతులను ముఖ్య నాయకులు విశ్లేషించారు. తెలంగాణ వ్యాప్తంగా క్షేత్రస్థాయిలో నాయకత్వాన్ని బలోపేతం చేసే దిశగా ఫార్ములా 21ను అనుసరించి అన్ని కొత్త జిల్లాల్లో నియోజకవర్గాలలో, మండలాల్లో ప్రతీ యూనిట్‌లో 21మంది ముఖ్యులతో స్థానిక కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యవర్గ నిర్మాణం పూర్తి అయిన వెంటనే క్యాడర్‌కు రెండు రోజుల శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఉమ్మడి జిల్లాల పర్యటనలను విజయవంతంగా పూర్తి చేసి సంబంధిత కమిటీలను ఇప్పటికే పూర్తి చేశామన్నారు. ఈ ప్రక్రియకు కొనసాగింపుగా నూతన జిల్లాల పర్యటనను ఈ నెల 21 నుంచి భూపాలపల్లి జిల్లా నుంచి ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో తమ కార్యవర్గాన్ని ఉత్తర, దక్షిణ , సెంట్రల్ విభాగాలుగా నియమించి తదుపరి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పెద్ద ఎత్తున బీసీ నాయకుల గెలుపు దిశగా తమ భవిష్యత్ కార్యాచరణను కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు ఏరుకొండ హైమావతి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గాజు యుగేంధర్‌యాదవ్, హనుమకొండ గౌరవ అధ్యక్షుడు జూలూరి రమేష్‌గౌడ్, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు గండి వీరేందర్‌గౌడ్, ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మాచర్ల శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి, హనుమకొండ మండల ఇన్‌చార్జి జనార్దన్, కొడుపుగంటి శ్రీధర్, చిరంజీవి, హసన్‌పర్తి మండల అధ్యక్షుడు రాకేష్, సదానందం, తదితరులు పాల్గొన్నారు.

సుమతిరెడ్డి మహిళా కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ ఎనగందుల వరదారెడ్డి

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలంలోని అనంతసాగర్ సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలకు స్వయం ప్రతిపత్తి (యూజీసీ), (జేఎన్‌టీయూహెచ్) ఆటోనామస్ హోదా వచ్చినట్లు ఎస్ఆర్ విద్యా సంస్థల చైర్మన్ ఎనగందుల వరదారెడ్డి మంగళవారం తెలిపారు. హనుమకొండలోని కాకాజీ కాలనీలోని తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వరదారెడ్డి మాట్లాడుతూ.. సుమతిరెడ్డి కళాశాల విద్యార్థినులు వివిధ కంపెనీలలో పని చేస్తూ ప్రపంచంలోనే ఎస్ఆర్, సుమతిరెడ్డి కళాశాలల ప్రతిష్ఠను కీర్తిని పెంచారని తెలిపారు. స్వయం ప్రతిపత్తి హోదా వలన కళాశాలకు అకాడమిక్ మెరుగుదల, సాంకేతిక అభివృద్ధి, కళాశాల అభ్యున్నతికి దోహద పడుతాయని అన్నారు. కళాశాల హోదా పెరిగి మంచి గుర్తింపు రావడంతో విద్యార్థినులకు మెరుగైన అవకాశాలు వస్తాయన్నారు. ఎస్ఆర్ఐటీడబ్ల్యూ తన పాఠ్యప్రణాళిక రూపకల్పన, మూల్యాంకన ప్రమాణాలు ఏర్పర్చుకోవడం వలన ఉద్యోగావకాశాలు వస్తాయని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.రాజశ్రీరెడ్డి మాట్లాడుతూ విద్యార్థినులకు వివిధ కంపెనీలకు సంబంధించిన పాఠ్యాంశాలను పొందుపర్చి విద్యార్థినుల లోని సృజనాత్మకతను వెలికి తీసి వారిని ప్రపంచ స్థాయిలో ఉద్యోగ, వ్యాపార వేత్తలుగా నిలిపేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ఎస్ ఆర్ఐటీడబ్ల్యూ అన్ని రంగాల్లోని విద్యార్థినులను ఉత్తేజం చేస్తూ కొత్త అధ్యాయాన్ని ప్రారంభిస్తున్నట్లు అన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు ఇ.సుదర్శన్, కె.మహేందర్,ఏవో వేణుగోపాలస్వామి, అధ్యాపకులుతదితరులు పాల్గొన్నారు.

నాచినపల్లి విద్యార్థికి జాతీయ స్థాయిలో గుర్తింపు



ఆన్‌లైన్‌లో తన ఆవిష్కరణను వివరిస్తున్న విద్యార్థి రిషిక్

దుగ్గొండి, ఫిబ్రవరి18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాచినపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుచున్న రిషిక్ ఎటీబీ (ఎనీ టైం బ్యాగ్) రూపొందించిన ఆవిష్కరణకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ, కేంద్ర ప్రభుత్వం ఇన్నోవేషన్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతీ ఏడాది స్కూల్ ఇన్నోవేషన్ కాంటెస్టు నిర్వహిస్తోంది. కేంద్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన ఈ పోటీలకు జాతీయ స్థాయిలో ఆన్‌లైన్ పద్ధతిలో 1,20,000 ఆవిష్కరణలు రాగా, రిషిక్ ఆవిష్కరణ ప్రాథమిక రౌండ్‌కు ఎన్నికైందని గైడ్‌గా టీచర్‌గా వ్యవహరించిన సుమలత వెల్లడించారు. మంగళవారం రాజ్‌కోట్‌లోని ఆర్కే యూనివర్సిటీ ప్రొఫెసర్ల ఎదుట ఆన్‌లైన్ పద్ధతిలో రిషిక్ ఆవిష్కరించిన ప్లాస్టిక్ వాడకం విపరీతంగా పెరిగిపోవడంతో కాలుష్యానికి దారితీస్తోందని, ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా గుడ్డ సంచులు వాడే విధంగా ఎటీబీ(ఎనీ టైం బ్యాగ్) ఉపయోగం పడుతుందని వివరించినట్లు పేర్కొన్నారు. రిషిక్ ఆవిష్కరణపై ప్రొఫెసర్లు ప్రశంసలు పొందినట్లు సుమలత వెల్లడించారు.

కొతులను కొట్టబోయి.. బావిలో పడి రైతు మృతి



బానోతు వెంకన్న (ఫైల్)

నెక్కొండ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : పంట చేనులోకి కోతులు రాకుండా కాపల ఉన్న రైతు బావిలో పడి మృతి చెందిన ఘటన వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మడిపల్లికి చెందిన బానోతు వెంకన్న (38) తన వ్యవసాయ భూమిలో మొక్కజొన్న పంట సాగు చేశాడు. భార్య సునితతో కలసి కొతుల బెడద నుంచి పంటను కాపాడడానికి వెళ్లాడు. కొతుల గుంపు పంట చేనులోకి చేరడంతో వాటిని తరిమేందుకు వెంకన్న వెళ్తుండగా ప్రమాదవశాత్తు బావిలో పడ్డాడు.

సమీపంలో ఉన్న భార్య కేకలు వేయడంతో చుట్టుపక్కల వ్యవసాయ పనుల్లో ఉన్న రైతులు వచ్చి బావి నుంచి వెంకన్నను బయటకు తీయగా అప్పటికే మృతి చెందాడు. భార్య సునిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి ఒక కూతురు ఉండగా వివాహం జరిగింది.

కాకినాడ జేఎన్‌టీయూ

వీసీగా నిట్ ప్రొఫెసర్

ఉత్తర్వులు జారీ చేసిన ఏపీ గవర్నర్



హనుమకొండ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : కాకినాడ జేఎన్‌టీయూ వైస్‌చాన్స్లర్‌గా వరంగల్ నిట్ ప్రొఫెసర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆరు యూనివర్సిటీలకు వీసీలను నియమించగా ఇందులో కాకినాడ జేఎన్‌టీయూకు ప్రసాద్ నియామకమయ్యారు. ప్రసాద్ పూర్తి పేరు చేకూరి శివరామ క్రిష్ణ ప్రసాద్. ఆయన తల్లిదండ్రులు చేకూరి సాంబశివరావు, తల్లి వెంకట సుబ్బమ్మ. ప్రసాద్ ప్రస్తుతం వరంగల్ నిట్‌లో సివిల్ ఇంజనీరింగ్ విభాగం ట్రాన్స్‌పోర్టు డివిజన్‌ను పర్యవేక్షిస్తున్నారు. ఆయన స్వస్థలం గుంటూరు. పదవ తరగతి గుంటూరు జిల్లా అమర్తలూరు జడ్పీహెచ్ఎస్ స్కూలులో, ఇంటర్ తెనాలి వీఎస్ఆర్ అండ్ ఎన్‌వీఆర్ కాలేజీలో చదివారు. బీటెక్ (సివిల్ ఇంజనీరింగ్), ఎంటెక్ (టాన్స్‌పోర్టు ఇంజనీరింగ్) వరంగల్ ఆర్ఈసీ (ప్రస్తుతం నిట్)లోనే చేశారు. పీహెచ్‌డీ (టాన్స్‌పోర్టు ఇంజనీరింగ్) కూడా ఆర్ఈసీలోనే చేశారు. ప్రసాద్ రవాణా రంగంలో విస్తృతమైన పరిశోధనలు చేశారు. ట్రావెల్ డిమాండ్ మోడలింగ్, అర్బన్ అండ్ రీజినల్ ట్రాన్స్‌పోర్టేషన్ ప్లానింగ్, మాస్ ట్రాన్స్‌పోర్టేషన్ ప్లానింగ్ ట్రాన్సిట్ ఓరియెంటెడ్ డెవలప్‌మెంట్, ట్రాఫిక్ ఇంజనీరింగ్, రోడ్డు భద్రత తదితర అంశాల్లో ఆయన తన పరిశోధనలు కొనసాగించారు. 33 ఏళ్ల బోధన అనుభవం కలిగిన ప్రసాద్ వరంగల్ నిట్‌లో వివిధ హోదాల్లో పని చేశారు. 1988లో లెక్చరర్‌గా చేరిన ఆయన కేంద్ర ప్రభుత్వం రీసెర్చ్ ఫెల్లోగా అయిదు సంవత్సరాలు పని చేశారు. ఆ తర్వాత ఇదే కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా, అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేశారు. ప్రస్తుతం హెచ్ఏజీ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

వివిధ హోదాల్లో...

వరంగల్ నిట్‌లో పాలనా పరగా వివిధ హోదాల్లో పని చేశారు. టీఈ ల్యాబ్ ఫ్యాకల్టీ ఇన్‌చార్జిగా, ట్రాన్స్‌పోర్టు డివిజన్ అధిపతిగా, అసిస్టెంట్ అడ్మిషన్ ఆఫీసర్, దూర విద్య సమన్వయ కర్త, అడ్మిషన్ ఆఫీసర్, టీఈక్యూఐపీ-2 అకాడమిక్ నోడల్ ఆఫీసర్, సివిల్ ఇంజనీరింగ్ హెడ్, అంతర్జాతీయ సంబంధాలు, పూర్వవిద్యార్థుల వ్యవహారాల డీన్, జీఐఏన్ లోకల్ కోఆర్డినేటర్, కార్పొరేట్ సంబంధాలు, వనరుల సమీకరణ సలహాదారుగా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారు. పదకొండ ఆర్ అండ్ డి ప్రాజెక్టులను పర్యవేక్షించారు. ప్రసాద్ ఆధ్వర్యంలో ఏడుగురు విద్యార్థులు పీహెచ్‌డీలు అందుకున్నారు. మరో నాలుగు పీహెచ్‌డీలకు గైడ్‌గా వ్యవహరిస్తున్నారు. ఇప్పటి వరకు ఆయన 77 శిక్షణా కార్యక్రమాలను, 166 ఎస్‌టీటీపీలు, వర్క్‌షాపులు, సెమినార్లను నిర్వహించారు. ప్రసాద్ సంపాదకత్వంలో నాలుగు పుస్తకాలు వెలువడ్డాయి. ఆయన రాసిన పరిశోధనా వ్యాసాలు 36 అంతర్జాతీయ, 16 జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. 45 అంతర్జాతీయ, 41 జాతీయ సదస్సులకు హాజరయ్యారు.

పత్తి చివరి క్వింటా వరకు కొనుగోలు చేస్తాం

సీసీఐ సీజీఎం పాణిగ్రహి

వరంగల్ వ్యవసాయం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా చివరి క్వింటా వరకు పత్తి కొనుగోలు చేస్తామని సీసీఐ సీజీఎం పాణిగ్రహి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ)తెలంగాణ రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ కు చెందిన తక్‌పట్టీ సాఫ్ట్‌వేర్ ద్వారా మద్దతు ధరతో కార్యకలాపాలు నిర్వహిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన థర్డ్‌పార్టీ డాటా సెంటర్‌లో నెట్‌వర్క్ సమస్యల కారణంగా అంతరాయం కలుగుతోందని, పరిష్కరించిన వెంటనే సీసీఐ పత్తి సేకరణ ప్రారంభిస్తుందని, పత్తి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరంలేదని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

తెలంగాణ జైళ్ల శాఖ దేశానికే ఆదర్శం

- డీజీ సౌమ్య మిశ్రా
- సెంట్రల్‌జైలు ప్రాంగణంలో పెట్రోల్ బంక్ ప్రారంభం



ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీజీపి సౌమ్యమిశ్రా

మామునూరు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి) : దేశంలోనే తెలంగాణ జైళ్ల శాఖ ఆదర్శంగా నిలుస్తోందని రాష్ట్ర జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ సౌమ్య మిశ్రా అన్నారు. మామునూరులోని సెంట్రల్ జైలు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌ను మంగళవారం ఆమె ప్రాంభించారు. అంతకు ముందు పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆశీర్వదించారు. అనంతరం సెంట్రల్ జైలును సందర్శించారు. ఖైదీలతో ముచ్చటించారు. ఖైదీలు పండించే పంటలు, జైలులో సౌకర్యాలు, వారు చేసే ఆర్గానిక్ వ్యవసాయ పంటలను డీజీ పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఖైదీలకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే మళ్లీ నేరాల వైపు వెళ్లరనే ఉద్దేశంతో జైళ్ల శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పెట్రోల్ బంక్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఖైదీల సత్ప్రవర్తన కోసం జైళ్ల శాఖ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు చేపడుతున్నామని, ఇందులో భాగంగా రాష్ట్రంలో ఇప్పటికే దాదాపు 30కి పైగా పెట్రోల్ బంకులు ఏర్పాటు చేసి విడుదలైన ఖైదీలతో పాటు ప్రస్తుతం శిక్ష అనుభవిస్తున్న వారికి కూడా అందులో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. మొదట 2013లో చంచల్ గూడ జైలు వద్ద పెట్రోల్ బంకు ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. బంకులలో వచ్చిన ఆదాయంతో ప్రస్తుతం శిక్ష అనుభవిస్తున్న కుటుంబాలకు ఉపాధి, ఆర్థిక భరోసా, ఖైదీల పిల్లలకు స్కాలర్ షిప్‌లు అందజేస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా పలువురు ఖైదీలు క్షమాభిక్ష కోసం డీజీకి వినతిపత్రాలను అందజేశారు. కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ.. వినియోగదారులకు కల్తీలేని నాణ్యమైన ఇంధనం అందించడమే కాకుండా ఖైదీలకు ఉపాధి కల్పిస్తున్న జైళ్ల శాఖ పనితీరు ప్రశంసనీయమని కొనియాడారు. కార్యక్రమంలో వరంగల్ రేంజ్ డీఐజీ ఎం.సంపత్, వరంగల్ కలెక్టర్ సత్యశారద, భారత్ పెట్రోలియం రిటైర్డ్ అధికారి నితిన్ సెలూకర్, కేంద్రకారాగార వరంగల్ పర్యవేక్షణ అధికారి టి.కళాసాగర్, ఉప పర్యవేక్షణ అధికారులు వెంకటేశ్వర స్వామి, ఎం.జ్యోతి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మేడారంలో తిరుగువారం

వనదేవతల పూజా సామగ్రిని భద్రపరచనున్న పూజారులు



మేడారంలోని సమ్మక్క మందిరం



కన్నెపల్లిలోని సారలమ్మ మందిరం

తాడ్వాయి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం వనదేవతల తిరుగువారం పండగను బుధవారం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పూజారులు మేడారంలో సమ్మక్క మందిరం, కన్నెపల్లిలో సారలమ్మ మందిరంతో పాటు వనదేవతల పూజా సామగ్రిని కూడా శుభ్రపరుస్తారు. ఈ క్రమంలో తల్లులకు ధూపదీప నైవేద్యాలు సమర్పిస్తారు. మహాజాతర వరకు ప్రజలందరినీ సుభిక్షంగా చూడాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని కుటుంబ సమేతంగా పూజారులు వేడుకుంటారు. అనంతరం వన దేవతల పూజా సామగ్రిని ఆయా తల్లుల మందిరాల్లో భద్రపరుస్తారు. దీంతో మినీ జాతర తంతు ముగుస్తుంది. ఇక ఆదివారం పూజారులు వనభోజనాలకు వెళ్తారు.

భద్రకాళి ఆలయంలో పూజలు



భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న సౌమ్యమిశ్రా

వరంగల్ కల్చరల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : చారిత్రక భద్రకాళి అమ్మవారి ఆలయాన్ని జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ సౌమ్యమిశ్రా దర్శించుకున్నారు. మంగళవారం మామునూరు సెంట్రల్ జైలు పరిశీలనకు వచ్చిన ఆమె ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పాలికారు. అమ్మవారి తీర్థప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు. ఆమె వెంట ఈవో శేషభారతి, అర్చకులు భద్రకాళి శేష, ఆలయ సిబ్బంది, పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

రుద్రేశ్వరుడి సన్నిధిలో..

హనుమకొండ కల్చరల్ : నగరంలోని ప్రసిద్ధ వేయిస్తంభాల రుద్రేశ్వరాలయాన్ని వరంగల్ పర్యటనకు విచ్చేసిన జైళ్లశాఖ డిప్యూటీ ఐజీ సౌమ్యామిశ్రా మంగళవారం సాయంత్రం సందర్శించారు. ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్ర శర్మ, ఇతర అర్చకులు ఆలయ మర్యాదలతో ఆమె స్వాగతించి తొలుత ఉత్తిష్ఠ గణపతిని దర్శింపజేసి రుద్రేశ్వరుడి సన్నిధిలో బిల్వార్చన నిర్వహింపజేసి ఆలయ నాట్య మండపంలో స్వామివారి శేషవస్త్రాలు బహుకరించి మహదాశీర్వచనం నిర్వహించా రు. ఈ సందర్భంగా సౌమ్యామిశ్రా గతంలో తాను ఉమ్మడి జిల్లా ఎస్పీగా పని చేసినప్పుడు ఈ ఆలయాన్ని ఎన్నోసార్లు సందర్శించానని, ఆలయ ప్రాశస్త్యాన్ని ప్రతి ఒక్కరు కాపాడాలని ఆమె అన్నారు. పలువురు జైళ్ల శాఖ అధికారులు, ఏసీపీ దేవేందర్‌రెడ్డి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సంపత్ తదితరులు ఆమె వెంట ఉన్నారు.

వినతులు స్వీకరించిన మంత్రి సురేఖ



బాధితులతో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

వరంగల్‌సిటీ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ మంగళవారం హనుమకొండలోని ఆమె నివాసంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. పలు సమస్యలపై వరంగల్ తూర్పు నియోజకవర్గానికి చెందిన ప్రజలు దరఖాస్తులు అందించారు. వాటిలో కొన్ని సమస్యలపై వెంటనే స్పందించిన మంత్రి సంబంధిత అధికారులకు ఫోన్ చేసి అప్పటికప్పుడు పరిష్కారం చూపారు. కొన్నింటిని అధికారులకు రిఫర్ చేశారు. సమస్యలు పరిష్కారం కాకపోతే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

వన ప్రేమికుడు.. ఇట్టే పాములను పట్టేస్తాడు..

సర్పాలను చాకచక్యంగా పట్టి అడవుల్లో వదులుతున్న స్నేక్ క్యాచర్ రహీమ్



గణపురం మండలం కర్కపల్లి గ్రామంలోని ఓ ఇంట్లోకి వచ్చిన నాగుపామును పట్టి డబ్బాలో బంధిస్తున్న స్నేక్ క్యాచర్ రహీమ్ (ఫైల్)

భూపాలపల్లి కృష్ణకాలనీ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యో తి) : ఆయనో వన ప్రేమికుడు. పర్యావరణ పరిరక్షణ అంటే అమితమైన ఇష్టం. పంక్చర్ షాపు నిర్వహించు కుంటూ జీవనం సాగించే ఆయన ఖాళీ సమయాల్లో మొక్కలు నాటుతుంటాడు. అంతేకాదు మొక్కలు నాటడం అందరి బాధ్యతంటూ ప్రచారం చేస్తుంటాడు. అలా ప్రకృతి పరిరక్షణకు నడుంబిగించిన భూపాలపల్లి పట్టణంలోని కృష్ణకాలనీకి చెందిన సయ్యద్ రహీమ్ పాషాకు ఆయనకు భార్య రెహానాబేగం కూడా చేదోడువాదోడుగా నిలుస్తూ ఉంటుంది. పర్యావరణ పరిరక్షణలో వనప్రేమికుడిగా గుర్తింపు పొందిన ఆయన మూగజీవాల సంరక్షణకూ పాటుపడుతుంటారు. అలా రహీమ్‌పాషా పాములను కూడా చాకచక్యంగా పట్టి.. వాటిని చంపకుండా అటవీ ప్రాంతాల్లో వదిలేస్తుంటాడు. ఎలాంటి విషసర్పాలనైనా అలవోకగా పట్టేసే రహీమ్‌పాషాకు 'స్నేక్ క్యాచర్'గా కూడా ప్రత్యేక గుర్తింపు ఉంది. 'పాము ఉంది.. పట్టడానికి రావాలి' ఎవరు ఫోన్ చేసినా వెంటనే రహీమ్, రెహానా ఇద్దరూ తమ ఎక్సెల్ వాహనంపై బయల్దేరుతారు. అక్కడ ఎవరికి హానీ కలుగకుండా.. పామును బంధిస్తారు. ఇప్పటి వరకు సుమారు 946 పాము లను పట్టిఉంటామని, వాటన్నిటిని భూపాల పల్లి మండల పరిధిలోని అటవీ ప్రాంతంలో సురక్షితంగా వదిలేశా మని వారు తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు సమీప ప్రాం తాల్లోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, జనావాసాలు, ఇళ్లు, వ్యాపారాల దుకాణాల్లోకి వచ్చిన పాములను పట్టిన సమయంలో ఆ పాముల నుంచి రక్షణ పొందిన వారు ఎంతిస్తే అంత తీసుకుంటూ ముందుకు సాగుతున్నామని రహీమ్ తెలిపారు. కాగా, ఇప్పటి వరకు తనకు ఎవరూ సహాయమందించడం లేదని, కనీస రక్షణ పరికరాలు కూడా లేవని, మూడుసార్లు తాను పాముకాటుకు గురై ప్రాణాపాయం నుంచి బయటపడ్డానన్నారు. దాతలు ముందుకొస్తే పాములతో హాని లేకుండా ఎంత దూరమైన వెళ్లి వాటిని బంధిస్తానంటున్నాడు. అయితే, ఏ పామైనా వాటికెక్కడా హానీ కలిగిస్తామోననే ఆత్మరక్షణ కోసమే అవి కాటేస్తాయని, పాములు కనిపిస్తే భయాందోళనకు గురై రాళ్లతో కొట్టడం, కర్రలు విసరడం లాంటివి చేయవద్దని రహీమ్ కోరుతున్నారు.

వెంటాడుతున్న బర్డ్‌ఫ్లూ భయం

- చికెన్ తినేందుకు జంకుతున్న జనం
- వెలవెలబోతున్న దుకాణాలు
- తగ్గుతున్న బిర్యానీ, గుడ్ల విక్రయాలు
- ఆవేదనలో వ్యాపారులు



కొనుగోలుదారులు లేక వెలవెల బోతున్న హనుమకొండ కుమార్‌పల్లి రోడ్ లోని ఓ చికెన్ సెంటర్



హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి18 (ఆంధ్రజ్యోతి) : ఓ వైపు చికెన్ ప్రియులను.. మరో వైపు చికెన్ వ్యాపారులు.. ఇంకోవైపు హోటళ్లు, రెస్టారెంట్ల యజమానులను బర్డ్ ఫ్లూ వైరస్ భయం వెంటాడుతోంది. ఉమ్మడి జిల్లాలో ఈ వైరస్ ఎక్కడా నిర్ధారణ కాకపోయినా.. పొరుగు రాష్ట్రాలు, జిల్లాల్లో వేలాది కోళ్ల మృత్యువాత పడటం, ప్రభుత్వం కూడా జాగ్రత్తగా ఉండాలని సూచించడం, కోళ్ల రవాణాపై ఆంక్షలు విధించడంతో చికెన్ ప్రియులు మరింత భయాందోళన చెందుతున్నారు. చికెన్ ముక్కలేనిదే ముద్ద దిగని వారు బర్డ్‌ఫ్లూ భయం నేపథ్యంలో అసలు చికెన్ తినాలా వద్దా అనే సందిగ్ధంలో సతమతమవుతున్నారు. దీంతో ఉమ్మడి జిల్లాతో పాటు నగరంలోని చికెన్ సెంటర్లు వెలవెల బోతున్నాయి. అమ్మకాలు తగ్గిపోవడంతో షాపుల నిర్వాహకులు ఆవేదనకు గురవుతున్నారు. అదే విధంగా కోడి గుడ్లను కూడా కొనేందుకు ఆసక్తి చూపకపోవడం తో గుడ్ల రేట్లు తగ్గుముఖం పడుతున్నాయి. హనుమకొండ చౌరస్తా పరిసర ప్రాంతాల్లోని పలు షాపుల్లోలో నిత్యం వందల కిలోల చికెన్ అమ్మకాలు జరుగుతుంటాయి. వారం రోజుల నుంచి బర్డ్ ఫ్లూ కారణంగా చికెన్ విక్రయాలు తగ్గిపోవడంతో చికెన్ సెంటర్ల నిర్వాహకులు నష్టాలు చూడాల్సి వస్తోంది. ఇక పలు హోటళ్లు, రెస్టారెంట్లలో చికెన్ బిర్యానీ, చికెన్‌తో చేసే ఇతర వంటకాలను తినేందుకు ప్రజలు ఆసక్తి చూపడం లేదు. నాటుకోళ్లు, చేపలు, రొయ్యలు, మటన్, శాకాహార పదార్థాల వైపు మొగ్గు చూపుతున్నారు. ఎప్పుడైనా గిరాకీ ఉండే చికెన్ బిర్యానీలను కొనేవారు తక్కువడంతో హోటళ్లు, రెస్టారెంట్ల యజమానులు డీలా పడుతున్నారు. ఈ క్రమంలో నాటుకోళ్లు, మటన్, చేపలు, రొయ్యల రేట్లు పెరుగుతున్నాయి. ఏళ్ల తరబడి చికెన్ విక్రయాలపై ఆధారపడిన తమకు బర్డ్‌ఫ్లూ వైరస్ తీరని నష్టాన్ని కలిగిస్తోందని చికెన్ సెంటర్ల యజమానులు, వాటిలో పనిచేసే వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అమ్మకాలు నిర్వహించడం లేదు



బర్డ్ ఫ్లూ వైరస్ వదంతుల కారణంగా ప్రజలు చికెన్ కొనుగోలు చేయడం లేదు. వారం రోజులుగా అమ్మకాలు నిర్వహించడం లేదు. గతంలో రోజుకు సగటున 80 నుంచి 100 కిలోల చికెన్ అమ్మేవాళ్లం. మేం ముగ్గురు నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తున్నాం. 25 ఏళ్లుగా చికెన్ సెంటర్ నిర్వహిస్తున్నాం. గతంలో బర్డ్ ఫ్లూ వైరస్ వచ్చిన సందర్భాలు ఉన్నా ఆ సమస్య తొందరగానే సమసిపోయేది. కానీ ఈ సారి పరిస్థితి మరింత జటిలమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం బర్డ్ ఫ్లూ వైరస్ పట్ల చొరవ తీసుకొని సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుని సహకరించాలి.

- బెజ్జంకి శ్రీనివాస్, చికెన్ సెంటర్ నిర్వహకుడు, టైలర్‌స్ట్రీట్

పర్యాటకం.. ప్రైవేటుకు!

(5వ పేజీ తరువాయి)

పద్ధతిలో తొలిదశలో ఐదు టూరిజం ప్రాంతాలను ప్రైవేట్‌కు అప్పగించేందుకు ప్రణాళిక రూపొందించింది. వీటిలో యునెస్కో గుర్తింపు పొందిన రామప్పతో పాటు పర్యాటకులను విశేషంగా ఆకర్షించే లక్నవరం సరస్సు, కాళేశ్వరం, బొగత జలపాతం, మేడారం మహజాతర ప్రాంతాలను ప్రైవేటుకు లీజుకు ఇవ్వనున్నారు. ఇప్పటికే వీటిలో కొన్నింటిని గత ప్రభుత్వం ప్రైవేటుపరం చేసింది. కాగా, ఆయా ప్రాంతాల్లో వచ్చే అదాయం ఆధారంగా 15ఏళ్ల నుంచి 66ఏళ్ల వరకు లీజుకు ఇవ్వనున్నట్లు సమాచారం. ఈ టెండర్ ద్వారా లీజు దక్కించుకున్న కంపెనీల నుంచి ప్రభుత్వానికి ఆదాయంతో పాటు పర్యాటక ప్రాంతాల అభివృద్ధి కూడా చేయాల్సి ఉంటుంది. అయితే హరిత హోటళ్లను నిర్మించినా వాటి నిర్వహణ లేక చాలా చోట్ల తెరుచుకునే పరిస్థితి లేదు.ఈ నేపథ్యంలో ప్రైవేటుకు అప్పగిస్తే హోటళ్లతో పాటు బొగత, రామప్ప, లక్నవరం లాంటి ప్రాంతాల్లో రిసార్టులు కూడా అభివృద్ధి చెందుతాయనే అభిప్రాయంతో ప్రభుత్వం ఉంది. ఈ మేరకు తెలంగాణ టూరిజం2025 పేరుతో వచ్చే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో బిల్లు పెట్టేందుకు పర్యాటకశాఖ కసరత్తు చేస్తున్నట్లుగా సమాచారం.

కొత్త పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై ఫోకస్

పర్యాటక రంగానికి కేరాఫ్‌గా ఉన్న ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో టూరిజాన్ని మరింతా అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నారు. భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం పాండవులగుట్టలను, ధర్మసాగర్ మండలంలోని దేవునూరు గుట్టలను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. అలాగే ఏటూరునాగారం అభయారణ్యంలో భాగంగా తాడ్వాయిలో చేపట్టిన పర్యాటక ప్రాంతాలు, బ్లాక్‌బెర్రీ ఐలాండ్‌తో పాటు మల్లూరు గుట్టలను, గణపసముద్రం, వరంగల్ కోటా తదితర ప్రాంతాలను అభివృద్ధి చేయాలని పర్యాటక శాఖ ప్రణాళికలు రూపొందిస్తుంది. ఓరుగల్లులో పాతికకు పైగా పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసి, హోటళ్లు, రిసార్టులు నిర్మించి ప్రవేటుకు లీజుకు ఇచ్చేందుకు కూడా డీపీఆర్ రూపొందిస్తున్నట్లుగా సమాచారం.

సామాన్యులకు భారం.. ఉద్యోగుల్లో ఆందోళన

పర్యాటక ప్రాంతాలను ప్రైవేటుపరం చేస్తే సామాన్యులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రైవేటు కాంట్రాక్టు సంస్థలు ఎంట్రీ రుసుం పెంచే అవకాశాలున్నాయి. అంతేకాకుండా హరిత హోటళ్లు, రిసార్టుల్లో గదుల ధరలు కూడా పెంచే అవకాశం ఉంది. వీటితో పాటు తినే ఆహారాలు, పార్కింగ్ స్థలాల ధరలు పెరుగనున్నాయి. దీంతో సామాన్యులు కుటుంబసమేతంగా పర్యాటక ప్రాంతాలకు వెళ్లటం కష్టమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే ఇప్పటికే హరిత హోటళ్లు, రిసార్టుల్లో పని చేస్తున్న రెగ్యులర్, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల్లోనూ ఆందోళన వ్యక్తమవుతోంది. తమ ఉద్యోగాల పరిస్థితి ఏమిటనే ఆందోళనలో ఉన్నారు. మొత్తంగా పర్యాటకశాఖ తీసుకొస్తున్న కొత్త టూరిజం పాలసీతో ఓరుగల్లు పర్యాటకం పరుగులు పెట్టేనా అనే చర్చ జరుగుతోంది.

వైద్య విద్యార్థులు ఉత్తమ డాక్టర్లుగా ఎదగాలి

- ములుగు కలెక్టర్ దివాకర
- మెడికల్ కళాశాలలో ముగిసిన కాలేజ్ ఫెస్ట్



మెడికల్ కాలేజ్ ఫెస్ట్ ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర్

ములుగు, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ములుగు ప్రభుత్వ వైద్యకళాశాలలో ఎంబీబీఎస్ చదువుతున్న విద్యార్థులు మంచి ఫలితాలతో ఉత్తీర్ణులై ఉత్తమ వైద్యులుగా ఎదగాని కలెక్టర్ టీఎస్.దివాకర అన్నారు. కళాశాల మొదటి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులతో కాలేజ్ ఫెస్ట్ నిర్వహించారు. మూడు రోజులపాటు జరిగిన కార్యక్రమాలు మంగళవారం రాత్రి ముగిశాయి. చివరి రోజు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతం ఎక్కువగా ఉన్న ములుగులో వైద్యకళాశాల ఏర్పాటు కావడం గొప్ప విషయమన్నారు. రాబోయే రోజుల్లో వసతులను మెరుగుపరుస్తామని వెల్లడించారు. వైద్యవిద్యను శ్రద్ధగా అభ్యసించి ఉత్తీర్ణులు కావాలన్నారు. రోగుల పట్ల దయతో ఉండాలని, వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. సాంస్కృతిక కార్యక్రమాలతో ఒత్తిడి తగ్గుతుందని, పాల్గొనడం ద్వారా నలుగురితో సత్సంబంధాలు మెరుగుపడటమే కాకుండా నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని అన్నారు. ఆత్మన్యూనతాభావం తగ్గుతుం దని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బానోతు మోహన్‌లాల్, ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ జగదీశ్వర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ లక్పతి, సీనియర్, జూనియర్ ప్రొఫెసర్లు, వైద్యులు, వైద్య విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

అమెరికా అమ్మాయికి మెహందీ పండుగ

- మెట్టినింట సంప్రదాయ కార్యక్రమాలు
- హాజరైన కుటుంబ సభ్యులు, బంధువులు
- భద్రకాళి అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజ



భద్రకాళి ఆలయంలో నూతన వధూవరులు, అమెరికా నుంచి వచ్చిన జెస్సిక కుటుంబీకులు

వరంగల్ కార్పొరేషన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : మన కట్టు బొట్టు.. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలతో రెండు రోజుల క్రితం నీరుకుళ్ల అబ్బాయి సతీష్ చంద్రను వివాహమాడిన అమెరికా అమ్మాయి జెస్సికకు అత్తింటివారు మంగళవారం తమ ఇంటి సంప్రదాయ కార్యక్రమాలను నిర్వహించారు. నూతన వధువుకు ముత్తైదువులు మెహిందీ పండగ నిర్వహించి, నల్లపూసల కార్యక్రమంలో పాటు చీర, సారె పోశారు. హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం నీరుకుళ్ల గ్రామానికి చెందిన తాటిపర్తి రఘునాథ్‌రావు- వైశాలిని కుమారుడు సతీష్‌చంద్ర 2014లో ఉన్నత చదువుల కోసం అమెరికాకు వెళ్లగా ఫ్లోరిడాకు చెందిన జెస్సికాతో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్త ప్రేమగా మారి పెళ్లికి దారి తీసింది. ఆదివారం ఆ జంట వివాహం అంగరంగ వైభవంగా జరగ్గా.. మంగళవారం వరంగల్ పోచమ్మమైదాన్ సమీపంలోని మర్రి వెంకటయ్య కాలనీ లో ఉన్న సతీష్‌చంద్ర నివాసంలో తమ సంప్రదాయ కార్యక్రమాలను పూర్తిచేశారు. నూతన వధువు జెస్సికను సంప్రదాయబద్ధంగా తయారు చేసి మెహందీ పండగ నిర్వహించారు. ముత్తైదువులు నల్లపూసలు గుచ్చే కార్యక్రమం నిర్వహించారు. ఈ క్రమంలో నూతన వధూవరులు తమ అత్త, మామలతో పాటు ముత్తైదువులు, ఇతర కుటుంబ పెద్దల ఆశీస్సులు అందుకున్నారు. ఆ తర్వాత చారిత్రక భద్రకాళి ఆలయంలో అమ్మవారిని దర్శించుకోగా.. అక్కడి వేద పండితులు జెస్సికతో కుంకుమ పూజ చేయించారు.

ఎస్పీఎఫ్ సిబ్బందికి సీపీఆర్‌పై అవగాహన

వరంగల్ క్రైం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బందికి మంగళవారం హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో కార్డియో పల్మోనరి రిససిటేషన్ (సీపీఆర్) పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జనరల్ ఫిజిషియన్ ఆకారపు రాజ్‌గోపాల్ సీపీఆర్ ఏ విధంగా చేయాలి.. ఏలాంటి సమయాల్లో చేయాలి అనే దానిపై ఎస్పీఎఫ్ సిబ్బందికి వివరించారు. ఈ కార్యక్రమంలో టీజీ ఎస్పీఎఫ్ అడిషినల్ ఎస్పీ జంగయ్య, సీఐ భీంరావు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


సీపీఆర్ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ సిబ్బంది

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన మార్నేని

హనుమకొండ సిటీ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : డీసీసీబీ, సహకార సంఘాల పదవీకాలం ఆరు నెలల పొడిగించిన సందర్భంగా టీజీ క్యాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం, డిప్యూటీ సీఎం లకు డైరీ, పుష్పగుచ్ఛాలు అందించి కృతజ్ఞతలు తెలిపారు. వీరితోపాటు మంత్రి జూపల్లి కృష్ణారావు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి జానారెడ్డిని సైతం డీసీసీబీ చైర్మన్లతో కలిసి వారికి మార్నేని రవీందర్‌రావు కృతజ్ఞతలు చెప్పారు.


సీఎం రేవంత్‌రెడ్డికి డైరీ అందజేస్తున్న రవీందర్‌రావు

వినయ్ భాస్కర్‌కు కేటీఆర్ అభినందన

కేసీఆర్ క్రికెట్ చాంపియన్‌షిప్ విజేతలకు బహుమతుల ప్రదానం


దాస్యం వినయ్ భాస్కర్‌ను అభినందిస్తున్న కేటీఆర్

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్నా లేకన్నా పదవితో సంబంధం లేకుండా ప్రజల కోసం వరంగల్ పశ్చిమ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ పనిచేస్తున్నారని మంగళవారం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. వరంగల్ పశ్చిమ నియోజక వర్గంలో మాజీ సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం పట్ల దాస్యం వినయ్ భాస్కర్‌ను కేటీఆర్ అభినందించి క్రీడల్లో గెలిచిన క్రీడాకారులకు బహుమతును అందజేశారు. కేసీఆర్ క్రికెట్ చాంపియన్‌షిప్‌తో పాటు ఇతర పోటీల్లో విజయం సాధించిన విజేతలను కేటీఆర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్స్ కాకతీయ క్రికెట్ అకాడమీ ఫౌండర్ ఫారూక్, మాజీద్, అస్లాం, షాకీర్, వీరు, సిరాజ్, రాజేష్‌కుమార్, బీఆర్‌ఎస్ వరంగల్ పశ్చిమ కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్, మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, సీనియర్ బీఆర్‌ఎస్ నాయకులు రామ్మూర్తి, బుద్ధ వెంకన్న, పెద్దిరాజు, ప్రణయ్, యాదగిరి, రఘు తదితరులు పాల్గొన్నారు.

30 మంది వాహనదారులకు జరిమానా

వరంగల్ క్రైం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలు ఉల్లంఘించిన 30 మంది వాహనదారులకు న్యాయమూర్తి రాజశేఖర్‌రెడ్డి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి. సీతారెడ్డి తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్‌లో 22 మంది పట్టుబడగా 20 మందికి రూ. 24, 400 జరిమానా, ఇద్దరికి కమ్యూనిటీ సర్వీసింగ్ శిక్ష, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపి పట్టుబడిన 10 మందికి రూ. 4,600 జరిమానా విధించినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

మెట్టుగుట్ట హుండీ ఆదాయం రూ. 3,45,084


మెట్టు రామలింగేశ్వరస్వామి ఆలయ హుండీలను లెక్కిస్తున్న అర్చకులు, భక్తులు

మడికొండ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మడికొండలోని మెట్టుగుట్ట పై గల మెట్టురామలింగేశ్వరస్వామి ఆలయం హుండీల ద్వారా రూ. 3,45,084 ఆదాయం సమకూరినట్లు దేవస్థాన ఈవో శేషుభారతి, చైర్మన్ పైడిపాల రఘుచందర్ మంగళవారం వెల్లడించారు. హుండీల ఆదాయాన్ని లెక్కించగా మెట్టురామలింగేశ్వరస్వామి ఆలయ హుండీ ద్వారా రూ. 2,72,547, సీతారామచంద్రస్వామి ఆలయ హుండీ ద్వారా రూ. 72537 మొత్తం రూ. ఆదాయం రూ. 3,45,084 ల ఆదాయం సమకూరినట్లు ఈవో, చైర్మన్ తెలిపారు. అలాగే మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా గుట్టపైన దుకాణముల నిర్వహణ కోసం టెండర్లు పిలువగా లడ్డూ, పులిహోర అమ్మకం హక్కు. రూ. 1,52,000, కొబ్బరి చిప్పలు సేకరణ హక్కు రూ. 27,500, అభిషేక పంచామృతాలు అమ్ముకునే హక్కు రూ. 45,000 లకు వేలం పాటలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పరావరం విష్ణువర్ధనాచార్యులు, పారుపెల్లి సత్యనారాయణశర్మ, ధర్మకర్తలు బైరి రాజు, వస్కుల ఉమ, బోగి కేదారి, రొడ్డ దయాకర్, దండిగం శ్రీనివాస్, మాడిశెట్టి జ్ఞానేశ్వరి, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

గణితం ఒలింపియాడ్‌లో రామన్ విద్యార్థులకు ర్యాంకులు


ర్యాంకులు సాధించిన విద్యార్థులతో కరస్పాండెంట్ రాజేష్

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో గత నెలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి గణిత ఒలంపియాడ్ పోటీలలో హనుమకొండలోని సుబేదారి రామన్ స్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించినట్టు పాఠశాల కరస్పాండెంట్ రాజేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర స్థాయిలో సబ్ జూనియర్ క్యాటగిరిలో మితాంష్ రెడ్డి 3వ ర్యాంకు, అవినాష్‌రెడ్డి జూనియర్ కేటగిరిలో స్టేట్ 1వ ర్యాంకు, శ్రీహర్షిక 2వ ర్యాంకు, యశశ్విని 3వ ర్యాంకు, ధార్మిక్ 4వ ర్యాంకు, యుక్తశ్రీ, హర్షిత్, హర్షతేజ, అనిష్‌చంద్ర, అశ్రిత, సహజ, ఖుదీషియా జీనాత్, సాయి కౌశిక్‌రెడ్డి, లక్షసాయి, అర్షవర్ధన్ మల్లిక్, మణిదీప్, దీపాన్విత, సహస్ర, మొహిత్‌రెడ్డి, రమణీత్‌రెడ్డి, అక్షిత, సూర్యవైష్ణవి పలు కేటగిరిలలో ర్యాంకులు సాధించారని తెలిపారు. కాగా, పాఠశాల కరస్పాండెంట్ రాజేష్ మాట్లాడుతూ గణిత శాస్త్రంలో పాఠశాల సిబ్బంది విలువలతో కూడిన విద్యను అందిస్తూ గణితంలో ప్రావీణ్యం పొందిన విద్యార్థులు ఫిజిక్స్, రసాయన శాస్త్రం లాంటి పాఠ్యాంశాలను అలవోకగా అర్థం చేసుకుంటున్నారని తెలిపారు. ఈ ఫలితాలు సాధించడానికి కృషి చేసిన అధ్యాపకులు కరుణారెడ్డి, ఇతర సిబ్బందిని పాఠశాల డైరెక్టర్ పురుషోత్తం, మడికొండ ప్రిన్సిపాల్స్ స్రవంతి, రజితను విద్యార్థినులు, పాఠశాల సిబ్బందిని అభినందించారు.

శ్యామల చెరువు పరిరక్షణపై నీలినీడలు

- బడా నాయకులు, ఉన్నతాధికారుల అండతోనే కబ్జాలు ?
- చెరువు శిఖం, నాలాలు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లే లక్ష్యం
- కబ్జా స్థలాల్లో వెంచర్లు, అక్రమ నిర్మాణాలు


చెరువు మత్తడి ఆనవాళ్లు లేకుండా చదును చేసిన దృశ్యం


ఎఫ్‌టీఎల్ పరిధిలో వెలిసిన ఆలయం, గృహ నిర్మాణాలు

హసన్‌పర్తి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ పరిధిలోని విలీన గ్రామాల్లో భూముల ధరలు రోజురోజుకు పెరుగుతూ ఆకాశాన్నంటాయి. దీంతో కబ్జాదారులు తమ పలుకుబడిని ఉపయోగించి కబ్జాలకు పాల్పడుతున్నారు. కొంత మంది ప్రజాప్రతినిధులు కబ్జాకు కొత్త పుంతలు తొక్కుతున్నారని చర్చ సాగుతోంది. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి మారి తమ అధికారాన్ని వినియోగించి కబ్జాల పర్వం కొనసాగిస్తున్నారనే విమర్శలున్నాయి. అంతేకాకుండా దేవుడి పేరు చెప్పి ఏకంగా చెరువులోనే నిర్మాణాలు చేపడుతూ చెరువు మత్తడితో సహా ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, నాలా భూములను సైతం హస్తగతం చేసుకునేందుకు ఓ మాజీ ప్రజాప్రతినిధి ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారనే ఆరోపణలున్నాయి. గత 20 ఏళ్లుగా తన ప్రణాళికలను అమలు చేయడంలో సఫలీకృతుడవుతూ చెరువును పూర్తిగా కనుమరుగు చేసే ప్రయత్నం చేస్తున్నారని స్థానిక ప్రజలు చెప్పుకుంటున్నారు.

గ్రేటర్ 55వ డివిజన్ పరిధి భీమారం రెవెన్యూ శివారు శ్యామల చెరువు సర్వే నెం.642లో సుమారు 67.22 ఎకరాల విస్తీర్ణం ఉంది. ఇందులో 100 ఫీట్ల బఫర్ జోన్, 97 ఎకరాలు ఎఫ్‌టీఎల్ పరిధి కాగా కొంత పట్టా భూమి ఉందని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎఫ్‌టీఎల్ పరిధిలో పట్టా భూములున్నా ప్రజా ప్రయోజనాల దృష్ట్యా వ్యవసాయ సాగుకు మాత్రమే వినియోగించాలే తప్పా శాశ్వత నిర్మాణాలు చేపట్టకూడదని చట్టాలు చెబుతున్నాయి. ఒకవేళ ఎఫ్‌టీఎల్‌లో పట్టా భూముల్లో శాశ్వత నిర్మాణాలు చేపడితే చెరువు కుంచించుకుపోయి వరదనీరు చేరకుండా భూగర్భ జలాలు అడుగంటడమే కాకుండా గ్రామంలో బోర్లు, బావులు ఎండిపోయే ప్రమాదం ఉందని నిపుణులు చెబుతున్నారు. అంతేకాకుండా గ్రామంలో పశుపక్ష్యా దులు తాగునీరు, మత్స్యకారుల కుటుంబాలు చేపలు పట్టే వృత్తిని కోల్పోయి రోడ్డున పడే ప్రమాదం ఉందని పలువురు అధికారులు పేర్కొంటున్నారు. అంటే ఎఫ్‌టీఎల్ పరిధిలో పట్టా భూములున్నా పట్టాదారుడు ప్రభుత్వ అనుమతి లేకుండా ఎక్కడ కూడా శాశ్వత నిర్మాణాలు చేపట్టకూడదని జిల్లా ఉన్నతాధికారులే పేర్కొంటున్నారు.

దశల వారీగా కబ్జాలు

శ్యామల చెరువు దశల వారిగా కబ్జాకు గురవుతునే ఉందనే ప్రజలు పేర్కొంటున్నారు. కొంత మంది ప్రజాప్రతినిధులు ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి మారుతూ ప్రజాప్రయోజనాలను విస్మరిస్తున్నారు. కోట్లాది విలువైన చెరువు శిఖంతో పాటు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, నాలా భూములను ఆక్రమిస్తున్నారని ఆరోపణలున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలు, దేవాలయాల పేరుతో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేపడుతూ చుట్టు పక్కల ఉన్న భూములను కబ్జా చేసి అపార్టుమెంట్లు వేసి విక్రయించి చేసి సొమ్ము చేసుకుంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలోనూ శ్యామల చెరువ బఫర్‌జోన్, నాలాలు, ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమ వెంచర్లు చేపట్టి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టి కబ్జాల పర్వాన్ని మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగిస్తున్నారనే విమర్శలున్నాయి. ప్రస్తుతం శ్యామల చెరువులో గోశాల పేరుతో నిర్మాణాలు చేపట్టి ఏకంగా చెరువునే మింగేసే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చెరువును ఆక్రమిస్తే చర్యలు
ఐబీ ఏఈఈ శ్రీనివాస్

చెరువును ఆక్రమిస్తే చర్యలు తప్పవు. గతంలో శ్యామల చెరువుపై జాయింట్ సర్వే నిర్వహించాం. వరంగల్ నగర పోలీసు కమిషనర్, గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్, రెవెన్యూ, ఐబీ అధికారుల జాయింట్ సర్వేలో భీమారం శ్యామల చెరువు సర్వే నెం. 642లో 67 ఎకరాల విస్తీర్ణంలో ఎఫ్‌టీఎల్ పరిధి 97 ఎకరాలు, బఫర్ జోన్ 100 మీటర్లు ఉందని గుర్తించాం. వీటిలో ఎఫ్‌టీఎల్ పరిధిలో 26 ఇండ్లు, బఫర్ జోన్ పరిధిలో 100 ఇండ్లు ఉన్నట్లు గుర్తించి వారికి నోటీసులు కూడా జారీ చేశాం. అంతేకాకుండా ఎఫ్‌టీఎల్ పరిధిలో 3 ఎకరాల విస్తీర్ణంలో ఇతర సర్వే నెంబర్ చూపిస్తూ కాంపౌండ్ నిర్మించినట్లు గుర్తించాం. అలాగే చెరువు మత్తడి పూర్తిగా తొలగించి 33 ఫీట్ల నాలా కూడా కబ్జాకు గురైంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కబ్జాలకు గురైన ప్రభుత్వ భూవిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం.


ఎఫ్‌టీఎల్ పరిధిలో కబ్జా చేసి నిర్మించుకున్న ఇండ్లు

భద్రకాళి చెరువు పూడికతీత పనులు వేగవంతం చేయండి

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే


భద్రకాళి చెరువు వద్ద పనులను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న హనుమకొండ కలెక్టర్, బల్దియా కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : భద్రకాళి చెరువు పూడికతీత పనులను వేగవంతం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం భద్రకాళి చెరువు ప్రాంతంలో సంబంధిత అధికారులతో కలిసి పర్యటించారు. చెరువులో పూడిక తీత పనులు, మట్టి తరలింపు తదితర అంశాలపై అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రావీణ్య మాట్లాడుతూ.. చెరువు పూడికతీత పనులలో భాగంగా మట్టిని తరలించే క్రమంలో ఏలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా అంతర్గత రోడ్డు (అప్రోచ్ రోడ్డు) నిర్మించాలని సూచించారు. మట్టి తరలింపు సమయంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. పనులు జరుగుతున్న సమయంలో రాత్రి పూట విద్యుత్ దీపాల సౌకర్యం కల్పించాలన్నారు. మట్టి తరలింపు వాహనాల నమోదు కోసం చెక్ పోస్టు ఏర్పాటు చేయాలన్నారు. రెవెన్యూ, పోలీస్, సాగునీటి పారుదల, మునిసిపల్ శాఖలు 24 గంటల పాటు పర్యవేక్షించాలన్నారు. పూడికతీత మట్టి కావాలనుకునే వారు క్యూబిక్ మీటర్‌కు రూ. 72 చెల్లించి మట్టిని తీసుకుని వెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, మున్సిపల్, కుడా, నీటి పారుదల అధికారులు పాల్గొన్నారు.

డ్రెయినేజీల నిర్మాణానికి సహకరించండి

వరంగల్ నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులలో భాగంగా పలు కాలనీల్లో జరుగుతున్న డ్రైనేజీల నిర్మాణ పనులకు ప్రజలు సహకరించాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సూచించారు. గ్రేటర్ వరంగల్ 32వ డివిజన్ తెలంగాణ కాలనీలో టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ అధికారులు నిర్మిస్తున్న పనులను మంగళవారం కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. స్థానిక ప్రజల సౌకర్యార్థం డ్రైనేజీలు నిర్మిస్తున్నామన్నారు. నగరం అభివృద్ధికి స్థానికుల సహాయంతో పాటు కాలనీల పర్యవేక్షణ కమిటీల సలహాలు అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, ఇన్‌చార్జి సీపీ రవీంద్ర రాడేకర్, ఈఈ శ్రీనివాస్, టీపీఎస్ అనిల్, ఏఈ ముజామిల్ తదితరులు పాల్గొన్నారు.

భారీ మొత్తంలో గుట్కాల పట్టివేత

వరంగల్ క్రైం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మట్టెవాడ, గీసుగొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం భారీ మొత్తంలో ప్రభుత్వ నిషేధిత పొగాకు ఉత్పత్తులు, జీఎస్టీ చెల్లించని సిగరెట్ పెట్టెలను పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు.

ధర్మారం న్యూబీట్‌బజార్‌లోని మహాలక్ష్మీ ట్రాన్స్‌పోర్ట్ నిర్వాహకుడు శ్యామ్ నుంచి సీఐ పవన్‌కుమార్ టీం రూ. 84 వేల విలువ చేసే గుట్కాలను స్వాధీనం చేసుకొని స్థానిక పోలీసులకు అప్పగించడం జరిగిందన్నారు. అదే విధంగా మట్టెవాడ పీఎస్ పరిధిలోని సంతోషిమాత ఏరియాలోని గోదాంలలో పిన్నవారి స్ట్రీట్‌కి చెందిన మహేందర్ కుమార్, జబ్బర్ సింగ్, జేపీఎన్ రోడ్డుకు చెందిన కలురం అనే వ్యాపారస్థులు డంప్ చేసిన రూ. 12, 42,1250 విలువ గల గుట్కాలు, జీఎస్టీ చెల్లించని సిగరెట్ పెట్టెలను సీఐ కాసగాని శ్రీధర్ బృందం స్వాధీనం చేసుకొని స్థానిక పోలీసులకు అప్పగించడం జరిగిందన్నారు.


స్వాధీనం చేసుకున్న సిగరెట్, గుట్కాల పెట్టెలను చూపిస్తున్న పోలీసులు

2008 డీఎస్సీ అభ్యర్థులందరికీ న్యాయం చేయాలి

నవ తెలంగాణ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామన్న నాయక్

వడ్డెపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): 2008 డీఎస్సీలో అర్హులైన అభ్యర్థులందరికీ ఉద్యోగాలు ఇచ్చి న్యాయం చేయాలని నవ తెలంగాణ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ రామన్న నాయక్ సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.వరంగల్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2008 డీఎస్సీలో క్వాలీఫై అయిన 16 మందిలో ఏడుగురికి మాత్రమే ఉద్యోగాలు ఇచ్చి సర్టిఫికెట్ వెరిఫికేషన్‌లో అన్యాయం చేశారని ఆయన ఆరోపించారు. 2008 డీఎస్సీలో క్వాలీఫై అయిన జె. సోమ్లా, ఇ. వెంకన్న, పి.శంకర్, ఇ. రాములు, బి.వాల్యా, బి.రవీందర్, రాంమూర్తి, భాస్కర్, గణేష్ తదితరులకు వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో వెంకన్న, సోమ్లా, రాములు, సంజీవ్, రవీందర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.


ప్రెస్ క్లబ్‌లో మాట్లాడుతున్న రామన్న నాయక్

పలు రాష్ట్రాల్లో దడువాయి చార్జీల పరిశీలన

పర్యటిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

వరంగల్ వ్యవసాయం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్లలో దడువాయిలు రైతుల నుంచి వసూలు చేస్తున్న చార్జీలను తెలుసుకునేందుకు రెండు రోజులుగా కార్మిక సంఘాల నాయకులు పలు రాష్ట్రాలలో పర్యటిస్తున్నారు. వ్యవసాయ మార్కెట్లను సందర్శించి వివరాలు తెలుసుకుంటున్నారు. దడువాయి యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సరసాని సురేందర్‌రెడ్డి, కార్యదర్శి నేనావత్ రవికుమార్, ఉపాధ్యక్షుడు వాసం సంజీవ్ కుమార్, కోశాధికారి బోనాల వీరన్న, ఏఐకేఎఫ్ జాతీయ అధ్యక్షుడు ప్రేమ్ సింగ్ బంగు, జాతీయ కార్యదర్శి మోర్తాల చందర్‌రావు మంగళవారం చండీగఢ్‌లోని వ్యవసాయ మార్కెట్లలో తిరిగి ఏజెంట్లు, వ్యాపారులు, రైతులను కలిసి రైతుల నుంచి వసూలు చేస్తున్న చార్జీలు ఎంత, కార్మికులకు చెల్లిస్తున్నది.. ఎంత అన్న పూర్తి వివరాలను పరిశీలించారు. పర్యటన పూర్తి అయిన తరువాత వివరాలను మీడియా, మార్కెట్ శాఖ అధికారులకు అందజేస్తామని వారు తెలిపారు.

ఉపాధ్యాయ, అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి గెలిపించండి

వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఎమ్మెల్సీ అభ్యర్థి నర్సిరెడ్డి


ప్రెస్ క్లబ్‌లో మాట్లాడుతున్న నర్సిరెడ్డి

వడ్డెపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి తనను ఎమ్మెల్సీగా గెలిపించాలని వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి కోరారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2019లో జరిగిన ఎన్నికల్లో ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల మద్దతుతో ఎమ్మెల్సీగా ఎన్నికైన తాను అప్పటి నుంచి ఉపాధ్యాయ, అధ్యాపకుల గొంతుకగా నిరంతరం పనిచేస్తున్నానని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఉపాధ్యాయుల పక్షాన నిలబడి ప్రభుత్వ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం, విద్యా సంస్థల బలోపేతం కోసం అటు శాసన మండలిలోనూ, ఇటు బయట శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 27న జరుగనున్న ఎన్నికల్లో ప్రస్తుత ఎమ్మెల్సీ ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల ఉమ్మడి అభ్యర్థిగా బరిలో నిలిచిన తనకు మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని నర్సిరెడ్డి కోరారు.

నగదు రహిత వైద్యం అందించాలి

పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కుందూరు గోపాల్‌రెడ్డి

వడ్డెపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్లకు నగదు రహిత వైద్యం అందించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కుందూరు గోపాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండ అంబేద్కర్ సర్కిల్ ప్రాంతంలోని పెన్షనర్ల సంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెన్షనర్లందరికి రావల్సిన ఐదు డీఏలను వెంటనే విడుదల చేయాలని అన్నారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్‌లో పెన్షనర్లకు ఇబ్బందులు కలగకుండా ట్రెజరీ నుంచి బిల్లులను వెంటనే విడుదల చేయించాలని కోరారు. పీఆర్‌సీని వెంటనే ప్రకటించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర పెన్షనర్ల సంఘం జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, వరంగల్ జిల్లా అధ్యక్షుడు సోమయ్య, హనుమకొండ నగర శాఖ అధ్యక్షుడు మాదిరెడ్డి మల్లారెడ్డి , ప్రధాన కార్యదర్శి కందుల సంజీవరెడ్డి, జిల్లా నాయకులు పి. సరళ, నారాయణరావు, ఖాజా నయీమొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కుందూరు గోపాల్‌రెడ్డి

అభిరుచి

సినిమా అంటే చిన్నప్పటి నుంచీ ఇష్టం. కానీ పరిశ్రమ తలుపు తట్టాలని ఎన్నడూ అనుకోలేదు. కాలేజీ వేడుకల్లో చిన్న చిన్న సెట్లు వేసిన అనుభవం. అదే ఆమెను రంగుల ప్రపంచం వైపు ఆకర్షించింది. ప్రొడక్షన్ డిజైనర్‌ను చేసింది. అదీ ఇక్కడో... అక్కడో కాదు... ఏకంగా హాలీవుడ్‌లో బిజీ అయిపోయింది. ఇటీవల తను పని చేసిన ఓ చిత్రానికి అవార్డు కూడా అందుకున్న అచ్చతెలుగు అమ్మాయి... లక్ష్మీ నైమిషా గుమ్మడి హైదరాబాద్ టూ లాస్‌ఏంజెలెస్ జర్నీ ఇది.





అనుభవమే అన్నీ నేర్పింది

"సినీ పరిశ్రమ అనగానే ఎవరైనా తెర మీద కనిపించాలని కోరుకొంటారు. కానీ నాకు అటు వైపు వెళ్లాలన్న ఆలోచనే ఎన్నడూ రాలేదు. చిన్నప్పుడు సినిమాలు చూసేదాన్ని. అయితే కెమెరామన్, దర్శకుడు... ఇలా తెర వెనుక ఎంతోమంది శ్రమ ఉంటుందని తెలిసేది కాదు. వెండితెర మీద కనిపించేవారే అన్నీ అనుకొనేదాన్ని. పెరిగే కొద్దీ ఒక్కొక్క క్రాఫ్ట్ గురించి అర్థమైంది. దాంతో సినిమా కంటే చివర్లో వచ్చే 'బిహైండ్ ది సీన్స్' బాగా నచ్చేవి. ఆ డిజైన్ ఎలా చేశారు? ఈ కలర్ ఎలా తీసుకురాగలిగారు? ముఖ్యంగా మన తెలుగు చిత్రాల్లో పాటలకు ఎంతో ప్రత్యేకత ఉంటుంది. వాటిల్లో కనిపించే కళాత్మకత నన్ను బాగా ఆకట్టుకొనేది. దానికితోడు మా అమ్మానాన్నలిద్దరూ ఆర్కిటెక్ట్‌లు. నాన్నకు కన్‌స్ట్రక్షన్ బిజినెస్‌లో ఉన్నారు. అమ్మ కూడా ఆర్కిటెక్ట్‌గా పని చేశారు. ఈ క్రమంలో ఎప్పుడూ రకరకాల డిజైన్లు చూస్తుండేదాన్ని. ఇంట్లో కూడా వాటి గురించి మాట్లాడుతుండేవారు. అలా డిజైనింగ్ అనేది నాకు ఒక అభిరుచిలా మారిపోయింది. సినిమాలు చూసేటప్పుడు కూడా నా దృష్టి ఎక్కువగా బ్యాక్‌గ్రౌండ్ మీదే ఉండేది. వాటి గురించి తెలుసుకోవాలన్న తపనే ఇవాళ నన్ను ప్రొడక్షన్ డిజైనర్‌గా హాలీవుడ్‌లో నిలబెట్టింది.

కాలేజీలో మొదలైంది...

మా స్వస్థలం గుంటూరు. పెరిగిందంతా హైదరాబాద్‌లో. టెన్త్ వరకు 'సంఘమిత్ర స్కూల్‌'లో చదివాను. 'ఓబుల్‌రెడ్డి పబ్లిక్ స్కూల్‌'లో పన్నెండో తరగతి అవ్వగానే ఆర్కిటెక్చర్‌లో బీటెక్ చేద్దామని కర్ణాటక 'మణిపాల్ యూనివర్సిటీ' (ఎంఐటీ)కి వెళ్లాను. 2021లో బీటెక్ పూర్తయింది. డిజైనింగ్ మీద ఉన్న ఆసక్తితో కాలేజీలో వార్షికోత్సవాలు, థియేటర్ స్కిట్స్ వంటి వాటికి సెట్టింగ్‌లు వేసేదాన్ని. అందరూ బాగున్నాయనేవారు. అలా సెట్ డిజైనింగ్ మీద ఆసక్తి పెరిగింది. డిగ్రీ అవ్వగానే కొన్నాళ్లు హైదరాబాద్‌లోని ఓ డిజైనింగ్ స్టూడియోలో ఆర్కిటెక్చర్ ప్రోగ్రామ్‌కు సంబంధించి పని చేశాను.

కరోనా సమయంలో...

వాస్తవానికి డిగ్రీ పూర్తవక ముందే, కరోనా సమయంలో నేను అమెరికా వచ్చాను. కొన్ని వర్క్‌లు చేశాను. కాలేజీలో ఉండగానే ప్రొడక్షన్ డిజైనింగ్ గురించి పరిశోధించాను... ఏ కాలేజీలో చదివితే బాగుంటుందనే దాని మీద. అలాంటి కాలేజీలన్నిటికీ దరఖాస్తు చేసుకున్నాను. టాప్ కాలేజీ 'అమెరికన్ ఫిలిమ్ ఇనిస్టిట్యూట్ (ఏఎఫ్‌ఐ)లో సీటు వచ్చింది. డిగ్రీ తరువాత మళ్లీ ఇక్కడకు వచ్చాను.
మాస్టర్స్ కొనసాగిస్తూనే వారాంతాలు, సెలవుల్లో బయటి సినిమాలతో పాటు కొన్ని ప్రాజెక్టులు కూడా చేశాను. నైపుణ్యం సాధించడానికి అవి నాకు ఎంతో తోడ్పడ్డాయి.

మ్యూజిక్ వీడియోలు...

రెండేళ్ల కిందట మాస్టర్స్ పూర్తయింది. కొన్నాళ్లు ఫ్రీలాన్సర్‌గా సినిమాలు, మ్యూజిక్ వీడియోలు, యాడ్స్, షార్ట్ ఫిల్మ్స్‌కు పని చేశాను. క్రమంగా హాలీవుడ్‌లో నా పేరు నిర్మాణ సంస్థలకు పరిచయమైంది. ఒక మంచి డిజైనర్‌గా నాకంటూ ఒక గుర్తింపు లభించింది. కెరీర్ చిన్నదే కానీ, పెద్ద ప్రాజెక్టులు చాలా చేశాను. డిస్నీ స్టార్ తదితర బడా ప్రొడక్షన్ హౌస్‌ల నుంచి తరచూ పిలుపు వస్తుంటుంది. ప్రొడక్షన్ డిజైనర్ అంటే.. సెట్ డిజైనింగ్. మన దగ్గర ఆర్ట్ డైరెక్టర్‌లాగా. కథను అనుసరించి, దర్శకుడి ఊహలకు తగ్గట్టు సెట్ వేయడం మా పని. సెట్ డిజైనింగ్ నుంచి దాన్ని తొలగించే వరకూ అంతా నేనే చూసుకొంటాను.

అడుగడుగునా సవాళ్లే...

ఒక మహిళగా అదీ పరాయి దేశం వచ్చి హాలీవుడ్‌లాంటి ప్రపంచ ప్రసిద్ధ చిత్ర పరిశ్రమలో పని చేయడం అంటేనే అతిపెద్ద విజయంగా నేను భావిస్తాను. అయితే ప్రత్యేకించి ప్రొడక్షన్ డిజైనింగ్‌లో మహిళలు తక్కువ. ఇక్కడ మన దేశం నుంచి వచ్చిన అమ్మాయిలు కూడా ఉన్నారు కానీ, వారిలో ఎక్కువమంది ఉత్తరాదివారే. ఎక్కువగా మగవారే కనిపిస్తుంటారు. వారిని దాటి అవకాశాలు దక్కించుకోవడం నుంచి సెట్ వేసి మెప్పించడం వరకు అడుగడుగునా సవాళ్లే. మొదట దర్శకుడు, కెమెరామ్యాన్ తదితరులతో చర్చించాలి. వారి ఆలోచనలకు తగ్గట్టు సెట్ నిర్మించాలి. ఎప్పటికప్పుడు మన సామర్థ్యానికి పరీక్ష ఎదురవుతుంటుంది. అవసరాన్ని బట్టి ఎంతమంది టీమ్ కావాలనేది నిర్ణయించుకోవాలి. ఒక్కోసారి షార్ట్ ఫిలిమ్‌కు పెద్ద సెట్ వేయాల్సి వస్తుంది. ప్రస్తుతం ఒక హర్రర్ చిత్రానికి చేస్తున్నాం. దానికి ఆర్ట్ డిపార్ట్‌మెంట్‌లో పన్నెండు మంది పని చేస్తున్నాం. డిస్నీ స్టార్ కోసం చేసిన పాప్ స్టార్ టైలర్ స్విఫ్ట్ మ్యూజిక్ వీడియోకు దాదాపు వంద మంది కష్టపడ్డాం. అలాగే ఓ తక్కువ బడ్జెట్ సినిమాకు నేను, మరొకరు మాత్రమే పని చేశాం. వీటికితోడు తరచూ ప్రయాణాలు చేయాల్సివస్తుంది. మొత్తం షూటింగ్ స్పాట్‌లో నేను తప్ప మరే అమ్మాయీ లేని సందర్భాలు చాలా ఉన్నాయి. వర్జీనియాలో ఒక తెలుగు సినిమాకు చేశాను. అక్కడా అదే పరిస్థితి. మన జాగ్రత్తలో మనం ఉంటూ, పని పూర్తి చేసుకోవాలి. మహిళనని తెలిసి ఆఖరి నిమిషంలో కొన్ని ప్రాజెక్టులు చేజారాయి. తిరిగి ఇంటికి వెళ్లిపోదామనుకున్న రోజులూ ఉన్నాయి. మళ్లీ నాకు నేనే సర్దిచెప్పుకొని ముందడుగు వేశాను. ఎక్కడ ఎలా ఉండాలో... పరిశ్రమలో ఎలా నిలదొక్కుకోవాలో... అనుభవమే అన్నీ నేర్పింది.

ప్రముఖులతో కలిసి...

ప్రొడక్షన్ డిజైనర్‌గా టేలర్ స్విఫ్ట్, కైలీ కంట్రాల్, నికోలాస్ జేమ్స్ బార్బర్, నికోల్ రుయిజ్ తదితర ప్రముఖులతో కలిసి పని చేశాను. ఇక ఇప్పుడు నేను లాస్‌ఏంజెలెస్‌లో ఉంటున్నాను. కాలిఫోర్నియా కార్చిచ్చు సంభవించినప్పుడు మమ్మల్ని ఇళ్లు ఖాళీ చేయించారు. మా చుట్టుపక్కల నాలుగైదు ప్రాంతాల్లో మంటలు చెలరేగాయి. ఆ సమయంలో షూటింగ్‌లు బంద్ అయిపోయాయి. చాలా అవస్థలు పడ్డాం. నేను మా స్నేహితురాలి ఇంట్లో ఉన్నాను. పరిస్థితులు అదుపులోకి వచ్చాక మళ్లీ వెనక్కి వచ్చాం. నా లక్ష్యం ఒక్కటే.. మరిన్ని పెద్ద ప్రాజెక్టులు చేయాలి. హాలీవుడ్‌లోనే స్థిరపడాలి. దాని కోసమే శ్రమిస్తున్నా."

• హనుమా

మరిచిపోలేని అనుభూతి

ఆ మధ్య నేను 'తహానన్' అనే ఒక ఫిలిప్పీన్ చిత్రానికి పని చేశాను. ప్రస్తుతం అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. దానికి ఇటీవల అమెరికాలో జరిగిన 'కల్వర్ సిటీ ఫిలిమ్ ఫెస్టివల్‌'లో ఉత్తమ చిత్రం అవార్డు లభించింది. సొంత దేశం వదిలేసి అమెరికాలో స్థిరపడిన ఓ ఫిలిప్పీన్స్ కథ అది. వారి భాషలో 'తహానన్' అంటే అర్థం... 'ఇల్లు'. భావోద్వేగాలతో నిండి చిత్రం. నా కథ కూడా అలాంటిదే కదా. సొంత ఇల్లు, దేశానికి దూరంగా, ఒంటరిగా అమెరికాలో ఉంటున్నా. అందుకే ఆ చిత్ర నిర్మాణంలో పూర్తిగా లీనమయ్యాను. ఫిలిప్పీన్ దేశ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా అమెరికాలో సెట్ వేశాను. ఆ దేశస్తులు కూడా షూటింగ్ తమ ప్రాంతంలోనే తీశారనుకున్నారు. వారందరి నుంచి ప్రశంసలు నాకు ఎంతో మధురమైన అనుభూతినిచ్చాయి. అంతకుముందు చేసిన షార్ట్ ఫిలిమ్.. 'డాస్ బ్రోస్ ఫోర్స్' పలు చిత్రోత్సవాల్లో పన్నెండు నామినేషన్లు దక్కించుకుంది.

గోడల మురికి పోవాలంటే...

గోడలు ప్రకాశవంతంగా ఉన్నప్పుడే ఇల్లు అద్దంలా మెరుస్తుంది. ఇంటి గోడలను పరిశుభ్రంగా ఎలా ఉంచుకోవాలో తెలుసుకుందాం.

- కాలక్రమేణా దుమ్ము, ధూళి పేరుకుని గోడలు కాంతివిహీనంగా కనిపిస్తూ ఉంటాయి. ఇంట్లో బూజు దులిపి ఫ్లోర్ శుభ్రం చేసేటప్పుడు గది గోడలను కూడా పరిశీలించాలి. మైక్రోఫైబర్ వస్త్రం లేదా మెత్తని స్పాంజ్‌తో గోడలను పై నుంచి కింది వరకు సున్నితంగా తుడవాలి. వారానికి ఒకసారి మెత్తని చీపురుతో గోడలను తుడిచినా ప్రయోజనం ఉంటుంది. గోడలను నీళ్లతో తడపకూడదు.
- ఇంట్లో కొన్ని ప్రదేశాల్లో గోడలపై తరచూ వేలిముద్రలు, చేతి గుర్తులు, ఆహార పదార్థాల మరకలు పడుతుంటాయి. ఒక గిన్నెలో గోరువెచ్చని నీళ్లు పోసి ఒక చెంచా డిష్ వాషింగ్ లిక్విడ్ వేసి బాగా కలపాలి. ఇందులో ఒక స్పాంజ్‌ని ముంచి దానితో మరకలపై మెల్లగా రుద్ది తుడవాలి.



- ఇంట్లో తేమ ఎక్కువగా ఉంటే గోడల రంగు మారడమే కాకుండా మూలల్లో బూజు చేరుతుంది. వంటగది, వాష్‌రూమ్ సహా అన్ని గదుల్లో వెంటిలేషన్ సరిగా ఉండేలా చూసుకోవాలి. గాలి లోపలికి వీచేలా ఏర్పాటు చేసుకోవాలి.
- ఎండ నేరుగా ఇంటిలోపలికి వస్తూ ఉంటే దాని వల్ల గోడల రంగు వెలిసిపోయే అవకాశం ఉంటుంది. అధిక వేడిని నివారించేందుకు కిటికీలకు కర్టెన్లు వేయడం మంచిది.
- హాల్, స్టడీ రూమ్, లివింగ్ రూమ్ గోడలపై తరచూ తాకే ప్రదేశాలు మురికిగా మారుతుంటాయి. గోడలకు వేసిన పెయింటింగ్‌లకు సంబంధించి చిన్న డబ్బాలు తెచ్చి పెట్టుకుని అప్పుడప్పుడు టచప్ ఇస్తూ ఉంటే సమస్య పరిష్కారమవుతుంది.
- చిన్న పిల్లలున్న ఇళ్లల్లో గోడలపై కలర్ పెన్సిల్స్, స్కెచ్‌లు, ఇతర రంగుల మరకలు, గీతలు కనిపిస్తూంటాయి. అలా చేయకుండా ఉండాలంటే వైట్ బోర్డును గోడకి ఏర్పాటు చేసి దాన్ని ఉపయోగించేలా నచ్చజెప్పాలి.

పిల్లల్లో జ్ఞాపకశక్తికి...

పిల్లలు చదువులో రాణించాలంటే వారిలో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరగాలి. కొన్ని ఆహార పదార్థాలతో వాటిని పెంచుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. అవేంటంటే...

- ప్రతిరోజూ నీళ్లలో అయిదు బాదం పప్పులను నానబెట్టి, పొట్టు తీసి పిల్లలచేత తినిపించాలి. దీనివల్ల శరీరానికి ఇ విటమిన్, మెగ్నీషియం,



ఆరోగ్యకరమైన కొవ్వులు లభ్యమై మెదడు చురుకుగా పనిచేస్తుంది. జ్ఞాపకశక్తి పెరుగుతుంది

- ఉదయం లేదా సాయంత్రం సమయాల్లో ఒక అరటిపండు తినిపిస్తే పిల్లలకు తక్షణమే శక్తి లభిస్తుంది. నేచురల్ షుగర్స్, పొటాషియం తగు మోతాదులో అంది ఆలోచనా శక్తి కూడా పెరుగుతుంది.
- పిల్లలు బడి నుంచి రాగానే నాలుగు వాల్‌నట్ గింజలు తినిపిస్తే మంచిది. వీటిలో ఉండే మెగ్నీషియం, కాల్షియం, ఐరన్, ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ లాంటివి మెదడు పనితీరుని వేగవంతం చేసి గుర్తుపెట్టుకునే సామర్థ్యాన్ని పెంచుతాయి.
- సాల్మన్, మాకెరెల్, సార్డైన్, ట్యూనా లాంటి చేపలతో తయారు చేసిన వంటకాలు తినిపించాలి. వీటిలోని ఫ్యాటీ యాసిడ్ సమ్మేళనాలు మెదడుని ప్రభావితం చేస్తాయి.
- రోజూ పడుకునేముందు ఒక గ్లాసు పాలు తాగిస్తే మెదడుకి విశాంతి లభిస్తుంది. పాలలోని ప్రోటీన్లు, ఇతర పోషకాలు... మెదడు సరైన క్రమంలో ఎదిగేందుకు తోడ్పడతాయి. స్వచ్ఛమైన నెయ్యిని ఆహారంలో చేర్చడం వల్ల జ్ఞాపకశక్తి వృద్ధి పొందుతుంది.
- కోడిగుడ్లు, పాలకూర, బచ్చలి కూర, దానిమ్మ గింజలు, గుమ్మడి గింజలు, అవిసె గింజలు, యాపిల్, నారింజ, పల్లీలను తరచూ తినిపిస్తూ ఉంటే పిల్లల మెదడు చురుకుగా పనిచేయడమే కాకుండా జ్ఞాపకశక్తి పెరుగుతుంది.

సాహసమే శ్వాసగా

కలలు అందరూ కంటారు... సాహసం, సహనం ఉన్న మీనాక్షి దాస్ లాంటి వారు మాత్రమే వాటిని నెరవేర్చుకోగలుగుతారు. దాదాపు ఏడాది కాలంలో... అరవై నాలుగు దేశాల్ని ఆమె బైక్ మీద చుట్టేశారు అసోం రాష్ట్రానికి చెందిన 41 ఏళ్ల ఈ ఫిట్‌నెస్ ట్రైనర్... ఇప్పుడు మరో యాత్రకు సిద్ధమవుతున్నారు. భీకరమైన వాతావరణాలు, వీసా కష్టాలే కాదు... ఎందరో అపరిచితుల ప్రేమను, ఆతిథ్యాన్ని చవి చూశానంటున్న మీనాక్షి తన ప్రయాణం గురించి చెబుతున్న సంగతులివి.



"బైక్ నడపడం నేర్చుకుంటానంటే ఎప్పుడూ వద్దనే నాన్న... నా ఆసక్తిని గుర్తించి తన కైనెటిక్ హోండా నడపడం నేర్పారు. అప్పుడు నాకు పదహారేళ్లు. మొదటిసారి గువాహటి వీధుల్లో బైక్ నడుపుతున్నప్పుడు... గొప్ప స్వేచ్ఛ లభించిన అనుభూతి. అప్పటి నుంచి బైక్ నా జీవితంతో విడదీయలేని భాగం అయిపోయింది. అస్సామీ మహిళగా... ఈశాన్య భారత దేశమంతా చుట్టేయాలని ఉండేది. చదువు, ఫిట్‌నెస్ ట్రైనర్‌గా వృత్తి బాధ్యతలతో ఆ ఆలోచన క్రమంగా మరుగున పడిపోయింది. పెళ్ళయిన తరువాత, నా భర్త వేదాంతకు కూడా బైక్ ట్రిప్స్ సరదా కావడంతో... ఆయనతో కలిసి అరుణాచల్‌ప్రదేశ్, మేఘాలయ రాష్ట్రాల్లో తిరిగి వచ్చాను. ఆ రోడ్లలో, మలుపుల్లో ప్రయాణం ఆహ్లాదాన్నే కాదు, భయాన్ని కూడా కలిగించింది. ఏదో ఒక రోజు నేనొక్కదాన్నే పర్యటనలు చెయ్యాలనుకొనేదాన్ని. కొన్నేళ్ళపాటు నా జీతంలో దాచుకున్న డబ్బుతో... 2019లో సొంతంగా నా మొదటి బైక్ కొనుక్కున్నాను. కొన్ని నెలల తరువాత... ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ప్రదేశంలో ఉన్న మోటారబుల్ రహదారి 'ఉమ్లింగ్ లా పాస్‌'లో బైక్ మీద ప్రయాణం చేశాను. ఈ మార్గంలో యాత్ర చేసిన రెండవ మహిళను నేనే.

ఆ మూడూ కుదరలేదు...

ఉమ్లింగ్ లా పాస్ అనుభవం నాకు ఉత్సాహాన్నిచ్చింది. కరోనా ఆంక్షలు ముగిసిన తరువాత... 2022లో నేపాల్‌కు సోలో రైడ్ చేశాను. "మగతోడు లేకుండా ఈ తిరుగుళ్లేమిటి?" అని నోళ్ళు నొక్కుకున్నవారు చాలామంది ఉన్నారు. నేను అవేవీ పట్టించుకోలేదు. కొత్త సాహసాలు చేయాలని మనసు ఉవ్విళ్ళూరుతూ ఉండేది. వివిధ దేశాల్ని బైక్‌లో చుట్టియ్యాలనే ఆలోచన వచ్చింది. ఒక మహిళ పేరిట 50 దేశాల్లో... బైక్ మీద పర్యటించిన ప్రపంచ రికార్డు ఉందని విన్నాను. నేను 67 దేశాల్లో ప్రయాణించి, ఆ రికార్డును బద్దలుగొట్టడంతోపాటు, మహిళా సాధికారతను చాటి చెప్పాలని నిశ్చయించుకున్నాను. నా భర్త, కుటుంబం కూడా అంగీకరించారు. 2023 డిసెంబర్ 17న నేపాల్‌కు బైక్‌లో వెళ్ళి, అక్కడి నుంచి ముంబై చేరుకున్నాను. నా బైక్‌ను దుబాయ్ పంపించి, నేను కూడా అక్కడికి విమానంలో వెళ్ళాను. అక్కడి నుంచి నా యాత్ర ప్రారంభమయింది. 2024 డిసెంబర్ 24న... స్వదేశం చేరుకోవడంతో పూర్తయింది. ఈ ప్రయాణంలో... 372 రోజుల్లో... 64 దేశాలు పర్యటించాను. మయన్మార్, ఒమన్, ఇరాక్ దేశాల్లో కూడా ప్రయాణిస్తే... నా 67 దేశాల లక్ష్యం నెరవేరేది. కానీ భద్రతాపరమైన ఆక్షల కారణంగా... ఆ దేశాల్లో ప్రవేశానికి అనుమతి దొరకలేదు.



ఉద్వేగం ఆపుకోలేక ఏడ్చేశాను...

ఇది అంత సులువుగా, సజావుగా సాగిన ప్రయాణం కాదు. మొదటి సమస్య నిధులు. ఈ మొత్తం యాత్రకు రూ.54 లక్షలు అవసరమవుతుందని అంచనా వేశాను. ఇది ఈశాన్య భారతం నుంచే కాదు, మొత్తం మన దేశం నుంచి స్థాపించే ప్రపంచ రికార్డు కాబట్టి, ప్రజలు సాయం చేస్తారని విశ్వసించాను. స్పాన్సర్ల కోసం వెతికాను. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు, క్రీడా, పర్యాటక మంత్రిత్వ శాఖలకు విజ్ఞాపనలు చేసుకున్నాను. అందరూ హామీలు ఇచ్చారు, కానీ ఎవరి నుంచీ ఒక రూపాయైనా అందలేదు. దీనితో మా పొలాన్ని తాకట్టు పెట్టాను. మిగిలిన మొత్తం కోసం క్రౌడ్ ఫండింగ్ కోసం ప్రయత్నించాను. ఒక వ్యక్తి రూ. 10 లక్షలు ఇచ్చి ప్రోత్సహించారు. అలా నా ఖాతాలో రూ.20 లక్షలు చేరాయి. కీలకమైన వీసాలు తీసుకోవడానికి అది సరిపోతుందని భావించి, నా యాత్రను చేపట్టాను. ఇక ప్రయాణాల్లో ఎదురైన ఇబ్బందుల గురించి చెప్పాలంటే... యమన్, ఒమన్ మధ్య ఉద్రిక్తతల కారణంగా దారి మార్చుకోవాల్సి వచ్చింది. నన్ను, నా బైక్‌ను ఫెర్రీలో తీసుకువెళ్ళడానికి సిద్ధపడిన ఒక ఎన్జీవో... ఆఖరి నిమిషంలో వెనక్కి తగ్గడంతో... కతార్‌కు బైక్‌తో సహా విమానంలో వెళ్ళాల్సి వచ్చింది. దానికి అదనంగా దాదాపు మూడు లక్షలు ఖర్చయ్యాయి. ఇక తీవ్రమైన ఇసుక తుపాను కారణంగా... 13 రోజులు జోర్డాన్‌లో చిక్కుకుపోయాను. అక్కడ ప్రియాంక అనే మహిళ నాకు ఆశ్రయం ఇచ్చారు. అక్కడి నుంచి బయలుదేరినప్పుడు... అయిదు వందల డాలర్లు ఒక కవర్లో పెట్టి ఆమె ఇచ్చినప్పుడు.. ఉద్వేగంఆపుకోలేక ఏడ్చేశాను.

కష్టమైనా... ఆపాలనుకోలేదు...

ఇక కొన్ని దేశాల్లో తీవ్ర స్థాయిలో వీసా కష్టాలు కూడా ఎదురయ్యాయి. ఈ యాత్ర కోసం ఎన్నో వదులుకోవాల్సి వచ్చింది. డబ్బు ఆదా చేయడం కోసం నాలుగు నెలలపాటు మధ్యాహ్నం భోజనం చేయలేదు. వర్షాలు, మంచు కారణంగా చిన్న అనారోగ్యాలకు కూడా గురయ్యాను. మా నాన్న అయిదేళ్ళ క్రితం చనిపోయారు. వృద్ధాప్యంలో ఉన్న మా అమ్మకు, బోర్డ్ ఎగ్జామ్స్ రాస్తున్న మా అమ్మాయికి, నా భర్తకు దూరంగా ఉండడం బాధగా అనిపించేది. ప్రయాణాల్లో వారు గుర్తుకు వచ్చినప్పుడు ఏడ్చేదాన్ని. నా వేదనలన్నీ నా ముఖానికి ధరించిన హెల్మెట్‌కు తెలుసు. కానీ ఎంత కష్టమైనా... ఈ ప్రయాణాన్ని ఆపాలని ఎప్పుడూ అనుకోలేదు. ఇది కేవలం నా కోసం కాదు, ఎగతాళికి గురైన ప్రతి ఒంటరి మహిళ కోసం చేసే ప్రయాణం అనుకున్నాను. నేను వెళ్ళాల్సిన దూరాలు ఇంకా చాలా ఉన్నాయి. మిగిలిన మూడు దేశాలతో పాటు.... త్వరలోనే రష్యా, అమెరికాల్లో సాహస యాత్రలకు సిద్ధమవుతున్నాను. ఈసారి నా భర్త కూడా నాతో ప్రయాణంలో భాగస్వామి అవుతారు.



కురచ కుర్తాల్లో కులాసాగా

ఫ్యాషన్

సౌకర్యానికి పర్యాయపదంలా ఉండే కురచ కుర్తాల పోకడ పెరిగింది. ఎండ పెరుగుతోంది కాబట్టి హాయిగొలిపే కురచ కుర్తాలు, వాటిని జత చేయవలసిన ప్యాంట్ల గురించి తెలుసుకుందాం!

- కురచగా ఉండే కుర్తాలను జీన్స్, లెగ్గింగ్స్, జెగ్గింగ్స్‌తో కలిసి ధరించవచ్చు.
- కాటన్, సింథటిక్ వస్త్రాలతో తయారయ్యే ఈ చిట్టిపొట్టి కుర్తాలు ఆకర్షణీయంగా ఉండడంతో పాటు, ఆధునికంగానూ కనిపిస్తాయి
- సౌకర్యానికి పెద్ద పీట వేసే కురచ కుర్తాలను పొడవాటి లెహంగాతో కలిపి ధరించవచ్చు
- సాయంకాలపు వేడుకలు, స్నేహితులతో కాలక్షేపాలకు ఈ కుర్తాలు భలే అనువుగా ఉంటాయి
- హుందాగా కనిపించాలనుకునేవాళ్లు కూడా ఈ కుర్తాలను ఎంచుకోవచ్చు
- లతలు, పువ్వుల డిజైన్లు ఉన్న కుర్తాలు, జీన్స్‌తో కలిపి ధరించి, ఎత్తు మడమల చెప్పులు వేస్తే చూడముచ్చటగా ఉంటుంది
- చికన్ వర్క్ కుర్తాల్లో పొట్టివి కూడా ఉంటాయి. ఇవి కాలేజీ అమ్మాయిలకు చక్కగా నప్పుతాయి. సినిమాలు, షికార్లకు ఈ రకం కుర్తాలు అనువైనవి

అదనపు హంగులు ఇలా...

- మట్టితో తయారయ్యే టెర్రకోటా ఆభరణాలు ఈ తరహా దుస్తులకు నప్పుతాయి.
- భుజానికి వేలాడే బ్యాగ్ చక్కగా నప్పుతుంది.
- చదునైన చెప్పులు, ఎత్తు మడమల చెప్పులూ రెండూ బాగుంటాయి
- భారీ నెక్లెస్‌లూ, కడాలూ లాంటివి ధరించకపోవడమే మేలు.



రూ.324 లక్షల కోట్లు

దేశంలోని టాప్- 500 కంపెనీల మార్కెట్ విలువ ఇది.. ● భారత జీడీపీ కంటే అధికం..

- జాబితాలో మళ్లీ రిలయన్సే టాప్
- టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీకి 2, 3 స్థానాలు
- టాప్ 10 కంపెనీల మొత్తం విలువ సౌదీ అరేబియా జీడీపీ కంటే ఎక్కువ..
- అన్ లిస్టెడ్ కంపెనీల్లో ఎన్ఎస్ఈ నం.1
- హైదరాబాద్ నుంచి 35 సంస్థలకు చోటు
- బర్గండీ ప్రైవేట్ హురున్ జాబితా విడుదల

యూఏఈ, ఇండోనేషియా, స్పెయిన్ దేశాల మొత్తం జీడీపీ కన్నా ఎక్కువే..



ముంబై: గత ఏడాది (2024)కి గాను భారత్‌లోని అత్యంత విలువైన 500 ప్రభుత్వయేతర కంపెనీల జాబితా మంగళవారం విడుదలైంది. యాక్సిస్ బ్యాంక్‌కు చెందిన ప్రైవేట్ బ్యాంకింగ్ వ్యాపార విభాగమైన బర్గండీ ప్రైవేట్, హురున్ ఇండియా సంయుక్తంగా దీన్ని విడుదల చేశాయి. భారత కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ రూ.17.52 లక్షల కోట్లకు పైగా మార్కెట్ విలువతో వరుసగా నాలుగోసారి తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. గత ఏడాదిలో రిలయన్స్ మార్కెట్ సంపద 12 శాతం పెరిగిందని రిపోర్టు వెల్లడించింది. దేశీయ ఐటీ, ప్రైవేట్ బ్యాంకింగ్ దిగ్గజాలైన టీసీఎస్ (రూ.16.10 లక్షల కోట్లు), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (రూ.14.22 లక్షల కోట్లు) వరుసగా 2, 3 స్థానాల్లో నిలిచాయి. ఎయిర్‌టెల్ (రూ.9.74 లక్షల కోట్లు), ఐసీఐసీఐ బ్యాంక్ (రూ.9.30 లక్షల కోట్లు), ఇన్ఫోసిస్(రూ.7.99 లక్షల కోట్లు), ఐటీసీ (రూ.5.80 లక్షల కోట్లు), ఎల్ అండ్ టీ(రూ.5.42 లక్షల కోట్లు), హెచ్‌సీఎల్ టెక్ (రూ.5.18 లక్షల కోట్లు), ఎన్ఎస్ఈ (రూ.4.70 లక్షల కోట్లు) వరుసగా టాప్-10లోని తర్వాత స్థానాలను దక్కించుకున్నాయి. జాబితాలోని 500 కంపెనీ ల మొత్తం మార్కెట్ సంపద గత ఏడాది 40 శాతం పెరిగి 3.8 లక్షల కోట్ల డాలర్లకు (రూ.324 లక్షల కోట్లు) చేరుకుంది. భారత జీడీపీ (3.5 లక్షల కోట్ల డాలర్లు) కంటే అధికమిది. అంతేకాదు, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ), ఇండోనేషియా, స్పెయిన్ దేశాల మొత్తం జీడీపీ కంటే కూడా ఎక్కువే. కాగా, దేశంలోని టాప్-500 కంపెనీలు మొత్తం 84 లక్షల మందికి ఉద్యోగం కల్పిస్తున్నాయి. 2023 లిస్టుతో పోలిస్తే ఉద్యోగుల సంఖ్య 14 లక్షల మేర పెరిగింది. అంటే, ఒక్కో సంస్థలో సగటున 21,000 మంది పనిచేస్తున్నారు. నివేదికలోని మరిన్ని విషయాలు..

ప్రభుత్వ సంస్థల్లో ఎస్‌బీఐ టాప్

దేశంలోని అత్యంత విలువైన ప్రభుత్వ రంగ కంపెనీల విషయానికొస్తే, ఎస్‌బీఐ రూ.7.69 లక్షల కోట్ల మార్కెట్ క్యాపిటలైజేషన్‌తో అగ్రస్థానంలో ఉంది. ఎల్ఐసీ (రూ.5.89 లక్షల కోట్లు), ఎన్‌టీపీసీ (రూ.3.46 లక్షల కోట్లు), ఓఎన్‌జీసీ (రూ.3.20 లక్షల కోట్లు), హిందుస్థాన్ ఏరోనాటిక్స్ (రూ.3.12 లక్షల కోట్లు) వరుసగా టాప్ 5లో ఉన్నాయి. పవర్‌గ్రిడ్, కోల్ ఇండియా, భారత్ ఎలక్ట్రానిక్స్, ఐఆర్ఎఫ్‌సీ, ఐఓసీ వరుసగా టాప్ 10లోని మిగతా స్థానాలను దక్కించుకున్నాయి.

- ఈ జాబితాలోని టాప్-10 కంపెనీల మొత్తం మార్కెట్ విలువ గత ఏడాదిలో రూ.22.7 లక్షల కోట్లు వృద్ధి చెంది రూ.96 లక్షల కోట్లు దాటింది. సౌదీ అరేబియా జీడీపీ కంటే అధికమిది. అంతేకాదు, భారత జీడీపీలో దాదాపు మూడో వంతుకు సమానం. లిస్ట్‌లోని మొత్తం కంపెనీల మార్కెట్‌లో 30 శాతం వాటా వీటిదే.
- టాప్ టెన్ కంపెనీల్లోకెల్లా ఎయిర్‌టెల్ విలువ అత్యధికంగా రూ.4 లక్షల కోట్లు పెరిగింది. పైగా ఎయిర్‌టెల్ టాప్-5లోకి చేరడం ఇదే తొలిసారి.
- అత్యంత విలువైన 10 కంపెనీల్లో తొలిసారిగా చోటు దక్కించుకున్న ఏకైక అన్ లిస్టెడ్ కంపెనీ నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ). అంతేకాదు, దేశంలో ఇదే అత్యంత విలువైన అన్ లిస్టెడ్ కంపెనీ కూడా. గత ఏడాది ఎన్ఎస్ఈ విలువ 201 శాతం వృద్ధి చెంది రూ.4.70 లక్షల కోట్లు దాటింది. ఇప్పటి వరకు అన్‌లిస్టెడ్ కంపెనీల విభాగంలో అగ్రస్థానంలో ఉన్న సీరమ్ ఇన్‌స్టిట్యూట్ (రూ.2.11 లక్షల కోట్లు) ఈసారి రెండో స్థానానికి జారుకుంది. జోహో కార్ప్, జీరోధా, హైదరాబాద్‌కు చెందిన మేఘా ఇంజనీరింగ్ (ఎంఈఐఎల్) వరుసగా 3, 4, 5 స్థానాల్లో ఉన్నాయి. ఈసారి జాబితాలోని సంస్థల మొత్తం మార్కెట్ విలువలో అన్‌లిస్టెడ్ కంపెనీల వాటా 22 శాతంగా ఉంది.
- ఈసారి జాబితాలో అత్యధిక సంపద వృద్ధిని కనబరిచిన కంపెనీల్లో మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ 297 శాతం పెరుగుదలతో నం.1గా నిలిచింది. ఐనాక్స్ విండ్ (273 శాతం), జెప్టో (269 శాతం), డిక్సన్ టెక్నాలజీస్ (241 శాతం), ట్రెంట్ (228 శాతం) ఆ తర్వాత స్థానాలను దక్కించుకున్నాయి. కాగా, అన్ లిస్టెడ్ కంపెనీల్లో క్విక్ కామర్స్ కంపెనీ జెప్టోదే అగ్రస్థానం. ఎన్ఎస్ఈ, ఫిజిక్స్‌వాలా (172%) టాప్-3లో నిలిచాయి.
- ఈసారి లిస్ట్‌లో 82 కంపెనీలకు కొత్తగా స్థానం లభించింది. హైదరాబాద్‌కు చెందిన అపర్ణ కన్‌స్ట్రక్షన్స్ అండ్ ఎస్టేట్, ప్రీమియర్ ఎనర్జీస్‌తో పాటు అదానీ రియల్టీ కూడా ఇందులో ఉన్నాయి.
- కనీసం రూ.9,580 కోట్ల మార్కెట్ విలువ కలిగిన కంపెనీలను ఈసారి పరిగణనలోకి తీసుకున్నట్లు రిపోర్టు వెల్లడించింది. గతసారి పరిగణనలోకి తీసుకున్న విలువ రూ.6,700 కోట్లతో పోలిస్తే 43 శాతం ఎక్కువిది.
- ఈ జాబితాలో కనీసం 3 సంవత్సరాల నుంచి ఏకంగా 192 ఏళ్ల ప్రస్థానం కలిగిన (పీఎన్‌జీ జువెలర్స్) కంపెనీలున్నాయి. 23 కంపెనీల వ్యాపార ప్రస్థానం 100 ఏళ్ల పైమాటే.
- జాబితాలో అత్యధికంగా ముంబై నుంచి 154 కంపెనీలకు చోటు దక్కగా.. బెంగళూరు (44 కంపెనీలు), ఢిల్లీ (37), గురుగ్రామ్(36) ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి. 35 కంపెనీలతో హైదరాబాద్ టాప్-5 నగరంగా నిలిచింది.
- జాబితాలోని 500 కంపెనీల మొత్తం ఆదాయం లక్ష కోట్ల డాలర్లకు చేరగా.. రూ.8 లక్షల లాభాన్ని ఆర్జించాయి. రూ.2.2 లక్షల కోట్ల పన్నులు చెల్లించాయని, కార్పొరేట్ల సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమాల కోసం రూ.11,000 కోట్లు వెచ్చించాయని నివేదిక వెల్లడించింది.



ఎల్ఐసీ స్మార్ట్ పెన్షన్ ప్లాన్

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం ఎల్ఐసీ మంగళవారం సింగిల్ ప్రీమియం స్మార్ట్ పెన్షన్ ప్లాన్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఎల్ఐసీ సీఈఓ, ఎండీ సిద్ధార్థ్ మొహంతితో కలిసి ఆర్థిక సేవల కార్యదర్శి ఎం నాగరాజు ఈ ప్లాన్‌ను విడుదల చేశారు. పాక్షిక లేదా పూర్తి సొమ్ము ఉపసంహరణకు పలు లిక్విడిటీ ఆప్షన్లు కలిగిన ఈ నాన్-పార్, నాన్-లింక్డ్ పాలసీ కనీస కొనుగోలు ధర రూ.లక్ష. ఈ ప్లాన్‌లో వార్షిక, అర్ధ వార్షిక, త్రైమాసిక, నెలవారీ యాన్యుటీ చెల్లింపుల్లో కస్టమరు తమకు నచ్చిన దానిని ఎంచుకోవచ్చని ఎల్ఐసీ తెలిపింది.

బీమా రంగంలో మరిన్ని సంస్కరణలు

ఏడాదిలోగా పాలసీని వెనక్కి తీసుకునే స్వేచ్ఛ !

న్యూఢిల్లీ: బీమా రంగంలో మరిన్ని సంస్కరణలకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, బీమా కంపెనీల ఏజెంట్లు అవసరం ఉన్నా, లేకపోయినా మాయమాటలతో పాలసీదారులకు పాలసీలు అంటగట్టే పద్ధతికి చెక్ పెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం పాలసీదారులు ఎలాంటి జరిమానా లేకుండా పాలసీ నుంచి తప్పుకునే స్వేచ్ఛను (ఫ్రీ లుక్ పీరియడ్) ఏడాదికి పెంచాలని యోచిస్తోంది. ప్రస్తుతం ఇది నెల రోజులు మాత్రమే. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆర్థిక సేవల విభాగం కార్యదర్శి నాగరాజు ఈ విషయం తెలిపారు. గృహ రుణాల కోసం వచ్చే వ్యక్తులు లేదా రుణాల కోసం వచ్చే చిన్నచిన్న వ్యాపార సంస్థలకు ప్రస్తుతం బ్యాంకులు, ఆర్థిక సంస్థలు ఏదోలా ఏదో ఒక బీమా పాలసీని అంటగడుతున్నాయి. ఈ జాడ్యంపై ఎప్పటి నుంచే ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. దీనికి చెక్ పెట్టేందుకు గట్టి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం యోచిస్తోంది.

స్వల్ప నష్టాల్లో మార్కెట్

ముంబై: ఎనిమిది రోజుల వరుస నష్టాలకు తెర దించి సోమవారం స్వల్పంగా లాభపడిన సెన్సెక్స్ అంతలోనే మళ్లీ నష్టాల బాట పట్టింది. విదేశీ నిధుల తరలింపు, ఆశించిన స్థాయిలో లేని కార్పొరేట్ ఆదాయాల నేపథ్యంలో ఇన్వెస్టర్ సెంటిమెంట్ ప్రభావితమైంది. దీంతో మంగళవారం సెన్సెక్స్ 29.47 పాయింట్ల నష్టంతో 75,967.39 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ ఒక దశలో 465.85 పాయింట్లు నష్టపోయి 75,531.01 వరకు దిగజారింది. నిఫ్టీ 14.20 పాయింట్ల నష్టంతో 22,945.30 వద్ద ముగిసింది. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 1.71 శాతం, మిడ్‌క్యాప్ సూచీ 0.19 శాతం నష్టపోయాయి.

రూ.400 లక్షల దిగువకు మార్కెట్ విలువ

వరుస నష్టాల కారణంగా బీఎస్ఈలో లిస్టింగ్ అయిన కంపెనీల మార్కెట్ విలువ రూ.400 లక్షల కోట్ల మైలురాయి కన్నా దిగువకు వచ్చింది. మంగళవారం రూ.2,01,032.50 కోట్ల మేరకు క్షీణించి రూ.3,98,31,067.30 కోట్ల వద్ద స్థిరపడింది. గత ఏడాది ఏప్రిల్‌లో ఇది తొలిసారిగా రూ.400 లక్షల కోట్ల మైలురాయిని దాటింది. గత ఏడాది సెప్టెంబర్ 27వ తేదీన జీవితకాల గరిష్ఠ స్థాయి 85,978.25 పాయింట్లను తాకిన అనంతరం ఇప్పటికి సెన్సెక్స్ 10,010.86 పాయింట్లు నష్టపోయింది.

ఎంఎఫ్ పెట్టుబడి నిబంధనల్లో మార్పులు

మరింత సురక్షితంగా స్టాక్ ట్రేడింగ్ : సెబీ

న్యూఢిల్లీ: మ్యూచువల్ ఫండ్ (ఎంఎఫ్) సంస్థలు కొత్త పథకాల ద్వారా సమీకరించే నిధుల పెట్టుబడి నిబంధనలను మార్కెట్ నియంత్రణ మండలి సెబీ మార్చింది. అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు (ఏఎంసీ) ఇక ఈ పెట్టుబడులను ఫండ్ ఆఫర్ డాక్యుమెంట్‌లో పేర్కొన్న నిబంధనలకు లోబడి నిర్ణీత కాల వ్యవధిలో పూర్తి చేయాలి. లేకపోతే ఎలాంటి ఎగ్జిట్ లోడ్ లేకుండా తమ పెట్టుబడులను వెనక్కి తీసుకునే స్వేచ్ఛ మదుపరులకు ఉంటుందని సెబీ గత ఏడాది డిసెంబరులోనే స్పష్టం చేసింది. ఈ కొత్త నిబంధన ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచే అమల్లోకి రానుంది.

మరింత పక్కాగా స్టాక్ ట్రేడింగ్: టెక్ ఆధారిత స్టాక్ మార్కెటింగ్ ట్రేడింగ్‌నూ మరింత సురక్షితం చేయాలని సెబీ యోచిస్తోంది. ఇందుకోసం మొబైల్ ఆధారిత సిమ్ గుర్తింపు వ్యవస్థతో పాటు యూనిక్ కస్టమర్ కోడ్ (యూసీసీ) మరింత పటిష్ఠం చేయాలని భావిస్తోంది. ఈ ప్రతిపాదిత మార్పులతో మంగళవారం ఒక చర్చాపత్రాన్ని విడుదల చేసింది. మార్చి 11లోగా దీనిపై సంబంధిత వర్గాలు తమ అభిప్రాయాలు, సూచనలు తెలియజేయాలని కోరింది.

భారత్‌లోకి టెస్లా ఎంట్రీ !

- ఢిల్లీ, ముంబైలో షోరూమ్‌ల ఏర్పాటు
- నియామకాలూ షురూ

న్యూఢిల్లీ: అమెరికా విద్యుత్ కార్ల (ఈవీ) దిగ్గజం టెస్లా కార్లు త్వరలోనే భారత రహదారులపై పరుగులు తీయనున్నాయి. కంపెనీ త్వరలోనే దేశంలో రెండు షోరూమ్‌లను తెరిచేందుకు సిద్ధమవుతోంది. ఢిల్లీ, ముంబైల్లో ఈ షోరూమ్‌లను ప్రారంభించనుంది. ముంబై విమానాశ్రయ సమీపంలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్, ఢిల్లీ విమానాశ్రయం సమీపంలోని ఏరోసిటీ ప్రాంతాల్లో టెస్లా ఇందు కోసం ఒక్కోటి 5,000 చదరపు అడుగుల విస్తీర్ణం ఉండే స్థలాన్ని లీజుకు తీసుకుంది. అయితే షోరూమ్‌ల ఏర్పాటు వార్తలపై టెస్లా అధికారికంగా నోరు మెదపడం లేదు. మరోవైపు ఈ రెండు షోరూమ్‌ల నిర్వహణకు అవసరమైన సిబ్బంది నియామకాల కోసం కంపెనీ తన వెబ్‌సైట్‌లో నియామకాల ప్రకటన కూడా ఇచ్చింది.

రిలయన్స్ జియో నుంచి స్మార్ట్ టీవీ ఆపరేటింగ్ సిస్టమ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): స్మార్ట్ టీవీల కోసం జియో టెలీ ఓఎస్ పేరిట ఆపరేటింగ్ సిస్టమ్‌ను ప్రారంభించినట్లు రిలయన్స్ జియో ప్రకటించింది. దేశంలో స్మార్ట్ టీవీలకు తొలి ఆపరేటింగ్ సిస్టమ్ ఇదే. స్మార్ట్ టీవీలకు పెరుగుతున్న డిమాండ్‌ను ఇది తీర్చుతుందని, టీవీ ఓఈఎంలు సరసమైన ధరల్లో ఈ అనుభవాన్ని అందించేందుకు సహాయపడుతుందని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. జియో టెలీ ఓఎస్ అమర్చిన స్మార్ట్ టీవీలు వచ్చే శుక్రవారం నుంచి మార్కెట్లో అందుబాటులోకి వస్తాయి. తొలుత థామ్సన్, కోడక్, బీపీఎల్, జేవీసీ బ్రాండ్ల టీవీలకు ఈ ఓఎస్‌ను ఉపయోగిస్తారు. జియో టెలీ ఎస్ ఇతర ఆపరేటింగ్ సిస్టమ్‌లు గూగుల్ ఆండ్రాయిడ్ టీవీ, వెబ్ ఓఎస్, శామ్‌సంగ్ టైజెన్‌కు పోటీ ఇస్తుంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



19వ తేదీ			
హైదరాబాద్	410	విజయవాడ	410
వరంగల్	412	గోదావరి	410
చిత్తూరు	493	విశాఖపట్నం	435
		దజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	80	విజయవాడ	91
వరంగల్	80	గుంటూరు	90
కరీంనగర్	80	ఒంగోలు	90
మహబూబ్‌నగర్	80	చిత్తూరు	75
కర్నూలు	80	నెల్లూరు	80
విశాఖపట్నం	83	అనంతపురం	80
గోదావరి	91		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	86,950 ▲	79,700 ▲	1,08,000 ▲
విజయవాడ	88,500 ▲	83,500 ▲	98,500 ▲
విశాఖపట్నం	85,670 ▲	78,530 ▲	96,450 ▲
రాజమండ్రి	86,950 ▲	79,700 ▲	99,200 ▲
ప్రొద్దుటూరు	88,200 ▲	81,670 ▲	97,500 ▲
ముంబై	85,690 ▲	78,492 ▲	96,063 ▲


చిత్రజ్యోతి
SINCE 1965

'హిట్-3' లోనూ...





ఈ ఏడాది తనవి మూడు చిత్రాలు రానున్నట్లు అడవి శేష్ అభిమానులకు హామీ ఇచ్చారు. అయితే ప్రస్తుతం 'జి-2', 'డెకాయిట్' చిత్రాలు మాత్రమే చిత్రీకరణలో ఉన్నాయి. అయితే ఆ మూడో సినిమా ఏమై ఉంటుందా? అని అభిమానుల్లో ఆసక్తి మొదలైంది. శైలేష్ కొలను దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'హిట్-3' చిత్రంలో నాని పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్నారు. 'హిట్-2' చిత్రంలోని అడవి శేష్ క్యారెక్టర్‌ని ఇందులోనూ కొనసాగించాలని మేకర్స్ నిర్ణయించినట్లు తెలిసింది. 'హిట్-3' చిత్రం షూటింగ్ సింహ భాగం కశ్మీర్‌లో చిత్రీకరించారు. మిగిలిన భాగాన్ని హైదరాబ్‌లోని ఓ స్టూడియోలో చిత్రీకరిస్తున్నారు. ఇందులో నాని సరసన శ్రీనిధి శెట్టి కథానాయికగా నటిస్తున్నారు. ఈ ఏడాది మేలో ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు చిత్రబృందం సిద్ధమవుతోంది.



సల్మాన్ 'లిటిల్ గిఫ్ట్'

సల్మాన్‌ఖాన్ కథానాయకుడిగా రూపొందుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'సికందర్'. 'టైగర్ 3' తర్వాత సల్మాన్ నుంచి వస్తున్న చిత్రమిది. రష్మిక మందన్న కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి మురుగదాస్ దర్శకుడు. సాజిద్ నడియాడ్‌వాలా నిర్మిస్తున్నారు. మంగళవారం సాజిద్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా 'లిటిల్ గిఫ్ట్' పేరుతో చిత్ర బృందం సల్మాన్ పోస్టర్‌ను మంగళవారం విడుదల చేసింది. ఇందులో సల్మాన్‌ఖాన్ సరికొత్త లుక్‌లో కనిపించారు. తీక్షణమైన చూపులతో గంభీరంగా కనిపించిన సల్మాన్ సరికొత్త మేకోవర్‌తో ఆకట్టుకున్నారు. మంగళవారంతో సల్మాన్‌ఖాన్ తన పాత్రకు సంబంధించిన షూటింగ్‌ను పూర్తి చేశారు. ఇక చిత్రబృందం ప్రచార కార్యక్రమాలపై దృష్టి పెట్టింది. ఈ నెల 27న టీజర్‌ను, మార్చి తొలి వారంలో ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు మేకర్స్ తెలిపారు. రంజాన్ పర్వదినాన 'సికందర్' చిత్రాన్ని విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్నారు.



ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాకు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కుటుంబసమేతంగా వెళ్లారు. సతీమణి అనా కొణిదెల, తనయుడు అకిరానందన్‌తో పుణ్య స్నానం ఆచరించారు. పవిత్ర సంగమం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. వారి వెంట సినీ దర్శకుడు త్రివిక్రమ్ ఉన్నారు.

నిండుగా చల్లావు రంగులే



'క'తో విజయం అందుకున్నారు కిరణ్ అబ్బవరం. ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'దిల్ రుబా'. రుక్సర్ ధిల్లాన్ కథానాయిక. విశ్వ కరుణ్ దర్శకత్వంలో రవి, జోజో జోస్, రాకేశ్ రెడ్డి, సారెగమ నిర్మిస్తున్నారు. హోలీ సందర్భంగా మార్చి 14న సినిమాను విడుదల చేస్తున్నారు. తాజాగా, ఈ చిత్రం నుంచి సెకండ్ సింగిల్‌ను విడుదల చేశారు మేకర్స్. 'హే జింగిలి.. హే జింగిలి నా జిందగీ నిండుగా చల్లావు రంగులే' అంటూ సాగే ఈ పాటను భాస్కరభట్ల రచించగా, సామ్ సీఎస్ ఆలపించడంతో పాటు సంగీతం అందించారు. ఈ సందర్భంగా కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ "ఇటువంటి మంచి సినిమా చేసినందుకు ఆనందంతో పాటు గర్వంగా ఉంది. అద్భుతమైన ప్రేమకథతో తెరకెక్కిన ఈ చిత్రం అందరినీ ఆకట్టుకుంటుంది. ఇందులో నా పాత్ర కొత్తగా ఉంటుంది" అని అన్నారు. సినిమా తప్పకుండా అందరికీ నచ్చుతుంది అని దర్శకుడు విశ్వ కరుణ్ చెప్పారు. "ఈ సినిమాలోని ప్రేమకథ చాలా కాలం గుర్తుండిపోతుంది" అని చిత్రనిర్మాత రవి తెలిపారు.

డెవిల్ కథేంటి?



దురాశ మనిషిని ఎలా పతనం చేస్తుందనేది ప్రధానాంశంగా కుటుంబ నేపథ్యంలో రూపుదిద్దుకున్న చిత్రం 'ది డెవిల్స్ చైర్'. అదిరే అభి, స్వాతి మందల్ హీరో హీరోయిన్లు. గంగ సప్త శిఖర దర్శకత్వంలో కేకే చైతన్య, వెంకట్ దుగ్గిరెడ్డి, చంద్ర నిర్మించారు. ఈ నెల 21న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించింది. అదిరే అభి మాట్లాడుతూ 'దురాశ వల్ల మనుషులు ఏమేం కోల్పోతున్నారనే అంశం చుట్టూ అల్లుకున్న కథతో ఈ చిత్రాన్ని తీశాం. కాన్సెప్ట్‌తో పాటు మంచి సందేశం ఉన్న చిత్రమిది. పతాక సన్నివేశాలు ప్రేక్షకులను ఉత్కంఠకు గురి చేస్తాయి' అన్నారు. మంచి వినోదం పంచే చిత్రమిదని దర్శకుడు చెప్పారు. పల్లెటూరి నేపథ్యంలో వస్తున్న పూర్తి వినోదాత్మక చిత్రమిదని నిర్మాతలు పేర్కొన్నారు.



దీక్ష, పట్టుదల ఉంటే..

కిరణ్, అలేఖ్యారెడ్డి జంటగా రూపుదిద్దుకున్న లవ్, యాక్షన్ ఎంటర్‌టైనర్ 'దీక్ష' విడుదలకు సిద్ధమైంది. స్వీయ దర్శకత్వంలో ప్రతాని రామకృష్ణ గౌడ్ ఈ చిత్రాన్ని నిర్మించారు. 'ఒక వ్యక్తి దీక్ష, పట్టుదలతో పని చేస్తే ఏదైనా సాధించవచ్చు అనే అంశంతో ఈ సినిమా రూపుదిద్దుకుంది. లవ్, యాక్షన్ అంశాలతో పాటు మైథలాజికల్ పాయింట్ జోడించాం. ఇందులో హీరో కిరణ్ భీముడి పాత్రలో అద్భుతంగా నటించారు. ఇప్పటి వరకూ మా బేనర్‌లో 40 చిత్రాలు నిర్మించాను. వాటికి మించి 'దీక్ష' సినిమా ఉంటుంది. త్వరలోనే ఈ చిత్రాన్ని విడుదల చేస్తాం' అని చెప్పారు.

స్పోర్ట్స్

వరంగల్ ● బుధవారం 19 ఫిబ్రవరి 2025

చాంపియన్స్ ట్రోఫీ షెడ్యూల్

తేదీ	ప్రత్యర్థులు	వేదిక
ఫిబ్రవరి 19	పాకిస్థాన్ x న్యూజిలాండ్	కరాచీ
ఫిబ్రవరి 20	భారత్ x బంగ్లాదేశ్	దుబాయ్
ఫిబ్రవరి 21	అఫ్ఘానిస్థాన్ x దక్షిణాఫ్రికా	కరాచీ
ఫిబ్రవరి 22	ఆస్ట్రేలియా x ఇంగ్లండ్	లాహోర్
ఫిబ్రవరి 23	భారత్ x పాకిస్థాన్	దుబాయ్
ఫిబ్రవరి 24	బంగ్లాదేశ్ x న్యూజిలాండ్	రావల్పిండి
ఫిబ్రవరి 25	ఆస్ట్రేలియా x దక్షిణాఫ్రికా	రావల్పిండి
ఫిబ్రవరి 26	అఫ్ఘానిస్థాన్ x ఇంగ్లండ్	లాహోర్
ఫిబ్రవరి 27	పాకిస్థాన్ x బంగ్లాదేశ్	రావల్పిండి
ఫిబ్రవరి 28	అఫ్ఘానిస్థాన్ x ఆస్ట్రేలియా	లాహోర్
మార్చి 1	దక్షిణాఫ్రికా x ఇంగ్లండ్	కరాచీ
మార్చి 2	భారత్ x న్యూజిలాండ్	దుబాయ్
మార్చి 4	సెమీఫైనల్-1	దుబాయ్
మార్చి 5	సెమీఫైనల్-2	లాహోర్
మార్చి 9	ఫైనల్	లాహోర్/దుబాయ్

(మ్యాచ్‌లన్నీ మ.2.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో)

చాంపియన్స్ మహా సమరం

వరల్డ్‌కప్‌నకు ఏమాత్రం తీసిపోనిది.. ఇంకా చెప్పాలంటే అంతకు మించినదే.. ఎందుకంటే ఈ టోర్నీలో పాల్గొనేది చిన్నాచితకా జట్లేమీ కాదు. చివరి ప్రపంచకప్‌లో తొలి ఎనిమిది స్థానాల్లో నిలిచిన టీమ్స్. ఇప్పుడు తాజాగా ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ (సీటీ) కోసం సమర భేరి మోగించబోతున్నాయి. టీ20 క్రికెట్ హోరులో టెస్టులతో పాటు వన్డేలకు కూడా ఆదరణ తగ్గుతున్న వేళ.. తిరిగి 50 ఓవర్ల మజాను అందించేందుకు ఎనిమిదేళ్ల బ్రేక్ తర్వాత ఈ మెగా టోర్నీ సిద్ధమైంది. వాస్తవానికి వరల్డ్‌కప్ విజేత కావడం కన్నా ఈ ట్రోఫీని గెల్చుకోవడమే కష్టమని భావిస్తుంటారు. మరి.. కఠిన సవాల్‌ను అధిగమించి భారత్ మూడో టైటిల్ సాధిస్తుందా? లేదా? అన్నది చూడాలి.

నేటి నుంచే ఐసీసీ మెగా వన్డే టోర్నీ





నేడు పాక్ X కివీస్ మధ్య ఆరంభ పోరు
రేపు భారత్ X బంగ్లా మ్యాచ్ మ.2.30 నుంచి

కరాచీ: దాదాపు ఇరవై రోజులపాటు ఇక క్రికెట్ అభిమానులకు పండగే.. బుధవారం నుంచి ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీకి తెర లేవనుండగా, ఈ భారీ ఈవెంట్‌కు పాకిస్థాన్ ఆతిథ్యమివ్వబోతోంది. 1996 వన్డే వరల్డ్‌కప్ తర్వాత ఆ దేశంలో జరుగబోతున్న అతిపెద్ద క్రీడా టోర్నీ ఇదే కావడం విశేషం. మార్చి 9న ఫైనల్ జరుగుతుంది. నువ్వా.. నేనా అనే రీతిలో మ్యాచ్‌లు సాగే ఈ చాంపియన్స్ ట్రోఫీ కోసం.. భారత్, పాకిస్థాన్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, బంగ్లాదేశ్, అఫ్ఘానిస్థాన్ జట్లు పోటీ పడబోతున్నాయి. దీంట్లో భాగంగా టీమిండియా తమ మ్యాచ్‌లను దుబాయ్‌లో ఆడబోతోంది. భద్రతా కారణాల రీత్యా పాక్‌లో పర్యటించేందుకు భారత ప్రభుత్వం అంగీకరించలేదు. దీంతో టోర్నీని హైబ్రిడ్ పద్ధతిన పాక్, దుబాయ్‌లో నిర్వహిస్తున్నారు. ఇక కరాచీలో జరిగే ఆరంభ మ్యాచ్‌లో ఆతిథ్య పాక్ జట్టు న్యూజిలాండ్‌తో ఆడనుంది. 2017లో చివరిసారి జరిగిన సీటీలో పాక్ జట్టే భారత్‌ను ఓడించి టైటిల్ గెలిచింది. ఆ తర్వాత ఎనిమిదేళ్ల తర్వాత తిరిగి టోర్నీని నిర్వహిస్తుండడం గమనార్హం. శ్రీలంక మొదటిసారిగా చాంపియన్స్ ట్రోఫీకి అర్హత సాధించలేకపోయింది. అలాగే పాక్‌లోని అస్థిర పరిస్థితులు, ఆర్థిక సంక్షోభాల నేపథ్యంలో చాంపియన్స్ ట్రోఫీని సమర్థవంతంగా నిర్వహించి అందరి మన్ననలు పొందాలనే భావనతో ఆ దేశ బోర్డు ఉంది. ప్రస్తుతం భారత్ మినహా అన్ని జట్లు కూడా పాక్‌లో పర్యటించి సిరీస్‌లు ఆడుతున్నాయి.

ఈ జట్ల నుంచి సవాలే..

ఇంగ్లండ్‌తో మూడు వన్డేల సిరీస్ క్లీన్‌స్వీప్‌తో భారత్ ఎనలేని ఆత్మవిశ్వాసంతో ఉంది. దూకుడైన ఆటతీరుతో పాటు పటిష్ఠ లైనప్ కూడా జట్టును ఫేవరెట్ స్థానంలో ఉంచుతోంది. అయితే 2023 వరల్డ్‌కప్ తర్వాత టీమిండియా కేవలం 9 వన్డేలు మాత్రమే ఆడడం గమనార్హం. మిగతా అన్ని జట్లూ కనీసం 11 మ్యాచ్‌లాడడం గమనార్హం. అటు టోర్నీలో భారత్‌కు గట్టి పోటీ ఎదురు కానుంది. తమ గ్రూప్‌లో ఉన్న పాకిస్థాన్, బంగ్లాదేశ్, న్యూజిలాండ్ అంత తేలికైన జట్లేమీ కాదు. ఆస్ట్రేలియా జట్టులో కీలక బౌలర్లు లేకపోయినా పటిష్ఠ బ్యాటింగ్ లైనప్‌తో అత్యంత ప్రమాదకర జట్టుగా చెప్పవచ్చు. పేసర్లు బౌల్ట్, సౌథీ రిటైర్మెంట్‌తో కివీస్ ఎక్కువగా కేన్ విలియమ్సన్‌పై ఆధారపడి ఉంది. ఇటీవలే పాక్‌లో ఈ జట్టు ట్రైసిరీస్‌ను గెలిచిన జోష్‌లో ఉంది. బవుమా నేతృత్వంలోని సౌతాఫ్రికా ఇటీవలి కాలంలో చెలరేగుతోంది. అయితే ఒత్తిడిని అధిగమిస్తేనే సఫారీలకు టైటిల్ అవకాశముంది. ఆతిథ్య పాక్ పేస్ బలం గురించి అందరికీ తెలిసిందే. భారత్ గండాన్ని దాటగలిగితే ఈ జట్టు దూసుకెళ్లడం ఖాయం. అలాగే రషీద్, గుర్బాజ్‌లతో కూడిన అఫ్ఘానిస్థాన్ ఇప్పుడు పసికూన జట్టేమీ కాదు. బంగ్లాదేశ్ కాస్త బలహీనంగా కనిపిస్తున్నా భారత్‌పై ఆ జట్టు రెట్టించిన ఉత్సాహంతో ఆడుతుంటుంది.

రో-కోలకు చివరి చాన్స్

హోరాహోరీ మ్యాచ్‌ల సంగతి పక్కనబెడితే ఈ టోర్నీ పలువురు ఆటగాళ్లకు చివరి అవకాశంగా భావిస్తున్నారు. ఈ జాబితాలో భారత కెప్టెన్ రోహిత్, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ముందుంటారు. వన్డే కెరీర్‌లో ఈ జోడీ చివరి దశలో ఉన్నారనేది వాస్తవం. ఈ టోర్నీ తర్వాత కూడా ఇద్దరూ వన్డే జట్టులో కొనసాగుతారా? అంటే చెప్పడం కష్టమే. అలాగే సీటీలో ప్రదర్శన ఆధారంగానే అటు టెస్టు జట్టులోనూ వీరి స్థానంపై ఓ అంచనాకు రావచ్చనేది విశ్లేషకుల భావన. ఇటీవలి కాలంలో రోహిత్, విరాట్ ఫామ్ కోల్పోయి తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నారు. కానీ ఇంగ్లండ్‌తో సిరీస్ హిట్‌మ్యాన్ శతకం, విరాట్ అర్ధసెంచరీ వారి ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. ఈ కీలక సమరంలో వారి బ్యాట్ల నుంచి అద్భుత ఇన్నింగ్స్ నమోదు కావాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు.

ఇదీ టోర్నీ చరిత్ర

చాంపియన్స్ ట్రోఫీని మొదటిసారి 1998లో నిర్వహించగా, అప్పట్లో దీన్ని ఐసీసీ నాకౌట్ ట్రోఫీగా పిలిచేవారు. కానీ 2002 నుంచి ప్రస్తుత పేరుతో వ్యవహరిస్తున్నారు. అలాగే 2009 నుంచి నాలుగేళ్లకోసారి జరపాలని నిర్ణయించారు. మరోవైపు ఫార్మాట్‌లో ఒకే వరల్డ్‌కప్ ఉండాలనే ఉద్దేశంతో 2017 తర్వాత చాంపియన్స్ ట్రోఫీని నిర్వహించకూడదని ఐసీసీ నిర్ణయం తీసుకుంది. అయితే 2024-2031 ఐసీసీ భవిష్యత్ టూర్స్ ప్రోగ్రామ్‌లో భాగంగా సీటీని పునరుద్ధరించారు. ఫలితంగా 2025 నుంచి తిరిగి చాంపియన్స్ ట్రోఫీ అభిమానులను అలరించబోతోంది.

డబ్బే డబ్బు..

ఈసారి విజేతగా నిలిచే జట్టుకు రూ. 19.4 కోట్లు, రన్నరప్‌నకు రూ. 9.7 కోట్ల ప్రైజ్‌మనీ లభిస్తుంది. అలాగే నలుగురు సెమీఫైనలిస్టులకు రూ. 4.9 కోట్లు అందుతుంది. మొత్తం ప్రైజ్‌మనీని చూస్తే..2017తో పోలిస్తే ఇది దాదాపు 53 శాతం అధికం.

ఫార్మాట్ ఇదీ..

సీటీలో పాల్గొంటున్న ఎనిమిది జట్లను రెండు గ్రూపులుగా విభజించారు. గ్రూప్ 'ఏ'లో భారత్, పాక్, బంగ్లాదేశ్, కివీస్ ఉండగా.. గ్రూప్ 'బీ'లో ఆసీస్, ఇంగ్లండ్, అఫ్ఘాన్, దక్షిణాఫ్రికా జట్లున్నాయి. ప్రతీ గ్రూపులో ఉండే నాలుగు జట్లు తమ ప్రత్యర్థితో ఒక్కోసారి తలపడతాయి. రెండు గ్రూపుల్లో టాప్-2లో నిలిచిన జట్లు సెమీఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. ఆ తర్వాత టైటిల్ పోరు ఉంటుంది. షెడ్యూల్ ప్రకారం ఫైనల్ మ్యాచ్ లాహోర్‌లో జరుగుతుంది. ఒకవేళ భారత్ తుది పోరుకు అర్హత సాధిస్తే వేదిక దుబాయ్‌కు మారుతుంది.

టై అయితే ఎలా..?

మ్యాచ్‌లో నెగ్గిన జట్టుకు రెండు పాయింట్లు, ఫలితం తేలకుంటే రెండు జట్లకు చెరో పాయింటు లభిస్తాయి. ప్రతి గ్రూపులో టాప్‌లో నిలిచిన జట్టు సెమీస్‌లో అవతలి గ్రూపులో రెండోస్థానం జట్టుతో ఆడుతుంది. సెమీఫైనల్ మ్యాచ్‌లు టై అయితే ఫలితాన్ని సూపర్ ఓవర్ ద్వారా నిర్ణయిస్తారు. ఒక వేళ రిజర్వ్‌డే రోజు కూడా మ్యాచ్ ఫలితం రాకపోతే తమ గ్రూపులో టాపర్‌గా నిలిచిన జట్టు ఫైనల్‌కు చేరుతుంది. ఇక ఫైనల్ మ్యాచ్ టై అయితే...అప్పుడూ సూపర్ ఓవర్ ద్వారానే విజేతను నిర్ణయిస్తారు. ఒకవేళ రిజర్వ్ డే నాడు కూడా మ్యాచ్ సాధ్యపడకపోతే ఇరుజట్లనూ సంయుక్త విజేతలుగా ప్రకటిస్తారు.

కుటుంబ సభ్యులకు ఓకే కానీ..

క్రికెటర్ల కుటుంబ సభ్యుల విషయంలో బీసీసీఐ వారికి కాస్త ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు వారికి అనుమతి ఇవ్వకపోగా.. తాజాగా టోర్నీలో ఏదైనా ఒక మ్యాచ్‌కు మాత్రం ఫ్యామిలీని ఆహ్వానించాలని నిర్ణయం తీసుకుందట. ఈమేరకు ఇంగ్లిష్ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఈ విషయంలో ప్లేయర్లు చర్చించుకుని బోర్డుకు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. ఆ తర్వాత అందుకు తగిన ఏర్పాట్లు బోర్డు చేస్తుందని తెలిసింది. బహుశా పాక్‌తో జరిగే మ్యాచ్‌కు క్రికెటర్లు తమ కుటుంబసభ్యులను రప్పిస్తారేమో..

భారత ఆటగాళ్లకు అద్భుత ఆదరణ

చాంపియన్స్ ట్రోఫీ కోసం దుబాయ్‌లో అడుగుపెట్టినప్పటి నుంచీ భారత ఆటగాళ్లకు విశేష ఆదరణ లభిస్తోంది. నెట్ ప్రాక్టీస్ సమయంలోనూ వారిని వదలడం లేదు. ప్లేయర్లను దగ్గరగా తిలకించేందుకు పక్క దేశాల నుంచి మరీ వస్తున్నారు. ఐసీసీ క్రికెట్ అకాడమీకి సోమవారం 200మందికి పైగా ఫ్యాన్స్ రావడం విశేషం. వీరంతా తమ మొబైల్స్‌లో క్రికెటర్ల ఫొటోలను, వీడియోలను చిత్రీకరిస్తూ బిజీగా కనిపించారు. క్రికెటర్లను ఇంత దగ్గర నుంచి చూడడం సంతోషాన్నిచ్చిందని ఒమన్‌కు చెందిన మహిళాభిమాని తెలిపింది. అలాగే తాను శ్రేయాస్, విరాట్‌ల ఆటోగ్రాఫ్‌లను కూడా తీసుకున్నానని చెబుతూ సంబరపడింది.

36 కెమెరాలతో..



చాంపియన్స్ ట్రోఫీని వీక్షించే అభిమానులకు సరికొత్త అనుభూతినిచ్చేందుకు ఐసీసీ సిద్ధమవుతోంది. దీనిలో భాగంగా స్టేడియాల్లో 36 కెమెరాలతో మ్యాచ్‌లను అద్భుతంగా చిత్రీకరించబోతున్నారు. ఇందులో 360 డిగ్రీ కోణంలో మైదానంలో జరిగే ఆసక్తికర విశేషాలను అందించేందుకు సిద్ధమవుతున్నారు. అలాగే డ్రోన్ కెమెరాల ద్వారా స్టేడియాలు, చుట్టు పక్కల పరిసరాల విహంగ వీక్షణాన్ని కూడా అభిమానులు ఆస్వాదించవచ్చు. రోవింగ్ బగ్గీ కామ్, స్పైడర్‌కామ్‌ల ద్వారా ఏరియల్ కవరేజీలో మరింత నాణ్యత కనిపించనుంది.



కామెంటరీ ప్యానెల్‌లో మనోళ్లు నలుగురు

చాంపియన్స్ ట్రోఫీ కోసం 22 మందితో కూడిన ఇంగ్లిష్ కామెంట్రీ ప్యానెల్‌ను ఐసీసీ వెల్లడించింది. ఇందులో భారత్‌కు చెందిన సునీల్ గవాస్కర్, రవిశాస్త్రి, దినేశ్ కార్తీక్, హర్షా భోగ్లేలకు చోటు దక్కింది.

వీళ్లే విజేతలు

- **1998:** దక్షిణాఫ్రికా
- **2000:** న్యూజిలాండ్
- **2002:** భారత్/శ్రీలంక
- **2004:** వెస్టిండీస్
- **2006:** ఆస్ట్రేలియా
- **2009:** ఆస్ట్రేలియా
- **2013:** భారత్
- **2017:** పాకిస్థాన్

స్వదేశానికి మోర్కెల్



చాంపియన్స్ ట్రోఫీ ఆరంభానికి ముందు భారత జట్టు బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ అర్ధంతరంగా స్వదేశం దక్షిణాఫ్రికాకు బయలుదేరాడు. అతడి తండ్రి కన్నుమూయడంతో హుటాహుటిన పయనమైనట్టు సమాచారం. సోమవారం జరిగిన ప్రాక్టీస్ సెషన్‌కు అతను హాజరుకాలేదు. అలాగే తిరిగి ఎప్పుడు జట్టుతో కలుస్తాడనే విషయంలో స్పష్టత లేదు.

కష్టాల్లో ముంబై

- రెఖాడే..ఒకే ఓవర్లో 3 వికెట్లు
- తొలి ఇన్నింగ్స్ 188/7

రంజీ సెమీస్


పార్థ్ రెఖాడే (3/16)

నాగ్‌పూర్: స్పిన్నర్ పార్థ్ రెఖాడే (3/16) ఒకే ఓవర్‌లో మూడు ప్రధాన వికెట్లు పడగొట్టడంతో.. డిఫెండింగ్ చాంప్ ముంబైతో రంజీ సెమీస్ మ్యాచ్‌లో విదర్భ పైచేయి సాధించింది. ఆటకు రెండో రోజు ఓవర్‌నైట్ స్కోరు 308/5తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన విదర్భ 383 పరుగులకు ఆలౌటైంది. యశ్ రాథోడ్ (54) హాఫ్ సెంచరీ చేశాడు. శివం దూబే ఐదు వికెట్లు పడగొట్టాడు. అనంతరం ముంబై తొలి ఇన్నింగ్స్‌లో 188/7 స్కోరు చేసింది. మంగళవారం ఆట ముగిసే సమయానికి ఓపెనర్ ఆకాష్ ఆనంద్ (67), తనుష్ కోటియన్ (5) క్రీజులో ఉన్నారు. శార్దూల్ ఠాకూర్ (37), సిద్ధేశ్ లాడ్ (35) ఫర్వాలేదనిపించారు. 41వ ఓవర్ తొలి బంతికి అజింక్యా రహానె (18)ను బౌల్డ్ చేసిన రెఖాడే.. మూడో బంతికి సూర్యకుమార్ యాదవ్ (0), ఐదో బంతికి శివం దూబే (0)లను పెవిలియన్ చేర్చడంతో.. ముంబై ఒక్కసారిగా కష్టాల్లో పడింది. ఠాకూర్ 2 వికెట్లు దక్కించుకొన్నాడు.

కేరళ 418/7


అజరుద్దీన్ (149 బ్యాటింగ్)

అజరుద్దీన్ (149 బ్యాటింగ్) అజేయ శతకంతో.. గుజరాత్‌తో మ్యాచ్‌లో కేరళ భారీ స్కోరు చేసింది. ఆటకు రెండో రోజు ఓవర్‌నైట్ 206/4తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన కేరళ 7 వికెట్లకు 418 పరుగులు చేసింది. నిన్నటి స్కోరు వద్ద సచిన్ బేబీ (69) అవుట్ కాగా.. సల్మాన్ నిజార్ (52) అర్ధ శతకం సాధించాడు. నాగ్వసవల్లా 3 వికెట్లు పడగొట్టాడు.

వన్డేల్లో యూఎస్ఏ ప్రపంచ రికార్డు

అల్ అమరత్ (మస్కట్): వన్డే క్రికెట్ చరిత్రలో అత్యల్ప స్కోరును కాపాడుకున్న జట్టుగా యూఎస్ఏ రికార్డు నెలకొల్పింది. మంగళవారం ఒమన్‌తో జరిగిన వరల్డ్‌కప్ లీగ్2 మ్యాచ్‌లో యూఎస్ 35.3 ఓవర్లలో 122 పరుగులకు ఆలౌటైంది. మిలింద్ (47 నాటౌట్) మాత్రమే రాణించాడు. ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన ఒమన్ 25.3 ఓవర్లలో కేవలం 65 పరుగులకే కుప్పకూలడంతో 57 పరుగుల తేడాతో యూఎస్ నెగ్గింది. స్పిన్నర్లు కెనిగె (5/11), యాసిర్ (2/10), మిలింద్ (2/17) దెబ్బతీశారు. తద్వారా వన్డే క్రికెట్ చరిత్రలో పూర్తి ఓవర్లపాటు జరిగిన మ్యాచ్‌ల్లో అత్యల్ప స్కోరును కాపాడుకున్న జట్టుగా యూఎస్ సంబరాల్లో మునిగింది. ఇప్పటివరకు ఈ రికార్డు భారత్ పేరిట ఉండేది. 1985లో పాక్‌పై భారత్ 125 పరుగులు చేయగా, ప్రత్యర్థిని 87 పరుగులకే పరిమితం చేసింది.

అదరగొట్టిన బ్రంట్

- ముంబై బోణీ ● 5 వికెట్లతో గుజరాత్ చిత్తు



డబ్ల్యూపీఎల్‌లో నేడు
ఢిల్లీ x యూపీ
రాత్రి 7.30 నుంచి

వడోదర: నటాలి సివర్ బ్రంట్ (57, 2/26) ఆల్‌రౌండ్ షోతో.. మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో ముంబై ఇండియన్స్ బోణీ చేసింది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో ముంబై 5 వికెట్లతో గుజరాత్ జెయింట్స్‌ను ఓడించింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ 20 ఓవర్లలో 120 పరుగులకు కుప్పకూలింది. హర్లీన్ డియోల్ (32), కశ్వీ గౌతమ్ (20) టాప్ స్కోరర్లు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ హేలీ మాథ్యూస్ 3 వికెట్లు పడగొట్టింది. ఛేదనలో ముంబై 16.1 ఓవర్లలో 122/5 స్కోరు చేసి గెలిచింది. ప్రియా మిశ్రా, కశ్వీ చెరో 2 వికెట్లు తీశారు.

సునాయాసంగా..: బ్రంట్ అర్ధ శతకంతో అదరగొట్టడంతో.. ముంబై అలవోకగా నెగ్గింది. స్వల్ప లక్ష్య ఛేదనను ముంబై ఓపెనర్లు హేలీ (17), యాస్తిక భాటియా (8) ధాటిగా ఆరంభించారు. మూడు ఫోర్లతో దూకుడుగా ఆడే ప్రయత్నం చేస్తున్న హేలీని తనూజ క్యాచవుట్ చేసింది. వన్‌డౌన్‌లో వచ్చిన బ్రంట్ కూడా బౌండ్రీలతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించడంతో.. పవర్‌ప్లే ముగిసే సరికి ముంబై 37/1తో నిలిచింది. అయితే, భాటియాను ప్రియ క్యాచవుట్ చేయడంతో.. రెండో వికెట్‌కు 24 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. బౌండ్రీతో ఖాతా తెరిచిన కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (4)ను కశ్వీ పెవిలియన్ చేర్చింది. ఈ దశలో గుజరాత్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో.. ముంబై స్కోరు కొంత నెమ్మదించింది. అయితే, 13వ ఓవర్‌లో ప్రియ బౌలింగ్‌లో అమేలియా కెర్ (19) 6,4తో వేగం పెంచింది. మరోవైపు బ్రంట్ రెండు బౌండ్రీలతో ఫిఫ్టీ పూర్తి చేసుకోగా.. టీమ్ స్కోరు సెంచరీ దాటింది. కానీ, కెర్‌ను కశ్వీ ఎల్బీ చేయడంతో.. నాలుగో వికెట్‌కు 45 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. విజయానికి 7 పరుగులు కావాల్సిన సమయంలో బ్రంట్‌ను ప్రియ బౌల్డ్ చేసింది. సజన (10 నాటౌట్), కమలిని (4 నాటౌట్) మరో 23 బంతులు మిగిలుండగానే జట్టును గెలిపించారు.

పెవిలియన్‌కు క్యూ..: ముంబై బౌలర్ల దెబ్బకు.. గుజరాత్ బ్యాటింగ్ పేకమేడను తలపించింది. పవర్ ప్లేలో ఓపెనర్లు బెత్ మూనీ (1), లారా వోల్వార్డ్ (4), హేమలత (9)తోపాటు కెప్టెన్ ఆష్లే గార్డ్‌నర్ (10)ను కోల్పోయిన గుజరాత్ 28/4తో పీకల్లోతు కష్టాల్లో పడింది. అయితే, కశ్వీతో కలసి ఆరో వికెట్‌కు, తనూజ (13)తో కలసి ఎనిమిదో వికెట్‌కు 24 పరుగుల చొప్పున భాగస్వామ్యాలు నెలకొల్పిన డియోల్.. జట్టు స్కోరును సెంచరీ మార్క్ దాటించింది.

స్కోరుబోర్డు

గుజరాత్: బెత్ మూనీ (సి) సంస్కృతి (బి) బ్రంట్ 1, లారా (సి) సజన (బి) ఇస్మాయిల్ 4, హేమలత (సి) కెర్ (బి) మాథ్యూస్ 9, గార్డ్‌నర్ (సి) సజన (బి) బ్రంట్ 10, హర్లీన్ (సి) మాథ్యూస్ (బి) అమన్‌జోత్ 32, డోటిన్ (స్టంప్డ్) భాటియా (బి) కెర్ 7, కశ్వీ (స్టంప్డ్) భాటియా (బి) మాథ్యూస్ 20, సిమ్రన్ (సి) కెర్ (బి) మాథ్యూస్ 3, తనూజ (సి) సంస్కృతి (బి) కెర్ 13, సయాలి (నాటౌట్) 13, ప్రియ (రనౌట్) 2; **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 20 ఓవర్లలో 120 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-6, 2-14, 3-16, 4-28, 5-43, 6-67, 7-79, 8-103, 9-103; **బౌలింగ్:** షబ్నిం ఇస్మాయిల్ 4-1-17-1, నటాలి సివర్ బ్రంట్ 4-0-26-2, హేలీ మాథ్యూస్ 4-0-16-3, అమేలియా కెర్ 4-0-22-2, పరుణిక 2-0-20-0, అమన్‌జోత్ కౌర్ 2-0-17-1.

ముంబై: హేలీ మాథ్యూస్ (సి) హర్లీన్ (బి) తనూజ 17, యాస్తిక (సి) లారా (బి) ప్రియ 8, బ్రంట్ (బి) ప్రియ 57, హర్మన్‌ప్రీత్ (ఎల్బీ) కశ్వీ 5, కెర్ (ఎల్బీ) కశ్వీ 19, సంజన (నాటౌట్) 10, కమలిని (నాటౌట్) 4; **ఎక్స్‌ట్రాలు: 3; మొత్తం: 16.1 ఓవర్లలో 122/5; వికెట్ల పతనం:** 1-22, 2-46, 3-55, 4-100, 5-144; **బౌలింగ్:** గార్డ్‌నర్ 3-0-21-0, తనూజ కన్వర్ 3-0-25-1, డోటిన్ 3.1-0-19-0, ప్రియ 4-0-40-2, కశ్వీ 3-0-15-2.

చివరి మ్యాచ్‌లకు ఆటపట్టు దూరం..

జాతీయ జట్టుకు ఆడాల్సి రావడంతో.. లీగ్ చివరి మ్యాచ్‌లకు యూపీ వారియర్స్ బ్యాటర్ చమరి ఆటపట్టు దూరం కానుంది. వచ్చే నెల 4 నుంచి న్యూజిలాండ్‌తో జరిగే పరిమిత ఓవర్ల సిరీస్‌కు శ్రీలంక కెప్టెన్‌గా ఆటపట్టును నియమించారు. దీంతో ఈ నెల 26 వరకు మాత్రమే ఆమె అందుబాటులో ఉండనుంది.



పారా అథ్లెటిక్స్‌లో ఆంధ్ర 'సిక్సర్'

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తొలిరోజు ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులు ఆరు పతకాలతో అదరగొట్టారు. చెన్నైలో మంగళవారం ప్రారంభమైన ఈ పోటీల్లో ఆంధ్ర అథ్లెట్లు రెండు స్వర్ణాలు, నాలుగు కాంస్యాలు సహా 6 పతకాలు సాధించారు. అనకాపల్లికి చెందిన పారా ఒలింపియన్ రొంగలి రవి స్వర్ణం కొల్లగొట్టాడు. జావెలిన్ త్రో ఎఫ్-40 విభాగంలో రవి పసిడి సాధించగా, ప్రకాశం జిల్లాకు చెందిన కాలేషా బాషా కాంస్యం దక్కించుకున్నాడు. టి-46 కేటగిరీ 100 మీటర్ల స్ప్రింట్‌లో రవణి (నెల్లూరు) స్వర్ణం, 1500 మీటర్ల పరుగులో నవీన్ (కాకినాడ) కాంస్యం గెలిచారు. టి-44 హైజంప్‌లో శ్యామ్ (గుంటూరు), టి-11 100 మీటర్ల రేసులో భవాని (విశాఖపట్నం) కాంస్యాలు అందుకున్నారు.

కర్రాన్ సెంచరీ.. జింబాబ్వేదే సిరీస్

హరారే: ఐర్లాండ్‌తో ఆఖరి వన్డేలో జింబాబ్వే సత్తా చాటింది. మంగళవారం ఇక్కడ జరిగిన నిర్ణయాత్మక మూడో మ్యాచ్‌లో ఏకంగా 9 వికెట్ల తేడాతో గెలిచింది. దీంతో మూడు వన్డేల సిరీస్‌ను ఆతిథ్య జింబాబ్వే 2-1తో కైవసం చేసుకుంది. మొదట బ్యాటింగ్‌కు దిగిన ఐర్లాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్లకు 240 పరుగులు చేసింది. ఓపెనర్ బల్‌బిర్నీ (64), లోర్కాన్ టక్కర్ (61), హ్యారీ టెక్టర్ (51) అర్ధ శతకాలతో రాణించారు. రిచర్డ్, ట్రెవర్‌కు చెరో రెండు వికెట్లు దక్కాయి. ఛేదనలో ఓపెనర్ బెన్ కర్రాన్ (118 నాటౌట్) అజేయ శతకంతో విజృంభించడంతో జింబాబ్వే 39.3 ఓవర్లలో వికెట్ మాత్రమే కోల్పోయి 246 పరుగులు చేసి గెలిచింది. కెప్టెన్ క్రెగ్ ఎర్విన్ (69 నాటౌట్) అజేయ అర్ధ సెంచరీతో అదరగొట్టాడు. బెన్ కర్రాన్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, బ్రియాన్ బెనెట్‌కు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డులు దక్కాయి.

అయ్యప్ప భక్తులు చేసిన పాపమేంటి?



- రంజాన్ భక్తులకే డ్యూటీ మినహాయింపా?
- మీలో హిందువుల రక్తం ప్రవహిస్తుందా?
- ఈ ప్రభుత్వం ఉండేది ఐదారు మాసాలే
- తరువాత అధికారంలోకి వచ్చేది బీజేపీనే
- కాంగ్రెస్ నేతలపై బండి సంజయ్ ఫైర్

హైదరాబాద్, మంచిర్యాల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రంజాన్ సందర్భంగా ముస్లిం ఉద్యోగులందరికీ సాయంత్రం 4 గంటల్లోపే విధులను ముగించుకుని వెళ్లిపోవచ్చని మినహాయింపు ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం.. మా అయ్యప్ప, హనుమాన్, భవానీ భక్తులకు ఎందుకు ఆ వెసులుబాటు ఇవ్వడం లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ నిలదీశారు. వారు చేసిన పాపమేంది? అని మండిపడ్డారు. మంగళవారం మంచిర్యాలలో నిర్వహించిన పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ.. 'అయ్యప్ప మాల వేసుకునే భక్తులు భిక్ష చేయడానికి ఎన్ని ఇబ్బందులుంటాయో అందరికీ తెలుసు. మధ్యాహ్నం భిక్ష చేయకుండా పస్తులుండి విధులకు వెళ్లాల్సిన పరిస్థితి. ఒకవేళ సమయానికి వెళ్లకపోతే సస్పెండ్ చేస్తారనే భయంతో డ్యూటీలకు పోతరు. భవానీ, హనుమాన్ భక్తులదీ అదే పరిస్థితి. కానీ రంజాన్ భక్తులకు మాత్రమే మినహాయింపు ఎట్లా ఇస్తారు?' అని ప్రశ్నించారు. 'కాంగ్రెస్‌లో హిందువులారా.... మీలో నిజంగా హిందూ రక్తమే ప్రవహిస్తే నా ప్రశ్నకు సమాధానం చెప్పాలి' అని డిమాండ్ చేశారు. 'తెలంగాణ అభివృద్ధికి కేంద్రం నిధులివ్వడంలేదని ఆరోపణలు చేస్తున్న కాంగ్రెస్‌కు నేను సవాల్ చేస్తున్నా.. కేంద్ర నిధులపై బహిరంగ చర్చకు సిద్ధమా? ఇదే అంశాన్ని రెఫరెండంగా తీసుకుని ఎమ్మెల్సీ ఎన్నికల్లోకి రావాలని సవాల్ చేస్తున్నా. కాంగ్రెస్ ప్రభుత్వంలోని టాప్ 5లో ఉన్న వాళ్ల దోపిడీ, అవినీతికి అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. కమీషన్లకు కక్కుర్తి పడుతున్నరు. ఉద్యోగుల పీఆర్సీని అమలు చేయరు. డీఏలు ఇవ్వాలని అడిగితే పైసల్లేవంటున్నరు. ఉద్యోగులు దాచుకున్న జీపీఎఫ్, గ్రాట్యుటీ పైసలు కూడా ఇయ్యకుండా సతాయిస్తున్నరు. కానీ 15 శాతం కమీషన్లు ఇస్తే మాత్రం కాంట్రాక్టర్లకు అప్పటికప్పుడు బిల్లులు క్లియర్ చేస్తున్నారు' అని సంజయ్ మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ దాదాగిరి మహా అంటే 5, 6 నెలలే. ఆ తరువాత అధికారంలోకి వచ్చేది బీజేపీ ప్రభుత్వమే. మేం అధికారంలోకి రాగానే అడ్డగోలుగా వ్యవహరించే వాళ్ల సంగతి చూస్తాం' అని అన్నారు. హామీలు, గ్యారంటీలపై నిలదీస్తుంటే, కాళేశ్వరం, డ్రగ్స్, ఫార్ములా ఈ రేస్ స్కాం కేసుల్లో ఇదిగో అరెస్టు.. అదిగో అరెస్టు అంటూ మీడియాలో వార్తలు రాయించుకుంటూ కాలయాపన చేయడం తప్ప కాంగ్రెస్ సాధించిందేమిటని నిలదీశారు. కేవలం కాంగ్రెస్‌ను గెలిపించేందుకే బీఆర్ఎస్ ఎమ్మెల్సీ బరిలో దిగలేదని, మోసాల కాంగ్రెస్‌కు ఎమ్మెల్సీ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని కోరారు.

ఆర్ఎంపీల సమస్యల పరిష్కారానికి కృషి

- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ హామీ
- సానుకూల చర్చలు జరుగుతున్నాయ్: కోదండరాం

కవాడిగూడ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందని టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్ చెప్పారు. వారంతా భారత వైద్య మండలి నిబంధనలకు లోబడి పనిచేయాల్సి ఉంటుందని సూచించారు. మంగళవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో ఆర్ఎంపీ, పీఎంపీల చలో హైదరాబాద్ కార్యక్రమంలో భాగంగా గ్రామీణ వైద్యుల ఆత్మగౌరవ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం హాజరయ్యారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ ఆర్ఎంపీ, పీఎంపీలపై జరుగుతున్న దాడులు నియంత్రించేందుకు చొరవ తీసుకుంటామని హామీ ఇచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ ఆర్ఎంపీ, పీఎంపీల సమస్యలపై రాష్ట్ర ఆరోగ్య వైద్య, శాఖ మంత్రితో సానుకూలంగా చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఈ విషయంపై సానుకూలంగా ఉన్నారని అన్నారు.

టీచర్ ఎమ్మెల్సీ ఎన్నిక కోసం 'కోడ్' సరి కాదు

- మూడు ఉమ్మడి జిల్లాల్లో అభివృద్ధి ఆగిపోయింది: గుత్తా

హైదరాబాద్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఖమ్మం-వరంగల్-నల్లగొండ టీచర్ ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలో కేవలం 25వేల ఓట్లు ఉంటాయని, ఇందుకోసం మూడు ఉమ్మడి జిల్లాల్లో కోడ్ అమలు చేయడం సరి కాదని మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. కోడ్ కారణంగా 34 అసెంబ్లీ నియోజకవర్గాల్లో అభివృద్ధి కార్యక్రమాలు ఆగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కోడ్‌ను సవరించాలంటూ కేంద్ర ఎన్నికల కమిషన్‌కు తాను లేఖ రాసినట్లు వెల్లడించారు.

ఐదు జిల్లాలకు అధ్యక్షుల్ని నియమించిన బీజేపీ

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మంగళవారం తెలంగాణలో ఐదు జిల్లాలకు అధ్యక్షుల్ని నియమించింది. నారాయణపేటకు కె. సత్య యాదవ్‌ను, సూర్యాపేటకు శ్రీలత రెడ్డిని, నిర్మల్‌కు రితేష్ రాథోడ్‌ను, సిద్దిపేటకు బైరి శంకర్ ముదిరాజ్‌ను, రాజన్న సిరిసిల్లకు ఆర్. గోపి ముదిరాజ్‌ను నియమించింది.

చరిత్ర సృష్టించి 11 ఏళ్లు :హరీశ్‌రావు

చరిత్ర సృష్టించి 11 ఏళ్లయింది.. స్వరాష్ట్ర సాధన కోసం ఉవ్వెత్తున ఉద్యమించిన తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు 2014 ఫిబ్రవరి 18న లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందిందని మాజీమంత్రి తన్నీరు హరీష్ రావు తెలిపారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కృషి.. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు ఫలించిన రోజిదని మంగళవారం 'ఎక్స్' వేదికగా ఆయన పేర్కొన్నారు. కేసీఆర్ నేతృత్వంలోని ప్రజా ఉద్యమం ఫలితంగా 2014 ఫిబ్రవరి 18న లోక్‌సభలో బిల్లు పాస్ అయిందని ఆయన వెల్లడించారు.

పట్టణాలకూ 'నక్షా'.. కొడంగల్‌లో పైలెట్ సర్వే

కొడంగల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సాగు భూముల మాదిరిగానే పట్టణాలకు కూడా నక్షాను రూపొందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సర్వేకు శ్రీకారం చుట్టాయి. పైలెట్ ప్రాజెక్టు కింద నక్షా సర్వేను సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లో చేపట్టనున్నారు. ఇందుకోసం ఇప్పటికే ప్రత్యేక హెలికాప్టర్ కొడంగల్‌కు చేరుకుంది. అధికారులు సమగ్ర సర్వే నిర్వహించి పూర్తిస్థాయి వివరాలతో పట్టాలు రూపొందించనున్నారు. కొడంగల్‌లో బుధవారం నుంచి రెండు రోజుల పాటు నక్షా సర్వేను నిర్వహించనున్నట్లు కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ విజయ్‌కుమార్, సర్వే ఆఫ్ ఇండియా అధికారులు తెలిపారు.

బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే బీసీ రిజర్వేషన్లు పెంచాలి

షెడ్యూల్-9లో చేర్చేందుకు సహకరించాలి: జస్టిస్ ఈశ్వరయ్య

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): బీసీలకు న్యాయం చేయాలనే చిత్తశుద్ధి బీజేపీకి ఉంటే బీసీ రిజర్వేషన్ల పెంపునకు చట్టం చేయాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. తమిళనాడు తరహాలో తెలంగాణలోనూ విద్య, ఉద్యోగ సర్వీసుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్ల అమలుపై సమగ్ర చట్టం తేవాల్సి ఉందన్నారు. స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీల రిజర్వేషన్లపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి, అనంతరం అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్రానికి పంపేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ తీర్మానాన్ని కేంద్ర ప్రభుత్వం... ఉభయ సభల్లో పెట్టి చట్ట రూపంలోకి తేవాలన్నారు. అప్పుడు ఏ కోర్టూ ఆ చట్టాన్ని కొట్టివేయలేదని వివరించారు. రిజర్వేషన్లపై అవగాహన లేని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత తిరకాసు పెట్టేలా మాట్లాడుతున్నారని విమర్శించారు.

సీఎంఆర్ గడువు 17 వరకు పెంపు

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం నుంచి కేంద్ర ప్రభుత్వానికి కస్టమ్ మిల్లింగ్ రైస్ అందించేందుకు కేంద్రం గడువు పెంచింది. ఈమేరకు మార్చి 17 వరకు అవకాశం ఇస్తున్నట్లు తెలుపుతూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ముఖ్య కార్యదర్శికి మంగళవారం లేఖ రాసింది. 2023-24 రబీ సీజన్‌కు సంబంధించిన ధాన్యాన్ని మార్చి 17 వరకు ఇవ్వాలంటూ లేఖలో పేర్కొంది. కాగా ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌సీఐ) కస్టమ్ మిల్లింగ్ రైస్ విధానాన్ని పరిశీలించాలని సూచించారు.

అయ్యో..ఎస్!

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల ఓ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో మాట్లాడుతూ 'మేం ఒక తప్పు చేయాలని అంటే ఒకటేమిటి సార్.. మూడు తప్పులు చేస్తామని అంటున్నారు' అంటూ తప్పుబట్టారు. ఏసీ గదులను వదిలి బయటకు రావడం లేదని, ప్రజా సమస్యల పరిష్కారాన్ని పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజానికి, ప్రభుత్వ సొమ్ము, ప్రభుత్వ భూమి, ప్రభుత్వ ఆస్తులను కాపాడడం, ప్రభుత్వ నిధులు దుర్వినియోగం కాకుండా కాపాడే కీలక బాధ్యత అఖిల భారత సర్వీసు అధికారులదే. కానీ, అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సిన కొందరు అధికారులు ఆ పని చేయకపోగా.. అక్రమార్కులకే కొమ్ము కాస్తున్నారు. అక్రమాలను సక్రమంగా ఎలా చేయాలో తరుణోపాయాలు చెప్పే స్థితికి దిగజారిపోయారు. ప్రజలకు మేలు చేసే ఫైళ్ల మీద కాకుండా వీరి దృష్టి అంతా తమకు లబ్ధి చేకూర్చే లిటిగేషన్ ఫైళ్లమీదే ఎక్కువ ఉంటుంది. లిటిగేషన్ ఎంత ఎక్కువ ఉంటే.. వీరు తీసుకునే ఆమ్యామ్యాల విలువ అంత పెరుగుతోంది. ఒకసారి డీల్ కుదిరితే చాలు.. ఇక ఫైల్ పని సాఫీగా సాగిపోయినట్లే! అప్పటి వరకూ అక్రమం కూడా సక్రమం అయిపోతుంది. వందల కోట్ల ప్రభుత్వ ఆస్తులు ప్రైవేటుపరమైపోతాయి. ఇలాంటి అధికారుల ఆస్తులు అమాంతం పెరిగిపోతాయి. 20-30 ఏళ్ల కిందట కూడా ఇటువంటి వారు కొందరు ఉండేవారు. కానీ, అత్యధికులు ప్రజా ప్రయోజనమే పరమావధిగా ఆలోచించేవారు. ఇప్పుడు మాత్రం దానికి రివర్స్‌లో పరిస్థితి తయారైందని ఒక సీనియర్ ఐఏఎస్ అధికారి ఆవేదన వ్యక్తం చేశారు. ఒకప్పుడు ఐఏఎస్ అధికారి ఎస్.ఆర్. శంకరన్‌ను గుర్తేడు అటవీ ప్రాంతంలో మావోయిస్టులు కిడ్నాప్ చేస్తే.. యావత్ రాష్ట్రం ఉలిక్కిపడింది. గిరిజనుల సేవ కోసం తన జీవితాన్ని ధారపోసిన అంత మంచి అధికారి ఎప్పుడు విడుదల అవుతారా అని ఎదురుచూసింది. అదే పరిస్థితి ఇప్పుడు ఎవరికైనా ఎదురైతే.. ప్రజల్లోనుంచి అంత అభిమానం చూరగొనగలిగిన అధికారులు వేళ్లమీద కూడా ఉండరు. కొందరు అధికారులు అధికారంలో ఉన్న పార్టీకి అనుచరులుగా పని చేస్తున్నారు. తర్వాత అధికారంలోకి వచ్చిన పార్టీ కొంతమందిని పక్కన పెట్టడానికి కారణం ఇదే. ఒక పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఓ వెలుగు వెలిగిన అధికారులు మరో పార్టీ అధికారంలోకి వస్తే కేసుల్లో ఇరుక్కోవడానికి, జైళ్లకు వెళ్లడానికీ కారణం ఈ అవినీతి అక్రమాలే!!

ఏకంగా ఏజెంట్ల వ్యవస్థ.. రహస్య పెట్టుబడులు

కొందరు ఐఏఎస్ అధికారులు అధికారంలోకి ఎవరు వచ్చినా ఆదాయం వచ్చే శాఖల్లోనే తిష్ట వేస్తారు. కొందరు ఐఏఎస్‌ల దృష్టి అంతా ప్రభుత్వ భూములపైనే ఉంటుంది. చట్టాల్లోని లొసుగులను అడ్డు పెట్టుకుని ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడం.. తద్వారా తాము కోట్లు కూడబెట్టడమే వారి దినచర్య కూడా. అక్రమ సంపాదనకు కొందరు అధికారులు ఏకంగా ఏజెంట్ వ్యవస్థనే ఏర్పాటు చేసుకున్నారు. తమ దగ్గర పనిచేసే కిందిస్థాయి అధికారుల్లో ఒకరిని, లేకుంటే బంధువుల్లో ఒకరిని ఏజెంట్లుగా మార్చేస్తున్నారు. వారి దగ్గరకు వెళ్లి డీల్ మాట్లాడుకుంటే.. అక్కడి నుంచి సదరు ఐఏఎస్ అధికారికి సిగ్నల్ వెళ్తే చాలు.. ఎంత సంక్లిష్టమైన ఫైల్ అయినా ఇట్టే పరిష్కారం అయిపోతుంది. ఇలా సంపాదించిన వందల కోట్ల రూపాయలను అనేక రూపాల్లో వారు పెట్టుబడులు పెడుతున్నారు. కొందరు భూములపై పెడుతుంటే.. మరి కొందరు తమ సొంత రాష్ట్రాలకు తరలించేస్తున్నారు. ఇంకొందరు దేశ రాజధాని ఢిల్లీ చుట్టుపక్కల పెట్టుబడులు పెడుతున్నారు. గుర్గావ్, నోయిడాల్లో ఎక్కువ మంది పెట్టుబడులు పెట్టారు. రిజిస్ట్రేషన్ విలువ తక్కువ, బహిరంగ మార్కెట్లో ఎక్కువ విలువున్న భూముల్ని నల్లధనం ఇచ్చి కొనుగోలు చేస్తున్నారు. షెల్ కంపెనీలు ఏర్పాటు చేయడమే కాదు.. వాటి ద్వారా నిధులు తరలిస్తున్నారు. ఆస్పత్రులు, ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లోనూ స్లీపింగ్ భాగస్వాములుగా ఉన్నారు.

మాట వినాలి.. మూటలు మోయాలి..

అధికారులు దిగజారారా లేక రాజకీయ నాయకులు వారిని దిగజార్చారా అనే ప్రశ్నకు కోడి ముందా? గుడ్డు ముందా!? అన్నదే జవాబు! రాజకీయ వ్యవస్థ తమను దిగజారేలా చేస్తోందని కొందరు అంటుంటే.. ఇప్పుడు అధికారుల తీరే అలా ఉంటోందని రాజకీయ నాయకులు అంటున్నారు. ఉదాహరణకు.. రాష్ట్రంలోనే ఓ కీలక విభాగంలో పని చేసే ఐఏఎస్ అధికారి రోజూ తన శాఖ మంత్రికి ఆదాయాన్ని తెచ్చి పెట్టే ఫైళ్లు పంపాలి. వాటిని ఎలా క్లియర్ చేయాలి.. చట్టానికి, కేసులకు చిక్కకుండా వాటి ద్వారా ఎలా పిండుకోవాలో వివరంగా చెప్పాలి. అలా చెప్పగలిగితేనే ఆయన తన వద్ద ఉంచుకుంటున్నారు. ఇక, నగరానికి ఆనుకుని ఉన్న ఓ జిల్లా కలెక్టర్ ఏకంగా తన తండ్రి కోసం వ్యవస్థలన్నీ పని చేయాలని, తన తండ్రి ఏది అడిగినా జాప్యం లేకుండా సమాధానం ఇవ్వాలని, పని చేసి పెట్టాలని జిల్లా యంత్రాంగానికి హుకుం జారీ చేశారు. ఆయన విషయంలో సీఎం కార్యాలయం వరకూ వెళ్లినా ఆ కలెక్టర్‌కు ఎలాంటి ఇబ్బంది లేకుండా రాజకీయ నాయకులే అండగా నిలుస్తున్నారనే చర్చ జరుగుతోంది.

మీరే క్లబ్‌లో ఉన్నారు!

కొందరు అధికారులు మీరు ఏ క్లబ్‌లో ఉన్నారని మాట్లాడుకుంటారని సమాచారం. ఇక్కడ ఏ క్లబ్ అంటే.. అదేదో నిజాం క్లబ్, ఫిల్మ్‌నగర్ క్లబ్బో కాదు. 100 కోట్ల క్లబ్బులోనా? 200 కోట్ల క్లబ్బులోనా? 500 కోట్ల క్లబ్బులోనా? అన్నది. అంటే కొందరు అఖిల భారత సర్వీసు అధికారుల ఆస్తులు ఎంతన్నది వింటుంటే కళ్లు తిరగాల్సిందే. ప్రత్యేక పార్టీల్లో వారిలో వారు మాట్లాడుకోవడం, లేదంటే వారి గురించి ఇతరులు మాట్లాడేప్పుడు.. ఆయన ఫలానా క్లబ్‌లో ఉన్నాడన్న మాట వినిపించడం పరిస్థితిని చెప్పకనే చెప్తోంది.

నిజాయతీపరులకు ఆదరణ ఏదీ!?

ఐఏఎస్ అధికారుల్లో నిజాయతీపరులు లేకపోలేదు. కఠోరంగా ఉన్నా.. వారి సంఖ్య తక్కువే. అయితే, ప్రస్తుత రాజకీయ వ్యవస్థలో నిజాయతీపరులకు మంచి పోస్టులు దక్కడమూ గగనమే. ఉదాహరణకు, నల్గొండ జిల్లాలో పనిచేసి అతి తక్కువ కాలంలో బదిలీపై కీలక శాఖకు వచ్చిన ఓ అధికారి జిల్లా ఖజానాలో ఉండే నిధులన్నిటినీ ఉన్న స్వల్ప వ్యవధిలోనే గోడలకు రంగులు వేయించి.. కమీషన్లు తీసుకుని వచ్చేశారు. ఆ తర్వాత వెళ్లిన అధికారిని ఓ మంత్రి 'నీకు ముందు ఉన్న అధికారి అంత బాగా పని చేస్తే నీకు పని చేయడం చేతకాలేదని చీవాట్లు పెట్టి ఆయన్ను మూడు నెలలకే వెనక్కి పంపేశారు. దీనిపై అధికారుల్లో చర్చ జరిగింది కూడా. అలాగే, రంగారెడ్డి జిల్లాలో ఓ ఐఏఎస్ అధికారి కలెక్టర్‌గా పని చేశారు. ఆయనను ఓ మంత్రి రోజూ తన చాంబర్‌కు పిలిపించి చీవాట్లు పెట్టేవారు. ఇందుకు కారణం.. తాను చెప్పిన ఫైళ్లను చట్టవిరుద్ధంగా పరిష్కరించడం లేదనే! ఆ పంచాయితీ సీఎం వద్దకు వెళ్లింది.. చివరకు ఆ అధికారే బలయ్యారు. ఐఏఎస్ అధికారి నిజాయితీగా పని చేస్తే మంచి పోస్టింగ్ రావట్లేదని, ఇప్పుడున్న రాజకీయ పరిస్థితులు అలా ఉన్నాయని ఓ సీనియర్ ఐఏఎస్ అధికారి ఆవేదన వ్యక్తం చేశారు. "ఓ కీలక విభాగాన్ని నాకు అప్పగించారు. ఆ శాఖ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చిందని అనుకున్నాను. కానీ, పాలకుల ఆలోచన వేరే ఉందని ఆరు నెలలకు తెలిసింది. ఫైళ్లు తీసుకుని ముఖ్య నేతను కలవలేదనే కారణంతో నన్ను ఆరు నెలలకే బదిలీ చేసి.. ఆ స్థానంలో రోజూ ఫైళ్లు తీసుకుని ఇంటికి వెళ్లే అధికారికి పోస్టింగ్ ఇచ్చారు" అని వివరించారు. సులువైన పద్ధతుల్లో డబ్బు సంపాదించి పెట్టేందుకు సూచనలు ఇచ్చే అధికారులనే నాయకులు ఇష్టపడుతున్నారని.. రూల్స్ ప్రకారం పని చేస్తామంటే తమకు అవసరం లేదని ముఖం మీదనే చెబుతున్నారని ఐఏఎస్‌లు తప్పుబడుతున్నారు. నిజాయితీగా పని చేస్తే ఎవరూ ఆదుకోరనే భయం అధికారుల్లో నెలకొందని మరో సీనియర్ ఐఏఎస్ అధికారి చెప్పారు. అవినీతికి పాల్పడితే తప్ప మంచి పోస్టింగ్ రాదనే అభిప్రాయంతో కొత్తగా సర్వీస్‌లోకి వచ్చేవారు ఉన్నారని, ఇది సమాజానికి మంచిది కాదని.. దీన్ని రాజకీయ నాయకులే చక్కదిద్దాలని సూచిస్తున్నారు. "కొత్తగా విధుల్లో చేరుతున్న ఐపీఎస్‌ల్లో కొందరు అవినీతి ఆరోపణలు ఎదుర్కోవడం బాధాకరం. మారిన పరిస్థితులే అందుకు కొంత వరకు కారణం. గతంలో నాయకులు చట్టానికి వ్యతిరేకంగా చేయాలని ఐపీఎస్‌ల్ని ఆదేశించేవారు కాదు. చట్టం అమలు విషయంలో అధికారుల నిర్ణయాలకు కట్టుబడి ఉండేవారు. ఇప్పుడు పరిస్థితులు మారాయి. పోస్టింగ్‌ల విషయంలో రాజకీయ జోక్యం పెరిగింది. ఇప్పుడు కొంత మంది సీనియర్లు కూడా పోస్టింగ్‌ల కోసం నాయకులు చెప్పినట్లు చేస్తున్నారు. ఇంకొందరైతే చెప్పిన దానికంటే ఎక్కువగా, నాయకుడి మనసులో ఏముందో తెలుసుకుని పనిచేస్తున్నారు. అలాంటి వారికే పోస్టింగ్‌లు దక్కుతున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో కొందరు సీనియర్ ఐపీఎస్‌ల ఆస్తులు వందల కోట్లకు చేరాయి. అంటే వారు ఎలా సంపాదించారో అర్థం చేసుకోవచ్చు. అలాంటి వారు జూనియర్ అధికారులకు బ్యాడ్ రోల్ మోడల్‌గా నిలిచారు" అని విశ్రాంత ఐఏఎస్ అధికారి ఒకరు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు కొత్తగా సర్వీస్‌లో చేరుతున్న వారిలో కొందర్ని చూస్తే ఆశ్చర్యం కలుగుతోందని, సర్వీస్‌లో చేరిన కొద్ది సంవత్సరాల్లోనే కార్లు, బంగళాలు, ఆస్తులు సమకూర్చుకుంటున్నారని ఆయన వివరించారు. తాము సర్వీస్‌లో చేరినప్పుడు పై ఆఫీసర్లను చూస్తేనే భయంగా ఉండేదని, ఏ చిన్న తప్పు చేసినా వారు వెంటనే చర్యలు తీసుకునేవారని వివరించారు. కానీ, ఇప్పుడు కొత్తగా వస్తున్న వారిలో టాలెంట్ ఉందని, అదే సమయంలో చేరిన తొలి రోజుల్లోనే వారు అక్రమాలకూ పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

అప్పుడు బడి.. ఇప్పుడు రాబడి

అఖిల భారత సర్వీసు అధికారులంటే ప్రభుత్వానికి కళ్లు, ముక్కు, చెవులుగా పనిచేసేవారు. క్షేత్ర స్థాయి పర్యటనలు చేసేవారు. ప్రజలతో మమేకమై ప్రజోపయోగ పథకాలకు రూపకల్పన చేసేవారు. అభివృద్ధి, సంక్షేమ విధానాలకు రూపకల్పన చేసేవారు. విధానాల రూపకల్పనలో పాలకులకు సహకరించేవారు. ప్రభుత్వం ఏదైనా ఒక పథకాన్ని ప్రారంభించాలన్నా.. ప్రారంభించినా.. దాని లాభనష్టాలను లోతుగా అధ్యయనం చేసేవారు. ప్రభుత్వానికి నివేదిక రూపంలో అందించేవారు. జిల్లాల్లో కలెక్టర్లుగా ఉన్నవారు వారంలో కనీసం ఒకటి, రెండు రోజులు క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లేవారు. రేషన్ షాపులు, స్కూళ్లు, ఆస్పత్రులు, హాస్టళ్లు తదితరాల్లో ఆకస్మిక తనిఖీలు చేసేవారు. ఆయా ప్రాంతాల్లో అందించే భోజనం నాణ్యత తదితరాలను ఆరా తీసి మెరుగు పరిచేవారు. గైర్హాజరైన అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేసేవారు. క్షేత్ర స్థాయిలో ఆర్జించిన జ్ఞానంతో సచివాలయానికి వివిధ శాఖల కార్యదర్శులుగా వచ్చిన తర్వాత కూడా విధానాల రూపకల్పనలో పాల్పంచుకునేవారు. కానీ, ఇప్పుడు కొందరు ఐఏఎస్ అధికారుల స్కెచ్ (రూపకల్పన) అంతా ఆదాయమే. ఏ పని చేస్తే ఎంత రాబడి వస్తుంది? ప్రభుత్వ భూములను ఎవరికి ఎలా కట్టబెట్టాలి!? ఏ అక్రమాన్ని సక్రమం చేస్తే సొంత రాబడి పెరుగుతుంది? అన్న అంశాలపైనే కొందరు ఎక్కువగా దృష్టి పెడుతున్నారనే ఆరోపణలు చాలా తీవ్రంగానే ఉన్నాయి. అంతేనా.. అక్రమార్కులు ఒక స్కెచ్‌తో వస్తే.. దానిని ఎలా అమలు చేయాలన్న అంశంపై ఫీడ్‌బ్యాక్ ఇస్తున్నారు తప్పితే.. రాష్ట్రం బాగు, సమాజాభివృద్ధి, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ గురించి పట్టించుకుంటున్న పాపాన పోవడం లేదని పదవీ విరమణ చేసిన ఓ ఐఏఎస్ అధికారి వాపోయారు.

పాఠశాలలో కేసీఆర్ పుట్టినరోజు వేడుకలు

- ఇన్‌చార్జి హెచ్ఎంపై వేటు

చంపాపేట/ చెన్నూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మాజీ సీఎం కేసీఆర్ పుట్టినరోజు వేడుకలకు అనుమతించిన హైదరాబాద్ మూసానగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు రజితను అధికారులు సస్పెండ్ చేశారు. సోమవారం మాజీ సీఎం కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఆ పార్టీ నాయకులు కొందరు ఎల్బీ నగర్ నియోజకవర్గం హస్తినాపురం డివిజన్ నందనవనంలోని మూసానగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటి విద్యార్థులకు చాక్లెట్లు పంపిణీ చేశారు. అలాగే విద్యార్థులతో కొన్ని నినాదాలు చేయించారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ నాయకులు విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పాఠశాలలో ఓ రాజకీయ నేత జన్మదిన వేడుకలకు అనుమతించి నిబంధనలను ఉల్లఘించినందుకు గాను పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు రజితను సస్పెండ్ చేస్తూ రంగారెడ్డి జిల్లా విద్యాధికారి (డీఈఓ) ఆదేశాలు జారీ చేశారు. అలాగే ఈ నెల 6న మంచిర్యాల జిల్లా చెన్నూర్ పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థి మనోజ్‌గౌడ్‌పై తోటి విద్యార్థులు దాడి చేసి ఇన్‌స్టాగ్రామ్‌లో సంఘటనను పోస్టు చేసిన ఘటనకు సంబంధించి అధికారులు చర్యలకు ఉపక్రమించారు. పాఠశాల ప్రిన్సిపాల్‌ను విధుల నుంచి తొలగించడంతో పాటు ఏడుగురు విద్యార్థులను సస్పెండ్ చేశారు. పోలీసులు ఏడుగురు విద్యార్థులపై కేసు నమోదు చేశారు.

మిఠాయిలు పంచితే.. సస్పెండ్ చేస్తారా?

ఏ పదవీ లేని తిరుపతిరెడ్డికి విద్యార్థులతో స్వాగతం పలికించొచ్చా?: కేటీఆర్

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఉద్యమనేత, మాజీసీఎం కేసీఆర్ పుట్టినరోజు నాడు మిఠాయిలు పంచితే తప్పా..? ఈ కారణంతో ప్రధానోపాధ్యాయుణ్ని సస్పెండ్ చేస్తారా? అని రేవంత్‌రెడ్డి సర్కార్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. పాఠశాల విద్యార్థులను ఎండలో నిలబెట్టి ఏ పదవీ లేని తిరుపతిరెడ్డికి పూలు చల్లి స్వాగతం పలికించొచ్చు.. వారితో ఆయనకు అధికార యంత్రాంగం దగ్గరుండి సెల్యూట్ కొట్టిస్తారు. సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు అయినంత మాత్రాన వార్డుమెంబర్ కూడా కాని తిరుపతిరెడ్డి అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయొచ్చు.. కలెక్టర్ సలాం కొట్టొచ్చు.. పోలీసులు ఎస్కార్ట్ ఇవ్వొచ్చు. 14 ఏళ్లపాటు అహింసాయుత పోరాటం చేసి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించి, తెలంగాణ ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన మాజీ సీఎం కేసీఆర్ పుట్టినరోజు నాడు విద్యార్థులకు మిఠాయిలు పంచితే తప్పా? అని మంగళవారం 'ఎక్స్' వేదికగా ఆయన నిలదీశారు.

సీఎం రేవంత్‌ను నమ్మితే పుస్తెల తాళ్లు ఎత్తుకుపోతాడు

- మోసపూరిత మాటలతో గద్దెనెక్కి అన్ని వర్గాలను మోసం చేసిన రేవంత్
- తన కుటుంబ లబ్ధి కోసమే ఫోర్త్ సిటీ, ఫ్యూచర్ సిటీ అంటూ డ్రామాలు
- సీఎం అయ్యాక రేవంత్ వెల్దంద వద్ద వెయ్యి ఎకరాలు సంపాదించారు
- ఆమనగల్లులో రైతు దీక్షలో కేటీఆర్



ఆమనగల్లులో నిర్వహించిన ర్యాలీలో కేటీఆర్ అభివాదం

ఆమనగల్లు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌ను నమ్మితే ఆడబిడ్డలకు తులం బంగారం ఇవ్వడం సంగతి అటుంచితే, మహిళల మెడలో నుంచి పుస్తెల తాళ్లు ఎత్తుకుపోతాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మోసపూరిత మాటలతో గద్దెనెక్కిన రేవంత్ రాష్ట్ర రైతులను అన్ని విధాలుగా దగా చేశారని, రుణమాఫీ పూర్తి చేయలేదని ఆరోపించారు. అప్పు కట్టలేని రైతుల ఇళ్ల తలుపులను, విద్యుత్ మోటర్ల స్టాటర్లను బ్యాంకు అధికారులు ఎత్తుకెళ్తున్నారని పేర్కొన్నారు. కులగణన అని బీసీలను, రూ.2500 అందిస్తామని మహిళలను, తులం బంగారం ఇస్తామని ఆడబిడ్డల తల్లిదండ్రులను, స్కూటీలు ఇస్తామని యువతులను.. ఇలా ప్రతీ వర్గాన్ని రేవంత్ మోసం చేశారని కేటీఆర్ మండిపడ్డారు. రేవంత్ పతనం కల్వకుర్తి నియోజకవర్గం నుంచే ప్రారంభం కావాలని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన రైతు దీక్షకు కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రేవంత్ 15నెలల దుర్మార్గ పాలనతో రాష్ట్రంలో 420 మంది రైతులు, 56మంది గురుకుల పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని చెప్పారు. ఫోర్త్ సిటీ, ఫ్యూచర్ సిటీ అంటూ సీఎం డ్రామాలు చేస్తున్నారని, తన, తన సోదరుల మేలు కోసమే అదంతా చేస్తున్నారని కేటీఆర్ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ వద్ద రేవంత్ కుటుంబానికి 500 ఎకరాల భూమి ఉండగా.. అధికారంలోకి వచ్చాక సీఎం సోదరులు మరో వెయ్యి ఎకరాలు సంపాదించారని, ఈ 1500 ఎకరాల భూముల విలువ పెంచుకోవడానికే అత్తగారి ఊరైన మాడ్గులకు పెద్ద రోడ్డు వేస్తానంటూ నమ్మబలుకుతున్నాడని కేటీఆర్ ఆరోపించారు.

మాజీ సర్పంచ్‌ల ఉసురు తీసుకుంటున్నారు

అధికారంలోకి వచ్చాక 35 సార్లు ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి అక్కడి నుంచి 35 పైసలు కూడ రాష్ట్రానికి తీసుకురాలేదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. పదేళ్ల కేసీఆర్ పాలన రైతులకు, ప్రజలకు స్వర్ణయుగమైతే 15 నెలల రేవంత్ పాలనలో ఏ ఒక్కరూ సంతోషంగా లేరన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలున్నందునే రేవంత్ రైతు భరోసా ఇస్తున్నారని.. అది కూడా ఎకరా, రెండెకరాల రైతులకే అందించారని విమర్శించారు. మాజీ సర్పంచ్‌లకు చెల్లించాల్సిన రూ.600కోట్ల బిల్లులు చెల్లించకుండా వారి ఉసురు తీసుకుంటున్నారని, ప్రభుత్వానికి పాలు పోసే పాడి రైతులకు కూడా నెలల తరబడి బిల్లులను చెల్లించడం లేదని కేటీఆర్ ఆరోపించారు.

ఎస్సీ కమిషన్ గడువు 10 వరకు పెంపు

హైదరాబాద్/బర్కత్‌పుర, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీల వర్గీకరణకు సంబంధించి గత నవంబరులో ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ గడువును రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. మార్చి 10 వరకు కమిషన్ గడువును పెంచుతూ సర్కారు ఉత్తర్వులు జారీ చేసింది. విశ్రాంత జడ్జి షమీమ్ అక్తర్ నేతృత్వంలోని కమిషన్‌ను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ కమిషన్ గడువును పెంచడం ఇది రెండోసారి. గత ఏడాది నవంబరు 11న కమిషన్ ఏర్పాటవగా 2025 జనవరి 10 వరకు తొలుత గడువు ఇచ్చారు. అప్పటికి వర్గీకరణ ప్రక్రియ కొలిక్కి రాకపోవడంతో ఫిబ్రవరి 10 వరకు పొడిగించారు. అయితే ఫిబ్రవరి 2నే కమిషన్ తన నివేదికను ప్రభుత్వానికి అందించింది. తర్వాత ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టింది. ఈ నెల 10న కమిషన్ గడువు ముగియడంతో కార్యాలయాన్ని, సామగ్రిని సాధారణ పరిపాలన శాఖకు అప్పగిస్తున్నట్లు కమిషన్ అధికారులు ప్రభుత్వానికి లేఖలు రాశారు. మరోవైపు ఎస్సీల వర్గీకరణ ప్రక్రియలో లోపాలను సవరించాలంటూ మాల, మాదిగల నుంచి ప్రభుత్వానికి విజ్ఞప్తులు వస్తున్నాయి. దీనిపై మంద కృష్ణ మాదిగ సీఎం రేవంత్‌తో భేటీ అయ్యారు. ఈ నేపథ్యంలో రెండోసారి ఏకసభ్య కమిషన్ గడువును మార్చి 10 వరకు పెంచడం గమనార్హం.

సీఎంకు కృతజ్ఞతలు: మంద కృష్ణ



ఎస్సీలను నాలుగు గ్రూపులుగా విభజించి వర్గీకరణ అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. ఎస్సీల్లోని మాదిగ ఉప కులాలను గ్రూప్ 1లో, మాదిగలను గ్రూప్ 2లో, మాల ఉప కులాలను గ్రూప్ 3లో, మాలలను గ్రూప్ 4లో వేసి వర్గీకరణ అమలు చేస్తే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. మాల దాసరులను గ్రూప్ 1లో చేర్చాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నిర్వహించిన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన మంద కృష్ణ.. మాలల్లోని కొందరు స్వార్థపరులు వర్గీకరణను అడ్డుకుంటున్నారని విమర్శించారు. జస్టిస్ అక్తర్ కమిషన్ నివేదికలో లోపాలను సవరించాలంటూ తాను చేసిన విజ్ఞప్తికి స్పందించి, కమిషన్ గడువును పొడిగించినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

నిర్మాణరంగ అనుమతుల ఫీజులు వాయిదాల్లో చెల్లిస్తాం!

- సీఎం ఆదేశాలిచ్చినా అధికారులు ఉత్తర్వులివ్వలే
- వెంటనే సంబంధిత ఉత్తర్వులు ఇవ్వండి: క్రెడాయ్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): నిర్మాణ రంగాన్ని ఆదుకునేందుకు గాను అనుమతుల ఫీజుల్ని వాయిదాల్లో చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని క్రెడాయ్ నేతలు డిమాండ్ చేశారు. ఫీజులు వాయిదా పద్ధతుల్లో చెల్లించడానికి అనుమతి ఇస్తూ తక్షణమే ఉత్తర్వులు ఇవ్వాలని క్రెడాయ్ హైదరాబాద్ అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖర్‌రెడ్డి, జగన్నాథరావు అధికారులకు విజ్ఞప్తి చేశారు. నిర్మాణ రంగ అనుమతుల ఫీజులను వాయిదాల్లో చెల్లించేందుకు అవకాశం కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేయగా.. సానుకూలంగా స్పందించి, తగు ఉత్తర్వులు ఇవ్వాలంటూ అధికారులకు ఆదేశాలిచ్చారని తెలిపారు. అయినా, అధికారులు ఉత్తర్వులు ఇవ్వకపోవడంతో డెవలపర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. మంగళవారం క్రెడాయ్ హైదరాబాద్ కార్యాలయంలో నగర రియల్ ఎస్టేట్‌పై సీఆర్ఈ మ్యాట్రిక్స్ రూపొందించిన హౌసింగ్ ఆఫీసు నివేదికలను ఆవిష్కరించారు. రెరా, రిజిస్ట్రేషన్ విభాగాల నుంచి సేకరించిన వివరాల ఆధారంగానే ఈ నివేదికను అందించారని ఏజెన్సీ నిర్వాహకులు తెలిపారు.

2024లో అమ్మకాలు కాస్త తగ్గినా..

హైదరాబాద్‌లో 2023 చివరి త్రైమాసికంతో పోలిస్తే 2024 చివరి త్రైమాసికంలో అమ్మకాలు 9% తగ్గాయని సీఆర్ఈ మ్యాట్రిక్స్ నివేదిక పేర్కొంది. కానీ, ఆస్తుల విలువ 17% పెరిగినట్లు వివరించింది. అదేవిధంగా కొత్త ప్రాజెక్టుల ప్రారంభం కూడా 2023 చివరి త్రైమాసికంలో 22 వేల యూనిట్లు ఉండగా.. 2024లో 11 వేల యూనిట్లు నమోదయ్యాయని, యూనిట్ల విక్రయానికి 19 నెలలు పడుతుండగా.. బెంగళూరులో మాత్రం 28 నెలలకు పైగా పడుతోందని పేర్కొంది. హైదరాబాద్ సౌత్ వెస్ట్‌లో చదరపు అడుగు విలువ అత్యధికంగా రూ.11,277 ఉందని, నార్త్ వెస్ట్‌తో పోల్చితే 15 శాతం అధికమని వివరించింది.

2 లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగు లక్ష్యం

» పంటల రక్షణకు సోలార్ ఫెన్సింగ్ పథకం: మంత్రి తుమ్మల



హైదరాబాద్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో వచ్చే ఏడాదికి 2 లక్షల ఎకరాల్లో పామాయిల్ పంట సాగు లక్ష్యంగా పెట్టుకున్నామని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. అడవి జంతువులు, కోతుల నుంచి పంటల రక్షణకు సోలార్ ఫెన్సింగ్ పథకం ప్రవేశపెట్టాలని ప్రభుత్వం యోచిస్తోందన్నారు. మంగళవారం సచివాలయంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, ఇతర అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ పురోగతి లేని పామాయిల్ కంపెనీలకు నోటీసులు ఇవ్వాలని, అవసరమైతే అనుమతులు రద్దు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే విశ్వతేజ ఆయిల్‌పామ్ కంపెనీకి ఇచ్చిన అనుమతులు రద్దు చేసి హిందుస్థాన్ యూనిలివర్ కంపెనీకి సదరు ప్రాంతాన్ని అప్పగించిన విషయం గుర్తుచేశారు. వచ్చే సంవత్సరం చివరికల్లా ఉమ్మడి జిల్లాల్లో కనీసం ఒక పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణం జరిగేలా చూడాలన్నారు. సోలార్ ఫెన్సింగ్ పథకం అమలవుతున్న హిమాచల్‌ప్రదేశ్ సహా ఇతర రాష్ట్రాల్లో పర్యటించి విధి విధానాలు వెంటనే సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇతర రాష్ట్రాల్లో సాగవుతూ లాభాలు పొందుతున్న మెకడమియా పంటను రాష్ట్రంలో ప్రవేశపెట్టడానికి వాతావరణ స్థితిగతులు, నేలలు, నర్సరీలు, మార్కెటింగ్ అవకాశాలను అధ్యయనం చేయాలని ఆదేశించారు.

చివరి ఆయకట్టుకే తొలుత నీళ్లు

» జిల్లా కలెక్టర్లను కోరిన ఈఎన్‌సీ అనిల్

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఈ యాసంగిలో ప్రాజెక్టుల కింద 17.94 లక్షల ఎకరాల్లో అరుతడి పంటలకు, 24.54 లక్షల ఎకరాల్లో వరి పంటకు కలిపి మొత్తంగా 42.48 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించాలని స్కైవమ్(రాష్ట్రస్థాయి సాగునీటి విడుదల ప్రణాళిక కమిటీ) నిర్ణయించిందని, ఆ మేరకు నీళ్లు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను ఈఎన్‌సీ(ఇంజనీర్ ఇన్ చీఫ్-జనరల్) జి.అనిల్ కుమార్ కోరారు. యాసంగికి సరిపడా నీళ్లు ప్రాజెక్టుల్లో ఉన్నాయని, ప్రాజెక్టుల కింద చివరి ఆయకట్టుకే తొలుత నీరు అందేలా చూడాలన్నారు. సీఎస్ శాంతికుమారి మంగళవారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో ఈఎన్‌సీ మాట్లాడారు. రాష్ట్రంలో ప్రాజెక్టుల కింద యాసంగిలో గత డిసెంబరు 25వ తేదీ నుంచి ఏప్రిల్ 8వ తేదీ దాకా నీటిని విడుదల చేయాలని నిర్ణయం తీసుకున్నామని గుర్తుచేశారు.

కేసీఆర్ మళ్లీ సీఎం అయితే రాష్ట్రాన్ని అమ్మేయాల్సి వచ్చేది: జూపల్లి



హైదరాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ మళ్లీ సీఎం అయి ఉంటే.. తెలంగాణ రాష్ట్రాన్ని అమ్మేసే పరిస్థితి వచ్చి ఉండేదని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పదేళ్లలో కేసీఆర్ చేసిన అప్పులకు ప్రస్తుత ప్రభుత్వం ప్రతి నెలా రూ.6,500 కోట్ల మేర చెల్లించాల్సి వస్తోందన్నారు. కేసీఆర్ హయాంలో ప్రాజెక్టుల పేరిట వేల కోట్లను కాంట్రాక్టర్లకు దోచిపెట్టారని, పారదర్శకంగా టెండర్లు నిర్వహించి ఉంటే రాష్ట్రానికి రూ.50 వేల కోట్ల దాకా మిగిలి ఉండేవన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలన కారణంగానే ప్రస్తుతం కొన్ని పథకాల అమలులో ఆలస్యం జరుగుతోందన్నారు.

ఫిరోజ్‌గాంధీ పుట్టింది పార్శీ కుటుంబంలోనే

» చరిత్రను వక్రీకరిస్తున్న సంజయ్: ఆది శ్రీనివాస్

హైదరాబాద్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): రాహుల్‌గాంధీ కులం గురించి బరితెగించి మాట్లాడుతున్న బండి సంజయ్.. చరిత్రను వక్రీకరిస్తున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ధ్వజమెత్తారు. రాహుల్‌గాంధీ తాత ఫిరోజ్ జహంగీర్ ఘాండీ.. జోరాస్ట్రియన్ మతాచారాలను పాటించే పార్శీ కుటుంబంలో పుట్టారని వెల్లడించారు. రతన్ టాటా కుటుంబమూ ఈ మతాన్నే పాటిస్తుందన్నారు. ఫిరోజ్ జహంగీర్ ఘాండీ తల్లిదండ్రులు ఇరాన్ నుంచి భారత దేశానికి వలస వచ్చారన్నారు. భారత స్వాతంత్ర్య పోరాట సమయంలో గాంధీపై అభిమానంతో తన పేరును ఫిరోజ్ గాంధీగా ఆయన మార్చుకున్నారని వివరించారు. రాహుల్‌గాంధీ మతంపై తప్పుడు ప్రచారం చేస్తున్న బీజేపీ నేతలు.. మేనక, వరుణ్‌గాంధీని ఎందుకు ప్రశ్నించట్లేదని నిలదీశారు. ముస్లింల్లో వెనుకబడిన వర్గాలను దశాబ్దాలుగా ఓబీసీలుగానే పరిగణిస్తున్నారని, కులగణనపై బీజేపీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ విమర్శించారు.

తెలంగాణ రియల్ హీరో రేవంత్: మల్లు రవి

తెలంగాణ రియల్ హీరో కేసీఆర్ అంటూ బీజేపీ నేతలు మాట్లాడుతున్నారని, వాస్తవానికి తెలంగాణకు రియల్ హీరో సీఎం రేవంత్‌రెడ్డేనని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి కితాబు ఇచ్చారు. పదేళ్లలో కేసీఆర్ అమలు చేయలేని అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను రేవంత్‌రెడ్డి ఏడాది కాలంలోనే అమలు చేసి చూపించారన్నారు.

టీజీడీపీఎస్ సలహా కమిటీ ఏర్పాటు

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ(టీజీడీపీఎస్) సలహా కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఉత్తర్వులను జారీ చేశారు. రాష్ట్రంలో విపత్తు నివారణకు ప్రణాళికలు, వాతావరణ మార్పుల ప్రభావంపై విశ్లేషణ, రాష్ట్ర ఆర్థిక, సామాజిక రంగాల్లో అంతరాలను సరిదిద్దే వ్యూహాలను రూపొందించడం, అభివృద్ధిపై విశ్లేషణ, పైలట్ ప్రాజెక్టుల రూపకల్పన.. తదితర విషయాల్లో ఈ కమిటీ ప్రభుత్వానికి సహకరిస్తుంది. ఈ సలహా కమిటీ ఛైర్మన్‌గా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వ్యవహరిస్తారు. సభ్యులుగా ప్రొ.కంచ ఐలయ్య, ప్రొ.శాంతా సిన్హా, ప్రొ.హిమాంశు, డా.సుఖదేవ్ తొరాట్, నిఖిల్ దేవ్, ప్రవీణ్ చక్రవర్తి, ప్రొ.భాంగ్యా భూక్య, ప్రొ.పురుషోత్తంరెడ్డిలు నియమితులయ్యారు.



ఆర్ అండ్ బీ ఇంజినీర్స్ అసోసియేషన్ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తా: కోమటిరెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రోడ్లు, భవనాల శాఖలోని ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. మంగళవారం బంజారాహిల్స్‌లోని తన నివాసంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుతో కలిసి ఆర్ అండ్ బీ ఇంజినీర్స్ అసోసియేషన్ డైరీ, క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే 118 మంది ఏఈఈలకు పదోన్నతులకు కల్పించామని వివరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు వి. బాలప్రసాద్, జనరల్ సెక్రటరీ కిరణ్‌కుమార్ గౌడ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శైవ క్షేత్రాలకు ఆర్టీసీ బస్సులపై మంత్రి సమీక్ష

శివరాత్రి సందర్భంగా శైవ క్షేత్రాలకు ఆర్టీసీ బస్సులపై మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష నిర్వహించారు. శివరాత్రి సందర్భంగా వేములవాడ, శ్రీశైలం, ఏడుపాయల, కీసర, పాలకుర్తి దేవాలయాలకు వెళ్లే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక బస్సులు నడపాలని అధికారులకు మంత్రి సూచించారు. భక్తులు అధికంగా వచ్చే అవకాశం ఉన్నందున అదనపు బస్సులు నడిపేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా భూభారతి

» కొత్త సమస్యలు రాకుండా విధివిధానాలరూపకల్పన

» అమల్లోకి వచ్చాక తెలంగాణలో పెనుమార్పులు : పొంగులేటి



హైదరాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): భూభారతి కొత్త చట్టం భూ యాజమాన్య హక్కులనే కాకుండా జీవితాలకు ఆత్మగౌరవాన్ని, ఆర్థిక స్వాతంత్ర్యాన్ని తీసుకువస్తుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈ చట్టం తరతరాలుగా ఉన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతుందని తెలిపారు. మంగళవారం మర్రిచెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి సంస్థలో భూ భారతి చట్టం విధివిధానాలు రూపొందించడంపై కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడారు. కొత్త సమస్యలు తలెత్తకుండా ఉన్న సమస్యలు పరిష్కరించేలా, రైతులకు ప్రయోజనం చేకూర్చేలా, రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా విధివిధానాలను రూపొందిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. చిన్న తప్పులకు కూడా అవకాశం లేకుండా పకడ్బందీగా విధివిధానాలను రూపొందించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సచివాలయంలో కూర్చుని నిబంధనలు తయారు చేయకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ విస్తృత స్థాయిలో అధికారులు, మేధావులు, అనుభవజ్ఞుల సలహాలు, సూచనలు తీసుకుని అందరి అభిప్రాయాలు క్రోడీకరించి విధివిధానాలను తయారు చేస్తున్నామని పొంగులేటి తెలిపారు. నూతన చట్టం అమల్లోకి వచ్చాక తెలంగాణలో పెనుమార్పులు తీసుకురాబోతుందన్నారు. తెలంగాణ ప్రజలకు సమగ్ర రెవెన్యూ సేవలను సత్వరమే అందించాలన్న ఆశయంతో సీఎం రేవంత్ ఆలోచనలకు అనుగుణంగా భూభారతి చట్టాన్ని తీసుకొచ్చామన్నారు. భూ హక్కుల పరిరక్షణ, భూ లావాదేవీలలో పారదర్శకత, రెవెన్యూ సేవలను సులభతరం చేయడమే చట్టం ముఖ్య ఉద్దేశమన్నారు. భవిష్యత్తులో మెరుగైన విధానాలను, సాంకేతికతను ఉపయోగించుకుని భూ పరిపాలనను సమర్థవంతంగా కొనసాగిస్తామన్నారు. ఈ సమావేశాల్లో రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిత్తల్, సీసీఎల్ఏ పీడీ సీఎంఆర్‌వో, మకరంద్, భూ చట్టాల నిపుణుడు సునీల్, పలువురు కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

సైబర్ నేరాలతో ముప్పు

(మొదటిపేజీ తరువాయి)

సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో హెచ్ఐసీసీలో షీల్డ్-2025 పేరుతో 'బాధితులకు రక్షణ కవచంగా సైబర్ భద్రత-డిజిటల్ భవిష్యత్తు' అనే అంశంపై రెండు రోజులపాటు నిర్వహిస్తున్న సదస్సును సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. దీంతోపాటు సైబర్ సెక్యూరిటీ బ్యూరో కేంద్రంగా కొత్తగా ఏర్పాటు చేసిన సెక్యూరిటీ ఆపరేషన్స్ సెంటర్ (సీవోసీ), సైబర్ ఫ్యూజన్ సెంటర్ (సీఎఫ్‌సీ)లను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. సైబర్ నేరాల కట్టడిలో తెలంగాణ రాష్ట్రం దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిందన్నారు. ఈ విషయంలో రాష్ట్ర పోలీసులు దేశంలోని మిగతా రాష్ట్రాల కన్నా ముందంజలో ఉన్నారని కితాబిచ్చారు. కేంద్ర ప్రభుత్వం సైతం ఇటీవల ఈ విషయాన్ని ప్రకటించిందని చెప్పారు. అయితే సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్తరకం మోసంతో ప్రజల ముందుకు వస్తున్నారని తెలిపారు. కొత్త రూపాలు సంతరించుకుంటున్న సైబర్ నేరాలను అరికట్టేందుకు పరిమితమైన విధానాలతో కేవలం ఒక రాష్ట్రం చేసే ప్రయత్నాలు ఫలితాలను ఇవ్వవని, రాష్ట్రాలన్నీ సమన్వయంతో దేశం యూనిట్‌గా పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు.

డీప్ ఫేక్‌తో తప్పుడు ప్రచారాల వ్యాప్తి..

సోషల్ మీడియా, డీప్ ఫేక్‌ను ఉపయోగించుకుని తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, జరగని నేరాలు, దాడులు జరిగినట్లు అవాస్తవాలను వ్యాప్తి చేస్తున్నారని సీఎం రేవంత్ అన్నారు. అడ్డూ అదుపు లేకుండా జరుగుతున్న ఇలాంటి ప్రచారాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. సైబర్ నేరాలు ప్రపంచ దేశాలకే సవాలుగా మారాయని, ప్రతి క్షణం ఎక్కడో ఒకచోట సైబర్ నేరం జరుగుతుండటం ఆందోళన కలిగించే అంశమని పేర్కొన్నారు. నేరం ఎక్కడి నుంచి జరిగింది, నేరానికి పాల్పడింది ఎవరని గుర్తించి పట్టుకుని శిక్షించడంతో పాటు.. అసలు సైబర్ నేరాలు జరగకుండా అడ్డుకట్ట వేయడంపై దృష్టి సారించాలన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలను అప్రమత్తం చేయడంతోపాటు బాధితులకు తక్షణ సహాయం కోసం 24/7 అందుబాటులో ఉండే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930ని ప్రతి ఒక్కరికీ షేర్ చేసి అవగాహన కల్పించాలని సూచించారు. సైబర్ సెక్యూరిటీ ఆవిష్కరణల్లో పెట్టుబడులు పెట్టడం, ఇంటెలిజెన్స్-షేరింగ్ ఫ్రేమ్‌వర్క్‌లను మెరుగుపరచడం, రాష్ట్రానికి సురక్షితమైన డిజిటల్ పర్యావరణ వ్యవస్థను నిర్ధారించడానికి కీలక భాగస్వామ్యాలను ఏర్పాటు చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని వివరించారు. సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేసేందుకుగాను ఆయా రాష్ట్రాలతో సమన్వయం సాధించడానికి దేశంలో ఒక కనెక్టింగ్ బ్రిడ్జిలా ఈ సదస్సు ద్వారా ప్రయత్నించడం అభినందనీయమన్నారు.



హైదరాబాద్ హైటెక్స్‌లో సీఎం రేవంత్‌కు జ్ఞాపికను అందజేస్తున్న డీజీపీ జితేందర్, చిత్రంలో సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్, మంత్రి శ్రీధర్‌బాబు

యువ నిపుణులను ప్రోత్సహించాలి..

యువ నిపుణులు, విద్యార్థులు సైబర్ భద్రతలో కెరీర్‌లను చేపట్టేలా ప్రోత్సహించడం ద్వారా భవిష్యత్తులో ఈ తరహా నేరాలను పూర్తిస్థాయిలో అడ్డుకునేందుకు అవకాశం ఉంటుందని సీఎం చెప్పారు. సైబర్ భద్రతలో తెలంగాణను దేశంలోనే నెంబర్‌వన్‌గా నిలబెట్టడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఐటీ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. సైబర్ భద్రత విషయంలో ప్రపంచం మొత్తం హైదరాబాద్ వైపు చూస్తోందన్నారు. రాష్ట్రంలో సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధునాతన టెక్నాలజీతో పనిచేస్తోందని చెప్పారు. సైబర్ నేరగాళ్లు దోచుకున్న మొత్తంలో రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు రూ. 350 కోట్లు ఫ్రీజ్ చేశారని, అందులో పెద్ద మొత్తాన్ని తిరిగి బాధితులకు అప్పగించారని తెలిపారు. టెక్నాలజీతో ప్రయోజనాలతోపాటు అదే స్థాయిలో ముప్పు కూడా ఉంటుందని, ఈ విషయంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని మంత్రి సూచించారు. అన్ని రంగాలపై సైబర్ నేరగాళ్ల ప్రభావం ఉందని చెప్పారు. హోంశాఖ కార్యదర్శి రవిగుప్తా, డీజీపీ జితేందర్, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్, తదితరులు పాల్గొన్నారు. లెఫ్టినెంట్ జనరల్ ఎంయూ నాయర్, ట్రాయ్ మాజీ ఛైర్మన్ ఆర్ ఎస్ శర్మ ఆయా అంశాల్లో కీ నోట్‌పై మాట్లాడారు. దేశవ్యాప్తంగా 14 రాష్ట్రాలకు చెందిన పోలీసు ఉన్నతాధికారులు, సైబర్ సెక్యూరిటీ నిపుణులు, ఐటీ రంగం ప్రతినిధులు, బీఎఫ్ఎస్ఐ, టెలికాం, రక్షణ మరియు ప్రజా విధాన సంస్థలు, ప్రపంచ టెక్ కంపెనీలు, స్టార్టప్‌ల నుంచి ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

బ్రెజిల్‌తో తెలంగాణ ఒప్పందం

వైద్యం, వ్యవసాయం, ఏఐ, ఐటీ, మైనింగ్, బయోటెక్ రంగాల్లో రాష్ట్రంలోని స్టార్టప్‌లు తమ ఆలోచనల్ని బ్రెజిల్‌లోని గోయాస్ రాష్ట్రంలోని స్టార్టప్‌లతో పంచుకునేందుకు ఇరు రాష్ట్రాల మధ్య పరస్పర అవగాహన ఒప్పందం కుదిరింది. మంగళవారం హెచ్ఐసీసీలో జరిగిన సమావేశంలో సీఎం రేవంత్, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో ఇరు రాష్ట్రాల అధికారులు ఎంవోయూ పత్రాలు మార్చుకున్నారు. ఈ కార్యక్రమంలో టీ-హబ్ ఫౌండేషన్ సుజిత్, బ్రెజిల్‌లోని గోయాస్ స్టేట్ సైన్స్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ సెక్రెటరీ జోస్ ఫ్రెడెరికో లైరా నెట్టో పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ వీసీగా కిషన్‌కుమార్‌రెడ్డి

» 16 ఏళ్ల తర్వాత వర్సిటీ ప్రొఫెసర్‌నే ఉపకులపతిగా నియమించిన సర్కారు

» బాధ్యతల స్వీకరణ.. అధికారులతో భేటీ

» కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చిన వీసీ

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్‌టీయూ) కొత్త ఉపకులపతిగా ఆచార్య టి.కిషన్‌కుమార్‌రెడ్డి నియమితులయ్యారు. మంగళవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. దాదాపు 16 ఏళ్ల తర్వాత జేఎన్‌టీయూ ప్రొఫెసర్‌నే ఉపకులపతి (వీసీ)గా నియమించడం పట్ల యూనివర్సిటీ సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు ఇన్‌చార్జి వీసీగా ఉన్న ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి, వర్సిటీ రెక్టార్ విజయకుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వర రావు నూతన వీసీకి సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం వివిధ విభాగాల డైరెక్టర్లు, అనుబంధ కళాశాలల ప్రిన్సిపాళ్లతో వీసీ కిషన్‌కుమార్‌రెడ్డి సమావేశమై.. యూనివర్సిటీ భవిష్యత్తు ప్రణాళికలపై సమీక్షించారు. వర్సిటీ అభివృద్ధికి కలిసి పనిచేద్దామని అధికారులకు వీసీ పిలుపునిచ్చారు. వర్సిటీలో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపర్చేందుకు, పరిశోధనలు, అభివృద్ధికి అనువైన వాతావరణం కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

ప్రొఫెసర్ టీకేకేగా..

జేఎన్‌టీయూ కొత్త వీసీ టి.కిషన్‌కుమార్‌రెడ్డి వర్సిటీలో ప్రొఫెసర్ టీకేకేగా సుపరిచితులు. 1994 నుంచి 2016 వరకు యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లోని మెకానికల్ విభాగంలో ప్రొఫెసర్‌గా సేవలందించారు. వర్సిటీ మెకానికల్ విభాగాధిపతిగా, ఆర్‌అండ్‌డీ డైరెక్టర్‌గా, అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్, రెక్టార్‌గా, ఓఎస్‌డీగా పనిచేశారు. పదవీ విరమణ అనంతరం గుజరాత్‌లోని పండిట్ దీన్‌దయాళ్ పెట్రోలియం యూనివర్సిటీ వీసీగా పనిచేశారు. ఏఐసీటీఈలోనూ రెండేళ్లు పనిచేశారు. టీకేకే రెడ్డి 2010లో రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, 2018లో ఐఏఏఎం పురస్కారాలు అందుకున్నారు. ఉస్మానియా వర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ నుంచి 1978లో బీఈ పూర్తిచేసిన టీకేకే, 1980లో మద్రాస్ ఐఐటీ నుంచి థర్మల్ పవర్ ఇంజనీరింగ్‌లో ఎంటెక్ చేశారు. ఆపై అమెరికాలో ఎంఎస్, పీహెచ్‌డీ పూర్తిచేశారు.

ఆరోగ్య శాఖకు నిధులు పెంచండి

బడ్జెట్‌లో 17,448 కోట్లు కేటాయించండి

ఆర్థిక మంత్రి భట్టిని కలిసిన మంత్రి దామోదర



హైదరాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖకు ఈసారి బడ్జెట్‌లో రూ.17,448 కోట్లు కేటాయించాలని ఆ శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ.. ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కను కోరారు. ఈ మేరకు మంగళవారం భట్టి విక్రమార్కను సచివాలయంలో మంత్రి దామోదర కలిశారు. కాంగ్రెస్ సర్కారు ఏర్పడిన తర్వాత గతేడాది జూలైలో బడ్జెట్ సమావేశాలు నిర్వహించారు. అందులో 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను వైద్య ఆరోగ్య శాఖకు రూ. 11,468 కోట్లు కేటాయించారు. అయితే ఈసారి గత బడ్జెట్ కంటే రూ.6 వేల కోట్లు అదనంగా కావాలని వైద్య శాఖ సర్కారును కోరింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ఇన్సూరెన్స్‌ను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచింది. అలాగే వైద్య చికిత్సల సంఖ్యను పెంచడంతో పాటు ఇటీవలే చికిత్సా ప్యాకేజీల ధరలను కూడా 20-25 శాతం మేర పెంచింది. ఈ నేపథ్యంలో ఆరోగ్య పథకాల కోసం రూ.10,469 కోట్లు కేటాయించాలని వైద్య శాఖ సర్కారును కోరింది. అలాగే కొత్త వైద్య కళాశాలలు ఏర్పాటైన నేపథ్యంలో.. వాటికి అవసరమయ్యే భవనాల నిర్మాణాలు, ఇతర మౌలిక సదుపాయాలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. మెడికల్ కాలేజీలకు అనుబంధంగా నర్సింగ్ కాలేజీలు కూడా ఏర్పాటు చేస్తామని సర్కారు ప్రకటించింది. దీంతో ఈసారి బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించే అవకాశం కనిపిస్తోంది ఒక్క వైద్య విద్య సంచాలకుల పరిధికే రూ.7,433 కోట్లు కేటాయించాలని ప్రతిపాదించినట్లు సమాచారం. అలాగే వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ విభాగానికి 4,542 కోట్లు, ప్రజారోగ్య సంచాలకుల విభాగానికి రూ.1,901 కోట్లు కేటాయించాలని ప్రతిపాదించారు. ఆరోగ్యశ్రీ బకాయిలు పెండింగ్‌లో పడకుండా ఉండాలంటే ప్రతీనెలా రూ.75-100కోట్లు విడుదల చేయాలని దామోదర కోరారు.

తాగునీటి స్థిరీకరణకు రూ.16వేల కోట్లివ్వండి

» కేంద్రాన్ని కోరిన మంత్రి సీతక్క

తెలంగాణలో తాగునీటి వ్యవస్థ స్థిరీకరణ కోసం అవసరమైన నిధులు మంజూరు చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క కేంద్రాన్ని కోరారు. రాష్ట్ర తాగునీటి అవసరాలు తీర్చేందుకు నీతి ఆయోగ్ గతంలో సిఫారసు చేసిన విధంగా కనీసం 16వేల కోట్లను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో నిర్వహించిన 'ఇండియా 2047- ఎ వాటర్ సెక్యూర్ నేషన్' సదస్సులో సీతక్క మాట్లాడారు. తాగు నీటి కొరతను తీర్చేందుకు రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వం సమన్వయంతో పనిచేయాలన్నారు. మిషన్ భగీరథ పథకంలోని లోపాలను సరిదిద్దేందుకు రేవంత్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పథకాన్ని పటిష్టపరిచేందుకు తమ ప్రయత్నాలకు కేంద్రం ఆర్థిక చేయూతనివ్వాలని సీతక్క కోరారు.

రూ.300 కోట్లే!

(మొదటిపేజీ తరువాయి)



చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. నిజానికి, ఉద్యోగుల బిల్లుల చెల్లింపులకు నెలకు కనిష్ఠంగా రూ.1000 కోట్లు అవసరమవుతాయి. అంత మొత్తం చెల్లించలేక సీలింగ్ విధిస్తూ కఠిన నిర్ణయం తీసుకుంది. ఇప్పటికైతే.. ఇదే విధానాన్ని పాటించాలని ఆదేశించింది. నెలకు రూ.300 కోట్లు పోను ఖజానాలో మిగిలిన సొమ్మును సంక్షేమ పథకాలకు మళ్లించాలని నిర్దేశించింది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతిష్ఠాత్మక పథకాలకు పెద్దఎత్తున నిధులు కావాల్సి వస్తున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ల పథకాలకు నిధులు సర్దాల్సి వస్తోంది. ఇప్పటికే అమల్లో ఉన్న ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రూ.500కే సబ్సిడీ సిలిండర్, పేదలకు 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్తు వంటి పథకాలకు విద్యుత్తు, ఆర్టీసీ, పౌర సరఫరాల శాఖలకు ప్రతి నెలా నిధులను విడుదల చేయక తప్పడం లేదు. రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేల ఆర్థిక సాయం, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పెంచుతామన్న సామాజిక పింఛన్ల పథకాలను ప్రారంభించాల్సి ఉంది. వీటి అమలుకు నిధుల కొరత ఏర్పడుతోంది. ఇలాంటి ఆర్థిక ఒడిదుడుకుల మధ్య ప్రభుత్వం ఉద్యోగుల బిల్లుల చెల్లింపుపై రూ.300 కోట్ల సీలింగ్ పెట్టి, మిగిలిన నిధులను సంక్షేమ పథకాలకు మళ్లించాలని నిర్ణయించింది.

ఉద్యోగులకే రూ.13 వేల కోట్లు అవసరం

వివిధ పనుల కాంట్రాక్టు బిల్లులు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆస్పత్రులకు ఆరోగ్యశ్రీ బిల్లుల చెల్లింపు విషయాన్ని పక్కన పెడితే.. ఉద్యోగులు, రిటైర్డు ఉద్యోగుల బిల్లులే భారీ మొత్తంలో పెండింగ్‌లో ఉన్నాయి. ఉద్యోగులు పదవీ విరమణ చేసిన తర్వాత చెల్లించే ఆర్థిక ప్రయోజనాలు, ప్రస్తుతం కొలువుల్లో ఉన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించిన దాదాపు 10 వేల బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారుల అంచనా. వీటన్నింటినీ చెల్లించాలంటే దాదాపు రూ.8,000 కోట్లు అవసరమని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఇందులో ఒక్క రిటైర్ అయినవారి ఆర్థిక ప్రయోజనాలు చెల్లించడానికే రూ.5000 కోట్ల వరకు అవసరం. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2021లో ఉద్యోగుల రిటైర్మెంట్ వయసును 58 నుంచి 61 సంవత్సరాలకు పెంచిన విషయం తెలిసిందే. దాంతో, 2024 మార్చి 31 వరకూ మూడేళ్లపాటు రిటైర్మెంట్లు లేవు. ఆ తర్వాత నుంచి పెద్దఎత్తున పదవీ విరమణ చేస్తున్నారు. ఒక్క 2024 సంవత్సరంలోనే 7,995 మంది రిటైర్ అయ్యారు. నెలలు గడుస్తున్నా వీరి బిల్లులు చెల్లించడం లేదు. ఇప్పటికే ఆర్థిక శాఖలో గుట్టలా పేరుకుపోయాయి. పదవీ విరమణ తర్వాత తమను ఇబ్బంది పెడుతున్నారని వారంతా తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక, ప్రస్తుత 2025 సంవత్సరంలో మరో 9,630 మంది రిటైర్ కాబోతున్నారు. వీరి బిల్లులను కూడా చెల్లించాలంటే మరో రూ.5000 కోట్లు కావాలి. మొత్తంమీద, పదవీ విరమణ చేసిన, చేస్తున్న, ప్రస్తుత ఉద్యోగుల బిల్లుల చెల్లింపునకు 13 వేల కోట్ల మేర నిధులు కావాలి. అసలే పాత అప్పులకు వడ్డీలు చెల్లించలేక నానా అవస్థలు పడుతున్న ప్రభుత్వానికి ఇంత భారీ మొత్తంలో బిల్లులను చెల్లించడం సమస్యగా మారింది.

సీపీఎస్ ఉద్యోగులకూ గుండు సున్నాయే..

ఉద్యోగుల బిల్లుల చెల్లింపుపై పరిమితి విధించిన ప్రభుత్వం.. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) ఉద్యోగుల పర్మినెంట్ రిటైర్మెంట్ అకౌంట్ నంబర్ (ప్రాన్) ఖాతాల్లోనూ కొన్ని నెలలుగా తన వాటాను జమ చేయడం లేదు. ఇలాంటి బకాయిలు రూ.2000 కోట్ల వరకు పేరుకుపోయినట్లు ఉద్యోగ సంఘాలు చెబుతున్నాయి. దీనివల్ల విధుల్లో ఉండి మరణించిన వారి కుటుంబాలకు ఆర్థిక ప్రయోజనాలు అందడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

నిధులు సర్దుబాటయ్యాక గ్రీన్ చానెల్ ద్వారా..


ఉద్యోగుల బిల్లుల చెల్లింపుపై సీలింగ్ పెట్టిన ప్రభుత్వం.. నిధులు సర్దుబాటు అయిన తర్వాత దానిని సడలిస్తామని ఆర్థిక శాఖకు చెప్పినట్లు తెలిసింది. నిధుల సమీకరణకు ప్రభుత్వం ఇప్పటికే పలు మార్గాలను అన్వేషిస్తోంది. భూములను తనఖా పెట్టి అప్పులు తెస్తోంది. ఎల్ఆర్ఎస్ ద్వారా కొంత సొమ్ము చేతికందుతుందని భావిస్తోంది. రాబడుల శాఖల్లో లీకేజీలను అరికట్టడంపై దృష్టి పెట్టింది. ఈ ప్రయత్నాల ద్వారా నిధులు సమకూరితే.. ఉద్యోగుల బిల్లులను పెద్ద మొత్తంలో క్లియర్ చేద్దామంటూ ఆర్థిక శాఖకు చెప్పింది. అప్పుడు గ్రీన్‌చానెల్ ద్వారా చెల్లిద్దామని వివరించినట్లు సమాచారం. అయితే.. ఉద్యోగుల బిల్లులను ప్రభుత్వం మొత్తానికి చెల్లించడం లేదా అంటే అదీ తప్పే. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పేరుకుపోయిన బిల్లులను క్లియర్ చేసింది. ఇప్పటి వరకు ఉద్యోగుల బిల్లులకు సంబంధించి 7000 కోట్లవరకు చెల్లించినట్లు ఆర్థిక శాఖ వివరించింది.

గోదావరి జలాల తరలింపునకు 6 వేల కోట్లు ఇవ్వండి

» కృష్ణా జలాల తరలింపును అడ్డుకోవాలి

» మేడిగడ్డపై ఎన్‌డీఎస్‌ఏ నివేదిక ఇవ్వాలి

» కేంద్రాన్ని కోరిన మంత్రి ఉత్తమ్



హైదరాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): గోదావరి జలాలను ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ రిజర్వాయర్లకు తరలించే పథకానికి రూ.6వేల కోట్ల సాయం అందించాలని, దీనికి అదనంగా మూసీ నది వెంట ట్రంక్ అండ్ ఇంటర్‌సెప్టార్ నెట్‌వర్క్ కోసం మరో రూ.4 వేల కోట్ల సహాయం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి కోరారు. గోదావరి జలాలతో హైదరాబాద్ తాగునీటి అవసరాలు తీరుతాయన్నారు. ఫలితంగా మూసీ పునరుజ్జీవన పథకానికి కూడా మేలు జరుగుతుందన్నారు. మంగళవారం రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో కేంద్ర జలశక్తి శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న అన్ని రాష్ట్రాల నీటిపారుదల శాఖ మంత్రుల రెండు రోజుల సదస్సులో ఉత్తమ్ మాట్లాడారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి నీటి కేటాయింపులు చేయాలని, సమ్మక్కసాగర్, సీతారామ ఎత్తిపోతల పథకం/సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వాలని కోరారు. తెలంగాణలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు తక్కువ వడ్డీతో దీర్ఘకాలిక రుణాలను అందించాలని విజ్ఞప్తి చేశారు. కృష్ణా జలాల వివాదంలో కేంద్రం తక్షణమే జోక్యం చేసుకొని, తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని సరిచేయాలని కోరారు. శ్రీశైలం ప్రాజెక్టుతో పాటు నాగార్జునసాగర్ కుడికాలువ నుంచి ఏపీ కృష్ణా జలాలను అక్రమంగా తరలిస్తోందని చెప్పారు. సాగర్, శ్రీశైలం నుంచి తరలించే ప్రతి నీటి చుక్కను లెక్కించడానికి వీలుగా టెలిమెట్రీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జస్టిస్ బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ (కృష్ణా ట్రిబ్యునల్-2)లో తెలంగాణకు కృష్ణా జలాల్లో న్యాయమైన వాటా దక్కడానికి చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టుల్లో పూడికతీతకు అయ్యే వ్యయాన్ని కేంద్రం భరించాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ) నిపుణుల కమిటీ నివేదికను సత్వరం అందించాలని కేంద్రాన్ని కోరారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా రాష్ట్రంలో వివిధ జలాశయాల్లో పూడికతీత పాలసీని అమలు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో మూసీ నది పునరుజ్జీవన పథకానికి కేంద్రప్రభుత్వం పూర్తిస్థాయిలో ఆర్థికసాయం అందించాలని కోరారు.



ప్రారంభోత్సవ కార్యక్రమంలో బాలకృష్ణ, సంస్కృతి శిఖర్ ట్రస్టు ప్రతినిధులు

బసవతారకం ఆస్పత్రిలో మరో ఆధునిక సౌకర్యం

- మెదడు, కాలేయ కణతులకు చికిత్స అందించేందుకు సీయూఎస్ఏ ఇంటెగ్రా అల్ట్రాసోనిక్ డైసెక్టర్ ఏర్పాటు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): మెదడు, కాలేయాల్లో ఏర్పడే కణతులకు సంబంధించిన అత్యాధునిక శస్త్ర చికిత్స పరికరం 'సీయూఎస్ఏ ఇంటెగ్రా అల్ట్రాసోనిక్ డైసెక్టర్'ను మంగళవారం బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ ఆస్పత్రిలో ప్రారంభించారు. రూ.90లక్షల వ్యయంతో ఈ అత్యాధునిక వ్యవస్థను సంస్కృతి శిఖర్ ట్రస్టు ఆర్థిక సహాయంతో నెలకొల్పారు. ఆస్పత్రి చైర్మన్ నందమూరి బాలకృష్ణ.. సంస్కృతి శిఖర్ ట్రస్టు ప్రతినిధులు తోరల్ దేశాయి, నిషా షా సమక్షంలో సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించి దీనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ ఆస్పత్రిని స్థాపించిన నాటి నుంచి అత్యాధునిక వైద్య సదుపాయాలు అందిస్తున్నామని చెప్పారు. అతిసున్నిత భాగాలకు సంబంధించిన గడ్డలను తొలగించడానికి ఈ పరికరం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. పేద, ధనిక తారతమ్యం లేకుండా అవసరమైన రోగులందరికీ దీన్ని అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. న్యూరో ఆంకాలజిస్టు డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ పరికరం సాయంతో శస్త్రచికిత్స చేసే సమయాల్లో మెదడు, కాలేయాల్లేని ఇతరత్రా కీలక రక్తనాళాలు, భాగాలకు ఎలాంటి నష్టం కలగకుండా చూడవచ్చని తెలిపారు. ఆస్పత్రి సీఈఓ కృష్ణయ్య, వైద్యులు టి.ఎస్. రావు, ఫణి కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు, సుజిత్ ఛాయా పట్నాయక్ పాల్గొన్నారు.

రూ.20వేలు లంచం తీసుకుంటూ దొరికిపోయిన మక్తల్ సీఐ, కానిస్టేబుళ్లు

- భద్రాద్రి జిల్లాలో ఏసీబీకి పట్టుబడ్డ రేంజర్, బీట్ ఆఫీసర్

మక్తల్, ఇల్లెందురూరల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి) : పోలీసు సీఐ, ఇద్దరు కానిస్టేబుళ్లు రూ.20 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ ఘటన నారాయణపేట జిల్లా మక్తల్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం చోటు చేసుకున్నది. మహబూబ్‌నగర్‌కు చెందిన సంధ్య వెంకట్రాములుపై మక్తల్‌లో పలు కేసులతో పాటు ఇటీవల కిడ్నాప్ కేసు నమోదైంది. ఈ కేసులో హైకోర్టు ఆయనకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేయగా చార్జిషీట్ ఆయనకు అనుకూలంగా రాసేందుకు రూ. 20వేలు లంచం కావాలని సీఐ చంద్రశేఖర్, ఇద్దరు కానిస్టేబుళ్లు సూచించారు. మంగళవారం ఉదయం 11 గంటలకు సీఐ చంద్రశేఖర్ ఆదేశాలతో పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుళ్లు నర్సింహ, శివారెడ్డి నిందితుడి నుంచి రూ. 20వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్టు చేశారు. అలాగే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో లంచం తీసుకుంటూ ఇద్దరు అటవీ అధికారులు ఏసీబీకి చిక్కారు. ఇల్లెందు మండలంలోని సర్వేతండా గ్రామానికి చెందిన జగదీష్ అనే కాంట్రాక్టర్ రోడ్డు పనులు చేస్తున్నాడు. అటవీ భూమిలో మట్టి తవ్వకం కోసం కొమరారం ఫారెస్ట్ రేంజర్ రెంటాల ఉదయ్‌కుమార్, మాణిక్యారం ఫారెస్ట్ బీట్‌ఆఫీసర్ నూనవత్ హరిలాల్‌ను సంప్రదించాడు. అనుమతి ఇచ్చేందుకు వారు డబ్బులు డిమాండ్ చేశారు. మంగళవారం కొమరారం అటవీరేంజ్ కార్యాలయంలో రూ.30 వేలను రేంజర్ ఉదయ్‌కుమార్ సమక్షంలో బీట్ ఆఫీసర్ తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ రమేష్ ఆధ్వర్యంలో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

40 శస్త్రచికిత్సలు.. రూ.4కోట్లు

- కిడ్నీ రాకెట్ కేసులో డాక్టర్ రాజశేఖర్‌కు అందిన మొత్తమిది
- శ్రీలంకలో.. ప్రధాన నిందితుడు పవన్!

దిల్‌సుఖ్‌నగర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సంచలనం సృష్టించిన అలకనంద ఆస్పత్రి కిడ్నీ రాకెట్ కేసులో పోలీసులు కీలక సమాచారం రాబట్టారు. చెన్నై నుంచి హైదరాబాద్ వచ్చి అలకనంద ఆస్పత్రిలో కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు చేసిన వైద్యుడు రాజశేఖర్.. ఒక్కో శస్త్రచికిత్సకు రూ.10లక్షలు చొప్పున వసూలు చేశాడు. దాదాపు 40 శస్త్రచికిత్సలు చేసిన రాజశేఖర్ రూ.4కోట్లు తీసుకున్నాడు. ఈ కేసులో ఇప్పటికే అరెస్టయిన రాజశేఖర్.. పోలీసు విచారణలో ఈ విషయాలను వెల్లడించినట్టు తెలిసింది. రిమాండ్‌లో ఉన్న రాజశేఖర్‌ను కస్టడీలోకి తీసుకున్న పోలీసులు కీలక సమాచారం రాబట్టినట్టు తెలిసింది. పోలీసులు దాడి చేయడానికి కాసేపటి ముందు ఆస్పత్రిలో ఓ గొడవ జరిగినట్టు సీసీ ఫుటేజీల ద్వారా పోలీసులు గుర్తించారు. రాజశేఖర్ పోలీసు కస్టడీ ముగియడంతో మంగళవారం సాయంత్రం అతనిని తిరిగి జైలుకు తరలించారు. కాగా, ఈ కేసులో ప్రధాన నిందితుడు పవన్.. రామేశ్వరం నుంచి సముద్రమార్గంలో శ్రీలంకకు పరారైనట్టు విశ్వసనీయ సమాచారం. పవన్‌పై ఇప్పటికే లుక్‌అవుట్ నోటీసులు జారీ చేశారు. పవన్ శ్రీలంకలోనే ఉన్నాడని రాజశేఖర్ కూడా పోలీసులకు చెప్పినట్టు తెలిసింది. పవన్‌ను స్వదేశానికి రప్పించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

ఎమ్మెస్సీ నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు నర్సింగ్ కళాశాలల్లో మాస్టర్ ఆఫ్ సైన్స్ ఇన్ నర్సింగ్(ఎమ్మెస్సీ) కోర్సుల్లో ప్రవేశాలకు కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎమ్మెస్సీ నర్సింగ్ కళాశాలల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించింది. నాలుగేళ్ల బీఎస్సీ నర్సింగ్ కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులు ఈ నెల 19 నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరింది. ఈ నెల 25 తుది గడువుగా పేర్కొంది. అలాగే సర్వీస్ కోటా అభ్యర్థులు కూడా రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఐదేళ్లకుగా పైగా శాశ్వత పద్ధతిలో స్టాఫ్‌నర్స్‌గా పనిచేస్తున్నవారు అర్హులని పేర్కొంది. సర్వీస్, నాన్ సర్వీస్ అభ్యర్థుల గరిష్ఠ వయో పరిమితి 45 ఏళ్లకు మించరాదని తెలిపింది. ఎస్సీ, ఎస్టీలకు మూడేళ్ల సడలింపునిచ్చింది.

హైకోర్టులోనే న్యాయవాదికి గుండెపోటు.. మృతి

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): హైకోర్టులో విషాదకరమైన ఘటన చోటుచేసుకుంది. ఎండ, ట్రాఫిక్ కారణంగా తీవ్ర ఒత్తిడికి గురై కోర్టులో వాదనలు వినిపిస్తుండగానే పసునూరు వేణుగోపాలరావు (66) అనే న్యాయవాది గుండెపోటుతో కుప్పకూలిపోయారు. 21వ కోర్టులో విచారణ కొనసాగుతున్న సమయంలో మంగళవారం మధ్యాహ్నం 1.12 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఆయనకు ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం సమీపంలోని ఉస్మానియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే వేణుగోపాలరావు మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. న్యాయవాది మృతికి సంతాపంగా న్యాయమూర్తి విచారణను నిలిపేశారు. ఇతర కోర్టుల్లో కేవలం అత్యవసర పిటిషన్‌లను మాత్రమే స్వీకరించారు.

తాగునీరు లేదు.. టాయ్‌లెట్లు లేవు!

మధ్యాహ్న భోజనం బాగుండడం లేదు.. తినలేకపోతున్నాం

- ఉపాధ్యాయుల కొరతతో సిలబస్ పూర్తి కావడం లేదు
- కళాశాలల్లో లెక్చరర్లు, ల్యాబ్‌ల కొరత.. ప్రాక్టికల్స్ లేవు
- రాష్ట్ర విద్యా కమిషన్‌కు తెలిపిన విద్యార్థులు, ఎన్జీవోలు



బహిరంగ విచారణలో పాల్గొన్న విద్యా కమిషన్ చైర్మన్ మురళి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి18 (ఆంధ్రజ్యోతి): "హైదరాబాద్‌లోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో బోలెడు సమస్యలున్నాయి. ఐదేళ్లకోసారి పాలకులు మారుతున్నా విద్యా సంస్థల్లోని ఇబ్బందులు తీరడం లేదు. ఒకచోట తాగునీటి కోసం తండ్లాట.. మరోచోట మరుగుదొడ్ల లేక అవస్థలు.. ఇంకోచోట టీచర్ల కొరత.. ఇలా చెప్పుకుంటే పోతే చాలా సమస్యలున్నాయి"అని విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల బాధ్యులు తెలంగాణ విద్యాకమిషన్ ఎదుట మొర పెట్టుకున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో కనీస విద్య అందడం లేదని, హైస్కూళ్లు, కాలేజీల్లో నైపుణ్య విద్య కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించి.. సమస్యలు పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి ఆధ్వర్యంలో సభ్యులు పీఎల్ విశ్వేశ్వర్‌రావు, వెంకటేశ్వర్లు, జ్యోత్స్న జిల్లాలవారీగా పర్యటిస్తున్నారు. మంగళవారం హైదరాబాద్ కలెక్టరేట్‌లో జిల్లా విద్యాశాఖాధికారి రోహిణి అధ్యక్షతన బహిరంగ విచారణ చేపట్టారు. వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు తమ సమస్యలను కమిటీ సభ్యులకు తెలియజేశారు.

పలువురు ప్రస్తావించిన సమస్యలు

- ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీల్లో ఫీజు రెగ్యులేటరీ కమిటీలను నియమించాలి.
- పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని మెరుగుపరచాలి. ఉదయం అల్పాహారం అందించాలి.
- స్కూళ్లు, కాలేజీల్లో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి. మరుగుదొడ్లను శుభ్రం చేసేందుకు సిబ్బందిని నియమించాలి.
- విద్యార్థినులకు శానిటరీ ప్యాడ్లను అందజేయాలి. అమ్మాయిల సమస్యలను తెలియజేసేందుకు ఫిర్యాదుల బాక్సులు ఏర్పాటు చేయాలి.
- హైస్కూళ్లు, కాలేజీల్లో పీఈటీలు, పీడీ పోస్టులను భర్తీ చేసి, ఆట స్థలాలను ఏర్పాటు చేయాలి.
- షిఫ్ట్ విధానాన్ని ఎత్తివేసి ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 వరకు తరగతులు పెట్టాలి.
- సైన్స్, డిజిటల్ లైబ్రరీలు ఏర్పాటు చేయాలి.
- హాజరుశాతం పెంచేందుకు పేరెంట్స్ కమిటీ సమావేశాన్ని ప్రతినెల నిర్వహించాలి.
- కంటిన్యూస్ అండ్ కాంప్రహెన్సివ్ ఎవాల్యూయేషన్ (సీసీఈ) విధానాన్ని ఎత్తివేయాలి.

నాణ్యమైన విద్య అందించాలి: మురళి

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి సూచించారు. తాము దాదాపు 260 విద్యాసంస్థల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల అభిప్రాయాలు తీసుకున్నామని చెప్పారు. విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో రాయడం, మాట్లాడడం రావాలన్నారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ ముకుందరెడ్డి, ఇంటర్ విద్యాధికారి వడ్డెన్న పాల్గొన్నారు.

అన్నం నీలం రంగులో..



మా స్కూల్‌లో మధ్యాహ్న భోజనం బాగుండడం లేదు. కొన్నిసార్లు అన్నం నీలిరంగులో ఉంటుండడంతో చాలామంది తినడం లేదు. ఒకసారి సాంబారులో ఈగలు కనిపించాయి. మాకు హిందీ టీచర్ లేరు.

\- ప్రజ్వల్, జీహెచ్ఎస్ (నంబర్-1), అమీర్‌పేట్

సైన్స్ ల్యాబ్ లేదు

పుస్తకాల బ్యాగు బరువు ఎక్కువగా ఉండడంతో మెడ, నడుం కండరాల నొప్పికి గురవుతున్నాం. పుస్తకాల సైజు తగ్గించి, డిజిటల్ బోధనకు కృషి చేయాలి. మా స్కూల్‌లో సైన్స్ ల్యాబ్ లేదు. సరిపడా టీచర్లు లేరు.

\- నిఖిల్, జీహెచ్ఎస్, బోరబండ

కాలేజీల్లో భోజనం అందించాలి

పాఠశాలల్లో మాదిరిగా కాలేజీల్లో కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలి. ఉదయం పూట అల్పాహారం అందించాలి. తాగునీటి సమస్యలను పరిష్కరించాలి.

\- తులసి, సీఈసీ ఫస్టియర్, న్యూ గవర్నమెంట్ కాలేజీ, మలక్‌పేట్

సర్కారీ విద్యపై నమ్మకం పోతోంది

చాలా ప్రభుత్వ కాలేజీల్లో సైన్స్ ల్యాబ్‌లు లేవు. మా కాలేజీ విద్యార్థులకు ప్రయోగాలంటే తెలియదు. పరీక్షల్లో వేరే చోటకు తీసుకెళ్లి హాజరు వేసి మార్కులు ఇస్తున్నారు. సర్కారు కళాశాలలపై నమ్మకం పోతోంది.

\- సయ్యద్ కరీం, బీపీసీ, సెకండియర్, ప్రభుత్వ జూనియర్ కాలేజీ, చంచల్‌గూడ

నర్సింగ్ కాలేజీకి గుర్తింపు లేకున్నా...



హుమాయున్‌నగర్‌లోని నైటింగేల్ స్కూల్ ఆఫ్ నర్సింగ్‌కు ప్రభుత్వ గుర్తింపు లేకున్నప్పటికీ దర్జాగా నడిపిస్తున్నారు. ఉస్మానియా జనరల్ ఆస్పత్రిలో కూర్చునే ఓ అధికారి ఈ కాలేజీ పేరు చెప్పి పంపిస్తున్నారు. ఈ కాలేజీకి రోజు ఆహారం కూడా ఉస్మానియా ఆస్పత్రి నుంచి వస్తుందని చెబుతున్నారు. నర్సింగ్ పాసైన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధిస్తున్నారు. - లుబ్నా సర్వత్, సామాజిక కార్యకర్త

డేటా ఎంట్రీకే పరిమితం

కొంతకాలంగా డీఈవోలపై పనిభారం పెరిగింది. వివిధ కార్యక్రమాల వల్ల డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా పనిచేయాల్సి వస్తోంది. రోజంతా ఆఫీసులో కూర్చుని ఫైల్స్ క్లియర్ చేయడమే పనిగా మారింది. స్కూళ్లను పర్యవేక్షించలేకపోతున్నాం.

\- రోహిణి, జిల్లా విద్యాశాఖాధికారి

థర్డ్‌క్లాస్ నా.. కొ..! పోరా బయటికి..!!

- టీటీడీ ఉద్యోగిపై బోర్డు సభ్యుడి వీరంగం
- మహాద్వారం వద్ద ఆపడంతో ఆగ్రహం
- ఆలయ ప్రాంగణంలోనే తిట్ల దండకం

తిరుమల, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి ఆలయంలో టీటీడీ ఉద్యోగిపై ధర్మకర్త మండలి సభ్యుడు ఒకరు తిట్లతో విరుచుకుపడ్డారు. దర్శనం అనంతరం తనను మహాద్వారం గుండా బయటికి పంపకపోవడంతో ఆగ్రహించారు. భక్తులందరూ చూస్తుండగానే ఉద్యోగిపై నోరుపారేసుకున్నారు. శ్రీవారిని దర్శించుకున్న వీఐపీలు ఆలయం వెలుపలకు వచ్చే సమయంలో మహాద్వారం, గొల్లమండపం మధ్యలో తీవ్ర రద్దీ ఏర్పడుతోంది. దీంతో బయటకు వచ్చేవారంతా బయోమెట్రిక్ వైపుగానే రావాలనే నిబంధనను కొన్నాళ్లుగా అమలు చేస్తున్నారు. మంగళవారం ఉదయం శ్రీవారిని దర్శించుకుని బయటకు వస్తున్న బోర్డు సభ్యుడు బెంగళూరుకు చెందిన నరేశ్ కుమార్ గేటు తీయాలని మహాద్వారం వద్ద విధుల్లో ఉన్న ఉద్యోగి బాలాజీని ఆదేశించారు. బయోమెట్రిక్ నుంచి వెళ్లాలని బాలాజీ చెప్పడంతో నరేశ్ ఆగ్రహంతో ఊగిపోయారు. 'ఎవడ్రా నువ్వు.. పోరా బయటకి! థర్డ్‌క్లాస్ నా.. కొ..! ఫస్ట్ బయటకి పంపండి ఇతన్ని. లేకుంటే ఇక్కడే కుర్చునేస్తాను' అంటూ విరుచుకుపడ్డారు. ఆ ఉద్యోగి భుజంపై చేయి వేసి నెట్టారు. టీటీడీ విజిలెన్స్ అధికారులు జోక్యం చేసుకుని నరేశ్ కుమార్‌కు నచ్చజెప్పి ఆ ఉద్యోగిని అక్కడినుంచి పంపేశారు. నిజానికి.. టీటీడీ బోర్డు సభ్యులను మహాద్వారం గుండా అనుమతించాలనే నిబంధన లేదు. అయినప్పటికీ... వారు మహాద్వారం గుండానే రాకపోకలు సాగించడం రివాజుగా వస్తోంది. ఉద్యోగి తనను అడ్డుకోవడం నరేశ్ దృష్టిలో తప్పే అయినప్పటికీ... ఆలయ ప్రాంగణంలోనే అసభ్యంగా మాట్లాడటం సరికాదనే అభిప్రాయం వినిపిస్తోంది. అక్కడి నుంచి హుందాగా వెళ్లిపోయి... తన పట్ల అనుచితంగా ప్రవర్తించారంటూ ఉద్యోగిపై ఉన్నతాధికారులపై ఫిర్యాదు చేస్తే సరిపోయేది!

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ గేట్లలో మార్పులు

- అభివృద్ధి పనుల కోసం కొన్ని మూసివేత

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులతో ప్రయాణికులు లోపలకు వెళ్లే, బయటకొచ్చే మార్గాల్లో మార్పులు చేశారు. ప్లాట్‌ఫామ్ నంబర్ 1పై గణేష్ ఆలయం పక్కన వద్ద కొత్త ప్రవేశద్వారం ఏర్పాటు చేశారు. టికెట్, విచారణ కౌంటర్లతో పాటు 750 మంది ప్రయాణికులకు సరిపోయేలా కొత్త వెయిటింగ్ హాల్ సౌకర్యం కల్పించారు. గేట్ నంబర్ 4 మూసివేసినందున స్వాతి హోటల్ ఎదురుగా వద్ద అదనపు ప్రవేశద్వారం ఏర్పాటు చేశారు. ప్లాట్‌ఫామ్ నంబర్ 10లో గేట్ నంబర్ 8 (బోయిగూడ వైపు) వద్ద టికెట్ కౌంటర్‌తో పాటు మరో కొత్త ప్రవేశం ద్వారం ఏర్పాటు చేశారు. స్టేషన్‌లో ఎంట్రీ/ఎగ్జిట్ మార్గాలు, ప్లాట్‌ఫారాలను గుర్తించడానికి, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలపై సైన్ బోర్డులు ఏర్పాటు చేశారు. రైళ్లు వచ్చే ప్లాట్‌ఫారాల వివరాలను ముందుగానే ప్లాట్‌ఫారమ్ 1, 10లో ప్రదర్శిస్తున్నారు. ప్రయాణికుల రద్దీని సమర్థవంతంగా నిర్వహించడానికి అదనపు సిబ్బందిని నియమించారు.

అసైన్డ్ భూములపై సబ్ రిజిస్ట్రార్‌కు అధికారం లేదు

- బాధ్యులపై క్రిమినల్ కేసు పెట్టండి
- రంగారెడ్డి కలెక్టర్‌కు హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): అసైన్డ్ భూములను రిజిస్ట్రేషన్ చేసే అధికారం సబ్ రిజిస్ట్రార్‌కు లేదని హైకోర్టు స్పష్టం చేసింది. ప్రస్తుతం వివాదంలో ఉన్న భూమిపై పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని, అసైన్డ్ భూమి ౨ అని తేలితే రిజిస్ట్రేషన్ చేసిన సబ్ రిజిస్ట్రార్‌తో పాటు ప్రైవేటు వ్యక్తులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని రంగారెడ్డి కలెక్టర్‌కు ఆదేశాలు జారీచేసింది. మూడునెలల్లో ఈ ప్రక్రియ పూర్తిచేయాలని స్పష్టంచేసింది. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్‌లోని సర్వే 176/23లో అంతారం లక్ష్మయ్యకు 33 గుంటల అసైన్డ్ భూమి ఉంది. వారసుల మధ్య వివాదం నేపథ్యంలో కొంత మంది వ్యవసాయేతర భూమిగా మార్చి విక్రయించారు. వివాదాస్పద భూమి అసైన్డ్ భూమి అన్న విషయాన్ని దాచిపెట్టి విక్రయించడంపై మరికొంత మంది వారసులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. అక్రమంగా భూ బదిలీ చేస్తే ఆరునెలల జైలుశిక్ష లేదా 10వేల జరిమానా లేదా రెండూ విధించవచ్చని పేర్కొంది. ప్రస్తుత కేసుపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

రెండో ఫోన్‌ట్యాపింగ్ కేసు బెయిల్ పిటిషన్‌లపై విచారించండి

- నాంపల్లి కోర్టుకు హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నాయకుడు చక్రధర్‌గౌడ్‌కు సంబంధించిన రెండో ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏ4, ఏ5గా ఉన్న తొడుపునూరి సంతోష్ కుమార్, బండి పరశురాములు బెయిల్ పిటిషన్‌లపై వేగంగా విచారించి నిర్ణయం తీసుకోవాలని నాంపల్లి కోర్టుకు హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. ఈ కేసులో ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే పంజాగుట్ట పోలీసులు తమను వేధిస్తున్నారంటూ వారు చేసిన ఫిర్యాదు మేరకు ఈ ఆదేశాలు ఇచ్చింది. వారు సమర్పించిన లంచ్‌మోషన్ పిటిషన్‌లపై విచారణ చేపట్టిన జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం ట్రయల్ కోర్టుకు ఈ ఆదేశాలు ఇచ్చింది.

హైదరాబాద్ కిటకిట



(మొదటిపేజీ తరువాయి)

సంగ్రహం (అట్లాస్)-2024"లో పేర్కొన్న గణాంకాలు. ప్రపంచంలోనే అత్యధిక జనసాంద్రత ఉన్న నగరం ఫిలిప్పీన్స్ రాజధాని మనీలా. అక్కడ ప్రతి చదరపు కిలోమీటరుకూ 43,079 మంది నివసిస్తారు. మనదేశంలో అత్యధిక జనసాంద్రత ఉన్నది.. ముంబై మహానగరం. అక్కడ ప్రతి చదరపు కిలోమీటరుకూ 28,508 మంది ఉంటున్నారు. ఒకవైపు హైదరాబాద్ జనసాంద్రత పెరుగుతుండగా.. బిహార్, పశ్చిమబెంగాల్ వంటి రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో మాత్రం జనసాంద్రత చాలా తక్కువగా ఉండడం గమనార్హం. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్ర జనాభా 3.5 కోట్లు. రాష్ట్ర విస్తీర్ణం 1,12,077 చదరపు కిలోమీటర్లు. అంటే సగటున చదరపు కిలోమీటరుకు 312 మంది మాత్రమే నివసిస్తున్నట్టు. ఆ రేటుతో పోలిస్తే.. హైదరాబాద్ జనసాంద్రత (18,161) ఎంత అత్యధికంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. కేంద్రీకృత పట్టణీకరణకు ఇది అతి పెద్ద ఉదాహరణ అని సామాజిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ప్రజలు గ్రామాలు, పట్టణాల నుంచి పెద్ద ఎత్తున హైదరాబాద్ మహానగరానికి వలస వస్తుండడంతో.. ఇక్కడ జనసాంద్రత విపరీతంగా పెరిగిపోతోందని, దాని వల్ల నగర మౌలికసదుపాయాలపైన, ప్రజా సేవలపైన, గృహ నిర్మాణ రంగం, పట్టణ ప్రణాళికపైన తీవ్రంగా ఒత్తిడి పడుతోందని ఆందోళన వ్యక్తమవుతోంది. కాగా.. దేశ జనాభాలో తెలంగాణ జనాభా వాటా 2011తో పోలిస్తే 2031 నాటికి 0.23 పర్సంటేజ్ పాయింట్ల మేర తగ్గనున్నట్టు ఈ నివేదిక అంచనా వేసింది. 2011 లెక్కల ప్రకారం భారతదేశ జనాభాలో అప్పటికి తెలంగాణ వాటా 2.89 శాతం. దేశంలోనే అత్యధిక జనాభా ఉన్న రాష్ట్రాల జాబితాలో 12వ స్థానంలో తెలంగాణ ఉంది. రాష్ట్రంలో 39.43 లక్షల జనాభాతో హైదరాబాద్ జిల్లా అగ్రస్థానంలో ఉండగా.. కేవలం 2.94 లక్షల జనాభాతో ములుగు జిల్లా చివరిస్థానంలో నిలిచింది. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ పరిధిలోని నేషనల్ కమిషన్ ఫర్ పాపులేషన్ అంచనాల ప్రకారం 2021 నాటికి రాష్ట్ర జనాభా 3.77 కోట్లకు (దేశ జనాభాలో తెలంగాణ వాటా 2.77%) చేరింది. 2031 నాటికి అది 3.92 కోట్లకు చేరుతుందని అంచనా. అంటే దేశ జనాభాలో అప్పటికి తెలంగాణ వాటా 2.66 శాతంగా ఉండనుంది. అంటే.. 2011తో పోలిస్తే 0.23 శాతం తగ్గినట్టు.

వృద్ధులు పెరిగి.. యువజనం తగ్గి..

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన నివేదికలో.. 2036 నాటికి రాష్ట్రంలో యువ జనాభా తగ్గి వృద్ధుల జనాభా పెరిగిపోనుందని పేర్కొనడం ఆందోళన కలిగించే అంశం. యువతే మన దేశ సంపద అని ప్రధాని నరేంద్ర మోదీ ఎప్పుడూ అంటుంటారు. దేశమైనా, రాష్ట్రమైనా అభివృద్ధి చెందాలంటే యువ జనాభాయే కీలకం. అలాంటిది మన తెలంగాణలో 2011తో పోలిస్తే 2036 నాటికి 34 ఏళ్లలోపువారి సంఖ్య గణనీయంగా తగ్గిపోనుంది. అదే సమయంలో వృద్ధుల జనాభా పెరగనుంది. జనాభా నియంత్రణ విధానాలను అనుసరించడం వల్ల జననాల రేటు తగ్గిపోవడమే ఇందుకు కారణం. నివేదిక ప్రకారం.. 2011లో మన రాష్ట్రంలో ఏడాది అంతకన్నా తక్కువ వయసున్న చిన్నారులు 5.79 లక్షల మంది. 2036 నాటికి ఆ సంఖ్య 3.94 లక్షలకు తగ్గిపోనుంది. అంటే 25.2 శాతం తగ్గుదల. నాలుగేళ్లలోపు చిన్నారుల సంఖ్య కూడా.. 28.59 లక్షల నుంచి 19.47 లక్షలకు (25.3 శాతం మేర) తగ్గిపోనుంది. 35 నుంచి 39 ఏళ్ల వారి సంఖ్య 4.6 శాతం మేర.. 60-64 ఏళ్ల వారి సంఖ్య 69.5 శాతం మేర పెరగనుంది. 80 ఏళ్లు దాటినవారి సంఖ్య అయితే ఏకంగా 82.1 శాతం మేర పెరగనుందని అంచనా. జనాభాలో వచ్చే ఈ మార్పులు.. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా గణనీయమైన ప్రభావం చూపనున్నాయి.

వయసు	2021 నాటికి జనాభా	2036 నాటికి జనాభా	పెరుగుదల/ తగ్గుదల
0-1	5.27	3.94	-25.2
0-4	26.05	19.47	-25.3
5-9	26.81	21.25	-20.7
10-14	28.31	23.40	-17.3
15-19	31.24	25.66	-17.9
20-24	33.94	26.26	-22.6
25-29	34.16	27.57	-19.3
30-34	33.50	30.33	-9.5
35-39	31.48	32.92	4.6
40-44	28.04	32.97	17.6
45-49	24.71	32.04	29.7
50-54	20.82	29.62	42.3
55-59	16.59	25.68	54.8
60-64	12.77	21.64	69.5
65-69	10.18	17.00	67
70-74	8.33	12.24	46.9
75-79	5.62	8.05	43.2
80+ఏళ్లు	4.7	8.56	82.1

(లక్షల్లో) (శాతాల్లో)

ఆరుగురిని చంపిన కేసులో ఇద్దరికి జీవితఖైదు

ఆస్తి కోసం స్నేహితుడు, అతడి భార్య, ఇద్దరు చెల్లెళ్లు, మైనర్లయిన ఇద్దరు కూతుళ్లను హత్య చేసిన ఉన్మాది

- ఈ ఘోరంలో అతడికి సహకరించిన తల్లి
- ఇద్దరు చిన్నారుల హత్యపైనే తీర్పిచ్చిన కోర్టు
- యాదాద్రి జిల్లాలో ఓ హత్య కేసులో 17 మందికి జీవిత ఖైదు
- నల్లగొండ జిల్లా ఎస్సీ, ఎస్టీ కోర్టు తీర్పు

నిజామాబాద్ లీగల్, నల్లగొండ క్రైం/మోత్కూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): స్నేహితుడి అప్పును ఎగ్గొట్టాలని, అతడి ఆస్తిని కాజేయాలనే కుట్రతో అతడిని, అతడి భార్య, ఇద్దరు చెల్లెళ్లు, మైనర్లయిన ఇద్దరు కూతుళ్లను ఇలా ఒకరికి తెలియకుండా మరొకరిని ఓ వ్యక్తి దారుణంగా హత్య చేసిన ఘటన గుర్తుందా? 2023 డిసెంబరులో జరిగిన ఈ ఘటనకు సంబంధించి ఇద్దరు చిన్నారుల హత్య కేసును వేరుగా విచారించిన నిజామాబాద్ జిల్లా ప్రిన్సిపల్ అండ్ సెషన్ కోర్టు.. నిందితుడైన వ్యక్తిని, హత్యలకు సహకరించిన అతడి తల్లిని దోషులుగా నిర్ధారించి యావజ్జీవకారాగార శిక్ష విధించింది. జిల్లాలోని మాక్లూర్‌కు చెందిన పుణె ప్రసాద్‌కు భార్య శాన్విక, కూతుళ్లు చైత్రిక, చైత్రి, చెల్లెళ్లు శ్రావణి, స్వప్న, తల్లి సుశీల ఉన్నారు. ప్రసాద్ ఓ యువతి హత్య కేసులో ఆరోపణలెదుర్కొని కొన్నాళ్లు జైల్లో ఉండి వచ్చాడు. తాను జైల్లో ఉన్నప్పుడు తన కుటుంబానికి ఆసరాగా ఉన్న మిత్రుడు మెడిద ప్రశాంత్ అడిగితే రూ.3.5 లక్షలు అప్పుగా ఇచ్చాడు. జైలు నుంచి వచ్చాక ప్రసాద్‌ను గ్రామస్థులు ఊర్లో ఉండనీయకపోవడంతో కుటుంబంతో కలిసి కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం పాల్వంచకు మారాడు. ఈ క్రమంలో ప్రసాద్‌కు అప్పులు పెరగడంతో మాక్లూర్‌లోని తన సొంతింటిని తాకట్టు పెట్టి అప్పు తీసుకునేందుకు ప్రయత్నించాడు. అయితే అతడిపై కోర్టు కేసు ఉండటంతో రుణం తీసుకోవడం సాధ్యపడలేదు. తన పేరు మీద ఇంటిని రిజిస్ట్రేషన్ చేసి ఇస్తే.. లోన్ తీయించి ఇస్తానని ప్రసాద్‌ను ప్రశాంత్ నమ్మించాడు. అతడు చెప్పినట్లు ప్రసాద్ రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చినా లోన్ తీయించడాన్ని ప్రశాంత్ ఎప్పటికప్పుడు దాటవేస్తూ వచ్చాడు. తన అప్పు తీర్చాలని.. అలాగే ఇంటిపై రుణం ఇప్పించాలని, లేదంటే ఇంటిని తన పేరు మీద తిరిగి రిజిస్ట్రేషన్ చేసివ్వాలని ప్రసాద్ తీవ్ర ఒత్తిడి చేయడంతో అతడిని, మొత్తంగా అతడి కుటుంబాన్ని అంతం చేయాలని ప్రశాంత్ పథకం వేశాడు. తొలుత ప్రసాద్‌ను ఆపై అతడి భార్య.. ఇద్దరు పిల్లలు, ఇద్దరు చెల్లెళ్లను ఒక్కొక్కరిగా కుట్ర పన్ని హత్య చేశాడు. ప్రసాద్ తల్లి ఈ కుట్ర నుంచి తప్పించుకోవడంతో ప్రశాంత్ పట్టుబడ్డాడు. ఈ హత్యల్లో ప్రశాంత్‌కు, అతడి తల్లికి కోర్టు శిక్ష విధించింది. ఇక.. ఎనిమిదేళ్ల క్రితం జరిగిన ఓ ప్రతీకార హత్యకు సంబంధించి నల్లగొండ జిల్లా ఎస్సీ, ఎస్టీ కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. 17మందికి జీవితఖైదు, రూ.6వేల చొప్పున జరిమానా విధించింది. ఆ కేసు వివరాల్లోకి వెళితే యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం అజీంపేట గ్రామానికి చెందిన బట్ట లింగయ్య(55) అదే గ్రామంలోని రాజమల్లు అనే వ్యక్తి మృతికి కారణమై జైలుకెళ్లి బెయిలుపై బయటకొచ్చాడు.. 2017లో దసరా పండగ సందర్భంగా లింగయ్య కుటుంబంతో కలిసి వేడుకల్లో పాల్గొనడానికి వెళుతుండగా రాజమల్లు కుటుంబసభ్యులు, వారి సామాజిక వర్గానికి చెందిన ఇంకొందరు దాడిచేసి లింగయ్యను చంపారు. హతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఘటనకు కారణమైన 18మందిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. నిందితుల్లో ఒకరు కేసు విచారణలో ఉండగా మృతిచెందారు. మంగళవారం ఈ కేసుపై తుది తీర్పు వెలువడింది. యావజ్జీవ కారాగార శిక్ష పడిన వారిలో ఒక మాజీ సర్పంచ్, ఎనిమిది మంది 30 ఏళ్ల లోపువారు ఉన్నారు. దోషుల్లో అన్నదమ్ములు పండుగ నరసయ్య, సాయిలు, రాములు ఉన్నారు. దోషుల్లో నరసయ్య కూతురు నాగమ్మ, అల్లుడు వాల్‌రాజు.. రాములు కుమారులు సతీశ్, మల్లేశ్ ఉన్నారు. దోషుల్లో సోదరులు పండుగ మల్లయ్య, పండుగ లింగయ్య, తండ్రికొడుకులు జక్కుల లచ్చయ్య, జక్కుల రమేశ్ ఉన్నారు. తీర్పు వెలువడగానే కోర్టుహాల్లో 17మంది కన్నీటి పర్యంతమయ్యారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.